గురువారం 10-8-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 140

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

ఇందుది కృష్ణా జిల్లా పెనమలూరు. సాధారణ మధ్యతరగతి కుటుంబం. తండ్రి గెస్ట్ లెక్చరర్. తల్లి గృహిణి. ఎం.ఎస్. చేయడం కోసం యూఎస్ వెళ్లింది. ప్రపంచ బ్యాంకు ఉద్యోగం తెచ్చుకుంది.



ఇందు

ప్రపంచ బ్యాంక్‌లో తెలుగమ్మాయి

చిన్నప్పటి నుంచి కష్టపడి చదివే మనస్తత్వం... స్పష్టమైన గమ్యం... లక్ష్యంపై ఏకాగ్రత... నిండైన ఆత్మవిశ్వాసం ఇందు సొంతం. తల్లిదండ్రులు మాధవి, సత్యనారాయణ. విజయవాడలో బీటెక్ పూర్తి చేసి, అమెరికాలో ఎం.ఎస్. పబ్లిక్ పాలసీ చేసింది. ప్రపంచ బ్యాంకులో ఉద్యోగం సాధించిన వైనాన్ని ఆమె 'సాక్షి'తో వివరించింది.

■ పర్యావరణ పరిరక్షణ

''అమెరికాలో ఎం.ఎస్. చదివి అక్కడే ఉద్యోగం చేయాలని ఉండేది. కోవిడ్ క్లిష్ట పరిస్థితుల్లో అమెరికా వెళ్లాను. అక్కడికి వెళ్లిన తరువాత నా దృక్కోణం విస్తరించింది. ప్రపంచ స్థాయిలో మానవజాతిని ప్రభావితం చేయగల ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ సంస్థల్లో పని చేయాలని నిర్ణయించుకున్నా. 'యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్– మేసన్'లో ఎంఎస్, పబ్లిక్ పాలసీ కోర్సులో చేరాను. యూనివర్సిటీ స్థాయిలో అనేక అంశాలపై అధ్యయనం చేసి అమెరికాలోనే ప్రఖ్యాతి గాంచిన ప్రొఫెసర్ టిమ్ స్మీడింగ్ వద్ద నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాను. యూనివర్సిటీ స్థాయిలో నేను ఇచ్చిన ప్రజెంటేషన్‌లు, పరిశోధనల ఆధారంగా ప్రపంచ బ్యాంకు ఉద్యోగం ఇచ్చింది.



■ దక్షిణ ఆసియా వాతావరణం

నాకు ఉద్యోగంలో దక్షిణ ఆసియా దేశాలకు చెందిన వాతావరణ విభాగం బాధ్యతలను కేటాయించారు. వాతావరణ మార్పును అధ్యయనం చేసే నిపుణురాలిగా, జాయింట్ మల్టీ బ్యాంకు డెవలప్‌మెంట్ మధ్య సమన్వయకర్తగా, విధానాల రూపకల్పనలు, వాటికి సాంకేతికతను అన్వయించడం, అమలు చేయటం, వివిధ దేశాలలో ఉండవలసిన కచ్చితమైన వాతావరణ కాలుష్యం ప్రామాణికతల నిర్ణయం, సంబంధిత దేశాల వాతావరణ కాలుష్య కార్యక్రమాల్లో అమలు తేడాలను విశ్లేషించడం నా విధులు. వీటికి సంబంధించిన నివేదికల తయారీ, ఒప్పందాల అమలు పర్యవేక్షణ, సమావేశాల్లో చర్చించటం మా విభాగం నిర్వర్తించాల్సిన ప్రత్యేక విధులు. అమెరికా ప్రభుత్వం నాకు ప్రత్యేకంగా జీ4 వీసా జారీ చేసింది. విధులకు హాజరుకావాలని ప్రపంచ బ్యాంకు నుంచి ఆదేశాలు వచ్చాయి. త్వరలోనే అమెరికాకు వెళ్లి విధుల్లో చేరాలి'' అని చెప్పారు ఇందు కిలారు.

గ్లోబల్ వార్మింగ్‌పై అధ్యయనం

ప్రపంచ బ్యాంకు టీమ్‌తో కలిసి దక్షిణ ఆసియా దేశాలలో గ్లోబల్ వార్మింగ్ తగ్గింపుపై ప్రత్యేక ప్రాజెక్టు రూపొందించాలి. ప్రధానంగా భారత్–పాకిస్తాన్ దేశాలలో వాతావరణ పరిస్థితులపై అధ్యయనం చేస్తాను. ఇండియన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రౌండ్ లెవల్‌లో కూలింగ్ సొల్యూషన్స్‌పై సాంకేతికంగా పాలసీని రూపొందించి దాని అమలుకు కృషి చేస్తాను. ఉష్ణోగ్రతలు 1.5–2 డిగ్రీల వరకు తగ్గించగలిగితే వ్యవసాయం, ఆరోగ్యం, కార్మికులకు అనువైన వాతావరణం నెలకొంటుంది.

– ఇందు కిలారు

సాధించిన విజయాలివి

- కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో జాతీయ స్థాయి క్యాంపస్ ఇంజినీరు పరీక్షకు హాజరై రాష్ట్రం నుంచి ఎంపికైన ఇద్దరిలో ఇందు ఒకరు.
- యూఎస్ యూనివర్సిటీలో ఏకగ్రీవంగా యూనిటీ అండ్ డైవర్సిటీ సంఘానికి ఏకగ్రీవంగా కోఆర్డినేటర్‌గా ఎన్నిక. ఆ బాధ్యతల్లో విదేశీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి. విద్యార్థులు, యూనివర్సిటీ అధికారులకు మధ్య వారధిగా పని చేసి మల్టీ టాస్కింగ్ విజర్డ్‌గా గుర్తింపు.
- క్రిసాలిస్ అనే ఎన్‌జీఓ సంస్థలో మేనేజ్‌మెంట్ బోర్డు అడ్వయిజర్‌గా సేవలు అందించడం.
- టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, టీచ్ ఫర్ చేంజ్ సంస్థలకు సేవలు అందించడం.
- ఎం.ఎస్.లో అత్యుత్తమ గ్రేడ్స్ సాధించి మూడు సెమిస్టర్లలో రూ 65 లక్షల రూపాయల ఉపకార వేతనం పొందడం.
- విదేశీ విద్యార్థినిగా స్నాతకోత్సవ సభలో యూనివర్సిటీ ఫ్లాగ్ బేరర్‌గా ఎన్నిక. ఔట్‌స్టాండింగ్ స్టూడెంట్ అవార్డు, బెస్ట్ స్టూడెంట్ ఎంప్లాయ్‌గా గోల్డెన్ బ్రిక్ అవార్డు, బెస్ట్ ఫైరో ప్రైజ్ విన్నర్, బెస్ట్ పేపర్ ఇన్ సైన్స్ అండ్ పబ్లిక్ పాలసీ పురస్కారం.
- ప్రతిష్ఠాత్మకమైన యూరోపియన్ యూనియన్ ప్రాజెక్టు.

– పోలవరపు వాసుదేవ్, సాక్షి, పెనమలూరు, కృష్ణా జిల్లా.

న్యూస్‌మేకర్

రాయ్‌పూర్‌లో ఒక టీచర్ పిల్లల్ని వినూత్నంగా ఆకట్టుకుంటోంది. వారానికి ఒకసారి వారిలాగే యూనిఫామ్ ధరించి స్కూల్‌కు వస్తోంది. 'నేనూ మీలో ఒకదాన్నే' అనే భావన కలిగించడమే కాదు... టీచర్ అంటే కొట్టే తిట్టే మనిషి కాదనే భరోసా ఇస్తోంది. దీంతో పిల్లలు ఫుల్లుగా స్కూల్‌కు అటెండ్ అవుతున్నారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసం నింపడానికి ఆమె చేస్తున్న ఈ చిన్న ప్రయత్నం అందరి ప్రశంసలు పొందుతోంది.



పిల్లలతోపాటే యూనిఫామ్ ధరించి వచ్చిన జాహ్నవి

గుడ్ మార్నింగ్ పిల్లలూ...

రాయ్‌పూర్ (చత్తీస్‌గఢ్)లోని గోకుల్‌రామ్ వర్మ ప్రైమరీ స్కూల్ అనే ప్రభుత్వబడిలో వారమంతా పిల్లలు ఉత్సాహంగా ఉంటారు. శనివారం ఇంకా ఉత్సాహంగా ఉంటారు. దానికి కారణం ఆ రోజు ఆ స్కూల్ టీచర్ జాహ్నవి యదు వారిలాగే తయారయ్యి వారిలాగే యూనిఫామ్ వేసుకుని వస్తుంది. ఆ రోజు కుర్చీలో కూచోదు. వారి మధ్య కూచుని పాఠాలు, కబుర్లు చెబుతుంది. వారితో సంభాషిస్తుంది. అందుకే పిల్లలందరికీ జాహ్నవి యదు టీచర్ అంటే ఇష్టం.

కొత్త ఆలోచన

గోకుల్ రామ్ వర్మ ప్రైమరీ స్కూల్‌లో 1 నుంచి 5 వరకూ చదివే 350 మంది పిల్లలు ఉన్నారు. వారంతా ఆ చుట్టుపక్కల బస్తీవాసుల పిల్లలు. వారి తల్లిదండ్రులకు పెద్దగా చదువు లేదు. పిల్లలకు క్రమశిక్షణ అంటే తెలియదు. స్కూల్‌కు రోజూ రావడం ఇష్టం ఉండదు. యూనిఫామ్ వేసుకోరు. గత సంవత్సరం ఇదే బడిలో టీచర్‌గా చేరిన 30 ఏళ్ల జాహ్నవి యదు ఇదంతా గమనించింది. వారితో తిప్పలు పడింది. దారిలో పెట్టలేక సతమతమయ్యింది. ఈ సంవత్సరం అంటే 2023 జూన్‌లో స్కూల్ రీ ఓపెన్ అయినప్పుడు జాహ్నవి యదు కొత్త ఆలోచన చేసింది. హఠాత్తుగా ఒకరోజు వారిలాగా యూనిఫామ్ వేసుకుని వచ్చింది. పిల్లలు ఆశ్చర్యపోయారు. గుమిగూడారు. నవ్వారు. ఆనందించారు. 'ఎందుకు టీచర్ ఇలా వేసుకొచ్చావ్' అనంటే 'స్కూల్‌కి మీరు ఇలాగే రావాలి. అందుకని వేసుకొచ్చా. మనందరం ఒక టీమ్. మనందరం సూపర్‌గా చదువుకోవాలి' అని వారిని 'మనం' చేశాక వాళ్లు సంతోషించారు. టీచర్‌లా యూనిఫామ్ వేసుకురావాలని వారికీ అనిపించింది. టీచర్ కోసం రోజూ స్కూల్‌కి రావాలని కూడా.

అన్నీ ప్రశంసలే

జాహ్నవి యదు వారానికి ఒకరోజు అంటే ప్రతి శనివారం స్కూల్ యూనిఫామ్‌లో రావడం రాయ్‌పూర్ అంతా పెద్ద వార్త అయ్యింది. జాహ్నవి యదు చర్య వల్ల పిల్లలు బెరుకు లేకుండా తమ మనసుల్లో ఉన్నది చెప్పుకుంటున్నారని స్కూల్ అనేది టీచర్లు చావబాదే స్థలం కాదని తెలుసుకుని క్లాసులకు హాజరవుతున్నారని ఊరు మొత్తం తెలిసింది. అందరూ జాహ్నవి యదును అభినందిస్తున్నారు. 'టీచర్లూ పిల్లలూ బడిలో సమానమే అనే భావన వ్యాప్తి చేయడమే నా ఉద్దేశం' అని జాహ్నవి యదు చెప్పింది. అయితే ఇలాంటి బట్టల్లో రావడానికి ఆమె కొంచెం ఆలోచించింది– అత్తామామలు ఏమంటారోనని. కాని వారు అంగీకరించి దూసుకుపో కోడలు పిల్లా అని ఉత్సాహపరిచారు. దాంతో జాహ్నవి యదు పిల్లలతో ఆడిపాడుతున్నట్టుగా కనిపిస్తూ వారికి పాఠాలు చెబుతూ దారిలో పెడుతోంది.

> టీచర్లూ, పిల్లలూ బడిలో సమానమే అనే భావన వ్యాప్తి చేయడమే నా ఉద్దేశం.
> – జాహ్నవి యదు

ఫేవరెట్ టీచర్

కొందరు టీచర్లు తమ కెరీర్ మొత్తం ఏ క్లాస్‌కీ ఫేవరెట్ టీచర్ కాకుండానే రిటైర్ అయిపోతారు. కొందరు టీచర్లు ప్రతి సంవత్సరం ఎంతోమంది పిల్లలకు ఫేవరెట్ టీచర్ అవుతారు. పిల్లలతో బంధం వేసుకోవడం టీచర్‌కు చాలా ముఖ్యం. అందులో ఎంతో ఆత్మతృప్తి ఉంటుంది. ఇప్పుడు స్కూల్ మొత్తానికి ఫేవరెట్ టీచర్ అయిన జాహ్నవి యదుని చూసి తాము కూడా పిల్లల కోసం ఏదైనా చేద్దామా అనుకుంటున్నారు మిగిలిన టీచర్లు. అది చాలదూ?

● మల్టీ టాలెంట్

అనన్య సామాన్య స్వతంత్రం



అనన్య బిర్లా

అనన్య బిర్లాకు చెందిన సూక్ష్మరుణ కంపెనీ (ఎంఎఫ్‌ఐ) స్వతంత్ర మైక్రోఫిన్ ప్రైవేట్ లిమిటెడ్ దేశంలో రెండో అతి పెద్ద 'ఎంఎఫ్‌ఐ'గా గుర్తింపు పొందనుంది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా గెలుపు జెండా ఎగరేసిన అనన్య బిర్లా సింగర్, రైటర్, యాక్టర్, సోషల్ యాక్టివిస్ట్...

ఏకంగా అయిదు సింగిల్స్‌లో డబుల్ ప్లాటినమ్ స్టేటస్‌ను సొంతం చేసుకుంది. అనన్య గానప్రతిభ గురించి చెప్పుకోవడానికి ఇదొక మచ్చుతునక మాత్రమే. 'లెట్ దేర్ బి లవ్' 'ఎవ్రీ బడీ లాస్ట్' పాటలతో అమెరికన్ నేషనల్ టాప్ 40 పాప్ రేడియో షో జాబితాలో చోటు సాధించిన ఫస్ట్ ఇండియన్ ఆర్టిస్ట్‌గా ఘనత సాధించింది.

అనన్యకు చిన్నవయసు నుంచే సంగీతం అంటే ఇష్టం. పదకొండు సంవత్సరాల వయసులో సంతూర్ ప్లే చేయడం నేర్చుకుంది. ఎకనామిక్స్ అండ్ మేనేజ్‌మెంట్ కోసం 'యూనివర్శిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్'లో చేరిన అనన్య డిగ్రీ పూర్తి కాకుండానే చదువు మానేసింది.

యూనివర్శిటీలో చదువు సంగతి ఎలా ఉన్నా సంగీతంలో మాత్రం ఎటు చూసినా అనన్య పేరు వినిపించేది. పాడడంతో పాటు కవితలు, పాటలు కూడా రాసేది. గిటార్ ప్లే చేయడం నేర్చుకుంది. 'లివిన్ ది లైఫ్' తన డెబ్యూ సింగిల్. యూట్యూబ్‌లో 14 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. మ్యూజిక్ చార్ట్స్‌లో టాప్‌లో నిలిచింది.

కునాల్ కోహ్లీ స్పై థ్రిల్లర్ 'శ్లోక్'లో నటిగా ఆకట్టుకుంది.

ఇంగ్లాండ్‌లో ఉన్నప్పుడు సంగీత, సాహిత్య కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనేది అనన్య. ఆందోళన, కుంగుబాటుతో సతమతం అవుతున్న యువత కోసం స్టూడెంట్ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. ఇంగ్లాండ్ నుంచి ఇండియాకు వచ్చిన తరువాత మానసిక సమస్యలతో బాధపడే వారికి సహాయం అందించడానికి 'ఎంపవర్' అనే సంస్థను ఏర్పాటు చేసింది.

కోవిడ్ సమయంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో కలిసి 24×7 ఫ్రీ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. ఈ హెల్ప్‌లైన్ ద్వారా వేలాది మంది ప్రజలకు మేలు జరిగింది. అమెరికాకు చెందిన ప్రసిద్ధ మెంటల్ హెల్త్ ఆర్గనైజేషన్ 'నేషనల్ అలయెన్స్ ఆన్ మెంటల్ ఇల్‌నెస్' అంబాసిడర్‌గా నియమితురాలైంది.

'అనన్య బిర్లా ఫౌండేషన్'తో సేవాకార్యక్రమాలను విస్తృతం చేసింది.

సంగీతం అంటే అపారమైన అనురక్తి ఉన్న అనన్య వ్యాపారరంగంలో తొలి అడుగు వేసినప్పుడు...

'అనన్య లోకం వేరు. ఆమె ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయం సాధించడం కష్టం' అనే గుసగుసలు వినిపించాయి.

అప్పటి వరకు అనన్య పేరు పక్కన సంగీతానికి సంబంధించిన విశేషణాలు కనిపించేవి. తరువాత స్వతంత్ర మైక్రోఫిన్, ఫౌండర్ అనేది ఆమె పేరు పక్కన కనిపించడం మొదలైంది. గ్రామీణ ప్రాంతాలలో మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించడానికి 'స్వతంత్ర'ను ఏర్పాటు చేశారు.

తన నాయకత్వ లక్షణాలతో 'స్వతంత్ర'ను అగ్రగామిగా నిలిపింది అనన్య. బెస్ట్ స్టార్టప్‌లకు ఇచ్చే 'గోల్డ్ అవార్డ్'ను గెలుచుకుంది. 2016లో గ్లోబల్ లగ్జరీ ఇ–కామర్స్ ప్లాట్‌ఫామ్ ఇక్రై ఏషియాకు సీయీవోగా బాధ్యతలు చేపట్టింది. ఫోర్బ్స్ ఆసియాస్ ఉమెన్ జాబితాలో అనన్య పేరు చోటు చేసుకుంది.

'స్వతంత్ర' వ్యవస్థాకురాలిగా అనన్య ఆఫీస్ గదికే పరిమితం కాలేదు. క్షేత్రస్థాయిలో పర్యటించేది. ఇండోర్‌లో ఒక పేదింటి మహిళ 'స్వతంత్ర' సహకారంతో ఇల్లు కట్టుకోగలిగింది. ఆమెతో మాట్లాడినప్పుడు అనన్యకు ఎంతో సంతోషంగా అనిపించింది.

అనన్య అపురూప విజయాలు చూసినప్పుడు 'ఏ పని చేసే వాళ్లు ఆ పని చేస్తే మంచిది' 'రెండు పడవల మీద కాలు వద్దు' లాంటి మాటలు, సామెతలు బిత్తర పోతాయి. పనిమీద అనురక్తి, అంకితభావం ఉంటే ఒక రంగానికి చెందిన వారు మరో రంగంలో విజయం సాధించవచ్చు అని చెప్పడానికి అనన్య బిర్లాలాంటి వాళ్లు పెద్ద ఉదాహరణ.

పెద్దింటి అమ్మాయి




పారిశ్రామిక దిగ్గజం కుమార మంగళం బిర్లా కూతురు అయిన అనన్య బిర్లా బాల్యం నియమ నిబంధనలు, రక్షణ వలయాల మధ్య గడిచింది. చిన్నప్పుడే అనన్యకు బాడీగార్డ్ ఉండేవాడు. మిగతా అమ్మాయిల్లాగా ఎక్కడ పడితే అక్కడ ఆడుకోవడానికి లేదు. ఈ రూల్స్‌తో తనకు ఊపిరి ఆడేది కాదు. ఒత్తిడికి గురయ్యేది. ఇంత ఒత్తిడిలోనూ తనదైన కలలు కనేది. 'అసలు నేనేమిటి?' అనే ప్రశ్నకు ఆమెకు సంగీతంలో జవాబు దొరికింది. సంగీతం తనలోని ఒంటరితనాన్ని పోగొట్టడమే కాదు ఆత్మబలాన్ని ఇచ్చింది. 'పెద్దింటి అమ్మాయి' అనే పేరు కంటే స్వేచ్ఛాప్రపంచాన్నే అనన్య ఇష్టపడేది.

పెద్ద యూనివర్శిటీలో పెద్ద చదువు చదవాలి. పెద్దింటి కుటుంబానికి చెందిన అబ్బాయిని పెళ్లి చేసుకోవాలి... ఇలా నా గురించి అనుకునేవారు. అయితే నా ఆలోచనలు దీనికి భిన్నంగా ఉండేవి. ఇది చాలామందిని ఆశ్చర్యపరిచేది. అయితే తల్లిదండ్రులు మాత్రం నాకు ఎప్పుడూ వెన్నుదన్నుగా ఉన్నారు. నా అభిప్రాయాలకు విలువ ఇచ్చారు' అంటుంది అనన్య.

హెయిర్ కేర్



ఉసిరి పొడిలో నిమ్మరసం వేసి పేస్టులా కలపాలి. ఈ పేస్టుని జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి క్యాప్ పెట్టుకోవాలి. గంట తరువాత మైల్డ్ షాంపూతో తల స్నానం చేయాలి. ఈ ప్యాక్‌లో విటమిన్ సి పుష్కలంగా ఉండి కురులను దృఢంగా మారుస్తుంది. జుట్టు రాలడం కూడా తగ్గుతుంది. త్వరగా తెల్లబడదు.



బ్యూటిప్స్

చూడచక్కని కనుబొమల కోసం...

కొంతమందికి కనుబొమలు బాగా పలుచగా, ఉండీ లేనట్టుగా కనిపిస్తాయి. కనుబొమలు తీరైన ఆకృతితో, దట్టంగా ఉంటేనే ముఖారవిందం ఆకర్షణీయంగా కనిపిస్తుంది. పలుచని కనుబొమ్మలను ఒత్తుగా... నల్లగా మార్చుకోవడానికి ఇలా ప్రయత్నించి చూడండి...





ఆముదం: జుట్టు పెరుగుదలకు దోహదపడే వాటిలో ఆముదం ముందు వరుసలో ఉంటుంది. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు, విటమిన్ ఇ, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. దూదిని ఆముదంలో ముంచి పలుచని ఐబ్రోస్ మీద అద్దుకుని ఐదు నిమిషాలు మర్దన చేయాలి. రోజూ ఇలా చేయడం వల్ల వెంట్రుకలు ఒత్తుగా పెరుగుతాయి.

ఉల్లిపాయ రసం: ఉల్లిపాయలో ఉండే సల్ఫర్ జుట్టు ఒత్తుగా పెరిగేలా చేస్తుంది. ఉల్లిపాయ రసాన్ని రోజూ కనుబొమలకు రాసుకోవాలి. రెండు మూడు వారాల్లోనే చక్కని ఫలితం కనిపిస్తుంది.

ఆలివ్ ఆయిల్ : ఫీనాలిక్ కాంపౌండ్స్ ఉండే ఆలివ్ నూనెను కనుబొమ్మలకు రాస్తే .. వెంట్రుకలు నల్లగా పెరుగుతాయి.

సబ్బులతో సాంత్వన

మాట్లాడే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అని పెద్దలు చెబుతుంటారు. ఆదుకోవాలని మనసు ఉండాలే గానీ, సరికొత్త దారులు అనేకం కనిపిస్తాయని చేసి చూపెడుతోంది పదిహేడేళ్ల సీమర్ సంగ్లా. యాసిడ్ దాడి బాధితులు తమ కాళ్ల మీద తాము నిలబడేందుకు సబ్బుల తయారీలో శిక్షణ ఇస్తూ ఎంతోమందికి ప్రేరణగా నిలుస్తోంది.



సీమర్ సంగ్లా

ఢిల్లీకి చెందిన సీమర్ ఇంటర్మీడియట్ చదువుతోంది. ఒకసారి పూనమ్ అనే అమ్మాయి మీద యాసిడ్ దాడి జరిగింది. దీంతో ఆమె ముఖం మొత్తం కాలిపోయింది. అయితే ఆమె మామూలు సబ్బులతో స్నానం చేస్తే యాసిడ్ దాడి జరిగిన ప్రదేశంలో బాగా మంట పుట్టేది. ఈ విషయం తెలిసిన యాసిడ్ దాడి బాధితులకు సాయం చేసే సీమర్ తల్లి... పూనమ్‌ను ఆదుకునే క్రమంలో ... మంట రాని సబ్బు తయారు చేయాలనుకుంది. ఈ క్రమంలోనే సీమర్ అమ్మ, అమ్మమ్మలు కలిసి, సబ్బు తయారు చేశారు. యాసిడ్ దాడికి కాలిపోయిన పూనంకు ఈ సబ్బు స్వాంతన కలిగించింది. వాడుకోవడానికి చాలా అనువుగా అనిపించింది. ఇదంతా దగ్గర నుంచి చూసిన సీమర్ యాసిడ్ బాధితుల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవడం మొదలు పెట్టింది. పూనమ్‌లా ఎంతోమంది యాసిడ్ దాడికి గురైనట్లు తెలుసుకుని, వాళ్లందరికి తాను ఏదోరకంగా సాయపడాలనుకుంది. గతేడాది యాసిడి బాధితుల అవసరాలకు తగినట్లుగా 'సేఫ్ కేవ్' పేరిట సబ్బులు తయారు చేయడం ప్రారంభించింది.



యాసిడ్ బాధితులకు సబ్బుల తయారీలో శిక్షణ ఇస్తున్న సీమర్ సంగ్లా

అలోవెర, తేనెలతో సబ్బులు తయారు చేసి యాసిడ్ బాధితులకు ఇచ్చేది. ఈ సబ్బులు బాధితులకు సాంత్వననిచ్చేవి. వారి ఆసక్తిని గమనించిన సీమర్... సబ్బుల తయారీలో శిక్షణ ఇవ్వడం మొదలు పెట్టింది. శిక్షణ తీసుకున్న వారంతా సబ్బులు తయారు చేసి మార్కెట్లో విక్రయించి డబ్బులు సంపాదిస్తున్నారు. దీంతో వాళ్లకంటూ ఒక గుర్తింపుతోపాటు, సాధారణ అమ్మాయిల్లా జీవించగలుగుతున్నారు.

సీమర్.. ఇప్పటిదాక ఇరవైమందికిపైగా సబ్బుల తయారీలో శిక్షణ ఇచ్చింది. యాసిడ్ బాధితుల గురించి తన స్నేహితులు, ఇతర పిల్లలకు చెబుతూ వారికి సాయం చేయాలని కోరుతోంది. ఇది చిన్నపనే అయినప్పటికీ వారి జీవితాల్లో పెద్ద మార్పుని తీసుకొస్తుంది సీమర్. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయిన బాధితులంతా సీమర్ శిక్షణతో ధైర్యాన్ని కూడగట్టుకొంటూ జీవితంపై కొత్త ఆశలతో ముందుకు సాగుతున్నారు.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 140

గురువారం 10-8-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'



అక్టోబర్ 14న భారత్ X పాక్

వన్డే వరల్డ్‌కప్‌లో 9 మ్యాచ్‌ల తేదీల్లో మార్పులు చేసిన ఐసీసీ - 12లో



జీఎస్టీ మార్పులకు కేంద్రం ఓకే


ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోలు, గుర్రపు పందెం క్లబ్‌లపై 28 శాతం పన్ను - 13లో



దేశం నుంచి తరిమికొట్టాలి

అవినీతి, వారసత్వ రాజకీయాలను భారత్ నుంచి తరిమి కొట్టాలని ప్రజలు నినదిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ►



ఇక మాది కేరళం రాష్ట్రం

తమ రాష్ట్రం పేరును కేరళంగా మార్చుకు నేందుకు కేరళ శాసనసభ తీర్మానం చేసింది. ఇందుకు అనుమతివ్వాలని కేంద్రాన్ని కోరింది.


వివరాలు 6లో ►



చంద్రయాన్–3 కక్ష్య తగ్గింపు

చందమామ చుట్టూ చక్కర్లు కొడుతున్న చంద్రయాన్–3 మిషన్ కక్ష్యను ఇస్రో శాస్త్రవేత్తలు మరోసారి తగ్గించారు.

వివరాలు 6లో ►



తొలిసారి తగిలిన లాటరీ

టమాటా పంట రైతులను కోటీశ్వరులను చేసింది. వ్యాపారులు పోటీపడి ధరలు పెంచ డంతో రైతులకు మంచి లాభాలు వచ్చాయి.

వివరాలు 5లో ►

మాటల తూటాలు

మణిపూర్ అంశంపై అధికార, విపక్షాల వ్యాఖ్యలతో అట్టుడికిన లోక్‌సభ



లోక్‌సభలో మాట్లాడుతున్న రాహుల్

- మణిపూర్‌లో భరతమాతను హత్య చేశారు: రాహుల్ గాంధీ
- అక్కడికి ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకెళ్లడం లేదని నిలదీత
- ఈ అంశాన్ని రాజకీయం చేయడం సిగ్గుచేటు: అమిత్ షా
- దీనిపై రాహుల్ గాంధీ డ్రామా నడిపించారని మండిపాటు
- లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై రెండోరోజు చర్చ
- మణిపూర్‌లో శాంతిని కోరుతూ లోక్‌సభలో తీర్మానం ఆమోదం

6లో

మణిపూర్‌లో భరతమాతను హత్య చేశారంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు లోక్‌సభలో పెను దుమారం సృష్టించాయి. లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణ తర్వాత తొలిసారిగా సభలో మాట్లాడిన ఆయన బీజేపీపై, ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు. కేంద్రంపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ రెండోరోజు బుధవారమూ కొనసాగింది. అధికార, విపక్షాల మధ్య మాటల మంటలు చెలరేగాయి. మణిపూర్‌లో హింసాకాండను అరికట్టడంలో మోదీ సర్కారు విఫలమైందని రాహుల్ నిప్పులు చెరిగారు. మణిపూర్ ప్రజలను హత్య చేయడం ద్వారా భారతదేశాన్ని హత్యచేశారని, అందుకే ప్రధానమంత్రి అక్కడికి వెళ్లడం లేదని విమర్శించారు. విపక్షాల ఆరోపణలను లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా తిప్పికొట్టారు. మణిపూర్ అంశాన్ని రాజకీయం చేయడం సిగ్గుచేటని విపక్షాలపై ధ్వజమెత్తారు. పొరుగు దేశం మయన్మార్ నుంచి కుకీ తెగ గిరిజనులు మణిపూర్‌కు వలస రావడం వల్లే అక్కడ సమస్య మొదలైందని వివరించారు. ప్రభుత్వం చేపట్టిన చర్యలతో రాష్ట్రంలో ఘర్షణలు తగ్గుముఖం పట్టాయని వెల్లడించారు. మణిపూర్‌లో శాంతిని కోరుకుంటూ అమిత్ షా ప్రతిపాదించిన తీర్మానాన్ని లోక్‌సభలో ఆమోదించారు.



లోక్‌సభలో మాట్లాడుతున్న అమిత్ షా

మహిళా మంత్రికి ముద్దులా..?

- మహిళా ఎంపీలను అవమానించాడు
- కేంద్ర మహిళా మంత్రులు, ఎంపీల ధ్వజం
- కఠినాతి కఠిన చర్యలు తీసుకోండి
- రాహుల్‌పై లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు
- బీజేపీకి రాహుల్ ఫోబియా: కాంగ్రెస్

6లో



మణిపూర్ సమస్యను త్వరగా పరిష్కరించాలి

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి

10లో

ఫ్యాక్ట్ చెక్

పూర్తవని ఈ-టెండర్‌పై..

ఈ తప్పుడు రాతలేంటి.!

- తుపాను ప్రభావిత తీర ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థ పటిష్టతకు భూగర్భ కేబుళ్లు
- రూ.1,165.41 కోట్ల ప్రాజెక్టు నివేదికకు 2022 మార్చిలో కేంద్రం ఆమోదం
- పీఎఫ్‌సీ ఆమోదించిన స్టాండర్డ్ బిడ్డింగ్ డాక్యుమెంట్‌కి అనుగుణంగా టెండర్
- జ్యుడీషియల్ ప్రివ్యూ ఆమోదం మేరకు ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ ప్రకటన
- కేబుళ్ల ధరల్లో భారీ వ్యత్యాసం కారణంగా పెరిగిన టెండర్ ధర
- పొంగులేటి శ్రీనివాసరెడ్డి సన్నిహితుడు అయితే వైఎస్సార్‌సీపీని ఎందుకు విడిచిపెట్టారు?
- రామోజీరావు ఎందుకు టెండర్లు వేయలేదు?
- వాస్తవాలను దాచిపెట్టి దురుద్దేశంతో ఈనాడు తప్పుడు కథనం

14లో

వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు, అధికారులు



పెద్ద చదువుల కల సాకారం

నా చెల్లెమ్మలు ఆ దిశగా పయనిస్తుండటం ఆనందదాయకం

- ఈ పథకం లబ్ధిదారుల్లో 86 శాతం అమ్మాయిలు ఉన్నత చదువులు
- బాల్య వివాహాల నివారణ, ఉన్నత చదువులే లక్ష్యంగా అడుగులు
- అర్హుల్లో ఏ ఒక్కరూ మిగిలిపోకూడదనే మానవత్వమున్న ప్రభుత్వమిది
- పేదరికం నుంచి అందరూ బయటకు రావాలన్నదే నా తపన

వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం జగన్

- ప్రతి మండలంలో ప్రత్యేకంగా బాలికల కోసం జూనియర్ కాలేజీ
- గ్రామ సచివాలయంలోనే వివాహ సర్టిఫికెట్లు అందిస్తూ విప్లవాత్మక మార్పులు
- ఈ పథకం మూడో విడత కింద 18,883 జంటలకు రూ.141.60 కోట్లు సాయం

2లో



గ్రామ సచివాలయాల్లో 'సమాచారహక్కు'

- మరింత పారదర్శకతకు ప్రభుత్వ కీలక నిర్ణయం
- అన్ని సచివాలయాల్లో సమాచారహక్కు చట్టం అధికారులు.. ఉత్తర్వులు జారీ చేసిన పంచాయతీరాజ్ శాఖ

2లో

'అంగళ్లు' దాడుల కేసులో

ఎ1గా చంద్రబాబు

హత్యాయత్నం, నేరపూరిత కుట్ర సహా పలు సెక్షన్ల కింద కేసు

- నిందితుల్లో మాజీ మంత్రులు దేవినేని, అమరనాథ్, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి
- మాజీ ఎమ్మెల్యేలు షాజహాన్, రమేష్ పైనా కేసు.. మొత్తం 20 మందిపై కేసు నమోదు
- బాబు యాత్రలో ఉద్దేశపూర్వకంగానే టీడీపీ దాడులు.. కుట్ర ప్రకారమే మారణాయుధాలు, బాటిళ్లు ముందుగా సిద్ధం
- ఆధారాలతో ఫిర్యాదు చేసిన అంగళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్.. ముదివేడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- పిచ్చలవాండ్లపల్లె రిజర్వాయర్ పనులు నిలిపివేయించిన బాబు
- దీనిపై నిరసన తెలిపి వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ నేతలు
- వారిని చూడగానే రెచ్చిపోయి కార్యకర్తలను ఉసిగొల్పిన చంద్రబాబు
- రాళ్లు, రాడ్లు, కర్రలు, బాటిళ్లతో దాడులు చేసిన టీడీపీ కార్యకర్తలు
- పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, ఓ కానిస్టేబుల్, ఓ విలేకరికి గాయాలు



అంగళ్లులో చంద్రబాబు రెచ్చగొడుతుండగా.. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు తొడగొడుతూ, చెప్పు చూపిస్తున్న టీడీపీ మూకలు (ఫైల్)

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం అంగళ్లులో వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులకు సంబంధించి టీడీపీ అధినేత ఎన్.చంద్రబాబు నాయుడు ప్రథమ ముద్దాయిగా పోలీసులు హత్యాయత్నం, నేరపూరిత కుట్ర, ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈనెల 4న యాత్ర ముసుగులో టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ నేతల హత్యకు కుట్ర పన్ని, మారణాయుధాలు, బాటిళ్లు, రాళ్లు, కర్రలతో

మిగతా 3వ పేజీలో ▶

గుంట నక్కల కుట్రలు సహించం

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల

చంద్రబాబు నాయకత్వంలోనే టీడీపీ మూక దాడులు

3లో

రామోజీ, శైలజకు సీఐడీ నోటీసులు

- 16, 17 తేదీల్లో విజయవాడలో విచారణ
- ఈసారి హాజరుకాకపోతే న్యాయపరంగా కఠిన చర్యలకు యోచన.. కోర్టు ద్వారా నోటీసులు ఇప్పించాలని నిర్ణయం
- జూలై 5న ఏపీలో విచారణకు రాని రామోజీ.. ఇప్పటికే ఇద్దరిని హైదరాబాద్‌లో పలుమార్లు విచారించిన సీఐడీ

10లో



ఇదండీ సంగతి



మనం హామీలు నెరవేర్చనందుకు ఎన్నికల అధికారులతో ఇబ్బంది ఏదన్నా ఉంటుందా సార్!

విద్యుత్ ఉద్యోగులతో ఫలించిన చర్చలు

సమ్మె ప్రతిపాదనను ఉపసంహరించుకున్న 'ఏపీఎస్‌పీఈజేఏసీ'

- పేస్కేలు నిర్ధారణకు జెన్‌కో ఎండీ నేతృత్వంలో కమిటీ
- సింగిల్ మాస్టర్ స్కేల్ రూ.2.60 లక్షలు.. 8 శాతం ఫిట్‌మెంట్
- 12 వాయిదాల్లో బకాయిలు
- మాస్టర్ స్కేల్ రూ.2.60 లక్షలు దాటితే పర్సనల్ పే, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి 2018 స్కేల్ ప్రకారం జీతాలు, అదనంగా 2% పెంపు
- మంత్రులు పెద్దిరెడ్డి, బొత్స సమక్షంలో చర్చలు
- యాజమాన్యం, ఉద్యోగ సంఘాల మధ్య రేపు ఒప్పందం



విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులతో చర్చలు జరుపుతున్న మంత్రులు, అధికారులు

సాక్షి, అమరావతి: విద్యుత్ ఉద్యోగులతో ప్రభుత్వం జరిపిన చర్చలు ఫలించాయి. దీంతో ఉద్యోగుల ఆందోళనకు తెరపడింది. గురువారం తలపెట్టిన సమ్మె ప్రతిపాదనను కూడా వారు ఉపసంహరించుకున్నారు. పే రివిజన్‌లో భాగంగా డిమాండ్ల సాధన కోసం గత నెల 27 నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన ఉద్యోగులు ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని వెల్లడించారు. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీఎస్‌పీఈజేఏసీ) నోటీసు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఏపీఎస్‌పీఈజేఏసీ ప్రతినిధులతో ప్రభుత్వం

మిగతా 14వ పేజీలో ▶

క్లుప్తంగా...

గిరిపుత్రులకు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు: సీఎం జగన్



సాక్షి, అమరావతి: అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ట్వీట్ చేశారు. 'ప్రపంచం ఎంత అభివృద్ధి చెందుతున్నా గిరిపుత్రులు మాత్రం అమ్మలా భావిస్తున్న అడవులపైనే ఆధారపడి జీవిస్తూ.. నిత్యం ప్రకృతిని కాపాడుతున్నారు. వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తూ మన ప్రభుత్వంలో వివిధ కార్యక్రమాలను ప్రవేశపెట్టాం. నాణ్యమైన విద్య, వైద్యం వంటి సౌకర్యాలు కల్పిస్తూనే లక్షల మంది గిరిజనులకు పోడు భూములపై యాజమాన్య హక్కులు కల్పించాం. గిరిజనులకు ప్రాధాన్యత ఇచ్చి, కొత్తగా రెండు జిల్లాలను ఏర్పాటు చేశాం. నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వారికి నా శుభాకాంక్షలు' అంటూ సీఎం జగన్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

గ్రామ సచివాలయాల్లో 'సమాచారహక్కు'

సాక్షి, అమరావతి: ప్రభుత్వ కార్యక్రమాల్లో మరింత పారదర్శకత తీసుకొస్తూ ప్రభుత్వం కొత్తగా గ్రామ సచివాలయాల స్థాయిలోను సమాచారహక్కు(ఆర్టీఐ) వ్యవస్థను ఏర్పాటు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల్లో సమాచారహక్కు చట్టం అధికారుల నియామకానికి చర్యలు చేపట్టాలంటూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ ఆ శాఖ కమిషనర్‌ను ఆదేశిస్తూ జీవో నంబరు 437 జారీచేశారు. ప్రతి గ్రామ సచివాలయంలో సమాచారహక్కు సంబంధిత సహాయ అధికారి(అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్–ఏపీఐవో), సమాచార హక్కు సంబంధిత అధికారి(పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్–పీఐవో)లను నియమిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. గ్రామ సచివాలయంలో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్ ఏపీఐవోగాను, పంచాయతీ కార్యదర్శి పీఐవోగాను కొనసాగుతారని కమిషనర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సచివాలయం స్థాయిలో పరిష్కారం కాని వినతులపై ఫిర్యాదుల కోసం అప్పిలేట్ అథారిటీగా ఆ మండల ఎంపీడీవో పనిచేస్తారని తెలిపారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నూర్ బాషా సంఘం ప్రతినిధులు

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): వైఎస్సార్ షాదీ తోఫా పథకం ద్వారా ప్రభుత్వం నూర్‌బాషా మహిళలకు అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నూర్ బాషా సంఘం కృతజ్ఞతలు తెలిపింది. బుధవారం నూర్ బాషా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయవాడ పోలీసు కంట్రోల్ రూం వద్ద గల వైఎస్సార్ పార్క్‌లో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. థాంక్యూ సీఎం సార్.. అంటూ వైఎస్సార్ పార్క్‌లో ఫ్లెక్సీని ప్రదర్శించారు. రాష్ట్ర టైలర్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఎస్‌కే సుభానీ, రాష్ట్ర నూర్ బాషా సంఘం అధ్యక్షుడు ఓ రసూల్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలన నూర్‌బాషాలకు స్వర్ణయుగమని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన నూర్ బాషా పిల్లల పెళ్లిళ్లకు భరోసా కల్పిస్తున్నారని అన్నారు. తాము అడిగిన వెంటనే ఆర్థిక సహాయం రూ. 50 వేల నుంచి రూ.లక్షకు పెంచిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటామన్నారు.

తక్కువ ధరకే సెట్‌టాప్ బాక్స్‌లు

• ఫైబర్ నెట్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాలకు ఫైబర్‌నెట్ సేవలను మరింత చేరువ చేసే విధంగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా ప్రజలందరికీ తక్కువ ధరకే సెట్‌టాప్ బాక్స్‌లు అందజేసే విధంగా కృషి చేస్తున్నామని ఏపీ ఫైబర్ నెట్ లిమిటెడ్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి తెలిపారు. బుధవారం విజయవాడలో ఆయన అధ్యక్షతన ఏపీ ఫైబర్ కేబుల్ రాష్ట్ర ఎంఎస్‌వో, ఎల్‌సీవోలు భేటీ అయ్యారు. అనంతరం గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ ఎంఎస్‌వోలకు రాయితీలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. త్వరలో ఫైబర్‌నెట్ ద్వారా ఓటీటీ ప్లాట్ ఫామ్స్ అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు.

కొత్తగా 8 ఆర్వోబీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా ఎనిమిది రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్వోబీ)ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కార్యాచరణ చేపట్టాయి. సీఎం వైఎస్ జగన్ ప్రతిపాదనల మేరకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) రాష్ట్రానికి 33 ఆర్వోబీలను మంజూరు చేసేందుకు ఆమోదించిన విషయం విదితమే. అందులో తాజాగా ఎనిమిది ఆర్వోబీల నిర్మాణ ప్రక్రియను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాయి. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధుల కింద భూసేకరణ, యుటిలిటీస్ షిఫ్టింగ్ వ్యయాన్ని భరించనుంది. ఎన్‌హెచ్ఏఐ తన నిధులతో ఆర్వోబీలను నిర్మిస్తుంది.

పుట్టుకతోనే వినికిడి లోపం ఉన్న చిన్నారులకు వరంగా ఆరోగ్యశ్రీ.. పథకం కింద పూర్తి ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలు

- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రెండు చెవులకూ ఆపరేషన్లు
- రూ.12 లక్షలు ఖర్చయ్యే సర్జరీలు ఉచితంగా చేస్తున్న ప్రభుత్వం
- డిశ్చార్జి తర్వాత ఆరోగ్య ఆసరా కింద భృతి కూడా
- 2019 నుంచి ఇప్పటివరకు 566 మందికి ఆపరేషన్లు
- రూ.33.48 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం



చిట్టి చెవులకు గట్టి భరోసా..

- సాక్షి, అమరావతి

అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం మల్లవరంకు చెందిన అడిగర్ల కొండబాబు, సత్యవేణి దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఆరేళ్ల క్రితం కుమారుడు పుట్టాడు. చిన్నారి శబ్దాలను గ్రహించలేకపోవడంతోపాటు ఎవరైనా పలకరించినా వారివైపు చూసేవాడు కాదు. దీంతో తల్లిదండ్రులు వైద్యులను సంప్రదించగా పుట్టుకతోనే వినికిడి లోపం ఉన్నట్టు నిర్ధారించారు. కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీ చేయాలని.. ఇందుకు రూ.8 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పడంతో ఆ నిరుపేద దంపతులు హతాశులయ్యారు. ఈ తరుణంలో వారిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆదుకుంది. ఈ పథకం కింద విశాఖలోని విమ్స్‌లో ఉచితంగా గతేడాది ఆగస్టులో బాబుకు సర్జరీ చేశారు. ప్రస్తుతం పిల్లాడికి వినిపిస్తోంది.. తల్లిదండ్రులు పిలిస్తే పలుకుతున్నాడు.. నెమ్మదిగా మాట్లాడుతున్నాడు. దీంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. 'బాబుకు సర్జరీ చేయించేంత ఆర్థిక స్తోమత మాకు లేదు. అలాంటి మమ్మల్ని సీఎం వైఎస్ జగన్ ఆదుకున్నారు. బిడ్డకు మేం జన్మనిస్తే.. వాడికి మాటలు వచ్చేలా చేసి ఆరోగ్యశ్రీ పునర్జన్మను ప్రసాదించింది' అని కొండబాబు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

..ఇది ఒక్క కొండబాబు ఆనందం మాత్రమే కాదు. రాష్ట్రంలో ఎంతో మంది వినికిడి శక్తి లేని చిన్నారులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆపద్బాంధవిలా నిలుస్తోంది. పేద, మధ్యతరగతి కుటుంబాల్లోని చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ఈ పథకం కింద పుట్టుకతోనే వినికిడి లోపం ఉన్న పిల్లలకు అత్యంత ఖరీదైన కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలను వైఎస్ జగన్ ప్రభుత్వం పూర్తి ఉచితంగా నిర్వహిస్తోంది.

ఇప్పటివరకు 566 మందికి ..



2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేసింది. ఇందులో భాగంగా రెండు చెవులకు (బైలాటిరల్) కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీని పథకంలోకి చేర్చింది. దీంతో దాదాపు రూ.12 లక్షలు ఖర్చయ్యే సర్జరీకి కూడా ఆరోగ్యశ్రీ వర్తించింది. 2019 నుంచి ఇప్పటివరకు 566 మంది వినికిడి లోపం ఉన్న పిల్లలకు ప్రభుత్వం కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలు నిర్వహించింది. ఇందుకు రూ.33.48 కోట్లు ఖర్చు చేసింది. అంతేకాకుండా ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యాక వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద చిన్నారులకు విశ్రాంత సమయానికి భృతిని సైతం అందజేస్తున్నారు.

ఇప్పటివరకు జరిగిన కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలు

ఏడాది	సర్జరీలు
2019-20	123
2020-21	47
(కరోనా కారణంగా నిలిచిన సర్జరీలు)	
2021-22	159
2022-23	167
2023-24 (ఇప్పటివరకు)	70
మొత్తం	566

మా జీవితాల్లో సీఎం జగన్ సంతోషాన్ని నింపారు..



నేను ప్రైవేట్ బ్యాంక్‌లో ఉద్యోగిని. మా నాలుగేళ్ల బాబుకు పుట్టుకతోనే వినికిడి లోపం ఉంది. ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.12 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. అంత ఆర్థిక స్తోమత మాకు లేదు. గతేడాది ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా రెండు చెవులకు బైలాటిరల్ కాక్లియర్ ఇంప్లాంటేషన్ జరిగింది. ప్రస్తుతం చిన్న చిన్నగా మాట్లాడగలుగుతున్నాడు.. స్కూల్‌కు కూడా వెళుతున్నాడు. మా జీవితాల్లో సంతోషాన్ని నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మేలును ఎప్పటికీ మరిచిపోలేం.

– సీహెచ్ శ్రీధర్, నర్సిపురం, శ్రీకాకుళం జిల్లా

ప్రభుత్వం చేసిన మేలును ఈ జన్మకు మరువను..



మా బాబు జాన్విత్‌కు పుట్టుకతోనే వినికిడి లోపం ఉంది. దీంతో పెద్దయ్యేకొద్దీ బాబుకు మాటలు కూడా రావని వైద్యులు చెప్పారు. కాక్లియర్ ఇంప్లాంటేషన్ చేయిస్తే వినికిడి శక్తి వస్తుందన్నారు. మాది పేద కుటుంబం కావడంతో సర్జరీ చేయించే స్తోమత మాకు లేదు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.12 లక్షల విలువైన ఆపరేషన్‌ను ఉచితంగా ప్రభుత్వం చేయించింది. ఏడాది పాటు ఉచితంగా సౌండ్ థెరపీ ఇచ్చి బాబుకు మాటలొచ్చేలా చేశారు. వాడు పుట్టిన కొన్నేళ్లకు అమ్మా అనే పిలుపునకు నోచుకున్నాను. ప్రభుత్వం చేసిన మేలును ఈ జన్మకు మరువను.

– లక్ష్మి, దొర్నిపాడు, నంద్యాల జిల్లా

పెద్ద చదువుల కల సాకారం

నా చెల్లెమ్మలు ఆ దిశగా పయనిస్తుండటం ఆనందదాయకం

వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నా చెల్లెమ్మలు పెద్ద చదువులు చదవాలనే లక్ష్యం నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా లబ్ధిదారుల్లో 86 శాతం మంది అమ్మాయిలు ఉన్నత చదువులు చదువుతుండటమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. అమ్మాయిలు పెద్ద చదువులు చదివేలా ప్రోత్సహించడంతో పాటు బాల్య వివాహాల నివారణే లక్ష్యంగా కళ్యాణ మస్తు, షాదీ తోఫా అమలు ద్వారా వారి పెళ్లిళ్లకు ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. అర్హులెవరైనా ఇంకా మిగిలిపోయి ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి, వారికి లబ్ధి చేకూర్చే మానవత్వం ప్రదర్శిస్తున్న ప్రభుత్వం ఇదని స్పష్టం చేశారు. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి ఈ ఏడాది ఏప్రిల్– జూన్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 18,883 జంటలకు వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా కింద రూ.141.60 కోట్ల ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి వధువుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలందరూ పెద్ద చదువులు చదివి పేదరికం నుంచి బయటకు రావాలన్నదే జగనన్న ప్రభుత్వం కోరిక అని తెలిపారు. అమ్మాయిల పెద్ద చదువుల కోసమే ప్రతీ మండలంలోని హైస్కూలును ప్రత్యేకంగా వారి కోసం జూనియర్ కాలేజీగా మారుస్తున్నామని చెప్పారు. పేదరికం నుంచి బయట పడేందుకు పెద్ద చదువులే బ్రహ్మాస్త్రంగా ఉండాలని మనందరి ప్రభుత్వం ఆరాట పడుతోందన్నారు. మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం ఎక్కడెక్కడికో వెళ్లకుండా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లోనే అక్కడే వెరిఫికేషన్ పూర్తి చేసి సర్టిఫికెట్ అందిస్తూ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

> నా చెల్లెమ్మలు కనీసం డిగ్రీ వరకైనా చదవాలన్నది నా తపన, తాపత్రయం. ఇందులో భాగంగానే వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాలకు పదవ తరగతి ఉత్తీర్ణులవ్వాలని కనీస అర్హత పెట్టాం. తద్వారా అంతవరకు తల్లిదండ్రులు తప్పక చదివిస్తారు. ఆ తర్వాత కూడా అమ్మ ఒడి వల్ల ఇంటర్ వరకూ కాలేజీకి పంపిస్తారు. విద్యాదీవెన, వసతి దీవెన వల్ల ఒక్క రూపాయి కూడా ఖర్చు కాని పరిస్థితి తీసుకు రావడం వల్ల డిగ్రీ వరకు చదవాలనే పట్టుదల పెరిగింది. తద్వారా నా చెల్లెమ్మలందరూ మంచి మంచి డిగ్రీలు చదివి.. పేదరికం నుంచి బయట పడుతున్న పరిస్థితి ఇవాళ రాష్ట్రంలో మన కళ్లెదుటే కనిపిస్తున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. - సీఎం వైఎస్ జగన్

ఆడపిల్లల చదువులను ప్రోత్సహిస్తూ..

- వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కార్యక్రమాలు చదువులను మరింత ప్రోత్సహిస్తూ.. ఆడ పిల్లలు గొప్పగా చదివేలా ప్రోత్సహిస్తున్నాయి. ఆ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచే మంచి కార్యక్రమాలు కూడా. ఈ రోజు పేద తల్లిదండ్రులందరూ తమ పిల్లలను గొప్పగా చదివించి, వారి పెళ్లి కూడా గౌరవప్రదంగా, అప్పుల పాలవ్వకుండా బాగా చేయాలని కోరుకుంటారు.
- అలా పేదరికంలో ఉన్న నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, నా దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడ పిల్లల కోసమే ఈ పథకం. వారి జీవితాల్లో వెలుగులు నింపాలని, అప్పుల పాలయ్యే పరిస్థితి లేకుండా, రాకుండా పెళ్లిళ్లు జరిగే పరిస్థితి రావాలని.. ఆ పిల్లలు బాగా చదివి ప్రతి ఒక్కరూ కనీసం డిగ్రీ వరకు వెళ్లే పరిస్థితి రావాలన్న తలంపుతో ఈ కార్యక్రమం చేస్తున్నాం.
- ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ ఈ మూడు నెలలకు సంబంధించి పెళ్లిళ్లు అయిన వారితో పాటు 2023 జనవరి నుంచి మార్చి వరకు వివాహాలు అయిన వారిలో ఏ కారణంగానైనా లేదా సర్టిఫికెట్ సకాలంలో సమర్పించక పోవడం, అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు ఆ సమయంలో లేకపోవడం వంటి కారణాలతో లబ్ధి పొందని వారికి కూడా కలిపి ఇవాళ ఈ సహాయం చేస్తున్నాం.

ఇల్లాలి చదువు.. పిల్లలకు మేలు

- ఇంటి ఇల్లాలు ఎప్పుడైతే డిగ్రీ వరకు చదువుకున్న పరిస్థితి ఉంటుందో.. తర్వాత తరంలో తమ పిల్లలను ఇంకా ఉన్నత విద్య వైపు నడిపించే పరిస్థితి ఉంటుంది. తద్వారా పేద సామాజిక వర్గాల్లో పిల్లలు గొప్పగా చదివే పరిస్థితి రావాలి. ప్రతి ఒక్కరికీ కనీసం డిగ్రీ సర్టిఫికెట్ చేతిలో ఉండే పరిస్థితి రావాలి. అవి కూడా మంచి డిగ్రీలు అయి ఉండాలి. భవిష్యత్‌లో వారు పేదరికం నుంచి బయటకు రావాలంటే చదువు అనే బ్రహ్మాస్త్రం ఉండాలని ఆరాటపడుతున్న ప్రభుత్వం మనది.
- ఈ పథకం గత ప్రభుత్వంలో ఎలా ఉండేది? మన ప్రభుత్వం వచ్చాక ఏ రకమైన మార్పులు తీసుకొచ్చిందో అందరికీ తెలుసు. గత ప్రభుత్వంలో చేశామంటే చేశామన్నట్టు మొక్కుబడిగా చేశారే తప్ప.. చిత్తశుద్ధిగా చేయలేదు. పేదల బతుకులు మారాలి.. వారికి మంచి జరగాలన్న ఆలోచన వారికి ఏ రోజూ లేదు. 2018లో 17,709 మందికి దాదాపు రూ.68.68 కోట్లు ఇవ్వకుండా ఎగ్గొట్టారు. ఆ రోజుల్లో కేవలం ఎన్నికలే లక్ష్యంగా పథకాలు తెచ్చారు.

రూపాయి ఖర్చు లేకుండా ఉన్నత చదువులు

- ఈ రోజు ఈ పథకానికి పదో తరగతి పాస్ అయి ఉండాలన్న నిబంధనను తీసుకొచ్చాం. ఆ దిశగా తల్లిదండ్రులు ప్రోత్సహించేలా అడుగులు వేస్తున్నాం. నా చెల్లెమ్మలకు 18, తమ్ముళ్లకు 21 సంవత్సరాల వయసు ఉండాలనే నిబంధన తీసుకొచ్చాం. తద్వారా చెల్లెమ్మలు పదో తరగతి వరకు కచ్చితంగా చదువుతారు. ఆ తర్వాత 18 సంవత్సరాల వరకు ఎలాగూ ఆగాలి.. అమ్మఒడి అనే పథకం అందుబాటులో ఉంది కాబట్టి.. చదువు కొనసాగిస్తూ ఇంటర్ పూర్తి చేస్తారు. ఆ తర్వాత పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ – విద్యాదీవెన, వసతి దీవెన అనే రెండు పథకాలతో డిగ్రీ, ఇంజనీరింగ్, డాక్టర్ వంటి పెద్ద చదువులు పూర్తి చేసేందుకు రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం భరిస్తూ తోడుగా నిలబడుతోంది.
- డిగ్రీలో చేరితే చాలు.. వసతి దీవెన అనే పథకం ద్వారా రూ.20 వేలు బోర్డింగ్, లాడ్జింగ్ ఖర్చుల కోసం రెండు దఫాల్లో పిల్లల తల్లుల ఖాతాల్లో వేస్తున్నాం. ఇది మరో ప్రోత్సాహకరమైన కార్యక్రమం. ఫీజు కాకుండా వారు డిగ్రీ చదివేందుకు ఒక్కొక్కరికి రూ.60 వేలు ఇచ్చినట్టవుతుంది.
- ఆ తర్వాత పెళ్లిళ్లు చేసినట్లయితే.. మైనార్టీలకు షాదీతోఫా కింద ఏకంగా రూ.లక్ష ఇచ్చి తోడుగా నిలుస్తున్నాం. గతంలో రూ.50 వేలు మాత్రమే ప్రోత్సాహకంగా ఇస్తామని ప్రకటించి, ఇవ్వకుండా ఎగరగొట్టిన పరిస్థితులు చూశాం. వికలాంగులకు ఏకంగా రూ.1.50 లక్షలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. గత ప్రభుత్వంలో రూ.లక్ష ఇస్తామని ప్రకటించి ఎగ్గొట్టారు.
- భవన నిర్మాణ కార్మికులకు గత ప్రభుత్వంలో రూ.20 వేలు ప్రకటించి ఇవ్వకుండా వదిలేస్తే.. మనం ఈరోజు రూ.40 వేలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. ఎస్సీలకు గతంలో రూ.40 వేలు ప్రకటించి ఇవ్వకుండా వదిలేస్తే.. మన ప్రభుత్వంలో రూ.లక్ష ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. ఎస్టీలకైతే గతంలో రూ.50 వేలు ఇస్తామని ఎగ్గొడితే.. మన ప్రభుత్వంలో రూ.లక్ష ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. బీసీలకు గతంలో రూ.30 వేలు ఇస్తామని ఎగ్గొడితే.. మనం ఏకంగా రూ.50 వేలు ఇచ్చి వాళ్లను కూడా ప్రోత్సహించే కార్యక్రమం చేస్తున్నాం. కులాంతర వివాహాలకు మనం అప్పటి కంటే ఇంకా ఎక్కువ ఇచ్చి మనసు పెట్టి ప్రోత్సహిస్తున్నాం.



జిల్లాల కలెక్టర్లు, లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

3 విడతల్లో రూ.267 కోట్లు

- గతేడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు రెండు విడతల్లో ఈ పథకాన్ని అమలు చేశాం. ఇవాళ మూడో విడతతో కలిపి మొత్తంగా రూ.267 కోట్లు సాయం చేశాం. మొత్తంగా 35,551 జంటలకు మేలు జరిగింది. ప్రతి ఏడాది మూడు నెలలకోసారి నాలుగు విడతల్లో ఈ కార్యక్రమం జరుగుతుంది.
- ఇవాళ సాయం అందుకున్న 18,883 మంది పిల్లలకు సంబంధించి కొన్ని విషయాలు సంతోషం కలిగిస్తున్నాయి. ఇందులో 18–21 ఏళ్ల వయసులో 8,524 మంది చెల్లెమ్మలు ఉన్నారు. ఇందులో అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వీటన్నింటి వల్లా లబ్ధి పొంది.. డిగ్రీ కూడా చదివిన, చదువుతున్న వారు 7,344 మంది ఉన్నారు. అంటే 8,524 మంది చెల్లెమ్మల్లో డిగ్రీ, ఇంజనీరింగ్ వంటి కోర్సులను 86 శాతం మంది చదువుతున్నారు.
- పదో తరగతి నుంచి ఇంటర్ వరకు అమ్మ ఒడి, ఆ తర్వాత డిగ్రీలో విద్యాదీవెన, వసతి దీవెన ద్వారా మేలు పొందారు. ఏం సాధించాలని మనం తాపత్రయపడ్డామో అది నెరవేరినందుకు ఆనందంగా ఉంది. ఈ మంచి కార్యక్రమం ఇంకా బాగా జరగాలి. ఎక్కువ మందికి మేలు జరిగే పరిస్థితి రావాలి. ప్రతి చెల్లెమ్మ డిగ్రీ వరకు కనీస చదువు ఉండాలన్నదే మన తపన.

ప్రతి అడుగులోనూ మానవత్వం

- దూదేకుల, నూర్ బాషాలకు సంబంధించి వాళ్లు కూడా మైనార్టీలే కదా అని సానుకూలంగా పరిగణలోకి తీసుకుని వాళ్లకు కూడా రూ.లక్ష పెంచే కార్యక్రమం చేశాం. గతంలో రూ.లక్ష రాని 227 జంటలకు కూడా ఇప్పుడు ఇస్తున్నాం. ప్రతి అడుగులోనూ మానవత్వం ప్రదర్శించాం. దేవుడు ఇంకా మంచి చేసే అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నా. ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న ప్రతి చెల్లెమ్మకు, తమ్ముడికి, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు.
- ఈ కార్యక్రమంలో బాలికా విద్యను ప్రోత్సహించేందుకు మన ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి మండలంలో ఒక హైస్కూల్‌ను ప్రత్యేకంగా బాలికల జూనియర్ కాలేజీగా మార్చాం. ప్రతి మండలంలో రెండు జూనియర్ కాలేజీలు ఉండేలా అడుగులు వేగంగా వేస్తున్నాం. ఇందులో ఒకటి కో ఎడ్యుకేషన్ కాలేజీ కాగా, మరొకటి ప్రత్యేక బాలికల జూనియర్ కళాశాల.
- ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, మంత్రులు.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ధర్మాన ప్రసాదరావు, మేరుగు నాగార్జున, ఉషశ్రీచరణ్, సీఎస్ జవహర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఎంతో ఉపయోగం

వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పేరుతో మీరు (సీఎం) చేస్తున్న సాయం పేదలకు ఊరట కలిగిస్తోంది. గత ప్రభుత్వంలో కంటే ఎక్కువగా సాయం అందిస్తుండటం పట్ల పేదలంతా సంతోషంగా ఉన్నారు. గతంలో పెళ్లి అంటే అప్పులు చేయాల్సి వచ్చేది. మీ గొప్ప ఆలోచన వల్ల ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. ఈ పథకం పేదలకు ఎంతగానో ఉపయోగకరం. దీనిపై కూడా ప్రతిపక్షాలు, కొన్ని పత్రికలు కట్టుకథలు రాస్తున్నాయి. వీరికి దేవుడు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుకుంటున్నా.

– మేరుగు నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

గౌరవంగా తలెత్తుకుని బతుకుతున్నాం



అన్నా నమస్తే.. మేం ముగ్గురం ఆడపిల్లలం. మా పేదరికం వల్ల నేను ఆరో తరగతి నుంచి డిగ్రీ వరకు సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో ఉండి చదువుకున్నాను. మీరిచ్చిన విద్యా దీవెన, వసతి దీవెనతో బీఎస్సీ బీఈడీ పూర్తి చేశాను. నాకు తండ్రి లేడు. నా పెళ్లి గురించి చాలా దిగులు పడ్డాను. ఈ స్కీమ్ ఎంతగానో అండగా నిలిచింది. అన్నదమ్ములు లేని నాకు మీరు ఈ విధంగా కూడా సాయం చేసినందుకు చాలా థాంక్స్ అన్నా. మీ పథకాల వల్లే మేం సమాజంలో గౌరవంగా తలెత్తుకుని బతుకుతున్నాం. మళ్లీ మీరే సీఎంగా రావాలి.

– ఎం.సుమతి, ఐరాల మండలం, పూతలపట్టు నియోజకవర్గం

మా రాతను తిరగరాస్తున్నారు..



అన్నా.. నేను ఎస్టీ, మా వారు ఎస్సీ. మా గ్రామంలో మా పెద్దలు కులాంతర వివాహం చేశారు. ఆ తర్వాత మా సచివాలయం వలంటీర్ వచ్చి మీరు దరఖాస్తు చేస్తే జగనన్న మీకు రూ.1,20,000 సాయం అందిస్తారని చెప్పారు. ఈ రోజు అది నిజమైంది. మీకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. ఈ డబ్బుతో ఏదైనా వ్యాపారం ప్రారంభిస్తాం. చేయూత, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, ఆర్బీకేలు, సచివాలయాలు, క్లినిక్‌ల వల్ల ప్రజలందరికీ ఎంతో మేలు జరుగుతోంది. విధిరాత బ్రహ్మ రాస్తుంటాడని పెద్దలు చెప్పారు. కానీ మా భవిష్యత్‌ను మీరు తిరిగి రాస్తున్నారు. అన్నా.. మీకు రాఖీపౌర్ణమి శుభాకాంక్షలు.

– కిల్లక అనూష, దిగువమండ, పార్వతీపురం మన్యం జిల్లా

మీరే లేకుంటే మేం అనాథలమే



అన్నా.. నాలాంటి పేద అమ్మాయిలకు ఈ పథకం వరం. నేను శెట్టి బలిజ సామాజికవర్గానికి చెందిన మహిళను. అనుకోకుండా నాన్న చనిపోవడంతో అమ్మ కూలి పనులు చేసి ఇల్లు నెట్టుకొచ్చింది. తమ్ముడు ఐటీఐ చదువుకున్నాడు. నా వివాహం వల్ల అమ్మకు ఆర్థిక ఇబ్బంది కలుగకుండా ఈ పథకం ఆదుకుంది. అమ్మకు ఆరోగ్యశ్రీ ద్వారా గుండె ఆపరేషన్ జరిగింది. వితంతు పింఛన్ కూడా వస్తోంది. మీరే లేకుంటే మేం అనాథలయ్యేవాళ్లం. మీ మేలు ఎప్పటికీ మరచిపోం.

– ధనలక్ష్మి, పుల్లేటికుర్రు, అంబాజీపేట మండలం

29న క్రీడా ప్రతిభావంతులకు అవార్డుల ప్రదానం

• పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్ కుమార్

సాక్షి, అమరావతి: శారీరక దృఢత్వంతో పాటు ఆరోగ్యంపై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అందుకు వ్యాయామ ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ అన్నారు. అన్ని జిల్లాల స్కూల్ గేమ్స్ కార్యదర్శులు, మండల, నియోజకవర్గ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్లతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి విద్యార్థి కనీసం రెండు ఆటల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. దీనికోసం వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడా ప్రాంగణాలను సంసిద్ధం చేసుకోవాలని, ప్రతి పాఠశాల నుంచి కనీసం పది మంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయులు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి ఒక్కరూ అవసరమైన సహకారం అందించాలని సూచించారు. రెండేళ్లు పూర్తి చేసుకున్న జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులను మార్చి ఆయా స్థానాల్లో మహిళలకు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. 2022–23 విద్యా సంవత్సరంలో క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లాకు 5 పాఠశాలల చొప్పున, రాష్ట్ర వ్యాప్తంగా 130 పాఠశాలలను క్రీడా ప్రతిభా అవార్డులకు ఎంపిక చేస్తామన్నారు. ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని జిల్లాల్లో అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. జిల్లా స్థాయిలో ఐదుగురు సభ్యుల బృందం నిబంధనలకనుగుణంగా పాఠశాలలను ఎంపిక చేస్తుందన్నారు. జిల్లాల్లోని అన్ని పాఠశాలల్లోని క్రీడాకారులు గత విద్యా సంవత్సరంలో సాధించిన క్రీడా సర్టిఫికెట్లను ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు ధ్రువీకరించి ఈనెల 16లోగా డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

క్యాన్సర్ గ్రిడ్‌తో 'ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల' అనుసంధానం

• మంత్రి విడదల రజిని



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్న అన్ని క్యాన్సర్ ఆస్పత్రుల్లో పాలియేటివ్ కేర్ కోసం 5% పడకలను కచ్చితంగా కేటాయించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆదేశించారు. బుధవారం వైద్య ఆరోగ్య శాఖ విభాగాధిపతులతో ఆమె మంగళగిరిలో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ..ఆరోగ్యశ్రీ క్యాన్సర్ ఆస్పత్రులను హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నడుస్తున్న క్యాన్సర్ గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల ఏ ప్రాంతంలో ఎలాంటి, ఎక్కువ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయో ప్రభుత్వానికి తెలుస్తుందన్నారు. బ్రెస్ట్ స్క్రీనింగ్‌ను పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని చెప్పారు. రూ.10వేల ఆసరా పింఛన్లు పొందుతున్న వారికి ఉచిత బస్‌పాస్‌లు అందజేయాలని సీఎం ఆదేశించారని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్దానం తాగునీటి ప్రాజెక్టుతో పాటు, పలాసలో కిడ్నీ కేర్ సెంటర్‌ను త్వరలో అందుబాటులోకి తెస్తామని తెలిపారు. పిడుగురాళ్ల, పులివెందులలో ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రారంభించనున్న నేపథ్యంలో, ఆయా చోట్ల టీచింగ్ ఆస్పత్రుల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలన్నారు.

నేడు నులిపురుగుల నివారణ మందుల పంపిణీ

జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంత్రి రజిని పోస్టర్‌ను ఆవిష్కరించారు. గురువారం గుంటూరులో నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేస్తామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ జె.నివాస్, ఆరోగ్యశ్రీ సీఈవో హరీంధిరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆ 2 వేల మంది ఎవరు?

శుక్రవారం పుంగనూరు వద్దకు పెద్ద సంఖ్యలో స్థానికేతరులు

- ఆ రోజు అక్కడ 5 వేల సిమ్‌లు ఉన్నట్లు నిర్ధారణ
- వీరిలో మూడు వేల మంది వరకు పోలీసులు, టీడీపీ నేతలు
- మిగతా 2 వేల మందిని విధ్వంసం కోసం రప్పించినట్లు అనుమానం


అంగళ్లులో పోలీసులను నెట్టేస్తున్న టీడీపీ శ్రేణులు

సాక్షి, తిరుపతి: పుంగనూరు ఘటనాస్థలిలో శుక్రవారం ఉన్న రెండువేల మంది స్థానికేతరులు ఎవరు? వారు ఎందుకోసం వచ్చారు? ఎక్కడి నుంచి వచ్చారు? అదేరోజు అంతమంది అక్కడికి రావలసిన అవసరం ఏమిటి? ఈ ప్రశ్నలు చిత్తూరు పోలీసుల మదిని తొలుస్తున్నాయి. ప్రాజెక్టుల పరిశీలన పేరుతో చంద్రబాబు ఈ నెల 4, 5వ తేదీల్లో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పర్యటించిన విషయం తెలిసిందే. అన్నమయ్య జిల్లా అంగళ్లులో శుక్రవారం గొడవకు కారణమైన చంద్రబాబు.. కొద్ది గంటలైనా గడవకముందే చిత్తూరు జిల్లా పుంగనూరులో మారణహోమానికి కుట్రపన్నారు. ఆ మారణహోమంలో టీడీపీ శ్రేణులే కాకుండా అల్లరి మూకలు, గూండాలు కూడా పాలుపంచుకున్నారు. టీడీపీ శ్రేణులు కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వారు రెండువేల మందికిపైగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ రోజు ఘటన స్థలంలో దాదాపు ఐదు వేల సిమ్ (సెల్‌ఫోన్లు)లు ఆన్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారిలో పోలీసులు, టీడీపీ శ్రేణులు, స్థానికులు కలిపి మూడువేల మంది వరకు ఉండొచ్చనే నిర్ణయానికి వచ్చారు. వీరుకాకుండా మిగతా రెండువేలమందికిపైగా స్థానికేతరులు అక్కడున్నట్లు వారి సెల్‌ఫోన్ సిగ్నల్స్‌ను బట్టి తెలుస్తోంది. స్థానికేతరులు ఇంత పెద్దసంఖ్యలో పుంగనూరు వద్దకు రావలసిన అవసరం ఏమిటనే కోణంలో విచారణ చేపట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

పుంగనూరుపై బాబు అక్కసు

సీఎం జగన్ ఆదేశాలతో చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పంలో మంత్రి పెద్దిరెడ్డి పల్లెబాట పేరుతో ఊరూరా.. వీధివీధి తిరుగుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమపథకాల గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. చంద్రబాబు కుప్పానికి చేస్తున్న ద్రోహం గురించి వివరిస్తున్నారు. వాస్తవాలను గ్రహించిన కుప్పం వాసుల్లో మార్పు మొదలైంది. మొన్నటి మున్సిపల్ ఎన్నికలే ఇందుకు నిదర్శనం. ఈ పరిణామాలను గమనించిన చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో కుప్పంలో ఓటమి తప్పదనే భయంతో సీఎం వైఎస్ జగన్‌ను, మంత్రి పెద్దిరెడ్డిని టార్గెట్ చేశారు. ఇందులో భాగంగా పుంగనూరులో పర్యటించి అలజడి సృష్టించాలని నిర్ణయించుకున్నారు. అయితే స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పోలీసులు అనుమతి ఇవ్వలేదు. అందుకు గల ప్రధాన కారణం.. పడమటి ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఆవులపల్లి, నేతిగుంటపల్లి, ముదివేడు రిజర్వాయర్లను చంద్రబాబు అండ్ కో అడ్డుకున్నారు. కోర్టు నుంచి స్టే తీసుకురావటంపై స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు వస్తే నిలదీయాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం చంద్రబాబు అండ్ కోకూ తెలుసు. ఇదే అదనుగా చంద్రబాబు మారణహోమానికి పథకం వేసినట్లు తెలిసింది.

రైతు వినతితో భగ్గుమన్న బాబు

మూడు రిజర్వాయర్లపై వేసిన కేసును వెనక్కు తీసుకోమని ఉమాపతిరెడ్డి అనే రైతు అంగళ్లు వద్ద చంద్రబాబుకు వినతి పత్రం ఇచ్చేందుకు ప్రయత్నం చేశారు. ఇదే అవకాశంగా చేసుకున్న చంద్రబాబు ఉమాపతిరెడ్డిని నానా బూతులు మాట్లాడి, టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టారు. 'తరమండిరా.. కొట్టండిరా నా కొడుకులను..' అంటూ హుకుం జారీచేశారు. అధినేత ఆదేశాలతో టీడీపీ గూండాలు రెచ్చిపోయారు. అక్కడి నుంచే పుంగనూరు వద్ద వేచి ఉన్న టీడీపీ నేతలు, కిరాయి గూండాలకు సమాచారం ఇచ్చారు. అల్లరిమూకలు బాబు రాగానే రెచ్చిపోయాయి.

ముందు రోజే మదనపల్లిలో తిష్ట

విధ్వంసానికి ముందు రోజు రాత్రే అంటే గురువారం రాత్రి టీడీపీ గూండాలు మదనపల్లికి చేరుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ రాత్రి నుంచి 4వ తేదీ ఉదయం 9 గంటల వరకు మదనపల్లిలో టీడీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన షెల్టర్‌లలో ఉన్నారు. రాత్రి, ఉదయం మద్యం సేవిస్తూ గడిపారు. ఉదయం 9 గంటలకు టీడీపీ నేతల నుంచి సమాచారం రావటంతో మదనపల్లి నుంచి పుంగనూరు వద్దకు వెళ్లారు. సాయంత్రం వరకు వేచి చూసి టీడీపీ నేతల ఆదేశాల మేరకు విధ్వంసానికి పూనుకున్నారు. టీడీపీ శ్రేణులు కాకుండా అద్దె గూండాలే రెండు వేల మందికి పైగా ఉన్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వీరంతా కర్ణాటక, తమిళనాడుకు చెందిన వారా? ఏపీకి చెందిన వారా? అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఈ రెండు వేల మంది గురించి ఎక్కడా, ఎవ్వరికీ అనుమానం రాకుండా టీడీపీ శ్రేణులు సాయంత్రం వరకు జాగ్రత్తలు తీసుకుని విధ్వంసాన్ని అమలు చేశారు. అయితే పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించటంతో టీడీపీ లక్ష్యం నెరవేరలేదు.

8 మంది ఇరిగేషన్ ఇంజినీర్ల సస్పెన్షన్

సాక్షి, అమరావతి: శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం కొల్లిపేట నుంచి ఆమదాలవలస మండలం నెల్లిమెట్ట వరకూ నాబార్డు ఆర్‌ఐడీఎఫ్–21 నిధులతో చేసిన రెల్లిగెడ్డ డ్రెయిన్ అభివృద్ధి పనుల్లో అక్రమాలకు పాల్పడిన 8 మంది ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు వేస్తూ జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెల్లిగెడ్డ డ్రెయిన్ అభివృద్ధి పనులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణ చేసి.. అక్రమాలు జరిగాయని తేల్చింది. వాటికి ఈఈ బి.రవీంద్ర, డీఈలు కేవీ క్రాంతి కుమార్, ఎం.శ్రీరంగనాయకులు, టి.హరిప్రసాద్, ఏఈఈలు కె.సాంబమూర్తి, డీవీ రమణ, జి.మోజస్, సూపరింటెండెంట్ బి.గోమతి లక్ష్మి బాధ్యులని తేల్చింది. ప్రభుత్వానికి సమర్పించిన ఆ నివేదిక ఆధారంగా జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ 8 మంది ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు వేశారు.

గుంట నక్కల కుట్రలు సహించం

- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- చంద్రబాబు నాయకత్వంలోనే అంగళ్లు, పుంగనూరులలోటీడీపీ మూక దాడులు
- కళ్లెదుటే ఆధారాలు.. సీబీఐ, ఎఫ్‌బీఐల విచారణ అనవసరం
- అంగళ్లులో తరమండిరా.. అని చంద్రబాబునాయుడు హూంకరించగానే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు
- బట్టలూడదీయిస్తా అంటూ పోలీసులపై దుర్భాష
- పుంగనూరు వద్ద కాల్పుల్లో ఐదారుగురు చనిపోవాలన్నది ప్లాన్
- తద్వారా అల్లర్లతో లబ్ధి పొందాలని కుట్ర
- పెద్ద సంఖ్యలో పోలీసులకు గాయాలు.. చూపు కోల్పోయిన ఓ కానిస్టేబుల్
- అయినప్పటికీ పోలీసుల సంయమనంతో పారని పాచిక
- ఇలాంటి చంద్రబాబుపై 307 కేసు కాకుండా ఇంకేం పెట్టాలి?



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ పాలనలో శాంతిభద్రతలు బ్రహ్మాండంగా ఉన్నాయని, వాటికి విఘాతం కల్పించడానికి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వంటి గుంటనక్కలు కుట్రలు చేస్తే సహించే ప్రశ్నే లేదని ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు), వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. అంగళ్లు, పుంగనూరులలో ఈనెల 4న తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు, హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోవడానికి.. పోలీసులపై దాడికి పాల్పడడానికి చంద్రబాబే కారణమనడానికి పక్కా ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన వీడియోలను తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మీడియా ముందు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఘటనపై సీబీఐ, ఎఫ్‌బీఐ విచారణ అవసరం లేదని.. ఇప్పటికే చంద్రబాబు డైరెక్షన్ మేరకు కుట్ర చేసిన వారు పోలీసులకు దొరికారని చెప్పారు. ఇంకా తమ వెనుక చంద్రబాబు ఉన్నాడులే.. మేమేం చేసినా చెల్లుతుంది అనుకునే వారికి ఇక బుద్ధి వస్తుందని ఆశిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీగా వైఎస్సార్‌సీపీ సంయమనం పాటిస్తుందని.. చంద్రబాబు, టీడీపీ అరాచక మూకల ఆగడాలు మితిమీరిపోతే ఎక్కడ ఎలా దెబ్బకొట్టాలో ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ చూసుకుంటాయని స్పష్టం చేశారు. మీడియాతో సజ్జల ఇంకా ఏం చెప్పారంటే..

గొడవకు కారణం చంద్రబాబే

- ప్రాజెక్టుల పరిశీలన పేరుతో పులివెందులలో రెచ్చగొట్టేందుకు ప్రయత్నించినా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సంయమనం పాటించారు. అంగళ్లు, పుంగనూరు ఘటనలపై దర్యాప్తు సీబీఐకి ఇస్తే అది ఇప్పట్లో తేలదని అనుకున్నాడో ఏమో కానీ బాబు చాలెంజ్ విసిరాడు. కానీ.. ఆ రోజు ఏం జరిగిందో రాష్ట్ర ప్రజలంతా చూశారు. ఎల్లో మీడియా మొత్తం లైవ్ ఇచ్చింది.
- తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో సాగు, తాగునీటి సమస్యలు తీర్చడానికి వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన ముదివేడు, నేతిగుంటపల్లి, ఆవులపల్లి రిజర్వాయర్ల నిర్మాణాన్ని ఎన్జీటీలో టీడీపీ కార్యకర్తలతో కేసులు వేయించి అడ్డుకుంటున్న చంద్రబాబుకు వినతిపత్రం ఇవ్వడానికి అంగళ్లులో శిబిరంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నల్లకండువాలు వేసుకుని కూర్చున్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఉద్దేశించి.. తరమండిరా నా కొడుకులను అంటూ చంద్రబాబు ఆదేశాలు ఇవ్వడంతో.. అప్పటికే చేతుల్లో రాళ్లు, కర్రలు, ఇనుప రాడ్లు పట్టుకున్న టీడీపీ అరాచక మూకలు ఎలా రెచ్చిపోయాయో రాష్ట్రమంతా చూసింది.
- చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నిజంగా దాడి చేయాలనుకుంటే.. శిబిరం వేసుకుని పక్కన కూర్చుంటారా? నాయకుడనేవాడు దాడులను ఆపడానికి ప్రయత్నం చేస్తాడా? తరమండిరా.. కొట్టండిరా.. అంటారా?
- వైఎస్ జగన్ పాదయాత్ర చేస్తున్నప్పుడు వందలసార్లు టీడీపీ కార్యకర్తలు నల్ల జెండాలతో నిరసనలు తెలిపారు. ఇప్పుడు కూడా అమరావతి ప్రాంతం వెళితే ఎక్కడో ఒక చోట నిరసన తెలుపుతూనే ఉన్నారు. దాన్ని ఆసరాగా తీసుకుని సీఎం వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఏనాడూ దాడులకు ప్రయత్నించలేదు.

పక్కా ప్రణాళికతోనే పోలీసులపై దాడి

- ఈనెల 4న పుంగనూరు బైపాస్ నుంచే చిత్తూరుకు వెళ్తామని చంద్రబాబు పర్యటన షెడ్యూలును ఈనెల 3నే విడుదల చేశారు. దాంతో ఈ నెల 4న పుంగనూరు బైపాస్ వద్దే పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. బట్టలూడదీస్తా అంటూ పోలీసులను చంద్రబాబు దుర్భాషలాడుతూ.. అరాచక మూకను వారిపైకి రెచ్చగొట్టారు. కరుడుగట్టిన నేరగాళ్లు ముందస్తు వ్యూహం ప్రకారం రాళ్లు, కర్రలు, ఇనుప రాడ్లతో పోలీసులపై విచక్షణారహితంగా దాడి చేశారు.
- ఒక ఉగ్రవాద, ఉన్మాద ముఠా దాడి చేసినట్లు పోలీసులు టీడీపీ మూక చేసిన దాడిని రాష్ట్ర ప్రజలంతా చూశారు. పెద్ద సంఖ్యలో పోలీసులు గాయపడ్డారు. రణధీర్ అనే కానిస్టేబుల్ కన్ను ఒకటి చూపు కోల్పోవడం దారుణం. మరో కన్ను కూడా చూపును కోల్పోయే ప్రమాదం ఉందని వైద్యులు చెప్పారు.
- ఉన్మాదంతో దాడి చేసిన వాళ్లు కార్యకర్తలా? ఒక రాజకీయ పార్టీ కార్యకర్తలు అని చెప్పుకోడానికి వారికన్నా సిగ్గుండాలి.. వారికి నాయకుడినని చెప్పుకోడానికి బాబుకైనా సిగ్గుండాలి. ఉన్మాది చంద్రబాబు అధ్యక్షుడిగా ఉన్న పార్టీలో శిక్షణ పొంది తయారైన ఉన్మాదుల ముఠా టీడీపీ మూక.
- ఈ ఉన్మాద ముఠా దాడులకు నాయకత్వం వహించిన చంద్రబాబుపై 307 కేసు కాకుండా ఇంకేం పెట్టాలి? పోలీసులను బట్టలు ఊడదీయ్ అన్నాక చంద్రబాబు నాయకుడు ఎలా అవుతారు? మామూలుగా మీడియా ఇలాంటి సంఘటనల్లో సంయమనం పాటిస్తుంది. కానీ వాళ్లు లైవ్‌లో అంతా చూపించారు. వారి ఆలోచన చూసి వైఎస్సార్సీపీ కార్యకర్తలు రెచ్చిపోవాలి.. రాష్ట్రం తగులబడాలి అనేది వారి ఆలోచన.

రెండు రోజుల ముందే కుట్ర

- తోడల్లుడు దగ్గుబాటి రాసిన పుస్తకంలో చెప్పినట్లుగానే ఇప్పుడు చంద్రబాబు వ్యవహరించారు. శాంతిభద్రతల సమస్య రావాలి.. అలాంటి సంక్షోభం నుంచి కూడా ఎన్ని ప్రాణాలు పోయినా తాను లాభపడాలనేదే చంద్రబాబు సిద్ధాంతం.
- రెండు రోజుల ముందే పుంగనూరు బైపాస్‌లో పోలీసుల మీద దాడి చేసి.. పుంగనూరులోకి తోసుకుపోవడానికి ప్లాన్ చేసుకున్నారు. ఈ సమయంలో పోలీసులు కాల్పులు జరిపి, నలుగురైదుగురు కార్యకర్తలు చనిపోతే.. దాని నుంచి సానుభూతి పొందాలని ప్రయత్నం చేశాడు. ఒక వేళ పోలీసులను తోసుకుని పుంగనూరులోకి పోగలిగితే.. పుంగనూరు పట్టణాన్ని తగలబెట్టాలని చంద్రబాబు పథకం రచించారు. ఇంతటి దిక్కుమాలిన ఆలోచన, కుట్ర, కుతంత్రం చరిత్రలో ఉండి ఉండదు.
- పుంగనూరు బైపాస్‌లో టీడీపీ మూక తీవ్ర స్థాయిలో దాడి చేస్తున్నా.. పోలీసులు చాలా సంయమనంతో వ్యవహరించారు. ఫైరింగ్ ఆర్డర్ ఇవ్వకుండా అక్కడి ఎస్పీ వెనక్కి తగ్గారు. పోలీసులు ప్రతిష్టకు పోయి ఉంటే చంద్రబాబు ఆశించిందే జరిగేది. అందుకే పోలీసులు రెచ్చిపోలేదని మీకు రోషం లేదా.. చొక్కాలు విప్పండి అంటూ బాబు తిట్టారు.
- తన హయాంలో ఫలానా పని చేశానని చంద్రబాబుకు చెప్పుకోవడానికి ఏమీ లేదు. వైఎస్ జగన్ పాలనలో ఎత్తిచూపడానికి లోపాలు ఏమీ లేవు. రూ.2.30 లక్షలకోట్లు డీబీటీ ద్వారా నేరుగా ప్రజల ఖాతాల్లోకి వెళ్లాయి. 87% ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. అందుకే ఏమీ చేయలేక పవన్ కల్యాణ్ వంటి వారికి ప్యాకేజీ ఇచ్చి తిప్పుకుంటున్నాడు.

మనసులో ఒకటి.. బయటకు మరొకటా?

మనసులో ఒకటి పెట్టుకుని.. బయటకు మరోలా మాట్లాడి.. ఎవరికి ప్రయోజనం చేకూర్చాలనుకున్నారని సినీ నటుడు చిరంజీవిని వైఎస్సార్‌సీపీ ప్రధానకార్యదర్శి సజ్జల ప్రశ్నించారు. మీడియా ప్రతినిధి ఒకరు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు బాలకృష్ణ సినిమాకు ఒకలా.. మిగిలిన వారి సినిమాలకు మరోలా వ్యవహరించి వివక్ష చూపారని ఎత్తిచూపారు. చిన్న, పెద్ద నిర్మాతలు అందరికీ న్యాయం చేసేలా పారదర్శకమైన టికెటింగ్ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్ తెచ్చారని గతంలో చిరంజీవి ప్రశంసించారని గుర్తు చేశారు. విభజన సమయంలో చిరంజీవి కేంద్ర మంత్రిగా పని చేశారని.. అప్పట్లో ప్రత్యేక హోదాపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. బోడిగుండకు మోకాలికి ముడిసేలా మాట్లాడితే మా నుంచి రాజకీయంగా ప్రతి స్పందన ఉంటుందని స్పష్టం చేశారు.

'అంగళ్లు' దాడుల కేసులో ఎ1గా చంద్రబాబు

▶ మొదటి పేజీ తరువాయి

దాడులకు పాల్పడిన ఘటనలపై చంద్రబాబు సహా 20 మందిపై కురబలకోట మండలం ముదివేడు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఈ కేసు నమోదైంది. ఇతర నిందితుల్లో టీడీపీకి చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఓ ఎమ్మెల్సీ, మదనపల్లె, తంబళ్లపల్లె, రాయచోటి, తిరుపతి ప్రాంతాలకు చెందిన నేతలు నిందితులుగా ఉన్నారు. దాదంవారిపల్లెకు చెందిన అంగళ్లు మార్కెట్ కమిటీ చైర్మన్ డీఆర్.ఉమాపతిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై ఐపీసీ 120బి, 147, 148, 153, 307, 115, 109, 323, 324, 506, రెడ్‌విత్ 149 సెక్షన్ల కింద ఎస్‌ఐ షేక్ ముబిన్‌తాజ్ కేసు నమోదు చేశారు.

వినతిపత్రం ఇచ్చేందుకు వేచి ఉండగా

చంద్రబాబు ఈనెల 4న అంగళ్లుకు వస్తున్నారని తెలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమాపతిరెడ్డి, ఎంపీపీ దస్తగిరి, జెడ్పీటీసీ జ్యోతి భర్త చంద్రశేఖర్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, కులశేఖర్‌రెడ్డి తదితరులు అంగళ్లు కూడలి సమీపంలోని రాయచోటి రోడ్డు వద్దకు చేరుకున్నారు. పిచ్చలవాండ్లపల్లె సాగు, తాగు నీటి రిజర్వాయర్ పనులను చంద్రబాబు కోర్టు ద్వారా నిలిపివేయించారని, ఈ చర్యను నిరసిస్తూ నల్ల కండువాలు ధరించి శాంతియుత పద్ధతిలో ఆయనకు వినతిపత్రం ఇవ్వాలని వేచి ఉన్నారు. వారికి రైతులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మద్దతుగా వచ్చారు.

ఊగిపోయి.. దాడులకు ఉసిగొల్పి..

మధ్యాహ్నం చంద్రబాబు యాత్ర కూడలిలోకి చేరుకుంది. అక్కడ నల్ల కండువాలతో ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలు, రైతులను చూసి చంద్రబాబు ఊగిపోయారు. 'తమాషాగా ఉందా.. ఆ నా కొడుకులను తరమండిరా.. వేసేయండిరా వాళ్లని' అని వేలెత్తి చూపించి టీడీపీ శ్రేణులను ఉసిగొల్పారు. వాహనంపై ఆయన పక్కనే ఉన్న మాజీ మంత్రులు దేవినేని ఉమా, ఎస్.అమరనాథ్‌రెడ్డి, మదనపల్లె మాజీ ఎమ్మెల్యేలు షాజహాన్‌బాషా, రమేష్, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి తదితర నేతలు కూడా వైఎస్సార్‌సీపీ నేతలవైపు చేతులు చూపుతూ, కేకలు వేస్తూ హెచ్చరికలు చేస్తూనే.. సైగలతో దాడులకు ప్రేరేపించారు. మరికొందరు స్థానికనేతలు ఈలలు వేస్తూ, తొడగొడుతూ.. బూతులు తిడుతూ కొట్టండి అంటూ దాడికి ప్రోత్సహించారు. దీంతో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నేతలపై విరుచుకుపడ్డారు. పథకం ప్రకారం టీడీపీ నేతలు ఈ దాడులు చేయించారు. అప్పటికే సిద్ధం చేసుకున్న మారణాయుధాలు, రాళ్లు, కొడవళ్లు, ఇటుకలు, కట్టెలు, చెప్పులు, రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, దాడిని అడ్డుకోబోయిన పోలీసులు గాయపడ్డారు. వైఎస్సార్‌సీపీకి చెందిన బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, వసంతరెడ్డి, అర్జున్‌రెడ్డి, మహేష్, ఓ విలేకరి శ్రీనివాసులు, ముదివేడు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ కేశవులు తీవ్రంగా గాయపడ్డారు. ఆ ప్రాంతమంతా భయానకంగా మారింది. రోడ్డుపై పగిలిన బాటిళ్లు, ఇటుకలు, కర్రలు పడి ఉన్నాయి. కొందరు స్థానికులు వైఎస్సార్‌సీపీ నేతలను రక్షించారు. లేనిపక్షంలో కొందరు హత్యకు గురయ్యేవారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.


అంగళ్లులో కర్రతో దాడికి వస్తున్న టీడీపీ కార్యకర్త

చంద్రబాబుపై హత్యాయత్నం, నేరపూరిత కుట్ర కేసు

రాయచోటి టౌన్: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుపై ముదివేడు పోలీసు స్టేషన్‌లో హత్యాయత్నం, నేరపూరిత కుట్ర కింద కేసు నమోదు చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు చెప్పారు. ఆయన బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అంగళ్లులో జరిగిన సంఘటనపై ఉమాపతిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశామని తెలిపారు. ఈనెల 4న మారణాయుధాలు, ఐరన్ రాడ్లు, రాళ్లు, ఇటుకలు, కర్రలతో వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని వివరించారు. దీనిపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

ఆధారాలతో ఫిర్యాదు

మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమాపతిరెడ్డి ఆధారాలతో సహా చంద్రబాబు తదితరులపై ఫిర్యాదు చేశారు. అంగళ్లు రోడ్‌షోలో చంద్రబాబు రెచ్చగొట్టే ప్రసంగాలు, ఇతర నాయకుల చర్యలను పెన్‌డ్రైవ్, సీడీలో ముదివేడు పోలీసులకు అందజేశారు. ఈ ఫిర్యాదు, ఆధారాల మేరకు పోలీసులు చంద్రబాబు ఏ1గా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ముందస్తు ప్రణాళిక, నేరపూరిత కుట్ర, అల్లర్లలో భాగంగా మారణాయుధాలతో తమపై దాడి చేసిన చంద్రబాబు అనుచరులు, దాడులకు పురమాయించిన టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో ఉమాపతిరెడ్డి కోరారు.

అంగళ్లు కేసులో నిందితులు

- ఎ1 ఎస్.చంద్రబాబు నాయుడు (మాజీ సీఎం)
- ఎ2 దేవినేని ఉమా (మాజీ మంత్రి)
- ఎ3 అమరనాథరెడ్డి (మాజీ మంత్రి)
- ఎ4 రాంభూపాల్‌రెడ్డి (ఎమ్మెల్సీ)
- ఎ5 షాజహాన్‌బాషా (మాజీ ఎమ్మెల్యే)
- ఎ6 దొమ్మలపాటి రమేష్ (మాజీ ఎమ్మెల్యే)
- ఎ7 కిశోర్‌కుమార్‌రెడ్డి (టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి)
- ఎ8 గంటా నరహరి (టీడీపీ రాజంపేట ఎంపీ అభ్యర్థి)
- ఎ9 శ్రీరామ్ చినబాబు (టీడీపీ తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు)
- ఎ10 శ్రీధర్‌వర్మ (టీడీపీ నాయకుడు)
- ఎ11 ఆర్.శ్రీనివాసులురెడ్డి (టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు)
- ఎ12 పులివర్తి నాని (చంద్రగిరి టీడీపీ ఇన్‌చార్జి)
- ఎ13 ఎం.రాంప్రసాద్‌రెడ్డి (రాయచోటి టీడీపీ నాయకుడు)
- ఎ14 పఠాన్ ఖాదర్‌ఖాన్ (మదనపల్లె టీడీపీ నాయకుడు)
- ఎ15 వైజీ రమణ (ముదివేడు మాజీ సర్పంచి)
- ఎ16 వైజీ సురేంద్ర (కురబలకోట మండల టీడీపీ కన్వీనర్)
- ఎ17 రాటకొండ మధుబాబు (తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి)
- ఎ18 పర్వీన్‌తాజ్ (టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి)
- ఎ19 యాలగిరి దొరస్వామి నాయుడు (టీడీపీ రాజంపేట పార్లమెంటు ప్రధాన కార్యదర్శి)
- ఎ20 నారాయణస్వామిరెడ్డి (బి.కొత్తకోట మండల టీడీపీ కన్వీనర్)
- మరియు ఇతరా టీడీపీ కార్యకర్తలు

చంద్రబాబు తదితరులపై నమోదు చేసిన కేసులో సెక్షన్లు

- సెక్షన్ 120 బి – కుట్రపూరితంగా వ్యవహరించడం
- సెక్షన్ 147 – అక్రమంగా సంఘం ఏర్పాటు చేసుకోవడం
- సెక్షన్ 148 – చట్ట విరుద్ధంగా గుమిగూడి మారణాయుధాలు కలిగివుండటం
- సెక్షన్ 153 – వర్గాలుగా హింసాత్మక సంఘటలకు ప్రేరేపించడం
- సెక్షన్ 307 – హత్యాయత్నం
- సెక్షన్ 115 – గొడవలకు ప్రేరేపించడం
- సెక్షన్ – 109 ప్రేరేపించడం
- సెక్షన్ – 323 చేతులతో కొట్టడం
- సెక్షన్ 324 – కట్టెలతో చిన్న గాయం చేయడం
- సెక్షన్ – 506 బెదిరించడం

ములకలచెరువు పోలీసు స్టేషన్‌లో బాబుపై మరో కేసు

ములకలచెరువు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై అన్నమయ్య జిల్లా ములకలచెరువు పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. ఈ నెల 4న ములకలచెరువులో జరిగిన రోడ్ షోలో రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసినందుకు ఈ కేసు నమోదైంది. ఈ ఘటనపై ఇన్‌చార్జి సీఐ శివాంజనేయులు సమగ్ర విచారణ జరిపిన అనంతరం చంద్రబాబును ఏ–7 నిందితుడిగా కేసు నమోదు చేశారు.



తాగినవాడు రహస్యాన్ని దాచలేడు.
వాగ్దానాన్ని నిలబెట్టుకోలేడు.
– మిగెల్ సెర్వాంటీజ్

సాక్షి
గురువారం, 10 ఆగస్టు 2023

మళ్ళీ లైసెన్స్ రాజ్యమా?

ఎప్పుడో వదిలేసిన పాత విధానాలను ఇప్పుడు మళ్ళీ తెస్తే... కొత్త ఫలితాలు వస్తాయా? కేంద్ర ప్రభుత్వం మాత్రం వస్తాయనే అనుకుంటున్నట్టు ఉంది. ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, పర్సనల్ కంప్యూటర్ల దిగుమతిపై ప్రభుత్వం గత వారం హఠాత్తుగా షరతులు పెట్టడాన్ని చూస్తే, మళ్ళీ 1970ల నాటి ప్రభుత్వ విధానాలు గుర్తొస్తున్నాయి. జాతీయ భద్రత కారణంగా చైనా, కొరియాల నుంచి ఈ దిగుమతులను నియంత్రించాలని ప్రభుత్వ భావన. లైసెన్సు తీసుకుంటేనే అనుమతిస్తామని సర్కార్ చెబుతోంది. అయితే, వెల్లువెత్తిన విమర్శలు, వ్యక్తమైన ఆందోళనలతో ప్రస్తుతానికి మూడు నెలల పాటు నవంబర్ 1 దాకా ఈ షరతులను వాయిదా వేసింది. దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించడానికే ఈ నిబంధనలని పాలకుల మాట. కానీ, షరతులతో అది సాధ్యమవుతుందా? చైనాను లక్ష్యంగా చేసుకొని పెడుతున్న ఈ నిషేధం తీరా భారతీయులకే నష్టం కలిగిస్తుందన్న విశ్లేషణలూ ఉన్నాయి.

దేశంలో ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతులు ఏటా 6.25 శాతం వంతున పెరుగుతున్నాయి. 2022 – 23లో 533 కోట్ల డాలర్ల విలువైన ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లను దిగుమతి చేసుకున్నాం. అందులో 75 శాతం చైనావే. ఇప్పుడు పౌరుల డిజిటల్ భద్రత రీత్యా ఈ దిగుమతులపై షరతులు పెడుతున్నామంటున్నారు. ఆ సాకు చూపడానికి కారణం ఒకటే! జాతీయ భద్రత కారణమైతేనే బహుళ పక్ష వాణిజ్య ఒప్పందాల్లో దిగుమతులపై షరతులు పెట్టే వీలుంటుంది. దేశీయ ఉత్పత్తులను కాపు కాసుకోవడం కారణమంటే రచ్చ తప్పదు. అయితే, ఎంత జాతీయ భద్రతను సాకుగా చూపినప్పటికీ, ఈ దిగుమతుల షరతులకు అవతలి వైపు నుంచి ట్యారిఫ్‌ల ప్రతిచర్యలు, దీర్ఘకాలిక వివాదాలు ఎలాగూ తప్పవు. పరిశ్రమతో ఎలాంటి సంప్రతింపులూ జరపకుండానే హడావిడి నిర్ణయం తీసుకొని, సుస్థిర వ్యవస్థను హఠాత్తుగా మార్చడంతో వచ్చిపడే ఇబ్బందులు సరేసరి.

ప్రస్తుత నిబంధనల ప్రకారం మన దేశంలోని కంపెనీలు ల్యాప్‌టాప్‌లను యథేచ్ఛగా దిగుమతి చేసుకోవచ్చు. రానున్న కొత్త రూల్స్‌తో ప్రత్యేక లైసెన్స్ ఉంటే కానీ, దిగుమతి సాధ్యం కాదు. 2020లో కలర్ టీవీల దిగుమతి పైనా భారత్ ఇలాంటి షరతులే పెట్టడం గమనార్హం. అలాగే, మొబైల్‌ఫోన్లపైనా అధిక ట్యారిఫ్‌లు విధించింది. పలు స్మార్ట్‌ఫోన్ సంస్థలు భారత్‌లోనే విడిభాగాలను కూర్చి, తయారు చేస్తున్నాయి. కానీ, కంప్యూటర్ల సంగతలా కాదు. చైనా సంస్థ లెనోవా మినహా యాపిల్, డెల్, సామ్‌సంగ్, షియామీ తదితర ఉత్పత్తులన్నీ దిగుమతులే! కంప్యూటర్ల దిగుమతికి లైసెన్స్ దెబ్బతో ఈ సంస్థల గంపగుత్త ఆర్డర్లపై దెబ్బ పడుతుంది. కలర్ టీవీల్లా కాక కంప్యూటర్లు విద్య, పరిశోధన, పౌరసేవల్లో కీలకం. విద్యారంగంలో విప్లవాత్మక మార్పుకై ఈ మధ్యే రిలయన్స్ సంస్థ రూ. 20 వేల లోపలే లభించే జియోబుక్‌ను తెచ్చింది. అదీ చైనా తయారీయే! రిలయన్స్ ఇప్పుడిక పాలకుల నుంచి ప్రత్యేక లైసెన్స్ తెచ్చుకోకుంటే, దిగుమతి చేసుకోలేదు.

షరతుల వార్తలతో ఈ వారం కంప్యూటర్ల అమ్మకాలు 25 శాతం పెరిగాయి. చివరకు కొరత ఏర్పడి, ధరల పెరుగుదలకు దారి తీస్తుంది. ఇప్పటికే కోవిడ్ వల్ల సరఫరా వ్యవస్థల్లో ఇబ్బందులు, సెమీ కండక్టర్ సంక్షోభం సతమతం చేస్తున్నాయి. షియామీ, రియల్‌మి, వన్‌ప్లస్ లాంటి కొత్త ఉత్పత్తులతో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న భారతీయ ట్యాబ్ మార్కెట్ ఈ షరతులతో మరిన్ని సవాళ్ళను ఎదుర్కోవాల్సి వస్తుంది. అసలు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా, ఐటీ సేవల కేంద్రంగా పేరున్న దేశం కంప్యూటర్ల దిగుమతులపై షరతుల పాట పాడడం ఎలా చూసినా అనూహ్యమే! ప్రజలపై ప్రభావం చూపుతూ, దీర్ఘకాలిక ఆర్థిక పర్యవసానాలున్న నిర్ణయాలను తీసుకొనే ముందు పాలకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వంలోని ఆర్థిక శాస్త్రవేత్తలతో సంప్రతింపులు జరిపివుంటే పాలకులు ఈ హఠాన్నిర్ణయం తీసుకొనేవారు కాదు. దేశీయ ఉత్పత్తి పెంచడం, దిగుమతులపై ఆధారపడడం తగ్గించడం, విశ్వసనీయ హార్డ్‌వేర్‌ను అందుబాటులో ఉంచడం మంచి లక్ష్యాలే. కానీ, వాటి కోసం పాత లైసెన్స్ రాజ్యానికి తిరోగమించాల్సిన అవసరం ఏ మాత్రం లేదు.

ఫలానా చైనా ఉత్పత్తుల వల్ల భద్రతలో ముప్పుందని భావిస్తే, ఆ దేశ ఉత్పత్తులకు అడ్డుకట్ట వేస్తే సరి. అలాకాక మొత్తం వ్యవస్థను లైసెన్సుల అగచాట్లలోకి నెట్టాల్సిన పని లేదు. అనేక కష్టాలు భరించాకే లైసెన్స్ రాజ్యబంధనాల్ని వదిలించుకున్నామని విస్మరించలేం. సులభంగా లైసెన్సులు ఇస్తామంటున్నా, ఆశ్రితపక్షపాతం సహా సమస్యలు మామూలే! ఇవాళ మనది సేవల రంగంతో పురోగమిస్తున్న ఆర్థికవ్యవస్థ. అందులో కీలకమైన కంప్యూటర్ హార్డ్‌వేర్ల కొరతతో దీర్ఘకాలిక నష్టమే.

దేశీయోత్పత్తిని పెంచేందుకు ఉత్పత్తితో ముడిపడ్డ ప్రోత్సాహకాల (పీఎల్‌ఐ) పథకాన్ని 2020లో ప్రారంభించిన కేంద్రం వివిధ రంగాలకు దాన్ని విస్తరించినా, ఐటీ హార్డ్‌వేర్ రంగంలో ఆశించినంత భాగస్వామ్యం రావట్లేదు. కేటాయింపులు రెట్టింపు చేసినా అదే పరిస్థితి. అలాగని, దిగుమతులపై షరతులు, లైసెన్స్ రాజ్యం పెడితే దేశీయ ఉత్పత్తి పెరుగుతుందనుకోవడం అవివేకం. ఆ సంగతి గత చరిత్ర నిరూపించింది. అపార ఇంజనీరింగ్ ప్రతిభ, తక్కువ వేతనానికే మెరుగైన సేవలు ఇస్తున్నా మనం అంతర్జాతీయ ఉత్పత్తి సేవల భాగస్వామ్యంలో ఎందుకని, ఎక్కడ వెనుకబడిపోయామో మథనం సాగాలి. ఆ విధాన లోపాన్ని సరిచేసుకోవాలి. ప్రతి వెయ్యిలో 15 మందికే కంప్యూటర్ చేరిన దేశంలో షరతులతో ఆ లోటు పెరుగుతుందా, తరుగుతుందా? ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యపై సమగ్ర దృష్టి పెట్టాలి. సంబంధిత పక్షాలతో క్షుణ్ణంగా చర్చించాలి. అనివార్యమైతే తప్ప అనవసర షరతులతో నష్టమని గుర్తించాలి. లేదంటే భారత పురోగతి మరోసారి కుంటుపడుతుంది.

ట్రంప్ ముందున్న మార్గం క్లిష్టమే!

విశ్లేషణ



మనోజ్ జోషి

రిపబ్లికన్ పార్టీ తమ అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకునే ప్రక్రియ 2024 జనవరిలో ప్రారంభమవుతుంది. అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై వివిధ నేరవిచారణలు ముగియడానికి ముందుగానే ఈ ప్రక్రియ ముగుస్తుంది. ట్రంప్ విషయంలో ప్రస్తుత రిపబ్లికన్ పార్టీ విధానం ఒకటే... ఆయన నేరాలనూ, దుష్ప్రవర్తనలనూ విస్మరించడం, ఈ ఫలితానికి బాధ్యత డెమొక్రాట్‌లపై ఉందని వాదించడం! అబార్షన్‌ను సహించలేని ఉన్నత నైతికత ఉన్న రిపబ్లికన్ పార్టీ, అదే సమయంలో తమ అధ్యక్ష అభ్యర్థి నీలిచిత్రాల తారలతో సహవాసం చేసినా పట్టించుకోని పార్టీగా మారిపోయింది. మరోవైపు, 2016–2024 మధ్యకాలంలోని 5.2 కోట్ల మంది అదనపు ఓటర్లు డెమొక్రటిక్ పార్టీ వైపు మొగ్గు చూపుతారని తెలుస్తోంది.


అమెరికాలో 2023 వేసవికాలం క్రూరంగా ఉండబోతోంది. దేశాన్ని పట్టి పీడిస్తున్న రాజకీయ సాంస్కృతిక జ్వరాలకు ఇది ఒక సూచన. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ఒక సంవత్సరం కంటే కొంచెం ఎక్కువ దూరమే ఉంది.

ఒక రకమైన ఆటో ఇమ్యూన్ వ్యాధి అమెరికాను తనవైపు తిప్పుకుంది. రిపబ్లికన్ పార్టీ తరపున పోటీ చేయబోతున్న అభ్యర్థి, తిరిగి భవిష్యత్ అమెరికన్ అధ్యక్షుడిగా భావిస్తున్న డోనాల్డ్ ట్రంప్ వ్యవహారాన్నే తీసుకోండి... రహస్య పత్రాలను దుర్వినియోగం చేసిన కేసులో ఆయన వచ్చే ఏడాది మేలో విచారణను ఎదుర్కోనున్నారు. కానీ 2024లో ఆయన ఎదుర్కొనే అనేక కేసుల్లో ఇది ఒకటి మాత్రమే. 2016 అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో జరిగిన లైంగిక కుంభకోణాన్ని కప్పిపుచ్చడానికి ట్రంప్ ఇచ్చిన నగదు చెల్లింపుపై క్రిమినల్ విచారణను మార్చిలో మొదలెట్టాలని నిర్ణయించారు. జార్జియాలో గత ఎన్నికల్లో పొందిన ఓటమిని తిప్పికొట్టేందుకు ట్రంప్ చేసిన ప్రయత్నాలపై కూడా విచారణ కొనసాగుతోంది. చివరగా, ఆయన నకిలీ ఓటర్లతో కూడిన కుట్ర ద్వారా 2020 ఎన్నికల తీర్పును తారుమారు చేయడానికి ప్రయత్నించాడనే అభియోగంపై కూడా దర్యాప్తు పూర్తి కావస్తోంది. ఈ కుట్రపూరిత ప్రయత్నం 2021 జనవరి 6న క్యాపిటల్‌పై దాడితో ముగియడం తెలిసిందే.

అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకునే రిపబ్లికన్ పార్టీ ప్రక్రియ 2024 జనవరిలో ప్రారంభమవుతుంది. ట్రంప్‌పై వివిధ నేరవిచారణలు ముగియడానికి ముందుగానే ఈ ప్రక్రియ ముగుస్తుంది. ట్రంప్ విషయంలో ప్రస్తుత రిపబ్లికన్ విధానం ఆయన నేరాలను, దుష్ప్రవర్తనలను విస్మరించడం, ఈ ఫలితానికి బాధ్యత డెమొక్రాట్‌లపై ఉందని వాదించడంగా కనిపిస్తోంది.

రిపబ్లికన్ పార్టీ ఈ అభిప్రాయానికి ఎలా వచ్చిందో, ఎలా చేరుకుందో స్పష్టం కావడం లేదు. కానీ 'లా అండ్ ఆర్డర్'గా తనను తాను చెప్పుకొనే ఈ పార్టీ... 2021 జనవరిలో జరిగిన అల్లర్లలో అసాధారణమైనది ఏమీ కనిపించలేదని భావించే స్థాయికి చేరుకుంది. పైగా ఆ పార్టీ ఇప్పుడు ఎఫ్‌బీఐ(ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్)ని కూడా రద్దు చేయాలనుకుంటోంది. అబార్షన్‌ను సహించలేని ఉన్నత నైతికత ఉన్న రిపబ్లికన్ పార్టీ, అదే సమయంలో తమ అధ్యక్ష అభ్యర్థి పోర్న్ స్టార్లతో సహవాసం చేసినా పట్టించుకోని పార్టీగా మారిపోయింది. వారి పూర్వ నాయకుడు రొనాల్డ్ రీగన్ సోవియట్ 'దుష్ట సామ్రాజ్యం'కు వ్యతిరేకంగా ప్రచారానికి నాయకత్వం వహించిన చోట, వారి ప్రస్తుత నాయకుడు రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు గొప్ప ఆశాకిరణంగా కనిపిస్తున్నారు.

మరోవైపున డెమొక్రాట్‌లకు వారి సమస్యలు వారికి ఉన్నాయి. కనీస జనాదరణ కూడా లేని జో బైడెన్ రెండోసారి పదవిని కోరు



తున్నారు. అయితే కాగితంపై విషయాలు బాగానే కనిపిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోంది, ఉద్యోగాలు పుష్కలంగా ఉన్నాయి, పైగా, రాబోయే ఆరు నెలల్లో పరిస్థితులు మరింత మెరుగు పడతాయన్న అంచనాలున్నాయి. అధ్యక్షుడిని అభిశంసిస్తామంటూ బెదిరించడం ద్వారా బైడెన్‌ను అణగదొక్కాలని రిపబ్లికన్లు ప్రయత్నిస్తున్నారు. బైడెన్, ఆయన కుమారుడు హంటర్ చర్యలు అవినీతితో ముడిపడి ఉన్నాయని వారు ఆరోపిస్తున్నారు, అయినప్పటికీ అధ్యక్షుడు స్వయంగా తప్పు చేసినట్లు చెప్పే సాక్ష్యాలు పెద్దగా లేవు.

దేశాన్ని పట్టి పీడిస్తున్న సంస్కృతీ యుద్ధాలు కూడా అంతే నాటకీయంగా ఉన్నాయి. అమెరికా సమకాలీన చరిత్రలో అతిపెద్ద విభజన, వాస్తవానికి గర్భస్రావ అంశమే. అమెరికన్ సుప్రీంకోర్ట్ అబార్షన్ హక్కుల కోసం రాజ్యాంగ పరమైన రక్షణను తీసివేసిన తర్వాత, అనేక రిపబ్లికన్ రాష్ట్రాలు అబార్షన్‌ను నిషేధించడమే కాకుండా, అబార్షన్ చేసేవారి చర్యను నేరంగా పరిగణిస్తూ కఠినమైన చట్టాలను ఆమోదించాయి. అయితే, గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా ఆయా సర్వేలు చూపిస్తున్నట్లుగా, అమెరికన్లలో ఎక్కువ మంది కొన్ని పరిమితులతో అబార్షన్ హక్కుకు మొగ్గు చూపుతున్నారు.

1955లో మిసిసిపిలో, శ్వేతజాతి మహిళపై ఈల వేసినందుకు అపహరణకు గురై, చిత్రహింసలపాలై హత్యకు గురైన 14 ఏళ్ల నల్లజాతి బాలుడు ఎమ్మెట్ టిల్ స్మారక చిహ్నాన్ని గత వారం అధ్యక్షుడు బైడెన్ ప్రారంభించారు. ఆ హత్య, అతని హంతకులను నిర్దోషులుగా విడుదల చేయడం అనేది 1960లలో పౌర హక్కుల ఉప్పెనను ప్రేరేపించింది. పైగా గత దశాబ్దంలో, 'బ్లాక్ లైవ్స్ మేటర్' (నల్లజాతి జీవితాలూ విలువైనవే) ఉద్యమ పెరుగుదలను చూశాం. ఈ పరిణామం అమెరికాలో నిలకడగా కొనసాగుతున్న జాత్యహంకార ఫలితమే.

సమకాలీన అమెరికన్ జాత్యహంకారం ఎలా పని చేస్తున్నదో చూడాలంటే... ఫ్లోరిడా గవర్నర్, రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిత్వంపై ఆశాజనకంగా ఉన్న రాన్ డిసాంటిస్ ఉదాహరణ చూడాలి. బానిసత్వాన్ని కొట్టివేసేలా ఆయన చర్యలు ఉంటున్నాయి. ఈ రాష్ట్రంలో సవరించిన పాఠ్య పుస్తకాలు... పని చేస్తూ బానిసలు కొన్ని నైపుణ్యాలను సంపాదించుకున్నందున వారు తమ బానిసత్వ స్థితి నుండి ప్రయోజనం పొందారని పేర్కొన్నాయి.

లైంగిక విద్య, లైంగిక ధోరణి, లింగ గుర్తింపుపై యుద్ధాలు జరుగుతున్నాయి. స్వలింగ సంపర్కుల హక్కులను స్థాపించడానికి విజయవంతమైన ప్రయత్నాలపై ఆధారపడి, ద్విలింగ, లింగ మార్పిడి వ్యక్తులు ప్రస్తుతం తమ హక్కులను పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒపీనియన్ పోల్స్ ప్రకారం, దాదాపు 21 శాతం జెనరేషన్ జెడ్ – అంటే 1990ల మధ్య నుంచి 2010 మధ్య జన్మించిన వారు– తమను తాము లెస్బియన్, గే, బైసెక్సువల్ లేదా ట్రాన్స్‌జెండర్ (ఎల్‌జీబీటీ)గా గుర్తించుకుంటున్నారు. 1980ల ప్రారంభంలో, 1990ల మధ్యకాలంలో జన్మించిన 'మిలీనియల్స్'లో ఎల్జీబీటీ సంఖ్య 10 శాతమే. జెనరేషన్ జెడ్ రాక దేశాన్ని ఇతర మార్గాల్లో కూడా ప్రభావితం చేస్తోంది. అమెరికన్లుగా ఉన్నందుకు 'అత్యంత గర్వంగా' భావిస్తున్నా మని చెప్పుకొనే యువకుల (18–34 ఏళ్లు) వాటా 2013లో దాదాపు 40 శాతం ఉండగా, ఇప్పుడది 18 శాతానికి పడిపోయిందని గాలప్ పోల్ వెల్లడించింది. ఈ ఏడాది, ఎల్‌జీబీటీ హక్కులను పరిమితం చేయడానికి ఉద్దేశించిన 75 బిల్లులు అమెరికా అంతటా చట్టసభలలో ఆమోదించబడ్డాయి. లైంగిక ధోరణి ఆధారంగా ద్వేషపూరిత నేరాలు పెరిగాయి. పైగా ప్రదర్శనలు, ప్రతి–ప్రదర్శనలు ఒక సాధారణ లక్షణంగా మారాయి. పాఠశాల, విశ్వవిద్యాలయ పాఠ్యాంశాలు కూడా రణరంగంలో చేరిపోయాయి.

'సంస్కృతి యుద్ధాలు' అని పిలిచే ఇవి నిజానికి మార్పుపై పోరాడటానికి సంప్రదాయవాదులు చేసిన ప్రయత్నం. వలసదారులు, స్వలింగ సంపర్కులు, మహిళలు, పేదలు, నల్లజాతీయులు, ఇతర సమూహాలకు తమ ఖర్చుతో అన్యాయమైన అధికారాలు ఇస్తున్నందున, ఉదారవాదం యొక్క బాధితులుగా సంప్రదాయవాదులు తమను తాము అభివర్ణించుకుంటున్నారు. సందడి ఎలా ఉన్నప్పటికీ, ట్రంప్‌కు మాత్రం రహదారి క్లిష్టంగానే ఉంది. ఒక ఎన్నికల సర్వే ప్రకారం, 2016–2024 మధ్యకాలంలోని 5.2 కోట్ల మంది అదనపు ఓటర్లు డెమొక్రటిక్ పార్టీ వైపు మొగ్గు చూపుతారని తెలుస్తోంది. స్పష్టంగా, అమెరికా మార్పునకు గురవుతోంది. ఇదేమీ అసాధారణమైనది కూడా కాదు. మితవాదుల ఆధిపత్యంలోని సుప్రీంకోర్టు వంటి సంస్థల సహాయంతో, రిపబ్లికన్లు 'శ్వేత జాతీయుల ఆధిపత్యాన్ని' కొనసాగించడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ అది సాధ్యం కాదు.

వ్యాసకర్త డిస్టింగ్విష్డ్ ఫెలో, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్
(ది ట్రిబ్యూన్ సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మరిచిపోయారా?



మణిపుర్‌లో తిరుగుబాట్లను అణచడానికి, సరిహద్దులను కాపాడటానికి 'అస్సాం రైఫిల్స్'ను ఉంచారు. ఈ రెండింటిలోనూ అది విఫలమైంది. 'సైనిక దళాల ప్రత్యేకాధికార చట్టం– ఏఎఫ్‌పీఎస్‌ఏ' మాటున వారు చేసింది మనందరికీ తెలుసు. కేవలం ఇప్పుడు మీ రాజకీయ వైఖరికి అనుకూలంగా ఉన్నంతమాత్రాన వారిని మణిపుర్ రక్షకులని అనుకోవద్దు.

– జాన్సన్ రాజ్‌కుమార్, మణిపుర్ ఫిలింమేకర్

దటీజ్...!



రజనీకాంత్ కొత్త సినిమా విడుదల రోజున చెన్నై, బెంగళూరుల్లో కార్యాలయాలకు సెలవులిస్తున్నారని వార్త. మిగతా నటులు సెలవు రోజుల్లో తమ సినిమాలను విడుదల చేస్తారు. రజనీకాంత్ సినిమా విడుదలైతే... అది సెలవు రోజు అవుతుంది.

– జాయ్ దాస్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్


వేసుకోవాల్సిన ప్రశ్న



పాకిస్తాన్‌లో లాగా మన ధర్మాన్ని తక్కువ చేసేవారిని చంపడం, జైళ్లలో వేయడం ద్వారా మాత్రమే నిజంగా మనం 'సామాజిక సామరస్యత' కోరుకుందామా? ఒకవేళ జవాబు అవును అయితే, అది ముస్లింలకు కూడా వర్తిస్తుందా?

– ముస్తఫా అక్యోల్, టర్కీ రచయిత

ఇదా మీ ప్రాధాన్యం?



వాళ్లు మణిపుర్ జీభత్సాల పట్ల కోపంగా లేరు. బ్రిజ్ భూషణ్ సింగ్ పట్ల కోపంగా లేరు. హరియాణాలో అల్లర్లు, విద్వేషపు నేరాల గురించి కోపంగా లేరు. కానీ వాళ్లకు ఒక ఫ్లయింగ్ కిస్ దౌర్జన్యంగా కనబడింది. ఇవీ వారి ప్రాథమ్యాలు!

– అద్వైద్, చరిత్రకారుడు

లవ్ ఫ్రమ్ ఆఫ్రికా



ఢిల్లీలోని పహాడ్ గంజ్‌కు మళ్లీ వెళ్లాను. పద్దెనిమిదో యేట రాసిన నా తొలి నవల 'ది అబిస్సీనియన్ బాయ్'కు నేపథ్యం ఈ ప్రాంతమే! కౌమార బాలుడిగా ఇండియాలో జీవించాను. ఒక ఆఫ్రికా పిల్లాడిగా నాకు ఇప్పుడు జీవితం గురించి తెలిసిన సర్వాన్నీ ఇండియా నాకు నేర్పింది.

– ఓన్యేకా నువెల్యూ, నైజీరియా రచయిత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

అరుదైన పత్రికా రచయిత


సందర్భం



కొమ్మినేని శ్రీనివాసరావు

జర్నలిజంలో పది, ఇరవై ఏళ్లపాటు కొనసాగడమే కష్టం. అలాగే జర్నలిస్టుగా జీవితం ఆరంభించి, కన్ను మూసే వరకు అదే వృత్తిలో ఉంటూ పత్రికలలో వ్యాసాలు రాయడం దాదాపు అసాధ్యం. అందరికీ ఆ అవకాశం లభించదు. అలాంటిది తుర్లపాటి కుటుంబరావు డెబ్బై ఏళ్లపాటు జర్నలిస్టుగా కొనసాగగలిగారు. ఏభై ఏళ్లపాటు 'వార్తలలో వ్యక్తి' పేరుతో ఒక శీర్షిక నిర్వహించగలగడం గొప్ప విషయం. ఒక వ్యాస శీర్షికను ఏభై ఏళ్లు నడపమంటే తేలికైన పని కాదు. కాని తుర్ల పాటి వల్ల అది సాధ్యపడింది. ఆంధ్రజ్యోతి, ఆ తర్వాత 'వార్త' దినపత్రికలలో 'వార్తలలోని వ్యక్తి' కాలమ్‌ను నిర్వహించేవారు. ఇంత సుదీర్ఘ కాలం జర్నలిస్టుగా ఉండి ఒక సొంత ఇల్లు కూడా సంపాదించుకోలేకపోవడం ఆశ్చర్యమే అనిపిస్తుంది. పాత్రికేయుడిగానే కాకుండా, 'ఉపన్యాస కేసరి' అని పిలిపించుకున్న ఏకైక జర్నలిస్ట్ తుర్లపాటి. 18 వేల ప్రసంగాలు చేసి గిన్నిస్ బుక్ రికార్డులలోకి ఎక్కారు. అదే సమయంలో పలు పుస్తకాలు రచించారు. 'జాతి నిర్మాతలు', '1857 విప్లవ వీరులు' వంటి పలు పుస్తకాలు వీరు రచించినవే. ఆంధ్ర యూనివర్శిటీ నుంచి 'కళా ప్రపూర్ణ', 'ముట్నూరి కృష్ణారావు అవార్డు', ఆనాటి ప్రధాని పీవీ నరసింహారావు చేతుల మీదుగా 'నేషనల్ సిటిజన్స్ అవార్డు', అమెరికాలోని బయోగ్రాఫికల్ సంస్థ వారి 'ఇంటర్నేషనల్ మ్యాన్ ఆఫ్ ది ఇయర్' వంటి అవార్డులు దక్కాయి.

తుర్లపాటి కుటుంబరావు 1933 ఆగస్టు పదో తేదీన జన్మించారు. కృష్ణా జిల్లా గన్నవరం, విజయవాడల్లో చదువుకున్నారు. 14 ఏళ్ల వయసులోనే పత్రికా రంగంలోకి రావడం ఒక ప్రత్యేకత. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుకు చెందిన 'ప్రజా పత్రిక'లో ఆయన చేరి వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేశారు. 1959లో ఆంధ్రజ్యోతి దిన పత్రికలో సహాయ సంపాదకుడిగా ఆరంభమైన ఆయన జర్నలిస్ట్ ప్రస్థానం జీవితాంతం కొనసాగింది. 18 మంది ముఖ్యమంత్రులతో ఆయనకు సంబంధాలు, మంచి పరిచయాలు ఉండేవి. అలాగే సినీ రంగంలో ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, శోభన్ బాబు తదితరులకు ఈయనంటే ఇష్టం. వారి గురించిన వ్యాసాలు పుంఖానుపుంఖాలుగా రాశారు. వారికి బిరుదులు ఇచ్చి విజయవాడలో సత్కార, సన్మాన కార్యక్రమాలు నిర్వహించేవారు. ఉదాహరణకు ఏఎన్నార్‌కు 'నట సామ్రాట్' అనే బిరుదును ఖాయం చేసి ప్రదానం చేసింది ఈయనే. 'నంది' అవార్డులను సినిమావారికి ప్రవేశపెట్టాలని కోరుతూ, అవి వచ్చేందుకు తుర్లపాటి విశేష కృషి చేశారు. జాతీయ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడిగా, జ్యోతిచిత్ర సినిమా పత్రిక సంపాదకుడిగా తనదైన ముద్ర వేసుకున్నారు. రాజకీయ, సినీ రంగం రెండిటిలోనూ ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శించగలగడం అందరికీ కుదరదు. సాహిత్య, సంగీతాభిలాషి అయిన ఆయన అభ్యుదయవాది కూడా. ప్రముఖ కూచిపూడి నర్తకి కృష్ణకుమారిని ప్రేమ వివాహం చేసుకున్నారు.



తుర్లపాటి కుటుంబరావు

రాష్ట్ర స్థాయి నేతలతోనే కాదు... పలువురు జాతీయ స్థాయి నాయకులతో కూడా ఆయన సంబంధాలు, ఉత్తరప్రత్యుత్తరాలు నెరపేవారు. తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, అంబేడ్కర్, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ వంటివారితో తరచు ఇంటరాక్ట్ అయ్యేవారు. ఇక ఇందిరా గాంధీ, మొరార్జీ దేశాయ్, జగ్జీవన్ రామ్, రాజీవ్ గాంధీ వంటివారు ఏపీకి వచ్చినప్పుడు, వారి ఉపన్యాసాలకు అనువాదకులుగా ఉండేవారు. నెహ్రూపై ఉన్న అభిమానంతో ఆయన తన కుమారుడికి ఆ పేరే పెట్టుకోవడం విశేషం. ప్రేమ వివాహానికి గుర్తుగా కుటుంబ రావు తమ కుమార్తెకు 'ప్రేమ జ్యోతి' అని పేరు పెట్టారు. చతు రోక్తులతో ప్రసంగాలు చేయడం ఆయన విశిష్టత. ఆయా సందర్భాలను బట్టి ఆయా ప్రముఖుల చరిత్రను, వర్తమానాన్ని కలిపి, జీవిత విశేషాలతో ఆ కాలమ్ రాసి పాఠకులను ఆకట్టుకునేవారు. ఇన్ని గొప్పదనాలు ఉన్నవి కాబట్టే కేంద్ర ప్రభుత్వం ఈయనకు పద్మశ్రీ అవార్డు ప్రదానం చేసింది. తెలుగు జర్న లిస్టులలో ఆ గౌరవం పొందింది ఈయన ఒక్కరే కావడం విశేషం.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ ఛైర్మన్
(నేడు తుర్లపాటి కుటుంబరావు జయంతి)

చట్టం పేరుతో నిజాలను తిరస్కరించలేరు

అభిప్రాయం



గౌతమ్ భాటియా

వెర్నాన్ గొంజాల్వెస్, అరుణ్ ఫెరీరాలకు బెయిల్ మంజూరు చేయాలని సుప్రీంకోర్టు తాజాగా నిర్ణయం తీసుకుంది. చట్టవిరుద్ధమైన కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా) కఠినమైన నిబంధనలలో కొంత మేరకు న్యాయప్రక్రియను చొప్పించడానికి ఈ తీర్పు ప్రయత్నిస్తోంది. మహారాష్ట్రలో 2018లో ఒక వ్యక్తి మరణం, విస్తృతమైన ప్రతిఘటన, హింస చోటుచేసుకున్న 'భీమా కోరేగావ్' కేసులో వెర్నాన్ గొంజాల్వెస్, అరుణ్ ఫెరీరాలు నిందితులు. వీరు దాదాపు ఐదేళ్లపాటు ఎలాంటి విచారణ లేకుండా జైలులో గడిపినందుకే కాదు... చట్టవిరుద్ధమైన కార్యకలాపాల (నివారణ) చట్టం ఉపా నిబంధనలలో సుప్రీంకోర్టు తగిన న్యాయ ప్రక్రియకు చెందిన అంశాన్ని చొప్పించడానికి ప్రయత్నించిన అరుదైన సందర్భాలలో ఇది ఒకటి కాబట్టి ఈ తీర్పు ముఖ్యమైనది.

ఉపా కింద అరెస్ట్ అయిన వ్యక్తి బెయిల్ విచారణ సమయంలో, న్యాయస్థానం ముందు వాస్తవాలకు సంబంధించి ప్రాసిక్యూషన్ (లేదా పోలీసు)కు చెందిన వెర్షన్ (వాదన)కు సంబంధించిన వివరాలు మాత్రమే ఉంటాయి. ఈ సమయంలో, ప్రతివాది సాక్షులను క్రాస్ ఎగ్జామిన్ చేయలేడు లేదా తన సొంత సాక్ష్యాలను చూపించే వీలుండదు. ఉపా ప్రకారం, ఈ ఏకపక్ష వాదన ఆధారంగా నిందితుడిపై దేశద్రోహం కేసు మోపినట్లు కనిపిస్తే, బెయిల్ మంజూరు చేయడానికి వీల్లేదు.

దీనిని ఒక చేయి వెనుకకు కట్టివేసిన స్థితిలో ప్రతివాది పోరాటం చేస్తున్నట్టు భావించినట్లయితే, అత్యున్నత న్యాయస్థానం తన గత తీర్పులలో రెండో చేతిని కూడా కట్టే ప్రయత్నం చేసింది. 2019లో 'నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ వర్సెస్ జహూర్ షా వటాలి' కేసులో ఇచ్చిన అపఖ్యాతి పాలైన తీర్పులో, బెయిల్ సమయంలో ఈ ఏకపక్ష వెర్షన్‌ని కూడా వివరణాత్మక లేదా శోధన పరిశీలనకు గురి చేయలేమని ఉన్నత న్యాయస్థానం పేర్కొంది. క్రిమినల్ న్యాయ కోవిదుడు అభినవ్ సెక్రీ మాటల్లో చెప్పాలంటే, పోలీసు వెర్షన్‌ను వేద వాక్యంగా భావించవలసి రావడంతో అనేక న్యాయస్థానాలు ఇతర వాస్తవాలను పరిగణనలోనికి తీసుకోకుండా బెయిల్‌ను నిరాకరిస్తున్నాయి.

భీమా కోరేగావ్ కేసులో కానీ, అలాగే 2020 ఢిల్లీ అల్లర్ల కేసుల్లో ఉమర్ ఖలీద్ వంటి వ్యక్తుల బెయిల్ దరఖాస్తుల విషయంలో కానీ న్యాయస్థానాలు కేవలం ప్రాసిక్యూషన్ వాదాన్ని పఠించడం, పరిగణనలోకి తీసుకోవడం ద్వారా బెయిల్ తిరస్కరించాయి. అనేక ఇతర నిందితుల బెయిల్ విషయంలోనూ ఇదే జరిగింది. చివరకు విచారణ సమయంలో కోర్టు బయట ఉన్న వదంతులను పరిగణనలోకి తీసుకోవడం జరిగింది. నిజానికి ఇలా పరిగణనలోకి తీసుకోవడం నిషిద్ధం. భారతదేశంలో నేర విచారణ చాలా కాలం పాటు సాగుతున్నందున, నేరారోపణ రుజువు కానప్పటికీ ఒక ఆరోపణ మాత్రంతోటే వ్యక్తులు ఏళ్లతరబడి జైళ్లలో తప్పని



సరిగా మగ్గవలసి వస్తోంది.

ఈ సందర్భంలోనే వెర్నాన్ గొంజాల్వెస్ కేసులో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వు... వాస్తవాలను తిరస్కరించే రాజ్య ధోరణి (స్టేట్ ఇంప్యునిటీ)కి తగిలిన ఒక ముఖ్యమైన న్యాయపరమైన ఎదురుదెబ్బ అనే చెప్పాలి. ఉపా కింద బెయిల్ నిబంధనల స్వభావాన్ని బట్టి కోర్టులు... నాణ్యత పరంగా, పరిశీలన విలువ పరంగా పోలీసులు అందించిన సాక్ష్యాల విశ్లేషణలో నిమగ్నమవ్వాలని న్యాయస్థానం సరిగ్గానే గుర్తించింది. చట్టం ఎంత కఠినంగా ఉంటుందో, విధి విధానాలకు కట్టుబడి ఉండటం కూడా అంతే ముఖ్యమని కోర్టు అందరి దృష్టికి తెచ్చింది. ఈ సూత్రాలను కోర్టు తన ముందున్న వాస్తవాలకు వర్తింపజేస్తూ, వెర్నాన్ గొంజాల్వెస్, అరుణ్ ఫెరీరాలకు వ్యతిరేకంగా ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యం చాలా నాసిరకం నాణ్యతతో ఉందని గుర్తించింది. ఈ జంట విప్లవ సాహిత్యాన్ని కలిగి ఉన్నట్లు కనుగొన్నప్పటికీ ఇది నేరం కాదని ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం నొక్కి చెప్పింది.

నిషేధిత సంస్థతో ఈ ఇద్దరు వ్యక్తులకు సంబంధం ఉందనీ, దానిలో వారికి సభ్యత్వం ఉందనీ థర్డ్ పార్టీ రాసిన లేఖను ప్రాసిక్యూషన్ చూపించడం సరికాదని కోర్టు పేర్కొంది. ఆ విధంగా కుట్రకు సంబంధించిన అస్పష్టమైన ఆరోపణల ద్వారా తన కేసులోని ఖాళీలను పూరించడానికి ప్రాసిక్యూషన్ చేసిన ప్రయత్నాలను కోర్టు తిరస్కరించింది. నిర్దిష్టమైన, ప్రత్యేకమైన వాస్తవాలు లేకుండా ఈ ఆరోపణలకు విశ్వసనీయతను కల్పించడానికి న్యాయస్థానం నిరాకరించింది. కోర్టు నిర్దేశించిన కొన్ని బెయిల్ షరతులు (గొంజాల్వెస్, ఫెరీరా తమ ఫోన్‌లను పోలీసు ఇన్వెస్టిగేటర్‌తో జత చేయడం, ఆ ఫోన్‌ల లొకేషన్‌ని ఎల్లప్పుడూ ఆన్‌లో ఉంచడం వంటివి) వ్యక్తిగత గోప్యతపై భృకుటి ముడి వేసినా... ఈ తీర్పు ఉపా కింద ప్రభుత్వానికి ఉన్న వాస్తవాలను తిరస్కరించే వెసులుబాటుపై గణనీయమైన దెబ్బలే వేసింది.

వస్తుగతంగా చూస్తే, విచారణలో సరైన ప్రక్రియను, న్యాయబద్ధతకు చెందిన కొన్ని ప్రాథమిక సూత్రాలను మాత్రమే ఉన్నత న్యాయస్థానం పునరుద్ఘాటించింది. కానీ ఈ తీర్పు ప్రముఖమైనది ఎందుకయ్యిందంటే... చాలా ఇతర కేసులలో, అనేక ఇతర కోర్టులు (ట్రయల్ కోర్టు, హైకోర్టు నుండి, సుప్రీం కోర్టు దాకా) పదేపదే ఈ సూత్రాలను విడిచిపెట్టేశాయనీ, పైగా వ్యక్తులు తమ రాజ్యాంగ హక్కుల సాధనలో కోర్టు తలుపులు తట్టినప్పుడు న్యాయస్థానాలు మరో వైపు చూశాయనీ చెప్పకనే చెప్పినందువల్ల.

సుప్రీం కోర్టు తీర్పు ఉపా చీకటి సొరంగంలో వెలుగును ప్రసరిస్తుంది. ఇప్పుడు ముందుకు వెళ్లే మార్గాన్ని ప్రకాశవంతం చేయడం ఇతర కోర్టుల పని.

వ్యాసకర్త ఢిల్లీ న్యాయవాది
('ద హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ.నవమి ఉ.7.52 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** కృత్తిక ఉ.6.59 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** రా.11.20 నుండి 12.56 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.57 నుండి 10.48 వరకు, తదుపరి ప.3.04 నుండి 3.54 వరకు, **అమృతఘడియలు:** తె.4.54 నుండి 5.50 వరకు (తెల్లవారితే శుక్రవారం); **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.44, **సూర్యాస్తమయం:** 6.27.

హకీంజానీ, బెల్లంకొండకు భాషా పురస్కారాలు

ఈ నెల 29న తెలుగు భాషా దినోత్సవం నాడు ప్రదానం




హకీం జానీ, బెల్లంకొండ నాగేశ్వరరావు

విజయవాడ కల్చరల్: తెలుగులో వాడుక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన వారికి తెలుగు భాషా పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు అధ్యక్షుడు సోమేపల్లి వెంకట సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలాది వ్యాసాల ద్వారా తెలుగు భాషా సంస్కృతిని పరిపుష్టం చేసిన తెనాలికి చెందిన షేక్ అబ్దుల్ హకీంజానీ, చెన్నైకి చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త బెల్లంకొండ నాగేశ్వరరావును 2023 సంవత్సరానికి గానూ పురస్కారాలకు ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీన తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

తొలిసారి తగిలిన లాటరీ

రైతులను కోటీశ్వరులను చేసిన టమాటా

- 45 రోజుల్లో రికార్డు స్థాయి ఆదాయం
- చివరి కోతలోనూ మంచి ధర
- కిలోకు సగటున రూ.130 నుంచి రూ.150 ధర
- చరిత్రలో ఈ స్థాయి ధరలు చూడలేదంటున్న రైతులు

రూ.3 కోట్లు మిగిలింది



చిత్తూరు జిల్లా సోమల మండలం కరమండ గ్రామానికి చెందిన ఈ రైతు పేరు పెనలప్పగారి మురళి. 24 ఎకరాల్లో టమాటా సాగు చేశారు. ఎకరాకు 20 నుంచి 25 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. పంట చేతికొచ్చే సమయంలో టమాటా ధర అనూహ్యంగా పెరిగింది. సగటున కిలో రూ.130 నుంచి రూ.150 వరకు ధర పలికింది. కేవలం 45 రోజుల్లోనే రికార్డు స్థాయిలో రూ.4 కోట్లకు పైగా ఆదాయం రాగా.. పెట్టుబడి పోనూ రూ.3 కోట్లకుపైగా మిగిలింది. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ.. 'నాలుగేళ్ల క్రితం 12 ఎకరాల్లో టమాటా సాగుచేసే వాడిని. ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రస్తుతం 24 ఎకరాల్లో పంట వేశా. ప్రభుత్వం 20 ఎకరాలకు సబ్సిడీపై డ్రిప్‌తోపాటు మల్చింగ్ షీట్స్ ఇచ్చింది. గతంలో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేది కాదు. ప్రస్తుతం 9 గంటలు ఇస్తున్నారు. ఇటీవలే మా ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లిన 4 గంటల్లోనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేశారు. టమాటా రైతులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వానికి, మంత్రి పెద్దిరెడ్డికి రుణపడి ఉంటాం' అని కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి, అమరావతి: ఒకప్పుడు కిలో టమాటాలను రూపాయి.. రెండు రూపాయలకు విక్రయించిన రైతులు అనూహ్యంగా లక్షాధికారులుగా మారారు. కొందరైతే కోటీశ్వరులయ్యారు కూడా. ఈ సీజన్‌లో టమాటా ధరలు పెరగడం రైతుల అదృష్టాన్ని మలుపు తిప్పింది. టమాటా ఎక్కువగా సాగయ్యే మహారాష్ట్రతో పాటు పలు రాష్ట్రాల్లో ఆకస్మిక వర్షాలతో పంటలు దెబ్బతినడంతో డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తిలేక టమాటా ధరలు జాతీయ స్థాయిలో అనూహ్యంగా పెరిగాయి. మండీలలోనే కిలోకు సగటున రూ.130 నుంచి రూ.150 ధర లభించగా.. ఒక దశలో కిలో రూ.270 వరకు పలికింది. వ్యాపారులు పోటీపడి ధరలు పెంచడంతో రైతులకు మంచి లాభాలు వచ్చాయి.

సుమారు 7 వేల మంది రైతులకు ప్రయోజనం

రాష్ట్రంలో 1.50 లక్షల ఎకరాల్లో టమాటా సాగవుతోంది. ఏటా ఖరీఫ్‌లో 60 శాతం, రబీలో 30 శాతం, వేసవిలో 10 శాతం విస్తీర్ణంలో సాగవుతుంది. వేసవి పంటను కర్ణాటక రాష్ట్రంలోని కోలార్, బెంగళూరు రూరల్ జిల్లాలతో పాటు ఏపీలోని చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో సాగు చేస్తుంటారు. ఏపీలో టమాటా రైతులు 70 వేల మంది ఉండగా, వారిలో 5–7 వేల మంది రైతులు మాత్రమే సుమారు 10 వేల ఎకరాల్లో వేసవి పంట సాగు చేస్తుంటారు. ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. సాధారణంగా సాగు చేస్తే 15 కోతలు, ట్రెల్లీస్ కింద సాగు చేస్తే 25–30 కోతలు వస్తుంది. హెక్టార్‌కు ఖరీఫ్‌లో 60 టన్నులు, రబీలో 65–70 టన్నులు, వేసవిలో 50–60 టన్నులు వస్తుంది.



ఎకరాకు గరిష్టంగా రూ.25 లక్షలకు పైగా ఆదాయం

గతేడాది వేసవి పంటకు కిలో రూ.100కు పైగా లభించడంతో ఈ ఏడాది అదే స్థాయిలో ధర లభిస్తుందన్న ఆశతో రైతులు వేసవి పంట సాగుకు మొగ్గు చూపారు. సాధారణంగా వేసవి పంట ఫిబ్రవరి–మార్చిలో వేస్తారు. కొద్దిమంది కాస్త ఆలస్యంగా మార్చి–ఏప్రిల్‌లో పంట వేశారు. ఈ వేసవిలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతల వల్ల ఎకరాకు సగటున 15–20 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. అనూహ్యంగా పెరిగిన ధరల ఫలితంగా చిత్తూరు జిల్లాలో 2,500 మంది రైతులు, అన్నమయ్య జిల్లాలో 3,200 మంది రైతులు రికార్డు స్థాయి లాభాలను ఆర్జించారు. సగటున ఎకరాకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఆదాయం రాగా, కొంతమందికి ఎకరాకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు కూడా ఆదాయం వచ్చింది. సుమారు 10–20 మంది రైతులు రూ.కోట్లలో ఆర్జించారు. మదనపల్లెలో కిలోకు గరిష్టంగా రూ. 200 పలుకగా, కలికిరిలో రూ.245 పలికింది. ఇక అంగర మార్కెట్‌లో రూ.215 ధర వచ్చింది.

వినియోగదారులకు బాసటగా ప్రభుత్వం

టమాటా ధరలు చుక్కలనంటడంతో ప్రభుత్వం జోక్యం చేసుకుని వినియోగదారులకు బాసటగా నిలిచింది. రైతుల నుంచి సగటున కిలో రూ.107.49 చొప్పున రూ.14.65 కోట్ల విలువైన 1,363 టన్నులు సేకరించి రైతుబజార్ల ద్వారా కిలో రూ.50కే సబ్సిడీపై వినియోగదారులకు అందించింది. బుధవారం కూడా కిలో రూ.83 చొప్పున రూ.16.60 లక్షలతో 20 టన్నులు సేకరించి సబ్సిడీపై పంపిణీ చేసింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.80 నుంచి రూ.125 మధ్య ధర పలుకుతుంటే రైతుబజార్లలో రూ.70 నుంచి రూ.84 మధ్య పలుకుతున్నాయి.

అప్పులన్నీ తీర్చేశా



రెండెకరాల్లో 15 ఏళ్లుగా టమాటా సాగు చేస్తున్నా. దిగుబడులు ఘనంగా వచ్చినా మార్కెట్లో ధరలు అంతంతమాత్రంగానే ఉండేవి. పెట్టుబడి పోనూ ఆదాయం పొందిన సందర్భాలు చాలా తక్కువ. ఈ ఏడాది ఫిబ్రవరిలో పంట వేశా. దిగుబడుల కోసం అధికంగా ఎరువులు వినియోగించడం వల్ల రూ.8 లక్షల వరకు పెట్టుబడి అయ్యింది. మే 20 నుంచి ఇప్పటి వరకు 23 కోతలు కోశాను. పెట్టుబడి ఖర్చులు పోనూ రూ.36 లక్షల వరకు ఆదాయం పొందాను. ఈ ఏడాది టమాటాకు వచ్చిన ధర గతంలో ఎప్పుడూ లేదు. ఈ ఆదాయంతో మాకున్న అప్పులన్నీ తీర్చేశా.

– వెంకటేష్‌రాయల్, చిప్పిలి, మదనపల్లె

సామూహిక అత్యాచారం కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు



మాట్లాడుతున్న బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్, చిత్రంలో స్పెషల్ పీపీ శారదామణి

- సత్ఫలితాలనిస్తున్న కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ విధానం: డీజీపీ
- మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి గుణపాఠం: బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

సాక్షి, అమరావతి/ గుంటూరు లీగల్/నగరంపాలెం: రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన రేపల్లె రైల్వే స్టేషన్‌లో జరిగిన సామూహిక అత్యాచారం కేసులో ఇద్దరు ముద్దాయిలకు 20 సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.2,500 జరిమానా విధిస్తూ నాలుగో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఆర్.శరత్‌బాబు బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా, యర్రగొండపాలెం మండలం, వెంకటాద్రిపురానికి చెందిన కొర్రపోలు రమేష్ వ్యవసాయ, తాపీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య ఏసమ్మ, ముగ్గురు పిల్లలు సంతానం కాగా, భార్య మళ్లీ గర్భంతో ఉంది. కృష్ణాజిల్లా నాగాయలంకలో కూలి పనులు చేసుకునేందుకు రమేష్ తన భార్య, పిల్లలతో 2022 ఏప్రిల్ 30న గుంటూరులో రైలు ఎక్కి రేపల్లె వెళ్లాడు. అప్పటికి సమయం 11.45 కావడంతో రైల్వేస్టేషన్‌లోనే తన భార్య, పిల్లలతో రమేష్ నిద్రకు ఉపక్రమించాడు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పాలుబోయిన విజయకృష్ణ, పలుచూరి నిఖిల్, మరో మైనర్ బాలుడు మద్యం మత్తులో రైల్వేస్టేషన్‌లోకి వచ్చారు. అక్కడ భార్య,పిల్లలతో నిద్రిస్తున్న రమేష్‌ను నిఖిల్ నిద్రలేపి టైం అడిగాడు. టైం చెప్పకపోవడంతో రమేష్‌ను కొట్టడం ప్రారంభించాడు. దీంతో రమేష్ స్టేషన్ బయటకు పరుగెత్తాడు. అక్కడే ఉన్న రమేష్ భార్యపై విజయకృష్ణ లైంగికదాడికి పాల్పడ్డాడు. రమేష్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి పోలీసులను తీసుకొచ్చేసరికి నిందితులు పారిపోయారు. నిందితులు తన భార్యపై సామూహిక అత్యాచారం చేసినట్లు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, దిశ డీఎస్పీ యు.రవిచంద్ర దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ శారదమణి వాదించారు. ఈ కేసులో మూడో ముద్దాయి మైనర్ కావడంతో తెనాలి పోక్సో కోర్టులో విచారణ జరుగుతుంది.

సత్ఫలితాలనిస్తున్న కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్

అత్యాచార కేసుల్లో దోషులకు సత్వరం శిక్షలు విధించేలా పోలీసు శాఖ కోర్ట్ ట్రయల్ మానిటరింగ్ విధానాన్ని సమర్థంగా అమలు చేస్తున్నదని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పారు. బాపట్ల జిల్లా రేపల్లె రైల్వేస్టేషన్‌లో గతేడాది ఓ మహిళపై అత్యాచారం చేసిన కేసులో పాలుబోయిన విజయకృష్ణ, పాలుచురి నిఖిల్‌ను దోషులుగా గుర్తిస్తూ న్యాయస్థానం 20 ఏళ్ల జైలు శిక్ష విధించడం కేసు దర్యాప్తులో పోలీసుల సమర్థతకు నిదర్శనమన్నారు. కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ ద్వారా గతేడాది కాలంగా గుర్తించిన 122 కేసుల్లో 102 కేసుల్లో దోషులకు శిక్షలు పడ్డాయన్నారు. ముగ్గురికి మరణశిక్ష, 37మందికి జీవిత ఖైదు, 62 కేసుల్లో 7 ఏళ్ల నుంచి 20 ఏళ్ల వరకు జైలు శిక్ష పడిందన్నారు.

ఈ తీర్పు ఓ గుణపాఠం..

రేపల్లె రైల్వేస్టేషన్‌లో జరిగిన సామూహిక అత్యాచారం కేసులో ఇచ్చిన తీర్పు మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి ఓ గుణపాఠమని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని స్పందన హాల్‌లో బుధవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాధితురాలికి తక్షణ సాయంగా రూ.10 లక్షలు, ఎస్సీ, ఎస్టీ కేసు కింద రూ.8.50 లక్షలు, ఎంపీ, ఎమ్మెల్యే నుంచి రూ.1.50 లక్షలు అందజేసినట్లు చెప్పారు. కాగా, ఈ కేసులో అన్ని కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేసి, నిందితులకు శిక్షలు పడే వరకు ప్రతిభ కనబరిచిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శారదామణి, డిప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్ మధుసూదనరావు, తదితర పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రాలు, రివార్డులు అందజేశారు.

ట్రిపుల్ ఐటీల్లో 250 మందికి అడ్మిషన్లు

నూజివీడులో 2వ విడత కౌన్సెలింగ్ ప్రారంభం



నూజివీడు ట్రిపుల్‌ఐటీలో నిర్వహిస్తున్న అడ్మిషన్ల కౌన్సెలింగ్

నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీల్లోని సీట్ల భర్తీకి నూజివీడు ట్రిపుల్ ఐటీలో బుధవారం రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించారు. తొలి రోజు 404 మందిని పిలవగా 250 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరందరి సర్టిఫికెట్లను పరిశీలించిన అనంతరం అందరికీ ప్రవేశాలు కల్పించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఒకరు, ఒంగోలు ట్రిపుల్ ఐటీకి 71 మంది, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి 178 మంది అభ్యర్థులకు ప్రవేశాలు కల్పించినట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు తెలిపారు. అడ్మిషన్ల ప్రక్రియను చాన్సలర్ ఆచార్య కేసీరెడ్డి, వైస్ చాన్సలర్ ఆచార్య ఎం.విజయ్‌కుమార్, నూజివీడు డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు పరిశీలించారు.

5న వైజాగ్ నేవీ మారథాన్



విశాఖ స్పోర్ట్స్: వైజాగ్ నేవీ మారథాన్ నవంబర్ 5వ తేదీన విశాఖ సాగర తీరంలో నిర్వహించనున్నట్లు ఐఎన్ఎస్ కళింగ సీవో కమోడోర్ సీఎస్ నాయర్ తెలిపారు. తూర్పునావికా దళం నేవీ డే వేడుకల్లో భాగంగా ఈ ఫ్లాగ్‌షిప్ ఈవెంట్‌కు విశాఖ మరోసారి వేదిక కానుందన్నారు. బుధవారం వైజాగ్ నేవీ మారథాన్(వీఎన్ఎం) వివరాలను ఆయన వెల్లడించారు. భారత నావికా దళం, రాష్ట్రం మధ్య దీర్ఘకాలిక అనుబంధం, సమ్మేళనానికి ప్రతీకగా మస్కట్ నిలవనుందన్నారు. ప్లాస్టిక్ రహిత రాష్ట్రాన్ని సాధించేందుకు ప్రభుత్వానికి సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రొఫెషనల్ రన్నర్స్, వయోభేదం లేకుండా ఔత్సాహికుల కోసం ఐదు కి.మీ, 10 కి.మీ, 21 కి.మీ, 42 కిలోమీటర్ల పరుగును ఈ మారథాన్‌లో నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నామన్నారు. పౌరుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, ఫిట్‌నెస్ ఔత్సాహికులను ప్రోత్సహించే ఉద్దేశంతో సిటీ ఆఫ్ డెస్టినీగా పేరుగాంచిన విశాఖలో మరోసారి నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం 8వ ఎడిషన్ వీఎన్ఎం మస్కట్ బ్లాక్‌బక్‌ను విడుదల చేశారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): విజయవాడ డివిజన్‌లోని మనుబోలు–గూడూరు సెక్షన్‌లో నాన్–ఇంటర్‌లాక్ పనుల కారణంగా ఈ నెల 10 నుంచి 15 వరకు ఆ మార్గంలో నడిచే పలు రైళ్లను పూర్తిగా, పాక్షికంగా రద్దు చేసి మరి కొన్నింటిని దారి మళ్లించనున్నట్లు రైల్వే శాఖ తెలిపింది.

రద్దయిన రైళ్లు: విజయవాడ–గూడూరు (07500/07458), సూళ్లూరుపేట–నెల్లూరు (06745/06746, 06747/06748, 06750/06751), గూడూరు–రేణిగుంట (07667), మచిలీపట్నం–ధర్మవరం (07095/07096), బిట్రగుంట–చెన్నై సెంట్రల్ (17237/17238), విజయవాడ–గూడూరు (17260), చెన్నై సెంట్రల్–విజయవాడ (12077/12078), విజయవాడ–చెన్నై సెంట్రల్ (12711/12712), ధర్మవరం–నర్సాపూర్ (17248), తిరుపతి–కాకినాడ టౌన్(17249/17250) రైళ్లను ఈ నెల 10 నుంచి 15 వరకు, బెంగళూరు–హటియా (18637) ఈ నెల 12న, హటియా–ఒంగోలు (18238) ఈ నెల 15న, గయా–చెన్నై ఎగ్మూర్ (12389/12390), ఈ నెల 13,15న, తిరుపతి–విశాఖ (22708/22707) ఈ నెల 9, 10, 11, 12 తేదీలలోను, చెన్నై సెంట్రల్–విశాఖ (22869/22870) ఈ నెల 14, 15 తేదీల్లో పూర్తిగా రద్దు చేశారు.

పాక్షికంగా రద్దు: సికింద్రాబాద్–గూడూరు (12710/12709) రైలును ఈ నెల 9 నుంచి 14 వరకు వేదాయపాలెం–గూడూరు మధ్య, విజయవాడ–గూడూరు (12744/12743) రైలును ఈ నెల 11 నుంచి 15 వరకు నెల్లూరు–గూడూరు మధ్య పాక్షికంగా రద్దు చేశారు.

దారి మళ్లింపు: కాచీగూడ–మధురై (07191) ఈ నెల 14న డోన్, గుత్తి, రేణిగుంట మీదుగా, యర్నాకులం–హౌరా (22878) ఈ నెల 14న, మధురై–నిజాముద్దీన్ (12651) ఈ నెల 15న, బెంగళూరు–గౌహతి ఈ నెల 10, 11 తేదీల్లో కాట్పాడి, రేణిగుంట, నంద్యాల, గుంటూరు మీదుగా దారి మళ్లించారు.

మణిపూర్‌లో భరతమాత హత్య | రాజకీయం చేయడం సిగ్గుచేటు

- లోక్‌సభలో కాంగ్రెస్‌ పార్టీ ఎంపీ రాహుల్‌ గాంధీ నిప్పులు
- మణిపూర్‌ను బీజేపీ విచ్ఛిన్నం చేసింది
- బీజేపీ నేతలు దేశభక్తులు కాదు.. దేశద్రోహులు
- లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణ తర్వాత సభలో రాహుల్‌ తొలి ప్రసంగం

సాక్షి, న్యూఢిల్లీ: అధికార బీజేపీపై కాంగ్రెస్‌ ఎంపీ రాహుల్‌ గాంధీ నిప్పులు చెరిగారు. మణిపూర్‌లో భరతమాతను బీజేపీ ప్రభుత్వం హత్య చేసిందని గర్జించారు. రాష్ట్రంలో హింసాకాండను అరికట్టడంలో, శాంతిని నెలకొల్పడంలో నరేంద్ర మోదీ సర్కారు దారుణంగా విఫలమైందని ఆరోపించారు. బీజేపీ నాయకులు ముమ్మాటికీ దేశద్రోహులేనని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్‌ సహా విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో రెండోరోజు బుధవారం కూడా చర్చ కొనసాగింది. ఈ చర్చలో రాహుల్‌ గాంధీ పాల్గొన్నారు. లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించిన తర్వాత సభలో ఆయన మాట్లాడడం ఇదే మొదటిసారి. దాదాపు 30 నిమిషాల పాటు ప్రసంగం సాగింది. బీజేపీపై, మోదీ సర్కారుపై దుమ్మెత్తి పోశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకొని ఘాటు వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. ఆ సమయంలో మోదీ సభలో లేరు. అలాగే తన 'భారత్‌ జోడో యాత్ర' అనుభవాలను రాహుల్‌ పంచుకున్నారు. ఒకవైపు ఆయన ప్రసంగం కొనసాగుతుండగా, మరోవైపు సభలో అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. విపక్ష ఎంపీలు 'ఇండియా.. ఇండియా' అని నినాదాలు చేయగా, అధికార పక్ష సభ్యులు 'మోదీ.. మోదీ' అంటూ నినాదాలతో హోరెత్తించారు. గౌతమ్‌ అదానీ గురించి మాట్లాడడానికి సభకు రాలేదని, భయపడకండి అని బీజేపీ సభ్యులకు చురక అంటిస్తూ రాహుల్‌ తన ప్రసంగం ప్రారంభించారు. సభలో ఆయన ఏం మాట్లాడారంటే...

ప్రజల మద్దతుతోనే పాదయాత్ర దిగ్విజయం

భారత్‌ జోడో యాత్ర ఇంకా పూర్తి కాలేదు. ఈ యాత్ర ప్రారంభించినప్పుడు ఎందుకు నడుస్తున్నారు? మీ లక్ష్యం ఏమిటి? అని చాలామంది అడిగారు. పాదయాత్ర చేయాలని ఎందుకు అనుకున్నానో తొలుత తెలియలేదు. నేను దేన్ని ప్రేమిస్తానో అర్థం చేసుకోవడానికి, దేనికోసం నేను మరణానికి కూడా సిద్ధమో గుర్తించడానికి, మోదీకి చెందిన జైలుకు వెళ్లడానికి యాత్ర చేస్తున్నట్లు క్రమంగా తెలుసుకున్నా. నేను నిత్యం 10 కిలోమీటర్లు పరుగెత్తేవాడిని. అలాంటిది పాదయాత్రలో రోజుకు 25 కిలోమీటర్లు నడవలేనా అనుకున్నా. అప్పట్లో నాలో అహంకారం ఉండేది. భారత్‌ జోడో యాత్ర ఆ అహంకారాన్ని మాయం చేసింది. యాత్ర మొదలైన తర్వాత రెండు మూడు రోజుల్లోనే నాకు ఒళ్లు నొప్పులు ప్రారంభమయ్యాయి. నాలో అహంకారం పూర్తిగా మాయమైంది. పాదయాత్రలో ప్రజలు నాకు అండగా నిలిచారు. వారి మద్దతుతోనే యాత్ర దిగ్విజయంగా కొనసాగించా. ప్రతిరోజూ ప్రజలు చెప్పింది విన్నాను. నా వద్దకు ఓ రైతు వచ్చాడు. అతడికి పంటల బీమా దక్కలేదని చెప్పాడు. అతడి ఆకలి బాధ నాకు అర్థమైంది. ఆ తర్వాత నా యాత్ర తీరు మారిపోయింది. అప్పటినుంచి చుట్టుపక్కల ప్రజల నినాదాలు నాకు వినిపించలేదు. బాధితుల ఆవేదనే వినిపించేది. భారత్‌ జోడో యాత్ర పూర్తి కాలేదు. తూర్పు నుంచి పశ్చిమ భారతదేశం వరకూ పాదయాత్ర కొనసాగిస్తా. దేశంలో వేర్వేరు భాషలు ఉన్నాయని చెబుతుంటారు. ఇది నేల, ఇది బంగారం, ఇది వెండి అని అంటుంటారు. కానీ, సత్యం ఏమిటంటే ఈ దేశం ఓ గొంతుక. దాన్ని వినాలంటే మన మనసులోని అహంకారాన్ని, విద్వేషాన్ని విడనాడాలి. అప్పుడే దేశం గొంతుక మనకు వినిపిస్తుంది.



లోక్‌సభలో మాట్లాడుతున్న రాహుల్‌ గాంధీ

ప్రజల గొంతుకను హత్య చేశారు

భారత్‌ అంటేనే ఓ గొంతుక. భారత్‌ మన ప్రజల గొంతుక. అది ప్రజల హృదయ స్పందన. అలాంటి గొంతుకను మీరు(బీజేపీ ప్రభుత్వం) మణిపూర్‌లో హత్య చేశారు. అంటే భరతమాతను హత్య చేశారు. మణిపూర్‌ ప్రజలను హత్య చేయడం ద్వారా భారతదేశాన్ని హత్యచేశారు. అందుకే మీ ప్రధాని(మోదీ) మణిపూర్‌ వెళ్లడం లేదు. మీరు దేశభక్తులు కాదు, దేశ ద్రోహులు. మీరు భరతమాత రక్షకులు కాదు. భరతమాతను హత్య చేసిన హంతకులు. నా తల్లి ఈ సభలోనే ఉన్నారు. మరో తల్లి అయిన భరతమాత మణిపూర్‌లో హత్యకు గురైంది. మణిపూర్‌లో హింసను అరికట్టనంత వరకూ నా తల్లి హత్యకు గురవుతూనే ఉంటుంది.

మణిపూర్‌ బాధితుల ఆవేదన విన్నా

కొన్ని రోజుల క్రితం మణిపూర్‌ వెళ్లాను. అక్కడికి ప్రధాని ఇప్పటికీ వెళ్లలేదు. మోదీ దృష్టిలో మణిపూర్‌ లేదు. మణిపూర్‌ భారతదేశంలో ఒక భాగం కాదని అనుకుంటున్నారు. నేను 'మణిపూర్‌' అనే పదాన్ని వాడాను. కానీ, మణిపూర్‌ అనేదే లేదు. దానిని రెండుగా విభజించారు. బీజేపీ ప్రభుత్వం మణిపూర్‌ను విచ్ఛిన్నం చేసింది. నేను మణిపూర్‌లో సహాయక శిబిరాలకు వెళ్లాను. అక్కడున్న మహిళలు, పిల్లలతో మాట్లాడాను. ఒక మహిళను 'అక్క.. మీకు ఏమైంది?' అని అడిగా. దానికి ఆమె 'నాకు ఒకే ఒక్క కుమారుడు ఉన్నాడు. నా కళ్ల ముందే అతడిని కాల్చిచంపారు. రాత్రంతా నేను నా బిడ్డ మృతదేహం పక్కనే కూర్చున్నాను. ఆ తర్వాత భయపడి కట్టుబట్టలతో, చేతిలో ఓ ఫొటోతో నా ఇంటిని విడిచిపెట్టాను' అని ఆమె నాతో చెప్పింది. మరో మహిళను 'మీకు ఏమైంది?' అని అడగ్గానే, ఆమెకు జరిగింది గుర్తుకు వచ్చి వణికిపోవడం మొదలుపెట్టింది. సొమ్మసిల్లి పడిపోయింది. మణిపూర్‌లో హిందూస్తాన్‌ను బీజేపీ హత్య చేసిందని చెప్పడానికి ఈ రెండు ఉదాహరణలు చాలు.

దేశాన్ని దహనం చేసే కుట్రలు

సైన్యం ఒక్క రోజులో మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించగలదు. కానీ, కేంద్ర ప్రభుత్వం సైన్యాన్ని మణిపూర్‌లో మోహరించడం లేదు. ఎందుకంటే ప్రభుత్వం మణిపూర్‌లో భారతదేశాన్ని హత్య చేయాలనుకుంటోంది. ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల మాటలు వినడం లేదు. కేవలం ఇద్దరి మాటలే వింటున్నారు. రావణాసురుడు కేవలం మేఘనాథుడు, కుంభకర్ణుడి మాటలే విన్నాడు. అలాగే మోదీ కేవలం గౌతమ్‌ అదానీ, అమిత్‌ షా మాటలనే ఆలకిస్తున్నారు. రావణుడి అహంకారమే లంకను దహనం చేసింది. రావణుడి అహంకారమే అతడిని అంతం చేసింది. మీరు దేశం మొత్తం కిరోసిన్‌ చల్లుతున్నారు. మణిపూర్‌లో కిరోసిన్‌ చల్లి నిప్పు రగిలించారు. హరియాణాలోనూ ఇప్పుడు అదే చేస్తున్నారు. దేశాన్ని దహనం చేసేందుకు మీరు కుతంత్రాలు పన్నుతున్నారు. దేశమంతటా భరతమాతను అంతం చేస్తున్నారు'' అని రాహుల్‌ గాంధీ ధ్వజమెత్తారు. ప్రసంగం అనంతరం ఆయన సభ నుంచి బయటకు వెళ్తూ ఇతర సభ్యుల వైపు చూస్తూ 'ఫ్లైయింగ్‌ కిస్‌' ఇచ్చారు.

మణిపూర్‌ అంశంలో విపక్షాల తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్‌ షా ఆగ్రహం

- హింసకు స్వస్తి పలకాలని మణిపూర్‌ తెగలకు విజ్ఞప్తి
- మణిపూర్‌లో శాంతి కోసం లోక్‌సభలో తీర్మానం

న్యూఢిల్లీ: మణిపూర్‌ అంశంలో ప్రతిపక్షాల వైఖరిపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్‌ వ్యవహారాన్ని రాజకీయం చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. బుధవారం లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా అమిత్‌ షా మాట్లాడారు. విపక్ష నేత రాహుల్‌ గాంధీ తీరును తప్పుపట్టారు. మణిపూర్‌లో ముఖ్యమంత్రిని మార్చడం గానీ, రాష్ట్రపతి పాలన గానీ అవసరం లేదని తేల్చిచెప్పారు. మణిపూర్‌లో శాంతిని కాంక్షిస్తూ అమిత్‌ షా ప్రతిపాదించిన తీర్మానాన్ని లోక్‌సభలో ఆమోదించారు. సభలో అమిత్‌ షా ప్రసంగం ఆయన మాటల్లోనే...

రాహుల్‌ 13సార్లు విఫలం

''మణిపూర్‌ పర్యటన సందర్భంగా కాంగ్రెస్‌ నేత రాహుల్‌ గాంధీ పెద్ద డ్రామా నడిపించారు. ఆయన పర్యటనకు ప్రభుత్వం అన్ని ఏర్పాటు చేసింది. వాటిని తిరస్కరించారు. చురాచాంద్‌పూర్‌కు హెలికాప్టర్‌లో వెళ్లాలని కోరితే రోడ్డు మార్గంలో వెళ్తానన్నారు. మొదటిరోజు సత్యాగ్రహం చేశారు. రెండోరోజు హెలికాప్టర్‌లో వెళ్లారు. 13 సార్లు రాజకీయ రంగ ప్రవేశం చేసిన నాయకుడు(రాహుల్‌ గాంధీ) ఈ సభలో ఉన్నారు. ఆయన 13 సార్లు విఫలమయ్యారు. మహారాష్ట్రలోని విదర్భలో కళావతి అనే పేద మహిళతో కలిసి రాహుల్‌ భోజనం చేశారు. ఆమె అనుభవిస్తున్న కష్టాలను ఈ సభలో ప్రస్తావించారు. ఆ తర్వాత కాంగ్రెస్‌ ప్రభుత్వమే ఆరేళ్లు అధికారంలో ఉంది. కానీ, కళావతి పేదరికాన్ని పోగొట్టడం కోసం రాహుల్‌ చేసిందేమీ లేదు. మోదీ ప్రభుత్వమే కళావతికి ఇళ్లు, కరెంటు, గ్యాస్‌ సౌకర్యాలు కల్పించింది. రేషన్‌ సరుకులు ఇస్తోంది.

మోదీ సర్కారు ఎన్నో ఘనతలు సాధించింది

ప్రధాని మోదీ గత తొమ్మిదేళ్లలో 50 సార్లు ఈశాన్య రాష్ట్రాల్లో పర్యటించారు. ఆయా రాష్ట్రాల అభివృద్ధి కోసం ఆయన శ్రమిస్తున్నారు. కాంగ్రెస్‌ పాలనలో మణిపూర్‌లో ఎన్నోసార్లు హింసాత్మక సంఘటనలు జరిగాయి. అప్పట్లో హోంమంత్రి మణిపూర్‌లో పర్యటించలేదు. కానీ, నేను ఆ రాష్ట్రంలో 23 రోజులపాటు పర్యటించా. ఈశాన్యంలో గత తొమ్మిదేళ్లలో 8 వేల మంది సాయుధ తీవ్రవాదులు లొంగిపోయారు. దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం ఎన్నో మంచి పనులు చేసింది. ఎన్నో ఘనతలు సాధించింది.

ఆ వీడియో వెనుక ఆంతర్యం ఏమిటి?

''మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన మే 4న జరిగింది. ఈ వీడియో జూలై 19న బయటికొచ్చింది. వీడియోను సోషల్‌ మీడియాలో పెట్టే బదులు రాష్ట్ర డీజీపీకి అందజేస్తే బాగుండేది. తద్వారా నేరస్తులను వెంటనే గుర్తించి, అరెస్టు చేసేందుకు వీలుండేది. పార్లమెంట్‌ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ఒక్కరోజు ముందు ఈ వీడియోను ఉద్దేశపూర్వకంగా లీక్‌ చేశారు. దాని వెనుక ఆంతర్యం ఏమిటి? వీడియో బయటపడిన వెంటనే ప్రభుత్వం స్పందించింది. తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసింది.

అందువల్లే అసలు సమస్య

మయన్మార్‌లో 2021లో అక్కడి సైనిక ప్రభుత్వం మిలిటెంట్లపై కఠిన చర్యలు ప్రారంభించింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అక్కడున్న కుకీలు మన దేశంలోని మణిపూర్‌కు వలసవచ్చారు. మణిపూర్‌ లోయలోని అడవుల్లో వారు స్థిర నివాసాలు ఏర్పరచుకున్నారు. దాంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అందువల్ల ఇక్కడ సమస్య మొదలైంది. వలసవచ్చిన కుకీల స్థావరాలను గ్రామాలుగా అధికారికంగా ప్రకటిస్తున్నారని వదంతులు రావడంతో అశాంతి ప్రారంభమైంది. మైతెయిలను ఎస్టీల్లో చేర్చే ప్రక్రియ ప్రారంభించాలని మణిపూర్‌ హైకోర్టు ఉత్తర్వులు ఇవ్వడంతో సమస్య ఇంకా ముదిరింది. మణిపూర్‌లో ఘర్షణల నివారణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. శాంతి కమిటీని ఏర్పాటు చేసింది. హింసను చాలావరకు అరికట్టాం.



లోక్‌సభలో మాట్లాడుతున్న అమిత్‌ షా

కాంగ్రెస్‌కు అవినీతి పనులు అలవాటే

ప్రభుత్వాలను కాపాడుకోవడానికి అవినీతికి పాల్పడిన ఘన చరిత్ర కాంగ్రెస్‌దే. విపక్ష కూటమి అసలు రూపం ప్రజలకు తెలుసు. 1999లో అప్పటి వాజ్‌పేయి ప్రభుత్వం అవిశ్వాస పరీక్షను ఎదుర్కొంది. ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి వాజ్‌పేయి తప్పుడు మార్గాలు ఎంచుకోలేదు. మౌనంగా పదవి నుంచి దిగిపోయారు. ముడుపులు ఇచ్చి ప్రభుత్వాలను కాపాడుకోవడం కాంగ్రెస్‌కు అలవాటే. 1993లో పీవీ నరసింహారావు ప్రభుత్వాన్ని అలాగే రక్షించుకున్నారు. 2008లో మన్మోహన్‌ సింగ్‌ ప్రభుత్వం కూడా అదే విధంగా సంక్షోభం నుంచి గట్టెక్కింది. కాంగ్రెస్‌ పార్టీ అసలు రంగు ఇదే. బీజేపీ ఎప్పటికీ విలువలకు కట్టుబడి ఉంటుంది. నరేంద్ర మోదీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలకు విశ్వాసం లేకపోవచ్చుగానీ ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉంది. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా పొందిన నాయకుడు నరేంద్ర మోదీ మాత్రమే. ఆయన రెండు సార్లు పూర్తి మెజార్టీతో అధికారంలోకి వచ్చారు. ఇలా జరగడం 30 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. అవినీతి.. క్విట్‌ ఇండియా, వారసత్వ రాజకీయాలు.. క్విట్‌ ఇండియా, బుజ్జగింపు రాజకీయాలు.. క్విట్‌ ఇండియా అని మేము నినదిస్తున్నాం.

చేతులు జోడించి ప్రార్థిస్తున్నా..

చేతులు జోడించి ప్రార్థిస్తున్నా. హింసకు ఇక స్వస్తి పలికి శాంతియుతంగా కలిసిమెలిసి ఉండాలని మణిపూర్‌ తెగలను కోరుతున్నా. సమస్య పరిష్కారం కోసం కేంద్రంతో చర్చలు జరపడానికి కుకీలు, మైతేయిలు ముందుకు రావాలి. మణిపూర్‌ అంశాన్ని ప్రతిపక్షాలు రాజకీయం చేయొద్దు. అరాచకాలను ఎవరూ సమర్థించరు. మణిపూర్‌లో జరిగిన ఘటనలు సిగ్గుచేటు. వాటిని రాజకీయం చేయడం సిగ్గుచేటు. మణిపూర్‌లో అగ్నికి ఆజ్యం పోయవద్దని ప్రతిపక్షాలను కోరుతున్నా. మణిపూర్‌లో జరిగిన ఘర్షణల్లో మే 3వ తేదీ నుంచి ఇప్పటిదాక 152 మంది మరణించారు. 14,898 మంది నిందితులు అరెస్టయ్యారు. 1,106 ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. మరణాలు తగ్గుతున్నాయి. మే నెలలో 107 మంది, జూన్‌లో 30 మంది, జూలైలో 15 మంది మరణించారు. మణిపూర్‌ ముఖ్యమంత్రిని తొలగించే అవకాశం లేదు. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించే విషయంలో సీఎం కేంద్ర ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నారు. అక్కడ రాష్ట్రపతి పాలన అవసరం లేదు'' అని అమిత్‌ వివరించారు.

నిండు సభలో..
మహిళా మంత్రికి ముద్దులా?

- మహిళా ఎంపీలను అవమానించాడు
- తద్వారా పార్లమెంట్‌కే మచ్చతెచ్చాడు
- కేంద్ర మహిళా మంత్రులు, ఎంపీల ధ్వజం
- కఠినాతి కఠిన చర్యలు తీసుకోండి
- లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు
- బీజేపీకి రాహుల్‌ ఫోబియా: కాంగ్రెస్‌
- ప్రేమను పంచితే సహించలేకపోతున్నారంటూ ఎదురుదాడి



మీడియాతో మాట్లాడుతున్న శోభా, తదితరులు

న్యూఢిల్లీ: లోక్‌సభలో కాంగ్రెస్‌ నేత రాహుల్‌ గాంధీ ఫ్లయింగ్‌ కిస్‌లు బుధవారం పెను వివాదానికి దారితీశాయి. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ మాట్లాడుతుండగా అధికార సభ్యుల కేసి ఆయన ముద్దులు విసిరారు. రాహుల్‌కి ఉన్న మహిళా విద్వేషానికి ఇది నిదర్శనమని బీజేపీ దుమ్మెత్తిపోయగా, అధికార పార్టీ రాహుల్‌ ఫోబియాతో బాధపడుతోందంటూ కాంగ్రెస్‌ ఎదురు దాడికి దిగింది. రాహుల్‌పై అత్యంత కఠిన చర్య తీసుకోవాలంటూ బీజేపీ మహిళా ఎంపీలు స్పీకర్‌ బిర్లాకు ఫిర్యాదు చేశారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. రాహుల్‌ తీరును తూర్పారబట్టారు. మొత్తంమ్మీద అనర్హత వేటు తర్వాత సభలో అడుగుపెట్టిన తర్వాత రాహుల్‌గాంధీ చేసిన సైగలతో రేగిన దుమారం కొద్దిరోజులపాటు పార్లమెంట్‌ను కుదిపేసేలా కనిపిస్తోంది.

సభలోనే కన్ను కొట్టిన చరిత్ర రాహుల్‌ది

కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని ఉద్దేశించి లోక్‌సభలో రాహుల్‌ అసభ్యకర సైగలు చేశారంటూ స్పీకర్‌కు బీజేపీ లిఖితపూర్వక ఫిర్యాదుచేసింది. మంత్రులు శోభా కరంద్లాజే, దర్శన జర్దోష్‌తోపాటు 20 మందికిపైగా బీజేపీ మహిళా ఎంపీలు దానిపై సంతకం చేశారు. ' రాహుల్‌ చేసిన దిగజారుడు పని సభలోని మహిళా సభ్యులను తీవ్రంగా అవమానించింది. అంతేకాదు, లోక్‌సభలో గౌరవానికి కూడా భంగం కలిగింది. అందుకే ఆయనపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్‌ చేస్తున్నాం' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దుమ్మెత్తిపోశారు. ఒక సభ్యుడు నిండు సభలో ఇంత బాహాటంగా స్త్రీ విద్వేషం ప్రదర్శించిన ఉదంతం పార్లమెంట్‌ చరిత్రలోనే ఎన్నడూ లేదని మహిళా బీజేపీ ఎంపీ అన్నారు. గాంధీ కుటుంబీకులు పాటించే విలువలకు ఇదే నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఇలాంటి దిగజారుడు ప్రవర్తనకుగాను రాహుల్‌కు తగిన శిక్ష పడి తీరాలని డిమాండ్‌ చేశారు. ఇరానీ ప్రసంగం వినాల్సిందిగా బీజేపీ సభ్యులు కోరినందుకు రాహుల్‌ వారివైపు రెండు మూడు అడుగులు వేసి మరీ ఫ్లైయింగ్‌ కిస్సులు విసిరారని శోభా కరంద్లాజే ఆరోపించారు. సీసీటీవీ ఫుటేజీలు చూసి ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలోనూ లోక్‌సభలో కన్ను కొట్టిన చరిత్ర రాహుల్‌కు ఉందని ఎంపీలు గుర్తుచేశారు. ఆయన ప్రవర్తనలోనే ఏదో లోపముందని అభిప్రాయపడ్డారు.

మణిపూర్‌పై చర్చ తప్పించుకునేందుకే: కాంగ్రెస్‌

లోక్‌సభలో రాహుల్‌ ఫ్లయింగ్‌ కిస్సులను కాంగ్రెస్‌ గట్టిగా సమర్థించుకుంది. ఆయన మహిళలను ఎప్పటికీ అగౌరవపరచజాలరని పార్టీ స్పష్టంచేసింది. మణిపూర్‌ హింసాకాండపై పార్లమెంట్‌లో చర్చ జరగడం అధికార పార్టీకి అస్సలు ఇష్టం లేదంటూ ఎదురుదాడికి దిగింది. అందుకే రాహుల్‌పై ఇలా తప్పుడు ఆరోపణలకు బరితెగించిందని ఆరోపించింది. బీజేపీకి, స్మృతి ఇరానీకి రాహుల్‌ ఫోబియా పట్టుకుందని లోక్‌సభలో కాంగ్రెస్‌ విప్‌ మాణిక్కం ఠాకూర్‌ ఎద్దేవా చేశారు. ముద్దులు.. ప్రేమకు, ఆప్యాయతకు నిదర్శనమని ఆయన చేసిన భారత్‌ జోడో యాత్రను చూసిన వారందరికీ తెలుసు అని కాంగ్రెస్‌ పార్టీప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ గుర్తుచేశారు. రాహుల్‌ చర్య ఆప్యాయత చిహ్నమేనని శివసేన(ఉద్ధవ్‌ ఠాక్రే) మహిళా ఎంపీ ప్రియాంకా చతుర్వేది వ్యాఖ్యానించారు. 'అప్పట్లో రాహుల్‌ ప్రేమ దుకాణం అన్నారు. ఇదీ అలాంటి సదుద్దేశంతో కూడిన సైగ మాత్రమే' అని స్పష్టంచేశారు.



భరతమాతను హత్యచేశారంటే.. బల్లలు చరుస్తారా ?

రాహుల్‌ గాంధీ ప్రసంగంపై నిప్పులు చెరిగిన స్మృతి ఇరానీ

న్యూఢిల్లీ: మణిపూర్‌లో భరతమాతను హత్య చేశారంటూ రాహుల్‌ గాంధీ చేసిన ప్రసంగాన్ని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ తీవ్రంగా తప్పుబట్టారు. ప్రభుత్వంపై విపక్షాలు చేసిన అవిశ్వాస తీర్మానంపై బుధవారం లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్‌కు ఘాటుగా స్మృతి తన స్పందన తెలిపారు. ' సభలో ఆయన ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నా. భరతమాత హత్యకు గురైందంటూ సభలోనే వ్యాఖ్యలు చేయడం పార్లమెంటరీ చరిత్రలో ఇదే తొలిసారి. ఆయన ఇలాంటి తీవ్రవ్యాఖ్యలు చేస్తుంటే తోటి కాంగ్రెస్‌ సభ్యులు చప్పట్లు కొడుతూ, బల్లలు చరుస్తారా ?' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ' నా ముందే ప్రసంగం చేశారు. ముందు వరసలో మహిళా సభ్యులు ఉండగా ఆయన(రాహుల్‌) గాలిలో ముద్దులు విసిరారు. ఇలాంటి అసభ్య సైగలు గతంలో మరెవరూ చేయలేదు. ఈ (గాంధీ)కుటుంబం సంస్కృతి ఇప్పుడు దేశం మొత్తానికి తెలిసొచ్చింది' అని వ్యాఖ్యానించారు. స్మృతి తన ప్రసంగాన్ని కొనసాగిస్తుండగా కొందరు మహిళా బీజేపీ ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌ ఓం బిర్లాకు రాహుల్‌ ఫ్లయింగ్‌ కిస్‌పై ఫిర్యాదుచేశారు. కఠిన చర్య తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

ఆర్టికల్‌ రద్దు వల్లే అది సాధ్యమైంది

'విపక్ష కూటమి పార్టీ నేత ఒకరు తమిళనాడులో.. భారత్‌ అంటే ఉత్తరభారతమే అని వివాదాస్పద వ్యాఖ్యచేశారు. దమ్ముంటే ఈ అంశంపై రాహుల్‌ మాట్లాడారు. మరో నేత కశ్మీర్‌పై రెఫరెండం కోరతారు. ఇలాంటి ప్రకటనలు కాంగ్రెస్‌ అధిష్టానం ఆదేశాలతో వస్తున్నాయా ?. మీ కూటమి 'ఇండియా' కాదు. భారత్‌లో అవినీతిని పెంచారు' అని ఆవేశంగా మాట్లాడారు. రాహుల్‌ గాంధీ భారత్‌ జోడో యాత్ర కశ్మీర్‌లో కొనసాగడంపై స్మృతి ఎద్దేవా చేశారు. ' రక్తంతో తడిసిన కశ్మీర్‌ లోయ అది. యాత్ర పేరుతో అక్కడికెళ్లి స్నో బాల్స్‌తో ఆడుకున్నారు. ఆర్టికల్‌ 370ని ప్రధాని మోదీ రద్దుచేయడం వల్లే అక్కడ అల్లర్లు తగ్గి నెలకొన్న ప్రశాంతత కారణంగా మీరు ఆ పని చేయగలిగారు. ఆ ఆర్టికల్‌ను మళ్లీ తెస్తామని అక్కడి వారికి రాహుల్‌ హామీ ఇచ్చి వచ్చారు. కానీ అది ఎన్నటికీ సాధ్యపడదు. ఆర్టికల్‌ పునరుద్ధరణ ఉండదు' అని తేల్చిచెప్పారు. కాంగ్రెస్‌ పాలనలో అత్యయిక స్థితిని స్మృతి గుర్తుచేశారు. ' మీ పాలనా చరిత్ర అంతా రక్తసిక్తం. 1984 సిక్కుల వ్యతిరేక అల్లర్లు, కశ్మీర్‌లో అశాంతి..' అని వ్యాఖ్యానించారు.

'మణిపూర్‌'పై పార్లమెంట్‌లో అలజడి

న్యూఢిల్లీ: మణిపూర్‌ అంశంపై ప్రధానమంత్రి మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్‌ చేస్తూ బుధవారం పార్లమెంట్‌ ఉభయ సభల్లో విపక్షాలు ఆందోళన కొనసాగించాయి. లోక్‌సభ బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. వెంటనే విపక్ష ఎంపీలు తమ స్థానాల్లో నిల్చొని మణిపూర్‌ అంశంపై నినాదాలు ప్రారంభించారు. ప్రధాని సభకు రావాలని డిమాండ్‌ చేశారు. ఇంతలో స్పీకర్‌ 'క్విట్‌ ఇండియా' ఉద్యమకారులకు సభలో నివాళులర్పించారు. 1942 ఆగస్టు 9న జరిగిన ఈ పోరాటంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ఆ త్యాగమూర్తులను ప్రజలంతా స్మరించుకోవాలని అన్నారు. అనంతరం విపక్ష ఎంపీలు మళ్లీ నినాదాలు ప్రారంభించారు. వెల్‌లోకి దూసుకొచ్చారు. ప్రశ్నోత్తరాలకు సహకరించాలని స్పీకర్‌ పలుమార్లు కోరినా వారు లెక్కచేయలేదు. విపక్ష ఎంపీల ఆందోళన మధ్యే స్పీకర్‌ 45 నిమిషాలపాటు ప్రశ్నోత్తరాలను నిర్వహించారు. సభలో గందరగోళం ఆగకపోవడంతో సభను మధ్యాహ్నం 12 గంటల దాకా వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత అవిశ్వాస తీర్మానంపై చర్చ మొదలైంది.

రాజ్యసభలో రెండు బిల్లులకు ఆమోదం

మణిపూర్‌ హింసాకాండ వ్యవహారం రాజ్యసభలోనూ అలజడి సృష్టించింది. 267 నిబంధన కింద వెంటనే చర్చ చేపట్టాలని విపక్ష సభ్యులు డిమాండ్‌ చేశారు. వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేశారు. ప్రతిపక్షాల ఆందోళనలు, నినాదాల కారణంగా సభను తొలుత మధ్యాహ్నం 2 గంటల వరకు, తర్వాత 2.45 గంటల దాకా, అనంతరం 3.15 గంటల దాకా వాయిదా వేయాల్సి వచ్చింది. బుధవారం సభలో రాజ్యాంగం(షెడ్యూల్డ్‌ కులాలు) ఆర్డర్‌(సవరణ) బిల్లు–2023పై చర్చ జరిగింది. బిల్లును సభలో ఆమోదించారు. దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో పరిశోధనల కోసం నిధులు సమకూర్చడానికి ఉద్దేశించిన 'అనుసంధాన్‌ నేషనల్‌ రీసెర్చ్‌ ఫౌండేషన్‌ బిల్లు–2023'ని సైతం రాజ్యసభలో ఆమోదించారు. ఈ బిల్లు వర్సిటీల్లో సానుకూల మార్పు తీసుకొస్తుందని వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ ఎంపీలు వి.విజయసాయిరెడ్డి, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అలాగే క్విట్‌ ఇండియా ఉద్యమంలో అసువులు బాసినవారికి రాజ్యసభలో నివాళులర్పించారు. వారి ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు.

ఆ రాజకీయాలను దేశం నుంచి
తరిమికొట్టాలి



న్యూఢిల్లీ: అవినీతి నిర్మూలన, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలను భారత్‌ నుంచి తరిమి కొట్టాలని ప్రజలు నినదిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్‌పై పరోక్షంగా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. స్వాతంత్య్ర పోరాటంలో 1942 ఆగస్టు 9న మహాత్మా గాంధీ చేపట్టిన క్విట్‌ ఇండియా ఉద్యమ సంస్మరణ దినాన్ని బుధవారం బీజేపీ నిర్వహించింది. ఈ సందర్భంగా మూడింటిని దేశం నుంచి తరిమి కొట్టాలని ఒకే స్వరం వినిపిస్తోందని ప్రధాని చెప్పారు. 'అవినీతిని దేశం నుంచి తరిమేయాలి. వారసత్వ రాజకీయాలను, బుజ్జగింపు రాజకీయాలను కూడా తరిమికొట్టాలి'' అని ప్రధాని బుధవారం ఒక ట్వీట్‌లో వెల్లడించారు. మరోవైపు బీజేపీ నేత రవిశంకర్‌ ప్రసాద్‌ మీడియాతో మాట్లాడుతూ దేశ ప్రయోజనాలు పరిరక్షించాలంటే అవినీతి, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలకు చోటు ఉండకూడదని అన్నారు.

మణిపూర్‌ మంటలు మోదీకి ఇష్టం


రాజస్తాన్‌ ఎన్నికల ప్రచారంలో రాహుల్‌ ధ్వజం

జైపూర్: అధికార బీజేపీ సైద్ధాంతిక భావజాలమే మణిపూర్‌ను మంటల్లోకి నెట్టిందని కాంగ్రెస్‌ నేత రాహుల్‌ గాంధీ అన్నారు. అమాయక ప్రజలను చంపేశారని, మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రధాని మోదీ నిజంగా తలచుకొంటే రెండు మూడు రోజుల్లో మణిపూర్‌ మంటలు ఆరిపోతాయని చెప్పారు. కానీ, ఆ మంటలు అలాగే చెలరేగాలని మోదీ కోరుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా రాజస్తాన్‌లోని మన్‌గఢ్‌ ధామ్‌లో బుధవారం కాంగ్రెస్‌ ప్రచార సభలో రాహుల్‌ ప్రసంగించారు. మణిపూర్‌ను ప్రధాని మోదీ రెండు విభజించారని ఆరోపించారు. గత మూడు నెలలుగా మణిపూర్‌ భారతదేశంలో ఒక భాగంగా లేనట్లు కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనులను బీజేపీ నేతలు 'ఆదివాసీ' అని కాకుండా 'వనవాసీ' అని సంబోధిస్తూ అవమానిస్తున్నారని రాహుల్‌ మండిపడ్డారు. గిరిజనులకు చెందిన అడవులను బలవంతంగా లాక్కొని అదానీకి కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. గిరిజనులకు హక్కులు దక్కాలని, వారి ఆకాంక్షలు నెరవేరాలని కాంగ్రెస్‌ కోరుకుంటోందని వివరించారు.

మరోసారి చంద్రయాన్‌–3 కక్ష్య తగ్గింపు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చందమామ చుట్టూ చక్కర్లు కొడుతున్న ఇస్రో వారి చంద్రయాన్‌–3 వ్యోమనౌక కక్ష్యను మరోసారి తగ్గించారు. చంద్రుడికి దగ్గరగా 174 కిలోమీటర్లు, దూరంగా 1,437 కిలోమీటర్ల దూరంలో ఉండే దీర్ఘ వృత్తాకార చంద్ర కక్ష్యలోకి చంద్రయాన్‌–3ని ప్రవేశపెట్టారు. మూడోసారి బుధవారం మధ్యాహ్నం 1.35 గంటలకు కక్ష్య దూరాన్ని తగ్గించే ప్రక్రియను విజయవంతంగా ఇస్రో నిర్వహించింది. బుధవారం బెంగళూరులోని ఇస్ట్రాక్‌ కేంద్రంలోని శాస్త్రవేత్తలు ఈ ఆపరేషన్‌ను చేపట్టారు. ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం 12.30 లోపు మరోసారి కక్ష్య దూరాన్ని తగ్గిస్తామని ఇస్రో ప్రకటించింది. కక్ష్య దూరాన్ని తగ్గిస్తూ చివరకు వంద కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి వ్యోమనౌకను తీసుకొస్తారు. ఆ తర్వాత కమాండ్‌ను పంపి ప్రొపల్షన్‌ మాడ్యూల్‌ నుంచి ల్యాండర్, రోవర్‌లను విడదీస్తారు. ల్యాండర్‌ నెమ్మదిగా చంద్రుడిపై దిగుతుంది.

ఇక మాది కేరళం రాష్ట్రం !



తిరువనంతపురం: రాష్ట్రం పేరును కేరళంగా మార్చుకోవాలని కేరళ శాసనసభ తీర్మానించింది. దీనికి సంబంధించి బుధవారం కేరళ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. 'రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లోసహా అన్ని భాషల్లో, అన్ని ప్రభుత్వ దస్త్రాల్లో తమ రాష్ట్రం పేరును కేరళం అని మార్చండి., అందుకు అనుమతి ఇవ్వండి' అని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. 'మలయాళం భాషలో రాష్ట్రాన్ని కేరళం అనే సంబోధిస్తారని సీఎం గుర్తుచేశారు. 'జాతీయోద్యమ కాలం నుంచి శక్తివంతమైన వర్గంగా ఉన్న మలయాళం మాట్లాడే వర్గాల కోసం ఐక్య కేరళను సాధించాల్సిన సమయం ఆసన్నమైంది' అని ముఖ్యమంత్రి విజయన్‌ అన్నారు.


ఈ గది నుంచి బయటకు తెండి

కారాగారంలో ఇమ్రాన్‌ ఖాన్‌ ఆవేదన



ఇస్లామాబాద్‌: ప్రభుత్వ కానుకల అక్రమ అమ్మకం కేసులో దోషిగా తేలి జైలు ఊచలు లెక్కిస్తున్న పాక్‌ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ ఖాన్‌ తాను ఉంటున్న జైలు గదిపై తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. అటోక్‌ జైలుకొచ్చిన తన లాయర్‌తో మాట్లాడారు. ' నేనీ గదిలో ఉండలేను. బయటకు తీసుకెళ్లండి' అని ఖాన్‌ బాధపడ్డారు. కాగా, జైలు అధికారులకు, ఖాన్‌కు మధ్య రహస్య కోడ్‌ సంభాషణలు జరుగుతున్నాయన్న కథనాల నేపథ్యంలో అటోక్‌ జైలు యంత్రాంగం ఒక భద్రతా ఆడిట్‌ను చేపట్టనుంది.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
గురువారం । 10 । ఆగస్టు । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 515.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్బీసీకి 450 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



వైభవంగా కావడి మహోత్సవం

వన్‌టౌన్: శ్రీసుబ్రహ్మణ్యేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో విమాన కావడి మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. తమిళ భక్తులు పూజలు నిర్వహించారు.

జేసీ దంపతులకు అభినందనలు



చిలకలపూడి: కృష్ణా జిల్లా జేసీ అపరాజిత సింగ్, ట్రైనీ ఐపీఎస్ అధికారి దేవేంద్ర కుమార్ దంపతులను కలెక్టర్ రాజాబాబు బుధవారం అభినందించారు. వారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

న్యూస్‌రీల్

కొండాలమ్మను దర్శించుకున్న కృష్ణా జేసీ దంపతులు



గుడివాడరూరల్(గుడ్లవల్లేరు): గుడ్లవల్లేరు మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసి యున్న శ్రీకొండాలమ్మను నూతన దంపతులైన కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్, ట్రైనీ ఐపీఎస్ అధికారి దేవేంద్రకుమార్ బుధవారం సందర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన నూతన దంపతులకు వేద పండితులు, ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అమ్మవారి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. గుడివాడ ఆర్డీఓ పి.పద్మావతి, తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ మస్తాన్, డెప్యూటీ తహసీల్దార్ బి.కనకదుర్గ, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం వీరవెంకటకృష్ణమూర్తి, దేవస్థానం ఈఓ కానూరి సురేష్‌బాబు పాల్గొన్నారు.

14న అప్రెంటీస్ మేళా

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారికి పరిశ్రమల్లో అప్రెంటీస్‌కు అవకాశం కల్పించేందుకు ఈ నెల 14వ తేదీన అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి తమ కంపెనీల్లో అప్రెంటీస్ చేసుకుందుకు అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. అన్ని ట్రేడ్‌ల ఐటీఐ విద్యార్థులు మేళాలో పాల్గొనవచ్చని సూచించారు. విజయవాడ రమేష్ ఆస్పత్రి రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జరిగే మేళాకు విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు హాజరు కావాలని స్పష్టంచేశారు. వివరాలకు 0866-2475575, 83094 42698, 77804 29468 ఫోన్ నంబర్లల్లో సంప్రదించాలని కోరారు.

దక్షిణ భారత బ్యాడ్మింటన్ పోటీలకు విజయవాడ క్రీడాకారులు ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్: దక్షిణ భారత బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌నకు ప్రాతినిధ్యం వహించే ఆంధ్ర రాష్ట్ర జట్టులో విజయవాడ క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటి వారు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. జూనియర్ బాలుర విభాగంలో టి.హర్షన్, జి.దిలీప్‌కుమార్, బాలికల విభాగంలో టి.సూర్యచరిష్మ, డి.రష్మిత, సీనియర్ మహిళల విభాగంలో టి.సూర్యచరిష్మ, డి.రష్మిత, మమైఖ్య ఎంపికయ్యారు. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు తమిళనాడు కోయంబత్తూరులోని పల్లికూడమ్ క్యాంపస్‌లో జరిగే దక్షిణ భారత బాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో వారు పాల్గొంటారు. ఈ జట్లకు కోచ్‌గా వి.గంగాధరరావు, మేనేజర్‌గా డి.ధనలక్ష్మి వ్యవహరిస్తారు. రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్న క్రీడాకారులను కృష్ణా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పరసా శ్రీనివాస్ అభినందించారు.

నులిమేస్తేనే ఆరోగ్యం

- నేడు జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం
- ఎన్టీఆర్ జిల్లాలో 1,454 విద్యా సంస్థల్లో మాత్రల పంపిణీ
- 4,67,550 మందికి మాత్రలు పంపిణీ లక్ష్యం
- విద్యార్థుల హాజరు నూరుశాతం ఉండేలా చూడాలని పాఠశాలలకు ఆదేశం



ఆల్ బెండజోల్ మాత్రలను ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేస్తున్న అధికారులు

వన్‌టౌన్/లబ్బీపేట: పిల్లల్లో ఎక్కువగా నులి పురుగులు ఉంటాయి. వీటి వల్ల రక్తహీనత, నీరసం, కడుపు నొప్పి వంటి సమస్యలతో విద్యార్థులు చదువులో వెనుకబడే ప్రమాదం ఉంది. చిన్నారుల్లో నులి పురుగులను నివారించి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం ఈ నెల పదో తేదీన జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని చేపట్టింది. గురువారం అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు నులి పురుగులను నిర్మూలించే ఆల్ బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

లక్ష్యాన్ని చేరుకునేలా..

జిల్లాలో అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, బ్రిడ్జి స్కూళ్లు, ఇతర సెంటర్లలో రెండు నుంచి 19 ఏళ్ల లోపు వయసున్న 4,67,550 మందితో ఆల్ బెండజోల్ మాత్రలు మింగించేలా వైద్య ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది. గురువారం మాత్రలు వేయించుకోని వారిని గుర్తించి ఈ నెల 17వ తేదీన మాత్రలను మింగిస్తారు. గ్రామాల్లో ఇంటి వద్ద ఉండే పిల్లలతో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఈ మాత్రలు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టారు. ఏడాది నుంచి రెండేళ్ల వయస్సు చిన్నారులకు 200 ఎంజీ మాత్ర, మూడేళ్ల చిన్నారులకు 400 ఎంజీ మాత్రను నీటిలో కలిపి తాగించాలి. నాలుగేళ్ల నుంచి 19 ఏళ్ల వారు 400 ఎంజీ మాత్రను నమిలి మింగాల్సి ఉంటుంది.

మాత్రకు దూరంగా ఉండాల్సిన వారు

పూర్తిగా అనారోగ్యంతో ఉన్న వారు కోలుకున్న తరువాతనే ఆల్ బెండజోల్ మాత్ర వేసుకోవాలి. ఏడాది లోపు వయసు పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కాలేయ వ్యాధిగ్రస్తులు, ఉదర సంబంధ క్యాన్సర్ ఉన్న వారు, పుట్టుకతో గుండె సంబంధిత వ్యాధులు ఉన్న వారు ఈ మాత్రలు వేసుకోకూడదు.

ఐరన్ టాబ్లెట్ల పంపిణీ తేదీ మార్పు

ఈ నెల పదో తేదీన భోజనం తరువాత విద్యార్థులకు అందించే ఫోలిక్ యాసిడ్ (ఐరన్) సప్లిమెంటేషన్ టాబ్లెట్‌ను పదకొండో తేదీకి మార్పు చేయాలని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక పాఠశాలల ఉపాధ్యాయులను ఆదేశించారు. నులిపురుగుల నివారణ మందు పంపిణీని పురస్కరించుకొని విద్యార్థుల హాజరు వంద శాతం ఉండేలా చూడాలని పాఠశాలలకు ఉత్తర్వులు జారీ చేశారు.

నులి పురుగులతో నష్టాలు ఇలా..

- నులి పురుగులు ఉన్న చిన్నారుల్లో ఎదుగుదల లోపం తలెత్తుతుంది.
- నులి పురుగులు పిల్లలకు రాత్రి వేళ నిద్రలేకుండా చేస్తాయి. దీంతో నీరస పడిపోతుంటారు.
- ఏకాగ్రత లోపించడంతో చదువుపై దృష్టి పెట్టలేక పోతుంటారు.
- తరచూ మూత్ర విసర్జనకు వెళ్తుంటారు.
- ఇంట్లో ఒకరికి ఉంటే, మిగిలిన వారికి వచ్చే అవకాశం ఉంది.
- కొందరు చిన్నారుల్లో కడుపునొప్పి కూడా వస్తుంది.

విజయవంతం చేయాలి



నులిపురుగుల నివారణ మందుల పంపిణీలో ప్రైవేట్ విద్యాసంస్థలు కచ్చితంగా భాగస్వాములు కావాలి. తల్లిదండ్రులకు నచ్చజెప్పి పిల్లలకు మందుల పంపిణీ జరిగేలా కృషిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు, ప్రధానోపాధ్యాయులు పూర్తిస్థాయిలో పాల్గొనాలి.

– సి.వి.రేణుక, డీఈఓ, ఎన్టీఆర్ జిల్లా

సర్వం సిద్ధం



జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఆల్ బెండజోల్ మాత్రల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే మందులను అంగన్‌వాడీలకు, ఏఎన్ఎంలకు చేరవేశాం. గురువారం పాఠశాలలకు రాని పిల్లలకు ఈ నెల 17వ తేదీన మాత్రలు ఇస్తాం. ఈ మాత్రలు తీసుకుంటే నులిపురుగులు నశించి పిల్లలు ఉత్సాహంగా ఉంటారు.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్ఓ, ఎన్టీఆర్‌జిల్లా

పేద యువతులకు కల్యాణ కానుక

- కల్యాణమస్తు, షాదీ తోఫాతో ఆర్థిక సాయం
- జిల్లాలో 611 మందికి రూ.4.95 కోట్లు మంజూరు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



కల్యాణమస్తు, షాదీ తోఫా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాల్య వివాహాల నివారణ, ఆడపిల్లలను చదువుకునేలా ప్రోత్సహించడంతోపాటు పేద యువతుల తల్లిదండ్రులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా ద్వారా ఆర్థిక సాయం చేస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల కింద ఏప్రిల్ – జూన్ త్రై మాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి బటన్ నొక్కి ఆర్థిక సాయం జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఢిల్లీరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 611 మంది లబ్ధిదారులకు రూ.4.95 కోట్ల ఆర్థిక సాయం చెక్కును కలెక్టర్ అందజేసి ప్రసంగించారు. పేద తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమ ఆడపిల్లల చదువులను అర్ధాంతరంగా నిలిపివేసి బాల్యవివాహాలు జరిపించకుండా నివారించేందుకు కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఇటువంటి పథకాలు అమలులో లేవన్నారు. పేద కుటుంబాల్లోని ఆడపిల్లలు చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. వారి కాళ్ల మీద వారు నిలబడేలా తీర్చిదిద్దిన తరువాతే వివాహం చేయాలన్నారు. ఇందుకు వైఎస్సార్ కల్యాణ్యమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలు దోహదపడతాయన్నారు. జిల్లాలో మూడు విడతల్లో 1,141 మంది వధూవరులకు రూ.9.42 కోట్ల ఆర్థిక సాయాన్ని జమ చేశామన్నారు. లబ్ధిదారుల్లో బీసీలు 490 మంది, మైనార్టీలు 115 మంది, ఎస్సీలు 454 మంది, ఎస్టీలు 68 మంది, విభిన్న ప్రతిభావంతులు 12 మంది, భవన నిర్మాణ కార్మికులు రెండు జంటలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన వంటి పథకాలను అమలు చేస్తూ పేద విద్యార్థులను ఎంతగానో ప్రోత్సహిస్తోందన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం.విజయభారతి మాట్లాడుతూ.. గ్రామ/వార్డు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశామన్నారు. ప్రతి మూడు నెలలకోసారి లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. అర్హులు తమ పిల్లల వివాహం జరిగిన 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పేద తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమ పిల్లలకు వివాహాలు చేయలేక సతమతమవుతున్న తరుణంలో వైఎస్సార్ కల్యాణ మస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక చేయూత అందిస్తున్నారని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని, డ్రాపవుట్స్, బాల్య వివాహాలు తగ్గాయని వివరించారు. వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు బండి పుణ్యశీల, తోలేటి శ్రీకాంత్, మనోజ్ కొఠారి, కె.గీతాంజలీదేవి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ, గౌస్ మొహిద్దీన్, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేవుడిలా ఆదుకున్నారు



ఆడపిల్లలకు పెళ్లి చేయడం తలకు మించిన భారంగా మారింది. అప్పు చేసి పెళ్లి చేయాల్సి వస్తోంది. మా పాప జోత్స్నకు జూన్‌లో వివాహం చేశాం. ప్రభుత్వం వైఎస్సార్ కల్యాణ మస్తు పథకం గురించి విని, దరఖాస్తు చేశాను. ప్రభుత్వం రూ.లక్ష మంజూరు చేసింది. ఎంతో సంతోషంగా ఉంది. సీఎం వైఎస్ జగన్ దేవుడిలా ఆదుకున్నారు.

– కాశమ్మ, క్రీస్తురాజుపురం, విజయవాడ

దేశంకోసం పునరంకితమవుదాం



విశ్రాంత సైనికుడు కోటయ్య కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు



నా భూమి - నా దేశం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, అధికారులు

నా భూమి – నా దేశంలో కలెక్టర్ ఢిల్లీరావు

ఇబ్రహీంపట్నం(మైలవరం): నా భూమి – నా దేశం (మేరీ మాటీ – మేరా దేశ్) కార్యక్రమంలో భాగంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులు, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుని దేశం కోసం పునరంకితం అవుదామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని గుంటుపల్లి జెడ్పీ పాఠశాలలో బుధవారం జరిగిన ఆజాదీకా అమృత్ మహోత్సవ్ జిల్లాస్థాయి ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత సైనికుడు వెనుకొండ కోటయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించి, నా భూమి – నా దేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సెల్ఫీ ఫొటోలు తీసుకుని విద్యార్థులు, అధికారులతో ప్రతిజ్ఞచేశారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గతేడాది హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టి ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగురవేశామని, అమృత్ సరోవర్‌తో గ్రామాల్లో చెరువు గట్ల అభివృద్ధి, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించామని గుర్తుచేశారు. ఈ ఏడాది నా భూమి – నా దేశం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య దేశంలో ఎందరో మహనీయుల త్యాగఫలాలను మనం అనుభవిస్తామని పేర్కొన్నారు. 1942 ఆగస్టు 9న బ్రిటీష్ వారిని తరిమికొట్టిన క్విట్ ఇండియా దినంగా పరిగణిస్తున్నామని తెలిపారు. అనంతరం విశ్రాంత సైనికుడు వెనుకొండ కోటయ్య కుటుంబ సభ్యులను సత్కరించి మొక్కలు నాటారు. డ్వామా పీడీ సునీత, డీఈఓ రేణుక, డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, ఎంపీపీ పాలడుగు జోత్స్న, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, సర్పంచి భుక్యా కవిత, ఎంఈఓ పుష్పలత, పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు పాల్గొన్నారు.

వందేభారత్ రైలులో పొగలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20702) రైలులో బుధవారం పొగలు వ్యాపించడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. బుధవారం తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో ఒక ప్రయాణికుడు తిరుపతిలో రైలు ఎక్కాడు. రైలు గూడూరు దాటాక ఆ ప్రయాణికుడు సీ–13 కోచ్‌లోని టాయిలెట్‌లోకి వెళ్లి పొగ తాగుతుండగా టాయిలెట్ లోపల ఉన్న ఏరోసోల్ ఫైర్ వ్యవస్థ స్పందించి పొగతో కూడిన పౌడర్‌ను విడుదల చేసింది. ఫలితంగా రైలులో పొగలు వ్యాపించడంతో ప్రయాణికులు భయపడ్డారు. ఎమర్జెన్సీ టాక్ బ్యాక్ యూనిట్ (ఈటీబీయూ) ద్వారా గార్డ్‌కు సమాచారం అందడంతో రైలును మనుబోలు వద్ద నిలిపివేశారు. ఆన్ డ్యూటీ ఆర్పీఎఫ్ సిబ్బంది అగ్నిమాపక యంత్రాలతో ప్రమాదం జరిగిన కోచ్ వద్దకు చేరుకుని ప్రయాణికుల సాయంతో టాయిలెట్ అద్దాలను పగులకొట్టి పొగలో చిక్కుకున్న ప్రయాణికుడిని రక్షించారు. దీంతో రైలు మనుబోలు వద్ద సాయంత్రం 4.46 నుంచి 5.10 గంటల వరకు నిలిచిపోయింది.



- బెదురులంక 2012 చిత్ర బృందం బుధవారం విజయవాడలో సందడి చేసింది. హీరో కార్తికేయ, హీరోయిన్ నేహాశెట్టి మాట్లాడుతూ.. పూర్తి పల్లెటూరి వాతావరణంలో నిర్మించిన తమ సినిమా ప్రేక్షకులను అలరిస్తుందన్నారు.

8లో

శాంతిభద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యం

కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ జాషువా

ఉయ్యూరు(పెనమలూరు): శాంతిభద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యమని కృష్ణా జిల్లా ఎస్పీ పి.జాషువా అన్నారు. ఉయ్యూరు పట్టణ, రూరల్ పోలీసుస్టేషన్లను బుధవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పోలీసు స్టేషన్ల రికార్డులను పరిశీలించారు. కేసుల నమోదు, దర్యాప్తు వివరాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తుపై తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ జాషువా విలేకరులతో మాట్లాడారు. శాంతిభద్రతలను పరిరక్షిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తామన్నారు. ప్రతి ఎస్‌హెచ్ఓ ఐదు గంటల సమయం పోలీస్ స్టేషన్‌లోనే ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. రోజూ మూడు గంటలపాటు విధిగా గస్తీ నిర్వహించాలన్నారు. ఉయ్యూరు టౌన్, రూరల్ పోలీసుస్టేషన్లలో రికార్డుల నిర్వహణ బాగుందని మెచ్చుకున్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి తీసుకునే చర్యలు అభినందనీయమన్నారు. భార్యాభర్తల కేసుల విషయంలో కౌన్సెలింగ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉయ్యూరులో ట్రాఫిక్ సిబ్బంది నియామకాన్ని పరిశీలిస్తామన్నారు. డీఎస్పీ జయసూర్య, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు వీరప్రసాద్, అవినాష్ పాల్గొన్నారు.

బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణపై సదస్సు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బయో మెడికల్ వ్యర్థాల వర్గీకరణ, శాస్త్రీయ పద్ధతిలో వాటిని నిర్వీర్యం చేసే అంశాలపై బుధవారం గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో అవగాహన సదస్సు జరిగింది. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ఐఎంఏ, ఆప్నా, సేఫ్ ఎన్విరాన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో పలు ఆస్పత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సులో ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి. శ్రీనివాసరావు, ఆప్నా అధ్యక్షుడు డాక్టర్ హనుమయ్య, జాయింట్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాసరావు, ఐఎంఏ నగరశాఖ అధ్యక్షుడు ఎంఏ రెహమాన్, సేఫ్ ఎన్విరాన్ ప్రతినిధి వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కృష్ణా జేసీ దంపతులకు శుభాకాంక్షలు



కోనేరుసెంటర్‌: వివాహ బంధంతో ఒక్కటైన కృష్ణా జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ డాక్టర్‌ అపరాజితాసింగ్‌, ట్రైనీ ఐపీఎస్‌ అధికారి దేవేంద్రకుమార్‌ దంపతులకు జిల్లా ఎస్పీ పి. జాషువా దంపతులు బుధవారం శుభాకాంక్షలను తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో అపరాజితాసింగ్‌, దేవేంద్రకుమార్‌లు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలవగా ఎస్పీ దంపతులు నూతన దంపతులను పుష్పగుచ్ఛంతో అభినందించి ఆశీర్వదించారు.

మొక్కలు నాటిన కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్‌: వడ్డేశ్వరం కేఎల్‌ విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు, ఫార్మసీ విద్యార్థులు గుండిమెడ గ్రామంలో నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగామ్‌ అధికారి ప్రొఫెసర్‌ శ్రీకాంత్‌ రెడ్డి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆదేశాల మేరకు కేఎల్‌ యూనివర్సిటీ ఆధ్వర్యంలో గుండిమెడ గ్రామంలో మొక్కలు నాటామని తెలిపారు. అనంతరం విద్యార్థులందరూ ప్రతిజ్ఞ చేశారు.

మహిళలను గౌరవించాలి

వీసీ జ్ఞానమణి

కోనేరుసెంటర్‌: పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం అనే అంశంపై కృష్ణా విశ్వవిద్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఉప కులపతి జ్ఞానమణి అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలపై వేధింపులకు పాల్పడే వారిని శిక్షించేందుకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై మహిళలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని వివరించారు. మార్పు ట్రస్ట్‌ సభ్యురాలు సూయజ్‌ రావూరి, ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ వైకే సుందరకృష్ణా, ప్రొఫెసర్‌ ఎన్‌. ఉష, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆదివాసీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): గిరిజనులు, ఆదివాసీల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని సెంట్రల్‌ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఆయా వర్గాల ఆర్థిక, రాజకీయ, సామాజికాభివృద్ధి కోసం సీఎం వైఎస్‌ జగన్‌ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. బుధవారం లెనిన్‌ సెంటర్‌లోని అంబేడ్కర్‌ భవన్‌లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ జిల్లా స్థాయి వేడుకలు జరిగాయి. విద్యార్థులు చేసిన గిరిజన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న మల్లాది విష్ణు మాట్లాడుతూ 2014, 2019 సార్వత్రిక ఎన్నికలలో ఎస్టీలు ఏడుగురు ఎమ్మెల్యేలు, ఒకరు పార్లమెంట్‌ సభ్యులుగా ఎన్నికయ్యారన్నారు. దీంతో గిరిజనుల సమస్యలు చట్టసభల్లో చర్చించి పరిష్కరించే అవకాశం లభించిందన్నారు. ఎ.కొండూరు మండల పరిధిలోని గిరిజన తండాలలో కిడ్నీ బాధితుల సమస్యను గతంలో ఏ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తండాలలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారికి ప్రత్యేకంగా డయాలసిస్‌ కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. కృష్ణా జలాలను తండాలకు తరలించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని 145 మంది నక్కల తెగకు చెందిన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్నామన్నారు.



గిరిజన లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, జేసీ సంపత్‌కుమార్‌

హక్కులపై అవగాహన అవసరం..

జేసీ డాక్టర్‌ పి. సంపత్‌ కుమార్‌ మాట్లాడుతూ జిల్లాలో ఎరుకుల, యానాదులు, చెంచులు నక్కల తదితర తెగలకు చెందిన వారికి జగనన్న కాలనీలలో పట్టాలు మంజూరు చేశామన్నారు. గిరిజన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం జి. కొండూరు మండలం చెరువు మాధవరం, కవులూరు గ్రామాలకు చెందిన గిరిజన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి రుణ సహాయం కింద రూ. 13.87లక్షలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నగర మేయర్‌ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీ శైలజారెడ్డి, జైన్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ మనోజ్‌ కొఠారి, విశ్వబ్రహ్మణ కార్పొరేషన్‌ చైర్మన్‌ టి. శ్రీకాంత్‌, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎం. రుక్మాంగదయ్య, స్థానిక కార్పొరేటర్‌ బంకా శంకుతల పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌కు నో ఎంట్రీ

కట్టుదిట్టంగా అమలు చేయాలని దుర్గగుడి ఈవో ఆదేశం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో సెల్‌ఫోన్‌ నిషేధాన్ని మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆలయ ఈవో భ్రమరాంబ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆలయంలోకి సెల్‌ఫోన్లు నిషేధం ఉన్నప్పటికీ సిఫార్సుల పేరిట విచ్చేసే వారితో పాటు సెక్యూరిటీ సిబ్బంది కళ్లుకప్పి సెల్‌ఫోన్‌తో ఆలయానికి వస్తున్న కొంత మంది భక్తులు అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఆర్జిత సేవలను వీడియో తీయడం ఇటీవల అధికమైంది. తాజాగా రెండు రోజుల కిందట సాయంత్రం వేళ అమ్మవారికి పంచహారతుల సేవ జరుగుతుండగా, ఓ భక్తుడు సేవను వీడియో తీయడం ఆలయ ఎస్‌పీఎఫ్‌ సిబ్బంది గమనించారు. దీంతో భక్తుడిని అదుపులోకి తీసుకున్న ఆలయ అధికారులు, ఎస్పీఎఫ్‌ సిబ్బంది సెల్‌ఫోన్‌లోని వీడియోను తొలగించారు. ఇటువంటి ఘటనలు తరచూ పునరావృతం అవుతుండటంతో సెల్‌ఫోన్‌తో ఆలయంలోకి నిషేధాన్ని మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆలయ ఈవో అధికారులను ఆదేశించారు.

సామాన్య భక్తులకేనా రూల్స్‌!

ఇంద్రకీలాద్రికి విచ్చేసే సామాన్య భక్తులు సర్వదర్శనం క్యూలైన్‌ ద్వారా అమ్మవారిని దర్శించుకుంటారు. క్యూలైన్‌లోకి ప్రవేశించే ముందుగానే భక్తులను సెక్యూరిటీ సిబ్బందితో పాటు సెల్‌ఫోన్‌ కౌంటర్‌ నిర్వహణ కాంట్రాక్టర్‌ సిబ్బంది తనిఖీ చేసిన తర్వాతే లోపలకు అనుమతిస్తారు. కొండ దిగువన మహా మండపం, ఓం టర్నింగ్‌ క్యూలైన్ల వద్ద ఇదే పరిస్థితి.. అయితే వీఐపీలు, సిఫార్సులపై వచ్చే వారు మాత్రం నేరుగా సమాచార కేంద్రానికి వెళ్లి అక్కడ నుంచి దర్శనానికి వెళ్తుంటారు. ఇలా వచ్చే వారికి ఎటువంటి తనిఖీలు ఉండవు. అంతే కాకుండా కొండపై సమాచార కేంద్రానికి చేరుకున్న తర్వాత వారు సెల్‌ఫోన్‌తోనే నేరుగా ఆలయంలోకి చేరుకోవడం ఇటీవల పరిపాటి అయింది.



తరచూ గొడవలే...

సెల్‌ఫోన్లను కౌంటర్‌లో భద్రపరుచుకున్న భక్తులు అమ్మవారి దర్శనం తర్వాత రాజగోపురం వద్ద వచ్చే సరికి అక్కడ అందరూ సెల్‌ఫోన్లతో ఫొటోలు దిగుతూ కనిపించడంతో భక్తులకు, అధికారులకు తరచూ గొడవలు జరుగుతున్నాయి. సామాన్యులకు ఒక రూల్‌, వీఐపీలకు ఒక రూల్‌ ఇదేక్కడి న్యాయం అంటూ అధికారులను నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు. అయితే ఇకపై అలా జరగకుండా సమాచార కేంద్రం, ప్రోటోకాల్‌ ఆఫీసు వద్ద సెల్‌ఫోన్లు భద్రపరుచేలా ప్రత్యేకంగా ఒక కౌంటర్‌ను ఏర్పాటు చర్యలు తీసుకోవాలని ఈవో భ్రమరాంబ ఏఈవో, సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేశారు.

జరిమానా కూడా..

ఆలయ ప్రాంగణంలో సెల్‌ఫోన్‌ వినియోగించే భక్తులకు జరిమానా విధించే ఆలోచనలో దేవస్థానం ఉంది. ఈమేరకు ఆలయంలో సెక్యూరిటీ బాధ్యతలు నిర్వహిస్తున్న ఏజెన్సీతో పాటు పోలీసు, హోంగార్డు సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. దేవస్థాన మైక్‌లో సైతం ప్రచారం చేస్తూ భక్తులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ దఫా ఆలయంలో సెల్‌ఫోన్‌ వినియోగించే వారిపై తప్పక చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు.

బకాయిలు ఇప్పించాలని వినతి



సీపీ టి.కె. రాణాకు వినతిపత్రం అందిస్తున్న శంకరరావు తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): సత్యసాయి జిల్లా ధర్మవరం చేనేత వ్యాపారులకు నగరంలోని ఆలయసిల్క్‌ వారి నుంచి రావాల్సిన బకాయిలు ఇప్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పోలీస్‌ కమిషనర్‌ టి.కె. రాణాను కోరారు. ఈమేరకు ఆయనను కమిషనరేట్‌లో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బకాయికోసం వస్తే తమపై జరిగిన దాడి విషయాన్ని ధర్మవరం వ్యాపారులు ఆయనకు వివరించారు. దుర్మార్గంగా తమపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు, న్యాయబద్ధంగా రావాల్సిన బకాయిలు ఇప్పించాలని వారు సీపీ కోరారు. సీపీని కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం ఎన్టీఆర్‌జిల్లా అధ్యక్షుడు షేక్‌ ముస్తాఫా, గుంటూరు జిల్లా అధ్యక్షుడు సారేపట్టి మహేష్‌లతో పాటు ధర్మవరం చేనేత వ్యాపారస్తుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆటో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

మైలవరం: ఆటో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌ బుధవారం తెలిపారు. మైలవరం డివిజన్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ ఆఫ్‌ పోలీస్‌ మారగాని రమేష్‌ నేతృత్వంలో స్థానిక సీఐ డీకేఎన్‌ మోహన రెడ్డి పర్యవేక్షణలో సర్కిల్‌ ఐడీ పార్టీ సిబ్బందితో కలిసి మైలవరం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుల కోసం నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిందితుల కోసం గాలిస్తుండగా..

మైలవరం గ్రామం విజయవాడ రోడ్‌లోని ఎల్‌బీఆర్‌సీఈ వై జంక్షన్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో విజయావాడలోని నున్న గ్రామానికి చెందిన జునుపూడి కల్యాణ్‌ ఆటోను దొంగిలించి అదే ఆటోలో వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘బెదురులంక-2012’ ఆకట్టుకుంటుంది



లబ్బీపేట(విజయవాడతూర్పు): గ్రామీణ వాతావరణంలో చిత్రీకరించిన బెదురులంక-2012 చిత్రం అందరినీ అలరిస్తుందని ఆ సినిమా హీరో కార్తికేయ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న విడుదల కానున్న బెదురులంక 2012 చిత్రం ప్రమోషన్‌లో భాగంగా నగరానికి విచ్చేసినట్లు తెలిపారు. ఈ సినిమా కొత్త తరహాలో ఉంటుందన్నారు. 2012లో యుగాంతం అయిపోతుందని అందరూ అనుకున్నారని, ఈ నేపథ్యంలోనే ఒక మారుమూల పల్లెటూరులో జరిగిన సందర్భాన్ని చిత్ర రూపంలో తీశామన్నారు. విజయవాడలోనే పుట్టి పెరిగానని, దుర్గమ్మవారి ఆశీస్సులు తనకు ఎల్లప్పుడూ ఉంటాయని ఆకాంక్షించారు. హీరోయిన్‌ నేహాశెట్టి మాట్లాడుతూ బెదురులంక చిత్రంలో కొత్త తరహాలో అచ్చమైన పల్లెటూరి అమ్మాయిలా కనిపిస్తానని, డీజేటిల్లులో క్యారెక్టర్‌కి దీనికి పోలికే ఉండదన్నారు. కార్యక్రమంలో చిత్రయూనిట్‌ సభ్యులు పాల్గొన్నారు.

వాణిజ్య బ్యాంకులకు దీటుగా కేడీసీసీబీ

బ్యాంకు చైర్‌పర్సన్‌ తాతినేని పద్మావతి

చిలకలపూడి(మచిలీపట్నం): వాణిజ్య బ్యాంకులకు దీటుగా కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌ సేవలు అందిస్తోందని బ్యాంక్‌ చైర్‌పర్సన్‌ తాతినేని పద్మావతి అన్నారు. బ్యాంక్‌ ప్రధాన కార్యాలయంలో బుధవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె సమావేశ వివరాలను విలేకరులకు వివరించారు. చైర్‌పర్సన్‌ మాట్లాడుతూ 425 పీఏసీఎస్‌లు, 57 బ్రాంచ్‌ల ద్వారా రైతులకు, ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తూ 2023 ఆర్థిక సంవత్సరానికి రూ. 10,120కోట్ల టర్నోవర్‌ను బ్యాంకు సాధించిందన్నారు. దీంతో దేశంలోనే అతి పెద్ద ఐదో సహకార బ్యాంక్‌గా నిలిచిందన్నారు.

- పాలకవర్గ సమావేశంలో స్వయం సహాయక సంఘాల్లో సభ్యులకు మరింత సేవలు అందించాలనే ఉద్దేశంతో బంగారు రుణాలపై గతంలో 9 శాతం వడ్డీ చెల్లించేవారని దీనిని 7 శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు.
- జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం చేసుకునే లబ్ధిదారుల్లో స్వయం సహాయక సభ్యులకు రూ. 35 వేల వరకు రుణాన్ని అందిస్తున్నామన్నారు. అయితే ప్రస్తుతం 70 నుంచి 80 శాతం పూర్తయిన ఇంటి నిర్మాణాలకు రూ. 2 లక్షల వరకు రుణం మంజూరు చేసేలా నిర్ణయం తీసుకున్నామన్నారు.
- ఆస్తి తనఖా పెట్టుకుని రుణం మంజూరు చేస్తే ఆ ఆస్తికి సంబంధించి ప్రాపర్టీ లయబులిటీ ఇన్సూరెన్స్‌ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చైర్‌పర్సన్‌ తెలిపారు.



మాట్లాడుతున్న బ్యాంక్‌ చైర్‌పర్సన్‌ తాతినేని పద్మావతి

సమావేశంలో పాలకవర్గ సభ్యులు కొమ్మినేని రవిశంకర్‌, గడిదేశి పెదవెంకయ్య, పడమట సుజాత, భూక్యా రాణి, తలుపుల వెంకటకృష్ణారావు, ఆప్కాబ్‌ జీఎం సీపీఎస్‌ మణి, సీఈవో ఎ శ్యామ్‌మనోహర్‌, జీఎం చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలే లక్ష్యం

వైద్యాధికారులకు డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ సుహాసిని ఆదేశం

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమంలో ప్రతిరోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎన్టీఆర్‌ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్‌ మాచర్ల సుహాసిని ఆదేశించారు. ఆమె బుధవారం జిల్లాలోని ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ పరిధిలోని మూలపాడు–2 హెల్త్‌ అండ్‌ వెల్నెస్‌ సెంటర్‌లో జరుగుతున్న కుటుంబ డాక్టర్‌ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీడీ–సీడీ, ఈ–ఆశ యాప్‌ పనితీరు, రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్‌ మసూద్‌ అహ్మద్‌, సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మూలపాడు హెల్త్‌ అండ్‌ వెల్నెస్‌ సెంటర్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ

పాఠశాలల తనిఖీ..

జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించనున్న డీవార్మింగ్‌ కార్యక్రమంలో భాగంగా బుధవారం పలు పాఠశాలలను సందర్శించారు. అందులో భాగంగా విజయవాడ బెంజిసర్కిల్‌లోని నలంద విద్యానికేతన్‌కు వెళ్లి, పిల్లలందరూ ఆల్‌బెండాజోల్‌మాత్రలు వేసుకునేలా చూడాలన్నారు. ఆ మాత్రలు వేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్‌ మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి వృద్ధురాలిపై దాడి.. బంగారపు గాజులు చోరీ

చిట్టినగర్‌(విజయవాడపశ్చిమ): ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిపై దాడి చేసి బంగారపు గాజులను చోరీకి పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం ప్రకారం.. కొత్తూరు తాడేపల్లిలోని జెడ్పీ హైస్కూల్‌ ప్రాంతంలో దేవినేని సరోజిని(80) ఒంటరిగా నివాసం ఉంటుండగా, సరోజిని కుమారులు ప్రసాదంపాడులో నివాసం ఉంటారు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఉన్న సరోజని వద్దకు ఓ యువకుడు వచ్చి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఇంట్లో ఉన్న స్టూల్‌ను నేలకేసి కొట్టి సరోజిని వద్ద ఉన్న 8 గాజులను బలవంతంగా లాక్కెళ్లాడు. దీంతో భయాందోళనలకు గురైన సరోజిని కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కొత్తపేట పోలీసులు సరోజిని నుంచి నిందితుడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉండే ఓ ఇద్దరు వ్యక్తులపై అనుమానం వ్యక్తం చేయడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితురాలు ముందుకు రానట్లు తెలుస్తోంది.

అనుమానాస్పద స్థితిలో అకౌంటెంట్‌ మృతి

మధురానగర్‌(విజయవాడసెంట్రల్‌): ఏజీ కార్యాలయంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న పి. ఆనందకృపా (36) గుణదల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో అనుమానాస్పదంగా మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పి. ఆనందకృపాకు మూగ చెవుడు ఉంది. దివ్యాంగుల కోటాలోనే ఉద్యోగం సాధించారు. అయితే ఆయనకు వివాహం కూడా కాకపోవటంతో ఎప్పుడూ ఒంటరిగా బాధపడుతూ ఉండేవారు. ఎవరితోనూ కలిసేవారు కాదు. మంగళవారం రాత్రి 9.50 గంటలకు గుణదల ఈఎస్‌ఐ బస్టాప్‌లో ఆనందకృపా అపస్మారక స్థితిలో పడి ఉన్నారంటూ ఆనందకృపా వదిన సుజాత్‌కు స్థానికులు ఫోన్‌ వచ్చింది. దీంతో ఆమె హుటాహుటిన ఈఎస్‌ఐ బస్టాప్‌కు చేరుకోగా అప్పటికే పోలీసులు 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీంతో ఆమె ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి విచారించగా అప్పటికే ఆనందకృపా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో సుజాత ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బుధవారం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

దాతల సహకారంతో మౌలిక వసతులు

- స్వాతి బలరాం సహకారం స్ఫూర్తిదాయకం
- జిల్లా కలెక్టర్‌ ఢిల్లీరావు

గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): జిల్లాలో సంక్షేమ వసతి గృహాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, దాతల సహకారంతో మరిన్ని మౌలిక వసతుల ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎన్టీఆర్‌ జిల్లా కలెక్టర్‌ ఎస్‌.ఢిల్లీరావు పేర్కొన్నారు. బుధవారం భవానీపురంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో దాత వేమూరి (స్వాతి) బలరాం ఆర్థిక సహకారంతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను కలెక్టర్‌ పరిశీలించారు. వసతి గృహం అభివృద్ధికి సహకరించిన దాతలను సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ మాట్లాడుతూ స్వాతి బలరాం అందించిన సహకారం స్ఫూర్తిదాయకమన్నారు. గతంలో నిర్మించిన భవానీపురం సాంఘిక సంక్షేమ వసతి గృహం మరమ్మతులకు నోచుకోక విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. మరమ్మతులు చేపట్టేందుకు అంచనాలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్‌ అధికారులను ఆదేశించామన్నారు. స్వాతి ఎడిటర్‌ వేమూరి బలరాం ఒక కార్యక్రమంలో కలిసినపుడు రూ.లక్ష కలెక్టర్‌ ప్రత్యేక నిధికి విరాళం ప్రకటించారన్నారు. వేమూరి బలరాం అందించిన నిధులతో వసతి గృహం మరమ్మతుల పనులను ప్రారంభించినట్లు చెప్పారు. మరింత మంది దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్వాతి బలరాం మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి ఢిల్లీరావు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఆయనకు తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో రూ.లక్ష విరాళం ఇచ్చానని, హాస్టల్‌ అభివృద్ధికి మరో రూ.లక్ష విరాళం ప్రకటించారన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి బి.విజయభారతి, ఈఈ అనిల్‌కుమార్‌, డీఈ ఎస్‌.రాయన్న, సహాయ సంక్షేమ అధికారి యూవీ కోటేశ్వరరావు, వసతి గృహ సంక్షేమ అధికారిణి టి.ఆదిలక్ష్మి, వేమూరి బలరాం కుటుంబ సభ్యులు రావులపల్లి ఝాన్సి, తుమ్మల వెంకటరత్నం, సిబ్బంది కందుల మాధవి, నిమ్మగడ్డ కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



బలరాంను సత్కరిస్తున్న కలెక్టర్‌ ఢిల్లీరావు

బ్యాడ్మింటన్‌లో సత్తా చాటిన చరిష్మా

లబ్బీపేట(విజయవాడతూర్పు): తిరుపతిలో జూలై 28 నుంచి 31 వరకూ జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్‌ బ్యాడ్మింటన్‌ చాంపియన్‌ షిప్‌లో అండర్‌–19 విభాగంలో నగరానికి చెందిన టి. సూర్య చరిష్మా సత్తా చాటింది. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో ఇంటర్మీడియెట్‌ ద్వితీయ సంవత్సరం చదువుతున్న చరిష్మా ఆ పోటీల్లో అండర్‌–19 సింగిల్స్‌, డబుల్స్‌లో విన్నర్‌గా నిలిచింది. అంతేకాక ఈ నెల 3 నుంచి 6 వరకూ వైఎస్సార్‌ కడప జిల్లాలో జరిగిన ఏపీ స్టేట్‌ సీనియర్‌ బ్యాడ్మింటర్‌ పోటీల్లో ఉమెన్‌ సింగిల్స్‌లో రన్నర్‌గా, డబుల్స్‌లో విన్నర్‌గా నిలిచి సత్తా చాటింది. దీంతో ఈ నెల 11 నుంచి 14 వరకూ కొయంబత్తూర్‌లో జరిగే సౌత్‌జోన్‌ అండర్‌–19 పోటీలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎస్‌. పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా ఆ పోటీల్లో కూడా విజేతగా నిలివాలని ఆకాంక్షిస్తూ ప్రిన్సిపాల్‌ పద్మజతో పాటు, సిద్ధార్థ అకాడమీ సెక్రటరీ పి. లక్ష్మణరావు, కన్వీనర్‌ ఎన్‌. లలిత ప్రసాద్‌, డైరెక్టర్‌ టి. విజయలక్ష్మి అభినందనలు తెలిపారు.



చరిష్మాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌ పద్మజ, డైరెక్టర్‌ విజయలక్ష్మి

స్వచ్ఛ ఓటర్ల జాబితాకు సహకరించండి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్‌ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారు చేసేందుకు సహకరించాలని కలెక్టర్‌ పి.రాజాబాబు రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. బుధవారం సాయంత్రం కలెక్టర్‌ చాంబర్‌లో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ఈ నెల 21వ తేదీ వరకు జరుగుతుందన్నారు. బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఓటర్ల జాబితాలో పోలింగ్‌ కేంద్రాల వారీగా కొత్తగా నమోదైన వారు, చేర్పులు, మార్పులు, తొలగింపుల జాబితా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఇచ్చామని తెలిపారు. అనవసరమైన ఫిర్యాదులు రాకుండా ఉండాలనే ఉద్దేశంతో జాబితాలను పారదర్శకంగా అందరికీ పంపిణీ చేశామన్నారు. జాబితాను పరిశీలించి, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై అభిప్రాయాలు, సలహాలు, సూచనలు కూడా తెలపాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడతూ బీఎల్‌వోలు ఓటర్లు ఉన్న సమయంలో రావటం లేదని కలెక్టర్‌ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా కూలీలు ఉదయమే పనులకు వెళ్లి సాయంత్రం ఇళ్లకు చేరుకుంటారని, అటువంటి వారిని ఆ సమయంలో పరిశీలన జరపాలన్నారు. పలు సూచనలు చేశారు. దీనిపై కలెక్టర్‌ స్పందిస్తూ ఓటర్లు ఇంటి వద్ద ఉండే సమయం చూసుకొని అప్పుడే జాబితా పరిశీలన చేస్తారని స్పష్టం చేశారు. వలస వెళ్లిన, మృతి చెందిన ఓటర్లను ప్రత్యేకంగా గుర్తించి బూత్‌ స్థాయి ఏజెంట్ల సమక్షంలో పంచనామా చేసి ధ్రువీకరించి వాటిని జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, మచిలీపట్నం మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ షేక్‌ సలార్‌దాదా, కె. చంద్రశేఖర్‌, కొడాలి శర్మ, వంపుగడవల చౌదరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

త్రిశక్తి పీఠంలో హుండీ కానుకల లెక్కింపు



కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని కాళీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తి పీఠం)లో అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలు బుధవారం లెక్కించారు. ఏప్రిల్ 13 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు 119 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.7,43,265 ఆదాయం లభించింది. ఈవో పి.లోకేశ్వరీ పర్యవేక్షణలో ఆలయ సూపరింటెండెంట్ మధుసూదనరావు ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో కమిటీ సభ్యులు 12 హుండీలను తెరిచి కానుకలు లెక్కించారు. ఆలయ పాలకవర్గ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గొల్లపూడి పుల్లయ్య, కార్యదర్శి కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు బి.హెచ్.విజయకిరణ్, కమిటీ సభ్యులు జి.సత్యనారాయణ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు సహకరించండి

పటమట(విజయవాడతూర్పు):ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో గత నెల 21 నుంచి ఈ నెల 21 వరకు ఇంటింటికీ ఓటరు సర్వే జరుగుతుందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విజయవాడ నగర నగరవాసులు ఇంటింటి వచ్చిన బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్‌వో) లకు తమ కుటుంబ సభ్యుల వివరాలు అందించి సహకరించాలని కోరారు. కుటంబంలో 18 ఏళ్లదాటిన వారిని ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



లబ్బీపేట(విజయవాడతూర్పు): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో నలంద విద్యార్థులు బుధవారం మొక్కలు నాటారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో క్విట్ ఇండియా డే సందర్భంగా పెనమలూరులోని బ్లూమింగ్ డే స్కూలు ఆవరణలో వందకు పైగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. తమ విద్యార్థులు ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.వెంకటేశ్వరరావుతో పాటు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఒత్తిడిలేని విద్య అందించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు):విద్యార్థులకు ఒత్తిడిలేని విద్యను అందించాల్సిన అవసరం ఉందని లేడీస్ సర్కిల్ ఇన్ ఇండియా డైరెక్టర్ శ్రుతి అన్నారు. రౌండ్ టేబుల్ ఇండియా, లేడీస్ సర్కిల్ ఇన్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం ఎంజీరోడ్డులోని భవిష్య జూనియర్ కళాశాలలో మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా శృతి మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల పిల్లలందరూ చదువుకునేందుకు తమ వంతు తోడ్పాటు అందిస్తామన్నారు. స్నేహభావంతో విద్యలో అందరూ రాణించాలనేది తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పేదరికం వలన ఎవరూ విద్యకు దూరం కాకూడదని, ఎంతో మంది విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ యం.శ్రీనివాస్, డాక్టర్ హర్ష, డాక్టర్ అమూల్య, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):పనికని ఇంటి నుంచి వెళ్లిన తన భార్య కనబడడం లేదంటూ ఓ భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రామకృష్ణాపురం కోడూరు వారి వీధికి చెందిన చిన్న సాయికిరణ్, హరిత దంపతులు నాలుగేళ్ల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నారు. నగరంలోని ఓ వస్త్ర దుకాణంలో ఇద్దరు పనిచేస్తుంటారు. బంగారం కొనుగోలు విషయంలో భార్యాభర్తలకు మధ్య రెండు రోజుల క్రితం గొడవ జరిగింది. ఈ నెల 8వ తేదీన సాయికిరణ్‌కు సెలవు కావడంతో హరిత షాపునకు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లింది. మధ్యాహ్నం ఆమెకు ఫోను చేయగా ఎంతసేపటికి ఎత్తలేదు. దీంతో అనుమానం వచ్చి షాపు దగ్గరకు వెళ్లి విచారించగా హరిత పనికి రాలేదని తెలిపారు. ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద ఆరాతీసిన ఎక్కడా కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు.

ఆదరణ చూసి ఓర్వలేకే విమర్శలు



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న దేవినేని అవినాష్, బెల్లం దుర్గ తదితరులు

ఆటోనగర్(విజయవాడతూర్పు):వైఎస్సార్ సీపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకే టీడీపీ విమర్శలు చేస్తుందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లోని ఠాగూర్ రోడ్డు, శివగంగా భవాని రోడ్డు నిర్మాణాలకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ రూ.40 లక్షలతో సీసీ రోడ్లు వేస్తున్నట్టు చెప్పారు. నాణ్యత లోపించకుండా పనులు చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 15వ డివిజన్‌లో రూ.20 కోట్లు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వాటర్ ట్యాంకు, రిటైనింగ్‌వాల్ తదితర అభివృద్ధి పనులు చేశామన్నారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె ఈ డివిజన్‌ను గతంలో దత్తత తీసుకొని సవతి ప్రేమ చూపించారని దుయ్యబట్టారు. లోకేష్ యువగళం పేరుతో యాత్ర చేస్తూ రాజకీయ నాయకుడిలా హుందాగా వ్యవహరించకుండా అధికారులను ...ప్రజలను భయభ్రాంతులుగా గురిచేసే విధంగా బెదిరించడం సిగ్గుచేటన్నారు. అదేదో ఎర్రబుక్‌అని.. అధికారంలోకి వస్తే అంతుచూస్తామని దిగజారుడుతనంగా మాట్లాడటం.. రెచ్చగొట్టేవిధంగా పోలీసుల మీద దాడి చేసేలా ఉసిగొల్పే విధానం మంచి పద్ధతి కాదన్నారు. సచివాలయానికి రూ.20 లక్షలు ఇచ్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధికి సహకరిస్తున్నారని తెలిపారు. అందుకు నగర ప్రజలందరి తరపున సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ మాట్లాడుతూ డివిజన్‌లో నిరంతరం అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ల చెల్లారావు, శ్రీనివాస్, భాను, సత్యన్నారాయణ, బలరాం, ఎస్‌వి నాయుడు, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సమస్యల పరిష్కారానికే 'దర్బార్'





దర్బార్ కార్యక్రమంలో మాట్లాడుతున్న అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు (ఇన్‌సెట్) హాజరైన హోంగార్డులు

డీసీపీ మోకా సత్తిబాబు

విజయవాడ స్పోర్ట్స్: విధి నిర్వహణలో హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా 'దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అడ్మిన్ డెప్యూటీ పోలీస్ కమిషనర్ (డీసీపీ) మోకా సత్తిబాబు అన్నారు. కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు విజయవాడ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో దర్బార్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డీసీపీ సత్తిబాబు పాల్గొని మాట్లాడారు. హోంగార్డులు పోలీస్ శాఖలో భాగమేనన్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తినపుడు పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. బందోబస్తు, ఎస్కార్ట్ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం చేస్తూ శారీరకంగా, మానసికంగా దృడంగా ఉండాలని సూచించారు. వృత్తిపరమైన సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. మంగళగిరిలోని ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో గత నెలలో నిర్వహించిన సంక్షేమ కమిటీ సమావేశంలో చర్చించిన పలు అంశాలపై హోంగార్డులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని పలువురు హోంగార్డులు విన్నవించారు. హోంగార్డ్స్ కమాండెంట్ కె.వి.ప్రేమ్‌జిత్, హోం గార్డ్స్ డీఎస్పీ ఐ.మోహన్‌కుమార్, ఆర్ఐ కృష్ణ పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న కేవీ నాగరాజు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):పోషక ఆహారాన్ని నిత్యం తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చునని సీనియర్ వెల్‌నెస్ కోచ్ కెవీ.నాగరాజు చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ ఆవరణలో ఆహారంతో ఆరోగ్యం అనే అంశంపై అవగాహన సదస్సు బుధవారం జరిగింది. నాగరాజు మాట్లాడుతూ రోజూ తీసుకునే ఆహారంలో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, ప్రోటీన్లు ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఆధునిక జీవనశైలిలో ఆహారాన్ని ఏమీ తీసుకుంటున్నామో, ఎంత పరిమాణంలో తీసుకుంటున్నామో కూడా తెలియడం లేదని దాని వల్ల అనేక జబ్బుల బారినపడుతున్నారని చెప్పారు. మన ఆరోగ్యం అనేది మనం తినే ఆహారంపైనే ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ దివాస్ ప్రెసిడెంట్ వై.స్వరూప మాట్లాడుతూ పోషక విలువలు ఉన్న ఆహారంపై అవగాహన పెంచుకోడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్నా మాట్లాడుతూ ఆహారాన్ని కాపాడుకోవడానికి నిత్యం మంచి ఆహారపు అలవాట్లు చేసుకోవాల్సిందేనని చెప్పారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణమ మాట్లాడుతూ ఇంటిలో మహిళ ఆరోగ్యం ఉంటే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉన్నట్లేనని చెప్పారు. పోషకాహార నిపుణురాలు కె.హరిత మాట్లాడుతూ నిత్యం ఆహారాన్ని ఏవిధంగా తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల సందేహాలను నివృత్తి చేశారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ దివాస్ సెక్రటరీ శ్రీసుష్మతో పాటుగా క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

స్టెల్లా ఆధ్వర్యంలో శాంతియాత్ర



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పటమట(విజయవాడతూర్పు): ఆయుధాలు లేని ప్రపంచాన్ని భవిష్యత్ తరాలకు అందిచాలని స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ జస్వింత క్వాడ్రస్ అన్నారు. నాగసాకి, హిరోషిమాపై అణు బాంబులు వేసి 78 ఏళ్లవుతున్న సందర్భంగా కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. అణు బాంబు దాడులుకు బలైన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా దేశాల్లో అంతర్గత ఉద్రిక్తతలు ప్రపంచ అశాంతికి ఆజ్యం పోశాయని ఆందోళన వ్యక్తం చేశారు. అవి మానవ ఉనికిని ప్రశ్నిస్తున్నాయని పేర్కొన్నారు. నిరాయుధీకరణ అనేది సురక్షితమైనదన్నారు. విద్యార్థులు 'యుద్ధానికి నో చెప్పండి,' ప్రపంచానికి శాంతిని వ్యాప్తి చేయండి' అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఓడి డాక్టర్ జి. లిటిల్ ఫ్లవర్, సీనియర్ అధ్యాపకురాలు పి.పద్మలత, ఇతర ఫిజిక్స్ విభాగం సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈవో కుమార్

పటమట(విజయవాడతూర్పు): హిరోషిమా – నాగసాకి దినోత్సవంను అణ్వాయుదాల వ్యతిరేక దినోత్సవంగా నిర్వహించాలని డీవైఈవో బి. కుమార్ అన్నారు. పటమటలంక కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అణుశక్తిని రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో హిరోషిమా, నాగసాకి నగరాల వినాశనానికి ఉపయోగించారని తెలిపారు. అలా కాకుండా మానవాళికి అందరికీ అవసరమైన విద్యుత్ తయారీకి అవసరమైన న్యూక్లియర్ రియాక్టర్ ను వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా న్యూక్లియర్ రియాక్టర్‌ను కనుగొన్న ఎన్రికో ఫెర్మీకి నివాళి అర్పించారు. ఇటువంటి శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు అందరూ మానవాళి సంక్షేమం కోసం కృషిచేసే శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల్లో 8, 9 తరగతి విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. లక్ష్మీకుమారి, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన 40 శాతం పూర్తి

జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో చేపట్టిన ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలన 40 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా పరిశీలిన పూర్తి పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు. ఈ నెల 21 నూరు శాతం పూర్తి చేస్తామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు సహకరించాలని కోరారు. సమావేశంలో డీఆర్వో కె.మోహన్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు వై.ఆంజనేయరెడ్డి (వైఎస్సార్ సీపీ), శివరాం ప్రసాద్ (టీడీపీ) పి, ఏసుదాస్ (కాంగ్రెస్), బాలు (సీపీఐ) పాల్గొన్నారు.

మేజర్ భీమేశ్వరరావుకు సన్మానం



గుణదల (విజయవాడ తూర్పు): దేశ సేవలో తన వంతు పాత్ర వహించిన మేజర్ ఎంవీ భీమేశ్వరరావు ఆదర్శప్రాయుడని ఆంధ్ర లయోల కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్ తెలిపారు. కళాశాల సెమినార్ హాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మేజర్ భీమేశ్వరరావును సత్కరించారు. ఈ సందర్భంగా ఫాదర్ కిషోర్ మాట్లాడుతూ లయోల కళాశాల పూర్వ విద్యార్థిగా ఉన్న భీమేశ్వరరావు తన డిగ్రీ పూర్తయిన అనంతరం భారత సైన్యంలో జవానుగా పనిచేశారని తెలిపారు. విద్య పట్ల ఆయనకున్న కోరికను బట్టి అనతి కాలంలోనే మెడిసిన్ పూర్తి చేసి వైద్యునిగా మంచి పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. నగరంలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీలో ఎగ్జామ్ కంట్రోలర్‌గా పనిచేశారని తెలిపారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ గా విధులు నిర్వహించి ఆయన పదవీ విరమణ చేశారని వివరించారు. రెండు విభిన్నమైన రంగాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్న భీమేశ్వరరావును నేటి తరం యువకులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం కళాశాల సిబ్బంది శాలువాతో స్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ కిరణ్, విశ్రాంత అనస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ జి.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో తమ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించారని మాస్టర్‌మైండ్స్ విజయవాడ బ్రాంచ్ అడ్మిన్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 400 మార్కులకు గాను కె.చైతన్యసాయి శరత్ 330, డి.వినయ్ ప్రీతమ్‌రెడ్డి-320, మరిశెర్ల జాహ్నవి-304 మార్కులు సాధించారని పేర్కొన్నారు. అత్యున్నత విద్యా బోధనా విధానం, క్రమశిక్షణే విద్యార్థుల విజయానికి కారణమని బ్రాంచ్ అకడమిక్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు తెలిపారు. విద్యార్థులకు అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

అణగారిన వర్గాల మహిళలపై ఆగని హింస

దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశంలో అణగారినవర్గాల మహిళలపై నిత్యం దాడులు, హింస జరుగుతూనే ఉన్నాయని దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో ' స్వతంత్ర్య భారతంలో కులం, మతం, హింస అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అణగారిన వర్గాల మహిళలపై జరుగుతున్న హింసకు మణిపూర్ ఘటనే తార్కాణమని చెప్పారు. ఈ ఘటనలో సిగ్గుపడాల్సింది బాధిత మహిళలు కాదని, యావత్ భారత దేశం సిగ్గుతో తలదించుకోవాలన్నారు. మహిళలపై హింసను అరికట్టాలని కోరారు. నాగార్జున విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాధిపతి ప్రొఫెసర్ అనిత మాట్లాడుతూ మణిపూర్ అంటేనే భయమేస్తోందని తెలిపారు. ఈ హింసకు ముగింపు లేదా? అని ప్రశ్నించారు. దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్నా మహిళలపై జరిగే అఘాయిత్యాలు, దారుణాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. రాజ్యాంగం హక్కులు కల్పించినా, ప్రత్యేక చట్టాలు ఉన్నా అవి అమలు కావడంలేదని ఆవేదన చెందారు. సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షురాలు బి.శ్వేత, భూమిక సంస్థ ప్రతినిధి అనుపమ, సఫాయి కర్మచారి నాయకులు బి. శ్రీదేవి, దళిత స్త్రీ శక్తి కో ఆర్డినేటర్లు రోజా, మేరీనిర్మల, కుమారి, లక్ష్మీప్రసన్న, శ్రీనివాస్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతికి ప్రతీక చేనేత వస్త్రాలు



చేనేత వస్త్రాలు తిలకిస్తున్న సీవీసీ డైరెక్టర్ జానకి

పటమట(విజయవాడతూర్పు): విశిష్టమైన భారతీయ సంస్కృతికి చేనేత వస్త్రాలు ప్రతీకలుగా నిలుస్తాయని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) డైరెక్టర్ ఎం.జానకి అన్నారు. పటమట పంటకాల్వ రోడ్డులోని స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న చేనేత జౌళి శాఖ, ఆప్కో చేనేత వస్త్ర ప్రదర్శనను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జానకి మాట్లాడుతూ అపురూపమైన నైపుణ్యత, సృజనాత్మకతతో చేనేత కార్మికులు అహర్నిశలు కష్టపడి ఇంద్రధనస్సు వంటి చేనేత వస్త్రాలను తయారు చేస్తున్నారని చెప్పారు. వాటిని ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. చేనేత జౌళి శాఖ, ఆప్కో ఈ తరహా ప్రదర్శనలు ఏర్పాటు చేయటం నేత కార్మికులకు ఎంతో ఉపయోగకరమన్నారు. తరతరాల భారతీయ సంస్కృతి, వారసత్వానికి ప్రత్యక్ష నిదర్శనాలుగా చేనేత సోయగాలు నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వారంలో ఒకరోజైనా నేత దుస్తులను ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఆప్కో జీఎం తనూజారాణి తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు విరాళం



రజక సంఘ నాయకులకు నగదు అందిస్తున్న దేవినేని అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు):వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తుందని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని ఆయన కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.90 వేల నగదును రజక సంఘ నాయకులకు అందచేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని తెలిపారు. వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా రజకుల సంక్షేమం కోసం ప్రత్యేక చొరవ తీసుకున్నారని వివరించారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని తాము తూర్పు నియోజకవర్గం పరిధిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా రజకుల దైవంగా భావించే ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు విరాళం ఇచ్చినట్లు ప్రకటించారు. కార్పొరేటర్లు వియ్యపు అమర్‌నాథ్, తాడిపత్రి కొండా రెడ్డి , జిల్లా యువజన నాయకులు కొరివి చైతన్య, రజక నాయకులు ఉకోటి రమేష్, దుర్గాప్రసాద్, శ్రీను, రాము, వాసు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సూచనలు స్వీకరించాలి



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులతో మాట్లాడుతున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారికి తలనీలాలు సమర్పించేందుకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని, వారికి ఏమైనా సమస్యలు ఎదురైనా వాటిని ఫిర్యాదులు, సూచనల రూపంలో స్వీకరించాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు అధికారులను ఆదేశించారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన కేశ ఖండనశాలను బుధవారం చైర్మన్ కర్నాటి రాంబాబు పరిశీలించారు. తలనీలాలు సమర్పించేందుకు విచ్చేసే భక్తుల పట్ల గౌరవంగా మాట్లాడాలని, సిబ్బంది ప్రవర్తన అమ్మవారి ఆలయానికి మంచి పేరు తీసుకువచ్చేలా ఉండాలని చైర్మన్ రాంబాబు పేర్కొన్నారు. భక్తుల తమ అభిప్రాయాలతో పాటు ఫిర్యాదులు, సూచనలు చేసేందుకు పుస్తకాన్ని అందుబాటులో ఉంచాలని, ఆ పుస్తకంలో నమోదయిన ప్రతి అంశాన్ని ఆలయ ఈవో, తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కేశ ఖండనశాలలో పారిశుద్ధ్యాన్ని పరిశీలించిన చైర్మన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. దుర్గాఘాట్ నుంచి అమ్మవారి సన్నిధికి, అమ్మవారి సన్నిధి నుంచి ఘాట్‌కు దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సర్వీసులను వినియోగించుకోవాలని భక్తులతో పేర్కొన్నారు.

పోలీసుల రిహార్సల్స్



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న కార్యక్రమానికి పోలీసులు బుధవారం రిహార్సల్స్ చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అలరించిన సినీ సంగీత విభావరి



అంజనేయ నాయక్‌ను సత్కరిస్తున్న రాజు, చిట్టిబాబు, నరసింహారావు తదితరులు

విజయవాడ కల్చరల్: ప్రణవీ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. అమర గాయకులు ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం, భానుమతి, పిఠాపురం నాగేశ్వరరావు తదితరులు గానం చేసిన గీతాలను కారుమంచి రాజు ఆధ్వర్యంలో ఆంజనేయ నాయక్, కృష్ణకుమారి, రూపాశ్రీ షబానా, వడ్డాది కామేశ్వరి, పి.శ్రీనివాసరావు ఆలపించారు. ప్రణవీ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. వేదిక ద్వారా నూతన గాయనీ గాయకులకు అవకాశం కలిప్తున్నట్లు తెలిపారు. వివిధ సంస్థల ప్రతినిధులు జిలానీఖాన్, చింతకాయల చిట్టిబాబు సీనియర్ గాయకుడు బాలజీకుమార్, గెల్లి సువర్ణ, సత్యవర్ధన్ పాల్గొన్నారు. గాయకుడు అంజనేయ నాయక్‌కు యువగాన చక్రవర్తి బిరుదుతో సత్కరించారు.

పర్యాటక రంగంపై ఆసక్తి చూపాలి

పెనమలూరు: విద్యార్థులు పర్యాటక రంగంపై ఆసక్తి చూపి నూతన విషయాలు తెలుసుకోవాలని ఇండియన్ టూరిజం నోడల్ ఆఫీసర్ రబిరత్నసేనాపతి అన్నారు. కానూరు కేసీపీ సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో బుధవారం యువ టూరిజం క్లబ్ ఆయన ప్రారంభించారు. పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ, అసిస్టెంట్ మేనేజర్ జాఫర్, ప్రిన్సిపాల్ మనోజ్ కర్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావు, శైలజా కిరణ్‌లకు సీఐడీ నోటీసులు



● 16, 17 తేదీల్లో విజయవాడలో విచారణ
● ఈసారి హాజరుకాకపోతే న్యాయపరంగా కఠిన చర్యలకు యోచన

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో ఏ–1గా ఉన్న ఆ సంస్థ చైర్మన్ రామోజీరావు, ఏ–2గా ఉన్న ఆయన కోడలు శైలజా కిరణ్‌లకు సీఐడీ బుధవారం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న రామోజీరావు, 17న శైలజా కిరణ్ విజయవాడలోని సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని సీఆర్‌పీసీ సెక్షన్ 41–ఏ(1) కింద జారీ చేసిన నోటీసుల్లో పేర్కొంది. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం, రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం, ఆర్బీఐ నిబంధనలను ఉల్లంఘిస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ యథేచ్ఛగా ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్టు రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ విభాగం విచారణలో వెల్లడైంది. దీంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై ఏడు కేసులు నమోదు చేసిన సీఐడీ అధికారులు ఇప్పటికే రామోజీరావును ఓసారి, శైలజా కిరణ్‌ను రెండుసార్లు హైదరాబాద్‌లోని వారి నివాసంలో విచారించారు. మరోవైపు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆస్తులను అటాచ్ చేసేందుకు సీఐడీకి రాష్ట్ర హోం శాఖ అనుమతినిచ్చింది. దీంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల సొమ్ముతో నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టిన రూ.1,035 కోట్ల పెట్టుబడులతోపాటు ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉన్న 88.50 శాతం వాటా, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్‌లో ఉన్న 44.55 శాతం వాటాను అటాచ్ చేసేందుకు అనుమతించాలని కోరుతూ సీఐడీ న్యాయస్థానంలో ఇప్పటికే పిటిషన్లు దాఖలు చేసింది. ఇక మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై నమోదు చేసిన 7 ఎఫ్‌ఐఆర్‌లకు సంబంధించి రెండింటిలో సీఐడీ చార్జ్‌షీట్లు కూడా వేసింది.

హాజరుకాకపోతే న్యాయపరంగా కఠిన చర్యలు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో ప్రధాన నిందితులు రామోజీరావు, శైలజా కిరణ్ ఈసారి విచారణకు హాజరుకాకపోతే న్యాయపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సీఐడీ భావిస్తున్నట్టు సమాచారం. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్‌లో మార్గదర్శి చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా రామోజీరావు, శైలజా కిరణ్ మళ్లించారని సీఐడీ గుర్తించి కేసు నమోదు చేసింది. బాధితులు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు కావడంతో కేసును కూడా రాష్ట్రంలోనే నమోదు చేశారు. అయితే రామోజీరావును, శైలజా కిరణ్‌ను హైదరాబాద్‌లోని వారి నివాసంలో సీఐడీ విచారించింది. కాగా వారిద్దరూ విచారణకు సహకరించలేదు. పైగా అధికారులను తమ నివాసంలోకి అనుమతించకుండా చాలాసేపు రోడ్డు మీదే వేచి ఉండేలా చేశారు. కేసు నమోదైన ప్రాంతంలోనే విచారించాలనే ప్రాథమిక దర్యాప్తు సూత్రాన్ని దేశవ్యాప్తంగా దర్యాప్తు సంస్థలు పాటిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రామోజీరావు, శైలజా కిరణ్‌లను రాష్ట్రంలో విచారించాలని సీఐడీ భావించింది. అందుకోసం జూలై 5న గుంటూరులోని సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసింది. కానీ వారిద్దరూ విచారణకు హాజరు కాలేదు. తాము రాలేని పరిస్థితుల్లో ఉన్నామని ఈ–మెయిల్ ద్వారా తెలుపుతూ విచారణకు డుమ్మా కొట్టారు. ఈ నేపథ్యంలో కేసు విచారణలో మరింత పురోగతి సాధించిన సీఐడీ వారిద్దరిని రాష్ట్రంలో విచారించాల్సిన అవసరం ఉందని గుర్తించింది. అందుకే ఈ నెల 16, 17 తేదీల్లో విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసింది. ఈసారి కూడా విచారణకు హాజరుకాకపోతే న్యాయపరంగా తీసుకోవాల్సిన తదుపరి కఠిన చర్యలపై సీఐడీ ఇప్పటికే సూత్రప్రాయంగా ఓ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఉద్దేశపూర్వకంగానే విచారణకు గైర్హాజరవుతున్న విషయాన్ని న్యాయస్థానానికి నివేదించాలని సీఐడీ భావిస్తోంది. న్యాయస్థానం ద్వారా నోటీసులు గానీ అంతకుమించిన ఉత్తర్వులుగానీ ఇప్పించాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో తదుపరి పరిణామాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

రామోజీ ఫిల్మ్‌సిటీ అక్రమ నిర్మాణమే

● ఆ భూములన్నీ ల్యాండ్ సీలింగ్ యాక్ట్ ఉల్లంఘించి సేకరించినవే
● ఫిల్మ్ సిటీ ఆస్తుల విలువ రూ.2 లక్షల కోట్లు
● రామోజీ తలచుకుంటే ఎవరికైనా శిక్షలు వేయించగలరు
● కోర్టుల్లో చాలా పలుకుబడి ఉంది
● మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తీవ్ర విమర్శలు



సాక్షి, రాజమహేంద్రవరం: రామోజీ ఫిల్మ్ సిటీ అక్రమ నిర్మాణమేనని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఫిల్మ్ సిటీ కోసం ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌ను ఉల్లంఘించి భూములు సేకరించారని విమర్శించారు. ఫిల్మ్‌సిటీ రెండు వేల ఎకరాల భూముల విలువ ఇప్పుడు రూ.2 లక్షల కోట్లన్నారు. వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. రాజమండ్రిలో ఉండవల్లి అరుణ్ కుమార్ బుధవారం మీడియాతో మాట్లాడారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌లో జమీందార్లు, పెద్దలు కూడా భూములు కోల్పోయారన్నారు. కానీ రామోజీ మాత్రం అందుకు భిన్నమన్నారు. ఇందుకు మార్గదర్శి కేసులో జరుగుతున్న విచారణే నిదర్శనమని తెలిపారు. రామోజీకి కోర్టుల్లో చాలా పలుకుబడి ఉందని, ఆయన అడ్వొకేట్లు ఎవరికి కావాలనుకుంటే వారికి శిక్షలు వేయించగలరని చెప్పారు. మార్గదర్శి చిట్‌ఫండ్ కేసులో రామోజీరావు, శైలజా కిరణ్‌లను అధికారులు ప్రశ్నించిన వీడియో బయటపెట్టాలని ఉండవల్లి కోరారు. మార్గదర్శిలో నిబంధనల ఉల్లంఘన ఆంధ్రాలో జరిగితే తెలంగాణ కోర్టులో విచారించాలని పట్టుబట్టడం విడ్డూరంగా ఉందన్నారు. దీన్నిబట్టి ఏపీ ప్రభుత్వం కన్నా రామోజీరావుకు పలుకుబడి ఉందని అర్థం అవుతోందన్నారు.

'ఈనాడు'తో వ్యవస్థలను భయపెడుతున్నారు..

రామోజీకి వ్యతిరేకంగా మాట్లాడితే ఈనాడు పేపర్‌ను అడ్డం పెట్టుకుని వ్యవస్థలను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఉండవల్లి అరుణ్ కుమార్ ఆరోపించారు. అందుకే ప్రతి కేసులో 'ఈనాడు పత్రిక అధిపతి' అని ప్రస్తావన తీసుకువస్తారన్నారు. ఒక కేసులో రామోజీరావు మార్గదర్శి ఎండీ అని, మరో కేసులో మార్గదర్శితో రామోజీరావుకు సంబంధం లేదని అఫిడవిట్ వేశారన్నారు. అలాంటి వ్యక్తిపై కంటెంప్ట్ ఆఫ్ కోర్టు ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. ఏపీలో ప్రజలు కట్టిన సొమ్ముకు, మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీ వద్ద ఉన్న సొమ్ముకు వ్యత్యాసం ఉందన్నారు. ఆదిరెడ్డి అప్పారావుని అరెస్టు చేసినప్పుడు రామోజీని ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. ఆదిరెడ్డిని పరామర్శించిన చంద్రబాబు రామోజీ గురించి మాట్లాడలేదన్నారు. తన రాజగురువుకు కోపం వస్తే పునాదులు కదులుతాయని ఆయన భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. మార్గదర్శి వ్యవహారంలో రామోజీ తప్పు చేయలేదని బాబు చెప్పగలరా? అని సవాల్ విసిరారు.

మార్గదర్శి కేసులో ప్రభుత్వం నాకు సహకరించాలి..

మార్గదర్శి అక్రమాలపై జరుగుతున్న విచారణ చూస్తుంటే చట్టం ముందు అందరూ సమానం కాదన్న భావన కలుగుతోందన్నారు. న్యాయ వ్యవస్థలో మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. మార్గదర్శి కేసులో నిజాలు బయటపెట్టాలంటే ప్రభుత్వం తనకు సహకరించాలని కోరారు. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ ప్రభుత్వంపై ఇంకా వ్యతిరేక కథనాలు కోకొల్లలుగా వస్తాయన్నారు. చిరంజీవి పిచ్చుక కాదని.. సొంత పార్టీ పెట్టి 18% ఓట్లు సాధించారని గుర్తు చేశారు.

ప్యాకేజీ స్టార్‌కు పది ప్రశ్నలు

● పరిపాలన రాజధానిగా విశాఖను వ్యతిరేకించిన మీకు ఉత్తరాంధ్రలో పర్యటించే అర్హత ఉందా?
● పవన్‌కళ్యాణ్‌ను నిలదీసిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర ప్రజల తరఫున ప్యాకేజీ స్టార్ పవన్ కళ్యాణ్‌కు పది ప్రశ్నలు వేస్తున్నామని.. వాటికి సమాధానం చెప్పి వారాహి యాత్రను ప్రారంభించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. బుధవారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పవన్‌కు పలు ప్రశ్నలు సంధించారు. విశాఖను పరిపాలన రాజధానిగా వ్యతిరేకించిన మీకు ఉత్తరాంధ్రలో పర్యటించే అర్హత ఉందా? ఉత్తరాంధ్ర మీద అసలు సొంత అజెండా ఉందా? విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు మీకు భాగస్వాములుగా ఉన్న బీజేపీని ఎందుకు నిలదీయట్లేదు? కమీషన్ల కోసం కక్కుర్తి పడి చంద్రబాబు పోలవరాన్ని నాశనం చేస్తే ఎందుకు ప్రశ్నించలేదు? ప్రత్యేక హోదాపై ఎందుకు మాట్లాడటం లేదు.. ప్రత్యేక ప్యాకేజీ చాలు అని చెప్పిన మీ దత్త తండ్రి చంద్రబాబును ఎందుకు నిలదీయలేదు? ఉద్దానం కిడ్నీ సమస్యను పరిష్కరిస్తున్న సీఎం జగన్‌ను ఎందుకు అభినందించలేకపోతున్నావు? సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న వలంటీర్ వ్యవస్థను కించపరిచే విధంగా మాట్లాడిన మీరు.. వలంటీర్లకు ఎందుకు క్షమాపణ చెప్పలేదు? పుంగనూరులో టీడీపీ మూకల దాడిలో ఒక కానిస్టేబుల్ కంటి చూపు కోల్పోతే ఎందుకు స్పందించలేదు.. దీనిపై చంద్రబాబును ఎందుకు ప్రశ్నించట్లేదు? పేదలకు ఇళ్ల పట్టాలిస్తే కోర్టులో కేసులు వేయించి చంద్రబాబు అడ్డుకుంటే ఇది తప్పు అని ఎందుకు ప్రశ్నించలేకపోయావు? బాబు పాలనలో ఇష్టారీతిన ఆలయాలను కూల్చివేస్తే ఎందుకు నోరు మెదపలేదు? అని పవన్‌కళ్యాణ్‌ను మంత్రి అమర్‌నాథ్ నిలదీశారు. వీటికి జవాబు చెప్పిన తర్వాత వారాహి యాత్ర వెబ్‌సిరీస్–3ని ప్రారంభించాలన్నారు. సినీ రంగ ప్రవేశం కోసం విశాఖలోనే ఓనమాలు దిద్దుకున్న పవన్.. ఇక్కడి ఆడబిడ్డను పెళ్లి చేసుకుని మోసం చేశాడని మండిపడ్డారు. పవన్‌కు అత్తారింటికి దారేది అంటే.. 20 ఏళ్ల క్రితం విశాఖ, 15 ఏళ్ల క్రితం అయితే ముంబై, 10 ఏళ్ల క్రితం నుంచి రష్యా గుర్తుకొస్తుందన్నారు.

మార్గదర్శిలో తీవ్రమైన అవకతవకలు

● అవి చందాదారులకు తెలిసే అవకాశమే లేదు.. తీవ్ర ఉల్లంఘనలు గుర్తించాకే నోటీసు ఇచ్చాం
● సుమోటోగా చిట్ రిజిస్ట్రార్లు చర్యలు ప్రారంభించవచ్చు
● చట్టం ఆ అధికారం కల్పిస్తోంది
● బహిరంగ నోటీసు విషయంలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులొద్దు
● హైకోర్టుకు నివేదించిన ఏజీ శ్రీరామ్
● ముగిసిన ఇరుపక్షాల వాదనలు.. తీర్పు రిజర్వ్



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో జరుగుతున్నవన్నీ తీవ్ర అంతర్గత అవకతవకలని, వాటి గురించి చందాదారులకు తెలిసే అవకాశమే లేదని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం హైకోర్టుకు నివేదించింది. అందుకే వాటిపై ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని వివరించింది. చందాదారులు ఫిర్యాదు చేయనంత మాత్రాన, మార్గదర్శి అక్రమాలు, అవకతవకలను ప్రశ్నించకూడదు, చర్యలు తీసుకోకూడదు అంటే ఎలా అని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ ప్రశ్నించారు. మార్గదర్శి చిట్ గ్రూపుల మూసివేత ఏమాత్రం ఏకపక్ష నిర్ణయం కాదన్నారు. చట్టపరమైన తీవ్ర ఉల్లంఘనలను గుర్తించాకే 2022 డిసెంబర్‌లో ఆ సంస్థకు నోటీసులు ఇచ్చి వివరణ కోరామన్నారు. ఆ వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో.. అందుకు కారణాలను వివరిస్తూ మళ్లీ నోటీసు ఇచ్చామని తెలిపారు. అయినా కూడా మార్గదర్శి యథేచ్ఛగా ఉల్లంఘనలను కొనసాగిస్తూనే ఉందన్నారు. ఈ నేపథ్యంలో చిట్ గ్రూపుల నిలుపుదల విషయంలో అభ్యంతరాలను ఆహ్వానిస్తూ బహిరంగ నోటీసు ఇచ్చామన్నారు. చట్ట నిబంధనలకు విరుద్ధంగా తాము వ్యవహరిస్తున్నట్లు మార్గదర్శి చేస్తున్న ఆరోపణలు సత్యదూరమని వివరించారు.

మార్గదర్శి వ్యాజ్యాలకు విచారణార్హత లేదు..

ఉల్లంఘనలను గుర్తించినప్పుడు.. వాటి విషయంలో తనంతట తాను (సుమోటో)గా చర్యలు ప్రారంభించే అధికారం చిట్ రిజిస్ట్రార్లకు చట్టం కల్పిస్తోందని ఏజీ శ్రీరామ్ హైకోర్టు దృష్టికి తెచ్చారు. కాబట్టి ఉల్లంఘనలపై ఫిర్యాదుల కోసం వేచి చూడాల్సిన అవసరం ఏమాత్రం లేదని తెలిపారు. చిట్ రిజిస్ట్రార్లు చట్టప్రకారం తమకున్న సుమోటో అధికారాన్ని ఉపయోగించి చర్యలకు ఉపక్రమించారన్నారు. 2008లో ఇచ్చిన జీవో ప్రకారం రిజిస్ట్రార్లకు అధికారాలను అప్పగించారని, చిట్‌ఫండ్ చట్టంలోని సెక్షన్ 48 (హెచ్) కింద చిట్ గ్రూపులను నిలిపేసేందుకు చర్యలు తీసుకునే సుమోటో అధికారం సైతం డిప్యూటీ రిజిస్ట్రార్లకు ఉందన్నారు. ప్రస్తుతం తాము జారీ చేసింది కేవలం షోకాజ్ నోటీసు మాత్రమేనని, దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు మార్గదర్శికి ఏమాత్రం అవకాశం లేదని తెలిపారు. అందువల్ల ఆ సంస్థ దాఖలు చేసిన వ్యాజ్యాలకు విచారణార్హత లేదన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో విస్తృత ప్రజాప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని, అందువల్ల ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయొద్దని కోర్టును అభ్యర్థించారు. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేస్తామని చెప్పారు. ఇరుపక్షాలు వాదనలు ముగించడంతో న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ప్రకాశం జిల్లా చిట్ గ్రూపు వ్యవహారంలో న్యాయస్థానం తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల చిట్ గ్రూపుల విషయంలో అభ్యంతరాలు తెలపాలని చందాదారులను కోరుతూ చిట్స్ రిజిస్ట్రార్ జారీ చేసిన పబ్లిక్ నోటీసుపై మార్గదర్శి యాజమాన్యం హైకోర్టులో వేర్వేరుగా మూడు వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాదులు నాగముత్తు, దమ్మాలపాటి శ్రీనివాస్‌లు వాదనలు వినిపించారు. బహిరంగ నోటీసు అమలును నిలిపేసి, ఆ నోటీసు ఆధారంగా ఎలాంటి చర్యలు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోర్టును కోరారు.



ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

ఎస్సీల అభ్యున్నతికి ఏపీలో పలు సంక్షేమ పథకాలు

రాజ్యసభలో ఎస్సీల రాజ్యాంగ ఆర్డర్ బిల్లుపై చర్చలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ ప్రజల సమగ్ర ఉద్ధరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి చెప్పారు. ఎస్సీల రాజ్యాంగ ఆర్డర్ బిల్లుపై బుధవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాల ప్రజల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్ కంకణబద్ధులై పని చేస్తున్నారన్నారు. ఎస్సీ సామాజికవర్గానికి మేలు చేకూర్చేలా చేపట్టిన కొన్ని వినూత్న సంక్షేమ పథకాల అమలుకు ఏపీ ప్రభుత్వం రూ. వేల కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం కింద రాష్ట్రంలో 12 లక్షల ఎస్సీ కుటుంబాలకు మేలు కలిగేలా ఇప్పటివరకు రూ.2,600 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. వైఎస్సార్ చేయూత పథకం కింద 6.4 లక్షల మంది ఎస్సీ మహిళలకు రూ.1,200 కోట్లు విడుదల చేశారన్నారు. జగనన్న విద్యా దీవెన పథకం కింద 2.3 లక్షల మంది ఎస్సీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర ఖర్చుల కోసం రూ.340 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్ పొందిన టాప్ 200 వర్సిటీల్లో ప్రవేశం పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడానికి ప్రవేశపెట్టిన జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద రూ.కోట్లు విడుదల చేస్తోందన్నారు. 17 లక్షల ఎస్సీ కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తోందని చెప్పారు.

ఫోన్ ట్యాపింగ్ నుంచి రక్షణ కల్పించాలి

ఫోన్ ట్యాపింగ్ ద్వారా మొబైల్ ఫోన్ వినియోగదారుల డాటాను తస్కరించే చర్యల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజయసాయిరెడ్డి కోరారు. డాటా ప్రొటెక్షన్ బిల్లుపై ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి ఫోన్‌లోని డేటాను తస్కరించే సామర్థ్యంతో అనేక విదేశీ కంపెనీలు 15 నుంచి 20 రకాల సాఫ్ట్‌వేర్‌లు తీసుకొచ్చాయని చెప్పారు. గతంలో ఏపీలో టీడీపీ అధికారంలో ఉండగా ఈ తరహా ఫోన్ ట్యాపింగ్ కార్యకలాపాలకు పాల్పడిందన్నారు. ఫోన్ ట్యాపింగ్ సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వాలకు, ప్రభుత్వ విభాగాల వినియోగానికి మాత్రమే విక్రయించాలన్న షరతు ఉందని తెలిపారు. కొన్ని ప్రైవేటు సంస్థలు ఈ సాఫ్ట్‌వేర్‌ను అక్రమంగా సంపాదించి ఫోన్ ట్యాపింగ్‌కు వినియోగిస్తుండటం ఆందోళనకరమన్నారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా జరిగే డాటా చౌర్యాన్ని నిరోధించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

రూ.105 కోట్లతో అనంత సెంట్రల్ వర్సిటీ

అనంతపురంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో మంజూరు చేసిన 25 పోస్టులకు (16 టీచింగ్, 9 నాన్ టీచింగ్)గాను 19 పోస్టులకు (13 టీచింగ్, 6 నాన్ టీచింగ్) అభ్యర్థులను ఎంపిక చేసినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సుభాష్ సర్కార్ చెప్పారు. విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి బదులిస్తూ..వర్సిటీ నిర్మాణానికి కేంద్రం రూ.450 కోట్లు మంజూరు చేయగా అందులో శాశ్వత క్యాంపస్ భవనాల నిర్మాణానికి రూ.105 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. కాగా, ఏపీలోని పంచాయతీరాజ్ సంస్థలకు 2023–24 లో 15వ ఆర్థికసంఘం గ్రాంటు రూపంలో రూ.2,031 కోట్లు కేటాయించినట్లు పరిమళ్ నత్వానీ మరో ప్రశ్నకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయమంత్రి కపిల్‌మోరేశ్వర్ పాటిల్ జవాబిచ్చారు.

లోక్‌సభ

ఇండస్ట్రియల్ కారిడార్లతో ఉపాధి

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి ప్రశ్నకు కేంద్రమంత్రి జవాబు



సాక్షి, న్యూఢిల్లీ: పారిశ్రామిక ఉత్పత్తిని విస్తరించడం, కార్మికులకు మెరుగైన జీవనం అందించడానికి నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రోగ్రాం ద్వారా గ్రీన్‌ఫీల్డ్ పారిశ్రామిక ప్రాంతాలు, నోడ్‌లు అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. లోక్‌సభలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. హైదరాబాద్–బెంగళూరు కారిడార్‌లో ఓర్వకల్లు వద్ద ఒక నోడ్ గుర్తించామని, ప్రాథమిక దశలో ఉందని తెలిపారు.

ఏపీలో 423 ఆర్‌వోబీ/ఆర్‌యూబీలు పూర్తి



ఏపీలో 20.18–19 నుంచి ఈ ఏడాది జూన్ వరకు 423 ఆర్‌వోబీ/ఆర్‌యూబీలు పూర్తి చేసినట్లు రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ చింతా అనూరాధ ప్రశ్నకు జవాబిచ్చారు.

1,55,987 ఎంటీల ఆహారధాన్యాల పంపిణీ

జాతీయ ఆహార భద్రత పథకం ప్రకారం ఏపీకి నెలకు 1,55,987 మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలు పంపిణీ చేస్తున్నట్లు కేంద్ర సహాయమంత్రి సాధ్వి నిరంజన్‌జ్యోతి.. వైఎస్సార్‌సీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నకు బదులిచ్చారు.



ఏపీలో భారీగా యురేనియం నిల్వలు



వైఎస్సార్ జిల్లా తుమ్మలపల్లె, పల్నాడు జిల్లా కొప్పునూరుల్లో 2,44,070 టన్నుల యురేనియం నిల్వలు గుర్తించినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి ప్రశ్నకు పీఎంవో సహాయమంత్రి జితేంద్రసింగ్ బదులిచ్చారు. కాగా, ఆర్బీకే, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు మంజూరైన ప్రాజెక్టుల్లో 209 ప్రాజెక్టులకుగాను గత నెల 25 వరకు రూ.25 కోట్ల రుణాన్ని పంపిణీ చేసినట్లు కేంద్ర ఆహార, వినియోగదారులశాఖ సహాయమంత్రి సాధ్వి నిరంజన్‌జ్యోతి.. వైఎస్సార్‌సీపీ ఎంపీ గొడ్డేటి మాధవి ప్రశ్నకు జవాబిచ్చారు.



పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి

శ్రీకాళహస్తి టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్న మాట నిజమేనని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఊరందూరులో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. తాము ఇంటింటికీ బొజ్జల కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఎవరిని అడిగినా తమకు అమ్మ ఒడి వంటి సంక్షేమ పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు తెలియజేశారన్నారు. సంక్షేమ ఫలాలు అందుకుని ఓటు మాత్రం తమకే వేయాలని కోరారు.

18 నుంచి వైజాగ్ ఓపెన్ గోల్ఫ్ టోర్నీ

విశాఖ స్పోర్ట్స్: ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఇండియా (పీజీటీఐ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 18 నుంచి వైజాగ్ ఓపెన్ గోల్ఫ్ 2023 ప్రారంభం కానుంది. ప్రొఫెషనల్ గోల్ఫ్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో పీజీటీఐ టోర్నీలు నిర్వహిస్తుండగా విశాఖ ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్ క్లబ్ వేదికగా ఈ టోర్నీ జరుగనుంది. 18 నుంచి లాంఛనంగా టోర్నీ ప్రారంభం కానుండగా 20 నుంచి 23 వరకు నాలుగు రౌండ్ల పాటు స్ట్రోక్ ప్లే ప్రధాన టోర్నీ జరుగనుంది. కార్యదర్శి ఎంఎస్ఎన్ రాజు బుధవారం క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ భారత్‌తో పాటు శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌కు చెందిన 126 మంది మేటి గోల్ఫర్స్ ఈ టోర్నీలో పాల్గొననున్నారన్నారు. యూరోస్పోర్ట్స్, సోషల్ మీడియా, దూరదర్శన్ చానల్స్‌లోనూ ప్రత్యక్షప్రసారం కానుందని చెప్పారు. గోల్ఫ్ విజేతలకు రూ.కోటి అందజేయనున్నామని తెలిపారు.

మెరుగైన పీఆర్సీ ప్రకటిస్తారని ఆశిస్తున్నాం

ఏపీ ఎన్జీవో సంఘం నేతలు

కాకినాడ సిటీ: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ మెరుగైన పీఆర్సీని సీఎం జగన్ ప్రకటిస్తారని ఆశిస్తున్నట్లు ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి చెప్పారు. ఈ నెలలో విజయవాడలో జరగనున్న ఎన్జీవో 21వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు జిల్లా ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో బుధవారం వీరు కాకినాడలో సమావేశమయ్యారు. విజయవాడలో నిర్వహించే రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి సీఎం హాజరవుతారని చెప్పారు. తాము జీపీఎస్‌ను వ్యతిరేకించడం లేదని, ఓపీఎస్ వచ్చే వరకు పోరాటం చేస్తామన్నారు. జిల్లాల పునర్విభజన జరిగిన సందర్భంగా గెజిటెడ్ ఉద్యోగులను నిబంధనలను అనుసరించి తమ సంఘంలోకి చేర్చుకోనున్నట్లు తెలిపారు.

'మణిపూర్'త్వరగా పరిష్కారం కావాలి

● అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నాం
● లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: మెజార్టీ బలమున్న కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం కన్నా మణిపూర్‌లో శాంతిభద్రతలు నెలకొల్పడం దేశానికి ముఖ్యమని వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి చెప్పారు. రెండుపక్షాల వైరం కన్నా దేశ సరిహద్దు ప్రాంతమైన మణిపూర్‌లో శాంతిభద్రతలు పునర్నిర్మించడం ఎంతో అవసరమన్నారు. లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై బుధవారం ఆయన మాట్లాడారు. మహిళలకు ఎక్కడ గౌరవం లభిస్తుందో అక్కడ దేవతలుంటారని వేదాలు చెబుతున్నాయన్నారు. దేశాన్ని కూడా భరతమాత అనే పిలుస్తామన్నారు. మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు బాధాకరమని చెప్పారు. ఇరువర్గాలను పిలిచి చర్చించి పరిష్కారం చూడాలన్నారు. భారతదేశంలో ఏం జరుగుతోంది? హింసాత్మక ఘటనలు ఏంటి? జండర్ వయలెన్స్ ఎందుకు ఉంటోంది? అని విదేశీ స్నేహితులు ప్రశ్నిస్తుంటే సిగ్గుగా ఉందన్నారు. మణిపూర్ చిన్న రాష్ట్రమైనా దేశంలో భాగమని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. ప్రస్తుతం రాజకీయాలకన్నా మణిపూర్‌లో శాంతి నెలకొల్పడం ఎక్కువ అవసరమని చెప్పారు. మణిపూర్‌లో మెజారిటీ, మైనారిటీ వర్గాల మధ్య కమ్యూనల్ క్లాషెస్ రాకుండా చూడాలన్నారు. తక్షణమే కేంద్ర బలగాలను దించడం లేదా ఇరుపక్షాలతో మాట్లాడి లాజికల్ కన్‌క్లూజన్ తీసుకురావడం అనే రెండు ఆప్షన్లు ఉన్నాయని చెప్పారు. మణిపూర్‌ను బంగారుభూమి అంటారని, మయన్మార్ సరిహద్దు కావడంతో గేట్‌వే ఆఫ్ ఇండియా ప్రదేశమని పేర్కొన్నారు. సరిహద్దు బలంగా లేకపోతే దేశభద్రతకు ముప్పు అన్న విషయాన్ని గుర్తించాలని కోరారు. మణిపూర్ స్ట్రాంగ్ అయితే దేశం స్ట్రాంగ్ అవుతుందన్నారు. రాజకీయాలు పక్కనపెట్టి మణిపూర్‌లో శాంతిభద్రతలు అవసరమని గుర్తించి వీలైనంత త్వరగా ఆ రాష్ట్రంలో శాంతిని తిరిగి నెలకొల్పాలని కోరారు. మెజారిటీ బలమున్న కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం అనవసరమని తమ పార్టీ నమ్ముతోందని చెప్పారు. ఈ అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

క్లుప్తంగా...

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే భూమన

నేడు టీటీడీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



సాక్షి,అమరావతి/తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నూతన చైర్మన్‌గా నియమితులైన తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి బుధవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. టీటీడీ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించడంపై సీఎం జగన్‌కు భూమన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 10న ఉదయం తిరుమలలోని శ్రీవారి ఆలయంలో ఉదయం 11: 44 గంటలకు టీటీడీ చైర్మన్‌గా భూమన బాధ్యతలు చేపట్టనున్నారు. సీఎం జగన్‌ని కలిసిన వారిలో భూమనతో పాటు ఆయన తనయుడు అభినయ్ రెడ్డి ఉన్నారు.

పలాయనం చిత్తగించిన దేవినేని ఉమా

అరెస్టు భయంతో ప్రెస్‌మీట్‌కు డుమ్మా

మహారాణిపేట (విశాఖ దక్షిణ): అన్నమయ్య జిల్లా అంగళ్లులో దాడి ఘటనలో హత్యాయత్నం కేసు నమోదైందని తెలియడంతో టీడీపీకి చెందిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పలాయనం చిత్తగించారు. ఉమామహేశ్వరరావు మంగళవారం రాత్రి విశాఖలో బసచేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు విశాఖ టీడీపీ కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లో పాల్గొనాల్సి ఉంది. ఈలోగా కేసు నమోదు విషయం బయటకు వచ్చింది. అరెస్టు చేస్తారన్న భయంతో దేవినేని టీడీపీ కార్యాలయానికి రాకుండా వెళ్లిపోయారు. ప్రెస్‌మీట్‌కు విశాఖ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాత్రం హాజరయ్యారు.

'సలహాలు మీ తమ్ముడికి ఇచ్చుకోండి'



పుత్తూరు రూరల్ (తిరుపతి జిల్లా): మంత్రి పదవి కోసం పార్టీనే కాంగ్రెస్‌లో కలిపేసిన వ్యక్తి సలహాలు వినే స్థితిలో ఇక్కడ ఎవరూ లేరని చిరంజీవిపై రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా మండిపడ్డారు. చంద్రబాబు వద్ద ప్యాకేజీలు తీసుకుని మాట్లాడటం మానేయమని ఆయన తమ్ముడు పవన్‌కు సలహా ఇచ్చుకుంటే మంచిదన్నారు. బుధవారం తిరుపతి జిల్లా వడమాలపేటలో మంత్రి రోజా మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక హోదాపై మాట్లాడుతున్న చిరంజీవి.. రాష్ట్రాన్ని రెండుగా విడగొట్టినపుడు కేంద్ర మంత్రిగా ఉండి ఏం చేశారని ప్రశ్నించారు.

'ఉక్కు' ఉద్యోగుల మహా ధర్నా

గాజువాక: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించే విధంగా కేంద్రం దిగొచ్చేవరకు తమ పోరాటం ఆగదని ఉక్కు కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి. క్విట్ ఇండియా స్ఫూర్తితో పాతగాజువాక జంక్షన్‌లో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ బుధవారం మహాధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా 'క్విట్ మోదీ..సేవ్ వైజాగ్ స్టీల్' నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ.. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థల్ని తన సన్నిహితులకు కట్టబెట్టేందుకు ప్రధాని మోదీ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. దానిలో భాగంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని చూస్తున్నారన్నారు. ఐఎన్‌టీయూసీ నేత మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ..కేంద్రం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ మాట్లాడుతూ..32 మంది బలిదానాలు, ప్రజల త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు.. ప్రజల సంపద అని అన్నారు. ఉక్కు కర్మాగారానికి అండగా ఉంటానని, దీన్ని కాపాడుకోవడానికి ఎలాంటి త్యాగానికైనా సిద్ధమన్నారు.

మాచర్లలో భరతుడంటా!

లోకేశ్ మళ్లీ ఏసేశాడు

సాక్షి, నరసరావుపేట : 'యుద్ధానికి వెళుతున్న భరతుడికి వీర తిలకం దిద్దిన ప్రాంతం మాచర్ల' అంటూ టీడీపీ నేత నారా లోకేశ్ తన అజ్ఞానాన్ని మరోసారి చాటుకున్నారు. పల్నాడు జిల్లా గురజాలలో బుధవారం జరిగిన బహిరంగ సభలో లోకేశ్ పైవిధంగా నాలుక నుమడతేసిపడేశారు. వాస్తవానికి బాలచంద్రుడికి వీర తిలకం దిద్ది పంపింది మగువ మాంచాల. పల్నాటి గడ్డపై పసివాడిని అడిగినా ఈ విషయం ఇట్టే చెప్పేస్తాడు. కానీ లోకేశ్ మాత్రం తన మిడిమిడి జ్ఞానంతో భరతుడిని మాచర్లలోకి దించేశారు. సత్తెనపల్లి నియోజకవర్గం చౌటపాపాయ పాలెంలో జరిగిన బహిరంగ సభలో లోకేశ్ మాట్లాడుతూ పోలవరం నిర్మాణ గడువు ఏటా పెంచుతూపోతున్నారని.. అడిగితే కేంద్రంపై నెపం మోపుతున్నారన్నారు. డయాఫ్రం వాల్, కాఫర్ డ్యాంల గురించి మాట్లాడేవారు లేరన్నారు. సత్తెనపల్లిలో గత ప్రభుత్వ హయాంలో రూ.1,400 కోట్ల అభివృద్ధి పనులు చేసినట్టు చెప్పారు. పిడుగురాళ్ల వావెళ్ల గార్డెన్స్ నుంచి ప్రారంభమైన లోకేశ్ పాదయాత్ర సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండలం మీదుగా పెదకూరపాడు నియోజకవర్గంలోకి ప్రవేశించింది.

క్లుప్తంగా...

'నా భూమి-నా దేశం' ప్రారంభం

- ఈ నెల 15 వరకు కార్యక్రమం

సాక్షి, అమరావతి: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న 'నా భూమి-నా దేశం' కార్యక్రమం తిరుపతి జిల్లా వడమాలపేట మండలం టీసీ అగ్రహారంలో బుధవారం ప్రారంభమైంది. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలు గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' శిలాఫలకాలను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరయోధులు, వీర జవానులు, పోలీస్ అమరవీరుల కుటుంబాలను సత్కరించారు. ఈ సందర్భంగా పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో 13,324 గ్రామ పంచాయతీలు, 123 పట్టణాల్లో బుధవారం నుంచి 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించాలని ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై అమరవీరుల సంస్మరణార్థం మట్టి దీపంతో సెల్ఫీ తీసుకుని 'మేరీ మాటీ మేరా దేశ్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు.

పశు వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జయప్రకాష్



సాక్షి, అమరావతి: పశు వైద్య సహాయ శస్త్ర చికిత్సల సర్వీస్ అసోసియేషన్ (ఏపీవీఏఎస్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ తెల్లపాటి జయప్రకాష్(నెల్లూరు) ఎన్నికయ్యారు. ఎనికేపాడులోని బీవీరావు పౌల్ట్రీ కమ్యూనిటీ హాలులో బుధవారం అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సమావేశానికి వెయ్యి మందికిపైగా పశువైద్యులు పాల్గొనగా, నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా వై.ఈశ్వర్‌రెడ్డి(గుంటూరు), కోశాధికారిగా ఒ.నాగరాజు(ఎన్టీఆర్ జిల్లా), ఉపాధ్యక్షులుగా వల్లే రమణ(శ్రీకాకుళం), కె.జయకాంత్(కృష్ణా), కోసూరు రవీంద్రరావు(ఎన్టీఆర్ జిల్లా), సహాయ కార్యదర్శులుగా షేక్ షంషేద్‌బేగం (నంద్యాల), ఎస్ఏస్ఎల్ గణేశ్వరరావు(అల్లూరి సీతారామరాజు జిల్లా), ఇ.కరుణాకర్(నంద్యాల) ఎన్నికయ్యారు. సంఘ నూతన కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించారు.

పొదుపు మహిళల రుణాల వడ్డీ రేపు జమ

1.05 కోట్ల మంది పొదుపు మహిళల రూ. 1353.76 కోట్ల వడ్డీ చెల్లించనున్న ప్రభుత్వం

- వరుసగా నాలుగో ఏడాదీ వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమం
- అమలాపురం మండలం జనుపల్లిలో రేపు బటన్ నొక్కి వడ్డీ డబ్బు జమ చేయనున్న సీఎం జగన్
- గత మూడు విడతలతో కలిపి మహిళలకు ఈ పథకం ద్వారా రూ. 4,969.05 కోట్లు ప్రయోజనం
- తొలి ఏడాది కన్నా దాదాపు 20 లక్షలు పెరిగిన లబ్ధిదారులు

సాక్షి, అమరావతి: పొదుపు సంఘాల మహిళలు బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లిస్తే ఆ రుణాలపై వడ్డీని ప్రభుత్వమే భరిస్తోంది. రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద గత మూడేళ్లుగా క్రమం తప్పకుండా వడ్డీని ప్రభుత్వం చెల్లిస్తోంది. వరుసగా నాలుగో ఏడాది కూడా ప్రభుత్వమే భరించి, ఆ వడ్డీ డబ్బులను శుక్రవారం నేరుగా మహిళల ఖాతాలలో జమ చేయనుంది. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం నాలుగో విడతలో రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల మంది మహిళలకు సంబంధించిన 10 లక్షల రుణ ఖాతాల వడ్డీ మొత్తం రూ.1,353.76 కోట్లను ప్రభుత్వం ఆ మహిళలకు అందజేయనుంది. ఈ లబ్ధిదారులు 9,48,122 సంఘాలకు చెందిన వారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం జనుపల్లి గ్రామంలో లబ్ధిదారులైన వేలాది మంది మహిళల సమక్షంలో బటన్ నొక్కి వడ్డీ డబ్బును వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. డ్వాక్రా రుణాలన్నింటినీ మాఫీ చేస్తానని 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా మాఫీ చేయకపోగా.. ఉమ్మడి రాష్ట్రం నుంచి అమలులో ఉన్న పొదుపు సంఘాల సున్నా వడ్డీ పథకాన్ని కూడా నిలిపివేశారు. దీంతో అప్పట్లో పొదుపు సంఘాల మహిళలు తీవ్ర అప్పుల ఊబిలో కూరుకుపోయి ఇబ్బందులు పడ్డారు. వైఎస్ జగన్ తన సుదీర్ఘ పాదయాత్రలో పొదుపు సంఘాల మహిళల ఇబ్బందులు గుర్తించారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక 2019 ఎన్నికలు జరిగిన నాటికి పొదుపు సంఘాలకు సంబంధించి మహిళలకు ఉండే బ్యాంకు అప్పులను నాలుగు విడతల్లో చెల్లించేందుకు వైఎస్సార్ ఆసరా పథకం తీసుకొచ్చారు. రుణాలు సకాలంలో చెల్లించే మహిళలకు వడ్డీ డబ్బును ప్రభుత్వమే భరించేలా వైఎస్సార్ సున్నా వడ్డీ పథకానికి జీవం పోశారు.



ముఖ్యమంత్రి కార్యక్రమం ఇలా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఉదయం 9.20 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి అమలాపురం చేరుకుంటారు. అక్కడి నుంచి జనుపల్లి గ్రామానికి వెళ్తారు. జనుపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించి, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం లబ్ధిదారులకు నిధులు విడుదల చేస్తారు. అనంతరం తాడేపల్లికి తిరుగు పయనమవుతారని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది.

గత మూడు విడతలతో కలిపి రూ.4,969 కోట్లు

2019 నుంచి ఇప్పటికే వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాలకు పొదుపు సంఘాల మహిళల రుణాల వడ్డీ మొత్తాలను ప్రభుత్వమే భరించింది. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా రూ. 3615.29 కోట్లను లబ్ధిదారులకు అందజేసింది. నాలుగో విడత కూడా కలిపితే మొత్తం రూ. 4969.05 కోట్లు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారానే అందజేసినట్టు అవుతుందని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు వెల్లడించారు. మరోవైపు తొలి ఏడాది 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం ద్వారా అందజేసిన లబ్ధిదారుల సంఖ్య కంటే నాలుగో ఏడాది లబ్ధి పొందే వారి సంఖ్య 20 లక్షల వరకు పెరిగినట్టు అధికారులు తెలిపారు. 2019-20లో 7.81 లక్షల సంఘాలకు చెందిన దాదాపు 81.52 లక్షల మంది మహిళలకు సంబంధించిన రుణాలపై రూ. 1,257.99 కోట్లు వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వం భరించింది. ప్రస్తుత నాలుగో ఏడాదిలో లబ్ధిదారుల సంఖ్య 1.05 కోట్లకు, సంఘాల సంఖ్య 9,48,122 పెరిగింది. వడ్డీ మొత్తం కూడా రూ. 1,353.76 కోట్లకు పెరిగింది. నాలుగో విడతలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 83.86 లక్షల మంది రూ.1002.31 కోట్ల మేర లబ్ధి పొందనుండగా.. పట్టణ ప్రాంతాలకు చెందిన 21.26 లక్షల మంది మహిళలు రూ. 351.45 కోట్లు లబ్ధి పొందనున్నారు. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో 5.92 లక్షల మంది మహిళలు రూ. 69.50 కోట్లు లబ్ధి పొందనున్నారని అధికారులు వెల్లడించారు.

అన్నా.. తను జాగ్రత్త!

- రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు
- కాలు ఛిద్రమై నెత్తురోడుతున్నా భార్యను కాపాడేందుకు భర్త తాపత్రయం
- పరిస్థితి విషమించి భర్త మృతి.. కోమాలోకి వెళ్లిన భార్య
- మృతుడు ఏఆర్ కానిస్టేబుల్



భార్య అనితను గుండెలకు హత్తుకున్న కానిస్టేబుల్ కిరణ్‌కుమార్

అనంతపురం (శ్రీకంఠం సర్కిల్): రెండు కాళ్లూ ఛిద్రమై రక్తమోడుతున్నాయి. అయినా ఆయన భయపడలేదు. తనతో పాటు ప్రమాదానికి గురైన భార్యను కాపాడాలని తాపత్రయపడ్డాడు. పైకి లేచి నిలబడలేని స్థితిలోనూ గుండె నిబ్బరం చేసుకుని నేలపై పాకుతూ వెళ్లి భార్యను గుండెలకు హత్తుకున్నాడు. 'ఏం కాదులే' అని ధైర్యం చెప్పాడు. 108 వాహనంలోకి చేర్చే క్రమంలో ఆమెను దీనంగా చూస్తూ అంబులెన్స్ సిబ్బందితో.. 'అన్నా.. తను జాగ్రత్త' అంటూ కన్నీరు పెట్టుకున్నారు. భార్యను కాపాడేందుకు ఎంతగానో తపించిన ఆ భర్త చివరకు కానరాని లోకాలకు వెళ్లిపోయాడు. అనంతపురం నగర శివారులోని నేషనల్ పార్క్ వద్ద 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యాలు అక్కడి వారిని కంటతడి పెట్టించాయి. లారీ ఢీకొన్న ఘటనలో కిరణ్‌కుమార్ (42) మరణించగా.. అతడి భార్య అనిత తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నారు.

భర్త ఏఆర్ కానిస్టేబుల్.. భార్య టీచర్

ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన కిరణ్‌కుమార్ 2003 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్. ఇదే ప్రాంతానికి చెందిన అనితను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత అనితకు టీచర్ ఉద్యోగం వచ్చింది. ఉద్యోగ రీత్యా అనంతపురం శివారు కళ్యాణదుర్గం రోడ్డు ఎస్‌బీఐ కాలనీ రెండో క్రాస్‌లో నివాసం ఉంటున్నారు. కిరణ్ కుమార్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వర్తిస్తుండగా.. అనిత తరిమెల జెడ్పీ హైస్కూల్‌లో టీచర్. వీరికి యశ్వంత్ నారాయణ, మణిదీప్ ఇద్దరు సంతానం. రోజూ ఉదయం భార్యను సోములదొడ్డి క్రాస్‌కు బైక్‌పై తీసుకెళ్లి.. ఆర్టీసీ బస్సులో తరిమెలకు పంపించడం కిరణ్‌కుమార్ దినచర్య. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో కిరణ్‌కుమార్ భార్యతో కలిసి సోములదొడ్డి బస్టాప్ వద్దకు ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. 44వ జాతీయ రహదారిపై నుంచి నేషనల్ పార్క్ వద్ద సర్వీసు రోడ్డులోకి వచ్చే క్రమంలో లారీ ఢీకొంది. బైక్‌పై నుంచి ఎగిరి కింద పడ్డ కిరణ్‌కుమార్ కాళ్లపై లారీ వెనుక టైర్లు వెళ్లాయి. ఈ హఠాత్పరిణామం నుంచి తేరుకోగానే అల్లంత దూరంలో భార్య అనిత పడి ఉండటం చూసి ఆమెను ఎలాగైనా కాపాడాలనుకున్నాడు. తన కాళ్లు ఛిద్రమైపోయినా శక్తినంతటినీ కూడదీసుకుని పాకుతూనే ఆమె వద్దకు చేరాడు. భార్యను చేతుల్లోకి తీసుకుని గుండెలకు హత్తుకున్నాడు. ముక్కు, చెవిలో రక్తస్రావమై అపస్మారక స్థితికి చేరుకుంటున్న భార్యను చూసి 'ఏమీ కాదు' అంటూ ధైర్యం చెబుతూ కన్నీరు పెట్టుకున్నాడు. ఆమెను అంబులెన్స్‌లోకి ఎక్కించిన తరువాత అపస్మారక స్థితిలోకి చేరాడు. దంపతులిద్దరినీ 108 వాహనంలో సర్వజనాస్పత్రికి తీసుకెళ్లగా.. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ప్రథమ చికిత్స చేసి బెంగళూరుకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ మృతి చెందగా.. భార్య అనిత కోమాలోకి వెళ్లింది.

పోలవరానికి 'చంద్ర' శాపం

9 ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు పోలవరం గురించి ఏనాడైనా ఆలోచించారా?

- ఆ ప్రాజెక్టు వైఎస్సార్ మానసపుత్రిక
- దాన్ని ప్రారంభించింది వైఎస్సార్.. పూర్తి చేసేది సీఎం జగన్
- నాడు పోలవరం కాంట్రాక్టర్లంతా ఎవరు?
- నవయుగను తప్పించారనే రామోజీ విషం కక్కుతున్నారు
- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ధ్వజం



సాక్షి, అమరావతి: దివంగత మహానేత వైఎస్సార్ ప్రారంభించకపోతే పోలవరం ప్రాజెక్ట్ ఉండేది కాదని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. ఆ ప్రాజెక్టుకు చంద్రబాబు శాపమని, దాన్ని నాశనం చేశారని ధ్వజమెత్తారు. పోలవరం తన మానసపుత్రిక అని ఆయన చెప్పడాన్ని ఎద్దేవా చేశారు. 9 ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు పోలవరం గురించి బాబు ఏనాడూ ఆలోచించలేదన్నారు. ఆ ప్రాజెక్టు వైఎస్సార్ మానసపుత్రిక అని తెలిపారు. ప్రాజెక్టును ప్రారంభించింది వైఎస్సార్ అని దాన్ని పూర్తి చేసేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తేల్చి చెప్పారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం అంబటి మీడియాతో మాట్లాడారు. పోలవరంపై చంద్రబాబు, రామోజీరావు, ఎల్లో మీడియా బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ప్రాజెక్టుపై ఎప్పుడూ మాట్లాడని చంద్రబాబు ఇప్పుడు మాట్లాడుతున్నారని నిప్పులు చెరిగారు. దోచుకుంది, దాచుకుంది, పంచుకుందీ ఆయన హయాంలోనేనని విమర్శించారు. ఈ సందర్భంగా అంబటి ఇంకా ఏమన్నారంటే..

తప్పులు మీద తప్పులు చేసిన చంద్రబాబు

పోలవరం ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు చారిత్రక తప్పులు చేశారు. ప్రాజెక్టును తామే కడతామని తీసుకోవడం తొలి తప్పు. 2013 -14 రేట్ల ప్రకారమే, ప్రాజెక్టును పూర్తి చేస్తానని 2016లో పనులు తీసుకోవడం మరో తప్పిదం. కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేయకుండా డయాఫ్రమ్ వాల్ కట్టడం ఇంకో తప్పు. ఇలా ఇంకా వెతికితే అడుగడుగునా బాబు చేసిన తప్పిదాలు కనిపిస్తాయి. నాడు పోలవరం కాంట్రాక్టర్లు రామోజీ, బాబు ఆత్మబంధువులు కాదా? మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, మాకు ఏం సంబంధం? మాతో ఆయనకు సంబంధం ఉంటే.. సీఎం జగన్‌పై కత్తి కట్టిన కాంగ్రెస్‌లో పొంగులేటి ఎందుకు చేరతారు? ఒకవేళ టెండర్‌లో పాల్గొని కాంట్రాక్ట్ దక్కించుకుంటే బంధుత్వం ఉన్నట్టు, దోచిపెట్టినట్టా? రివర్స్ టెండరింగ్, జ్యుడీషియల్ రివ్యూలో గెలిచినవారికే కాంట్రాక్టు దక్కుతుంది. తన బంధువుల కంపెనీలు పోయాయనే బాధతోనే రామోజీ విషపు రాతలు రాస్తున్నారు. టీడీపీ హయాంలో అంచనాలు పెంచి, తమ వారికి కాంట్రాక్టులు ఇచ్చి దోచుకున్నారు. నవయుగ, ఆర్వీఆర్, ట్రాన్స్ ట్రాయ్, రిత్విక్.. వీరంతా ఎవరి బంధువులు బాబూ? రామోజీ రాతలన్నీ బాబుకే వర్తిస్తాయి తప్ప సీఎం జగన్‌కి కాదు. ప్రాజెక్టుకు కేంద్రం ఇచ్చిన రూ.20 వేల కోట్లు ఖర్చుపెట్టాం. ఇంకా 41.15 మీటర్లకు సంబంధించి రూ.19 వేల కోట్ల కోసం ప్రతిపాదనలు పంపగా.. దాంట్లో రూ.12,911 కోట్లు ఇవ్వడానికి కేంద్రం ప్రాథమికంగా అంగీకరించింది. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కృష్ణా, గోదావరి పుష్కరాల పనుల కోసం దాదాపు రూ.5 వేల కోట్లు ఖర్చు చేసి, నామినేషన్ విధానంలో పనులిచ్చారు. నీరు – చెట్టు కార్యక్రమం కింద దాదాపు రూ.14 వేల కోట్ల పనులనూ ఇలాగే అప్పగించి దోచుకున్నారు. బ్రో సినిమాలో పాత్ర నాపై కక్షతో పెట్టింది కాదా? దీనికి చిరంజీవి ఏం సమాధానం చెబుతారు? పవన్ కళ్యాణ్ తాను తీసుకునే రెమ్యునరేషన్ గురించి చెప్పనప్పుడు, నీతి, నిజాయితీ, పారదర్శకత గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదు.

జిల్లా వార్తలు

అక్కచెల్లెమ్మలకు భరోసా

- వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా ఈ ఏడాది రూ.45.91 కోట్లు
- రేపు ఎస్‌హెచ్‌జీల బ్యాంక్ ఖాతాల్లో జమ
- నాలుగేళ్లలో రూ.134.64 కోట్ల మేర లబ్ధి



డ్వాక్రా సంఘ సమావేశంలో గ్రూపు సభ్యులతో సీసీ

పెడన/కంకిపాడు: స్వయం సహాయక గ్రూపు మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వడ్డీ లేని రుణాలను గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేయకపోవడంతో ఎస్‌హెచ్‌జీలు నానా పాట్లు పడ్డారు. ఈ క్రమంలో వీరికి ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తూ భరోసా కల్పిస్తున్నారు. స్వయం సహాయక గ్రూపులకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది.

కృష్ణా జిల్లా వ్యాప్తంగా..

స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి గడిచిన మూడేళ్లలో కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రూపులకు రూ.88.73 కోట్ల సున్నా వడ్డీ రుణాలను వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 35,752 స్వయం సహాయక గ్రూపులకు వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా రూ.45.91 కోట్లు లబ్ధి చేకూరనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 11న బటన్ నొక్కి ఈ మొత్తాన్ని గ్రూపు మహిళల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నారు.

గత ప్రభుత్వంలో..

స్వయం సహాయక గ్రూపు మహిళలకు ఇచ్చిన హామీలను గత ప్రభుత్వం పక్కనబెట్టి ప్రచారం కోసం పాకులాడింది. తీసుకున్న రుణాలను ఎవరూ చెల్లించొద్దని..తాము అధికారంలోకి వచ్చాకా బ్యాంక్ లింకేజ్ రుణాలను రద్దు చేస్తామని, 2014 ఎన్నికల సమయంలో టీడీపీ ప్రచారం చేసింది. దీనిని విశ్వసించిన మహిళలు రుణాలను తిరిగి చెల్లించలేదు. అయితే అధికారంలోకి వచ్చాక హామీని విస్మరించి ఎస్‌హెచ్‌జీలను నిలువునా ముంచారు. తీసుకున్న రుణాలను వడ్డీతో సహా చెల్లించాల్సి వచ్చింది. అవసరానికి రుణాలు అందక మహిళలు నానా ఇబ్బందులూ పడ్డారు.

నేడు అంతా ఆనందమే...

ఎస్‌హెచ్‌జీలు పడిన కష్టాలను గమనించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వీరికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో వీరి ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేశారు. ఎస్‌హెచ్‌జీలకు వందల కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలను ఏటా మంజూరు చేస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా మూడు విడతలు.. నాలుగో విడతగా ఎంత..ఎంతమందికి...అంటే

ఏడాది	గ్రూపులు	గ్రూపు సభ్యులు	రూ. కోట్లలో..
2019-20	32,918	3,12,721	28.05
2020-21	33,500	3,18,250	27.27
2021-22	35,291	3,65,279	33.41
2022-23	35,752	3,77,347	45.91
మొత్తం	--	--	134.64

ప్రణాళికలు ఇలా..

2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.1273 కోట్లను బ్యాంకు లింకేజీ రుణాలుగా రాష్ట్ర వ్యాప్తంగా మంజూరు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1081కోట్లు వ్యక్తిగత రుణాలు మంజూరుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎస్‌హెచ్‌జీ మహిళలకు రూ.2 లక్షలు నుంచి రూ.10 లక్షలు వరకు వ్యక్తిగత రుణాలను మంజూరు చేసేలా డీఆర్‌డీఏ అధికారులు చర్యలు చేపట్టారు. రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నారు.

రుణ పరపతి పెరిగింది..



బ్యాంకుల నుంచి స్త్రీనిధి, ఉన్నతి వంటి అనేక పథకాల ద్వారా పెద్ద మొత్తంలో రుణాలు ఇస్తున్నాం. దీంతో స్వయం సహాయక సంఘాల ద్వాక్రా గ్రూపు సభ్యులు స్వయం ఉపాధికి అవసరమైన పెట్టుబడికి నిధులు సమకూరుతున్నాయి. మహిళల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ఒక్కో సంఘానికి రూ.20 లక్షలు వరకు రుణాలు ఇస్తున్నాం. మహిళా సంఘాల ఆర్థిక క్రమశిక్షణ వలన రుణ పరపతి బాగా పెరిగింది. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద నాలుగు విడతలకు మొత్తం కలిపి రూ.134.64 కోట్ల మేర మహిళా సంఘాలకు లబ్ధి చేకూరింది.

–పి.శివరామప్రసాద్, పీడీ, డీఆర్‌డీఏ, మచిలీపట్నం

12, 13 తేదీల్లో ఐలు రాష్ట్ర మహాసభలు

గుంటూరు లీగల్: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) రాష్ట్ర మహాసభలు ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆహ్వాన సంఘ చైర్మన్, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు తెలిపారు. స్థానికంగా ఓ హోటల్‌లో మహాసభల వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్న మహాసభలకు న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలపై పని చేస్తున్న దేశంలో అతి పెద్ద సంఘంగా ఐలు ఉందన్నారు. ఈ మహాసభలను మొదటి రోజు మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భట్టు దేవానంద్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ బాబు, నగర అధ్యక్షుడు గండికోట శేషగిరిరావు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న జీజీహెచ్ వైద్యులు

అనాథకు చికిత్స అందించి.. క్షేమంగా స్వస్థలానికి..



మహేంద్ర విష్ణుభగత్‌ను స్వస్థలానికి పంపుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, వైద్యులు

గుంటూరు మెడికల్: ఇతర రాష్ట్రానికి చెందిన రోగి పక్క జిల్లాలో ప్రమాదానికి గురై చికిత్స కోసం జీజీహెచ్‌కు వచ్చాడు. జీజీహెచ్ వైద్యులు అనాథగా ఆసుపత్రిలో చేరిన వ్యక్తికి పెద్ద మనస్సుతో వైద్య సేవలు అందించి కోలుకున్న తరువాత అతడిని స్వస్థలానికి పంపించారు. వివరాల్లోకి వెళితే నాగపూర్‌కు చెందిన మహేంద్ర విష్ణుభగత్ గత నెల 21న నాగపూర్ నుంచి చెన్నై వెళ్తుండగా చీరాల రైల్వే స్టేషన్ వద్ద ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో రెండు చేతులకు గాయాలయ్యాయి. గాయపడిన భగత్‌ను రైల్వే పోలీసులు గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తీసుకుని వచ్చారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగం వైద్యులు రోగికి అవసరమైన పరీక్షలు చేసి చేతులకు పోయిన చర్మాన్ని తిరిగి ఏర్పాటు చేశారు. రోగి బంధువులు ఎవరు లేకపోవడంతో ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు అక్కున చేర్చుకుని వైద్య సేవలు అందించారు. ఆరోగ్యం పూర్తిగా కుదటపడడంతో అతడిని స్వస్థలానికి పంపించేందుకు ఆసుపత్రి సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్ ట్రైన్ టిక్కెట్ కొనుగోలు చేసి బుధవారం ఆసుపత్రి నుంచి నాగపూర్‌కు పంపించారు. ఈసందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఎవరూ లేని అనాథలకు సైతం జీజీహెచ్ వైద్యులు పెద్ద మనస్సుతో సేవలందించడమే కాకుండా, మానవతా దృక్పథంతో వారిని స్వస్థలానికి కూడా చేర్చడం అభినందనీయమని పేర్కొన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. రోగి బంధువులు సైతం జీజీహెచ్‌లో అందిస్తున్న వైద్య సేవలపై సంతోషం వ్యక్తం చేశారని, వైద్యుల సేవలను జీవితాంతం గుర్తుపెట్టుకుంటామని చెప్పారన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గోవింద నాయక్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ వెంకటసతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, పాల్గొన్నారు.

ఏఎన్‌యూ సమీపంలో 'వ్యూహం' షూటింగ్



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణం స్వీకారం చేసే సన్నివేశం



సన్నివేశాల చిత్రీకరణపై సూచనలు చేస్తున్న దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకార సన్నివేశాలు చిత్రీకరణ

ఏఎన్‌యూ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవిత సన్నివేశాలతో దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ చిత్రీకరిస్తున్న వ్యూహం చిత్ర షూటింగ్ బుధవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న మైదానంలో జరిగింది. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసే సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాత్రలో నటిస్తున్న నటుడు అజ్మల్ ప్రమాణ స్వీకార వేదికపైకి రావడం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులకు అభివాదం చేయడం, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కరచాలనం, గవర్నర్‌ను ఆలింగనం చేసుకోవడం, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌తో కరచాలనం చేసే సన్నివేశాలను మొదట చిత్రీకరించారు. అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనే నేను అంటూ ప్రమాణ స్వీకారం చేయడం, అది చూస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున కేరింతలు కొట్టే సన్నివేశాలు చిత్రీకరించారు. వ్యూహం చిత్ర షూటింగ్‌తో యూనివర్సిటీ ఎదురుగా ఉన్న మైదానంలో సందడి నెలకొంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, వైఎస్ కుటుంబ అభిమానులు షూటింగ్ చూసేందుకు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పలు సన్నివేశాల చిత్రీకరణలో సూచనలు చేస్తూ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ తనదైన శైలిలో షూటింగ్ కొనసాగించారు. డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ పాత్రలో గుంటూరు మాంటిస్సోరి కళాశాల ప్రిన్సిపాల్ సెబాస్టియన్ నటించారు.

హత్య కేసులో యావజ్జీవం

గుంటూరు లీగల్: హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ 12వ అదనపు జిల్లా జడ్జి, ఫ్యామిలీ కోర్టు జడ్జి పీవీఎస్ సూర్యనారాయణ మూర్తి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. అచ్చంపేట మండలం, గ్రంధశిరి గ్రామానికి చెందిన కిలారి నాగేశ్వరరావు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కిలారి నాగేశ్వరరావుకు నరసరావుపేట మండలం, పమిడిపాడు గ్రామానికి చెందిన జంపాని నాగేశ్వరరావు వరుసకు బాబాయి అవుతాడు. జంపాని నాగేశ్వరరావు భార్య చనిపోవడంతో పిల్లల్ని అక్కడే వదిలి గ్రంధశిరి వచ్చి కిలారి నాగేశ్వరరావుకు చెందిన రేకుల షెడ్డులో ఉన్నాడు. కిలారి, జంపాని ఇద్దరూ రోజూ ఇక్కడే మద్యం తాగుతూ ఉండేవారు. మేకలు కొనుక్కునేందుకు కొంత డబ్బు అప్పుగా ఇవ్వమని జంపాని కోరగా కిలారి రెండు లక్షలు ఇచ్చాడు. మేకలను కొన్న జంపాని కొంతకాలం తరువాత వాటిని అమ్మేశాడు. అయితే కిలారికి ఇవ్వాల్సిన అప్పు డబ్బులు ఇవ్వలేదు. దీనికితోడు కిలారి తమ్ముడు వరదయ్య మృతి చెందడంతో ఆయన భార్య హేమలత జంపానితో చనువుగా ఉంటుంది. ఈ క్రమంలో 2020 డిసెంబర్ 29న కిలారి తన అత్తకు ఒంట్లో బాగోలేదని తెలిసి తన భార్యను తీసుకెళ్లి అదే గ్రామంలో ఉన్న ఆమె ఇంట్లో వదిలిపెట్టి వచ్చాడు. మరుసటి రోజు ఉదయం ఆమె వచ్చే సరికి భర్త ఇంట్లో లేకపోవడంతో వెతకడం ప్రారంభించారు. జంపాని నాగేశ్వరరావుపై అనుమానంతో గది వద్దకు వెళ్లి కిటికీలో నుంచి చూడగా కిలారి తలకు రక్తం కారుతూ మంచంపై పడి ఉన్నాడు. తాళం పగులకొట్టి లోపలికి వెళ్లి చూడగా కిలారి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పక్కన ఇనుప కొడవలి, పొడవాటి చేతి గొడ్డలి ఉంది. వాటికి రక్తం మరకలు ఉన్నాయి. జంపాని నాగేశ్వరరావు కూడా కనిపించకుండా పోయాడు. దీంతో జంపాని నాగేశ్వరరావు, కిలారి హేమలత, కావూరి వెంకట్రావుపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు అనంతరం చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో జంపాని నాగేశ్వరరావుకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. మిగిలిన ఇద్దరిపై నేరం రుజువ కాకపోవడంతో కేసు కొట్టేశారు. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ సీహెచ్.వి.సత్యనారాయణ కేసును వాదించారు.



మనిక సూట్‌కేస్ ఇంటికి చేరింది...

పెరూ ఓపెన్ టోర్నీలో ఆడి స్వదేశం చేరుకునే క్రమంలో... డచ్ విమానయాన సంస్థకు చెందిన కేఎల్ఎమ్ ఎయిర్‌లైన్స్‌లో మరిచిపోయిన తన సూట్‌కేస్ బుధవారం ఉదయం ఇంటికి చేరిందని భారత టేబుల్ టెన్నిస్ స్టార్ మనిక బత్రా తెలిపింది. సూట్‌కేస్ కనిపించకుండాపోయిన విషయాన్ని సంబంధిత ఎయిర్‌లైన్స్ దృష్టికి తెచ్చినా ఆశించిన స్పందన లేకపోవడంతో మనిక కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా దృష్టికి తెచ్చింది. దాంతో పౌరవిమానయాన శాఖ సిబ్బంది చొరవతో సూట్‌కేస్ మనిక ఇంటికి చేరింది. ఈ సందర్భంగా జ్యోతిరాదిత్యకు మనిక ధన్యవాదాలు తెలిపింది.

విజయంతో వొజ్నియాకి పునరాగమనం



ప్రపంచ మహిళల టెన్నిస్ మాజీ నంబర్‌వన్ కరోలైన్ వొజ్నియాకి విజయంతో పునరాగమనం చేసింది. ఈ డెన్మార్క్ స్టార్ 2020లో టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పింది. అనంతరం ఆటపై మక్కువతో మళ్లీ రాకెట్ పట్టాలని 33 ఏళ్ల వొజ్నియాకి నిర్ణయం తీసుకుంది. మాంట్రియల్‌లో జరుగుతున్న నేషనల్ బ్యాంక్ ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 టోర్నీలో జరిగిన తొలి రౌండ్‌లో వొజ్నియాకి 6-3, 6-2తో కింబర్లీ బిరెల్ (ఆస్ట్రేలియా)పై గెలిచింది.



అక్టోబర్ 14న భారత్ X పాకిస్తాన్

ఒకరోజు ముందుకు జరిగిన కీలక సమరం
మొత్తం తొమ్మిది మ్యాచ్‌ల షెడ్యూల్‌లో మార్పులు

ముంబై: వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. మొత్తం 9 మ్యాచ్‌లను రీషెడ్యూల్ చేశారు. అహ్మదాబాద్‌లో నవరాత్రి ఉత్సవాలు... కోల్‌కతాలో కాళీ మాత పూజల కారణంగా తప్పనిసరిగా రెండు మ్యాచ్‌ల తేదీలలో మార్పులు చేయాల్సి వచ్చింది. దీని వల్ల ఇతర మార్పులు కూడా అవసరం కావడంతో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మరో ఏడు మ్యాచ్‌ల తేదీలను కూడా మార్చింది. దీని ప్రకారం టోర్నమెంట్‌కే హైలైట్ మ్యాచ్ అయిన భారత్, పాకిస్తాన్ మధ్య అక్టోబర్ 15న జరగాల్సిన పోరును ఒకరోజు ముందుగా అక్టోబర్ 14న నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లో కూడా అక్టోబర్ 12న జరగాల్సిన పాకిస్తాన్-శ్రీలంక మ్యాచ్ అక్టోబర్ 10కి మారింది. అక్టోబర్ 10న ఇంగ్లండ్, బంగ్లాదేశ్ జట్ల మధ్య డే అండ్ నైట్‌గా జరగాల్సిన మ్యాచ్‌ను డేగా నిర్వహిస్తారు.

మారిన షెడ్యూల్ వివరాలు

మ్యాచ్	పాత తేదీ	కొత్త తేదీ
ఇంగ్లండ్ x బంగ్లాదేశ్	అక్టోబర్ 10 (డే అండ్ నైట్)	అక్టోబర్ 10 (డే)
పాకిస్తాన్ x శ్రీలంక	అక్టోబర్ 12	అక్టోబర్ 10
ఆస్ట్రేలియా x దక్షిణాఫ్రికా	అక్టోబర్ 14	అక్టోబర్ 13
భారత్ x పాకిస్తాన్	అక్టోబర్ 15	అక్టోబర్ 14
ఇంగ్లండ్ x అఫ్గానిస్తాన్	అక్టోబర్ 14	అక్టోబర్ 15
ఆస్ట్రేలియా x బంగ్లాదేశ్	నవంబర్ 12	నవంబర్ 11
ఇంగ్లండ్ x పాకిస్తాన్	నవంబర్ 12	నవంబర్ 11
భారత్ x నెదర్లాండ్స్	నవంబర్ 11	నవంబర్ 12

పృథ్వీ షా 244

- ఇంగ్లండ్ దేశవాళీ వన్డే కప్ టోర్నీలో భారత బ్యాటర్ డబుల్ సెంచరీ
- 153 బంతుల్లో 28 ఫోర్లు, 11 సిక్స్‌లతో మెరుపు ఇన్నింగ్స్



లండన్: ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లో తొలిసారి ఆడుతున్న భారత క్రికెటర్ పృథ్వీ షా దేశవాళీ వన్డే కప్‌లో డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. సోమర్‌సెట్‌తో బుధవారం జరిగిన వన్డే మ్యాచ్‌లో నార్తంప్టన్‌షైర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న 23 ఏళ్ల పృథ్వీ షా విధ్వంసకర ఇన్నింగ్స్‌తో మెరిశాడు. 153 బంతులు ఆడిన పృథ్వీ షా 28 ఫోర్లు, 11 సిక్స్‌లతో 244 పరుగులు సాధించి ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో అవుటయ్యాడు. పృథ్వీ షా అసాధారణ బ్యాటింగ్‌తో మొదట బ్యాటింగ్‌కు దిగిన నార్తంప్టన్‌షైర్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 415 పరుగులు సాధించింది. అనంతరం సోమర్‌సెట్ జట్టు 45.1 ఓవర్లలో 328 పరుగులకు ఆలౌటై 87 పరుగుల తేడాతో ఓడిపోయింది.

నార్తంప్టన్‌షైర్ జట్టు తరఫున మూడో మ్యాచ్ ఆడిన పృథ్వీ షా 81 బంతుల్లో సెంచరీ చేయగా... డబుల్ సెంచరీని 129 బంతుల్లో దాటాడు. ముంబైకి చెందిన పృథ్వీ షాకిది లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో (దేశవాళీ, అంతర్జాతీయ వన్డేలు) రెండో డబుల్ సెంచరీ కావడం విశేషం. 2021లో భారత దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో పుదుచ్చేరిపై పృథ్వీ షా 227 పరుగులతో అజేయంగా నిలిచాడు. 2021 జూలైలో చివరిసారి శ్రీలంక పర్యటనలో భారత జట్టుకు ఆడిన పృథ్వీ షా ఆ తర్వాత ఫామ్ కోల్పోయి జాతీయ జట్టుకు దూరమయ్యాడు.

6 లిస్ట్ 'ఎ'లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ల జాబితాలో పృథ్వీ షాది ఆరో స్థానం. ఈ జాబితాలో తమిళనాడు క్రికెటర్ నారాయణ్ జగదీశన్ (277: అరుణాచల్‌ప్రదేశ్‌పై 2022లో) టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.

వన్డే వరల్డ్ కప్ టికెట్లు రెడీ

- ఆగస్టు 25 నుంచి అందుబాటులో
- ఆగస్టు 15 నుంచి రిజిస్ట్రేషన్
- దశల వారీగా భారత మ్యాచ్‌ల టికెట్లు



దుబాయ్: ఎట్టకేలకు వన్డే వరల్డ్ కప్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా చూడాలనుకునే అభిమానులకు తీపి కబురు! టోర్నీ తొలి మ్యాచ్ కంటే కేవలం 41 రోజుల ముందునుంచి ప్రేక్షకుల కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టికెట్లను అమ్మకానికి ఉంచనుంది. మ్యాచ్‌ల తేదీలనే బాగా ఆలస్యంగా (100 రోజుల ముందు) ప్రకటించిన ఐసీసీ ఇప్పుడు వేర్వేరు కారణాలతో వాటిని సవరించి బుధవారం తుది షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో పాటు ఫ్యాన్స్ తమ ప్రణాళికలు రూపొందించుకునేందుకు వీలుగా టికెట్ల అమ్మకాల వివరాలను కూడా ఐసీసీ వెల్లడించింది. 'భారత్ ఆడే వామప్, ప్రధాన మ్యాచ్‌లు'... 'భారత్ ఆడని ఇతర మ్యాచ్‌లు' అంటూ రెండు రకాలుగా టికెట్ల అమ్మకాలను ఐసీసీ విభజించింది. భారత్ ఆడే 9 లీగ్ మ్యాచ్‌ల టికెట్లను కూడా ఆరు వేర్వేరు దశల్లో (వేదికల ప్రకారం) అమ్మకానికి అందుబాటులో ఉంచుతారు. అయితే ఇతర ద్వైపాక్షిక సిరీస్ మ్యాచ్‌ల తరహాలో నేరుగా అమ్మకపు తేదీ నుంచి టికెట్లు కొనేందుకు అవకాశం ఉండదు. వరల్డ్ కప్ టికెట్ల కోసం అభిమానులు ఆన్‌లైన్‌లో ముందుగా వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. దాని ప్రకారమే ఆ తర్వాత కేటాయింపులు జరుగుతాయి. ఆగస్టు 15 నుంచి అభిమానులు https://www.cricketworldcup.com/register లో తమ వివరాలు నమోదు చేయాలి.

టికెట్ల అమ్మకపు తేదీల వివరాలు

25 ఆగస్టు నుంచి: భారత్ మినహా ఇతర జట్ల వామప్ మ్యాచ్‌లు/ప్రధాన మ్యాచ్‌లు
30 ఆగస్టు నుంచి: భారత్ ఆడే రెండు వామప్ మ్యాచ్‌లు (గువహటి, తిరువనంతపురం)
31 ఆగస్టు నుంచి: చెన్నై (ఆస్ట్రేలియాతో), ఢిల్లీ (అఫ్గానిస్తాన్‌తో), పుణే (బంగ్లాదేశ్‌తో)లలో భారత్ ఆడే మ్యాచ్‌లు
1 సెప్టెంబర్ నుంచి: ధర్మశాల (న్యూజిలాండ్‌తో), లక్నో (ఇంగ్లండ్‌తో), ముంబై (శ్రీలంకతో)లలో భారత్ మ్యాచ్‌లు
2 సెప్టెంబర్ నుంచి: బెంగళూరు (నెదర్లాండ్స్‌తో), కోల్‌కతా (దక్షిణాఫ్రికాతో)లలో భారత్ ఆడే మ్యాచ్‌లు
3 సెప్టెంబర్ నుంచి: అహ్మదాబాద్‌లో (పాకిస్తాన్‌తో) భారత్ ఆడే మ్యాచ్
15 సెప్టెంబర్ నుంచి: సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు

భారత్‌దే పైచేయి

పాకిస్తాన్‌పై 4-0తో ఘనవిజయం • ఆసియా చాంపియన్స్ ట్రోఫీ



చెన్నై: గత ఏడేళ్లుగా చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ జట్టు చేతిలో ఓటమి ఎరుగని భారత హాకీ జట్టు మరోసారి తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా బుధవారం పాకిస్తాన్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 4-0 గోల్స్‌తో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (15వ, 23వ ని.లో) రెండు గోల్స్ చేయగా... జుగ్‌రాజ్ (36వ ని.లో), ఆకాశ్‌దీప్ (55వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. భారత జట్టుకు ఐదు పెనాల్టీ కార్నర్‌లు రాగా ఇందులో మూడింటిని గోల్స్‌గా మలిచింది. ఇతర లీగ్ మ్యాచ్‌ల్లో జపాన్ 2-1తో చైనాపై, మలేసియా 1-0తో కొరియాపై నెగ్గాయి.

పాక్‌పై విజయంతో ఆరు జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో లీగ్ దశ ముగిశాక భారత్ 13 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. 12 పాయింట్లతో మలేసియా రెండో స్థానంలో, 5 పాయింట్లతో దక్షిణ కొరియా, జపాన్, పాకిస్తాన్ సంయుక్తంగా మూడో స్థానంలో, ఒక పాయింట్‌తో చైనా చివరి స్థానంలో నిలిచాయి. కొరియా, జపాన్, పాక్ ఐదు పాయింట్లతో సమంగా ఉన్నా... మెరుగైన గోల్స్ అంతరంతో కొరియా, జపాన్ జట్లకు సెమీఫైనల్ బెర్త్‌లు ఖరారయ్యాయి. దాంతో మాజీ చాంపియన్ పాకిస్తాన్ సెమీఫైనల్ చేరలేకపోయింది. శుక్రవారం 5-6 స్థానాల కోసం జరిగే వర్గీకరణ మ్యాచ్‌లో చైనాతో పాకిస్తాన్... సెమీఫైనల్స్‌లో కొరియాతో మలేసియా; జపాన్‌తో భారత్ ఆడతాయి.

హంపి ఓటమి... హారిక గేమ్ 'డ్రా'





బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ నాలుగో రౌండ్ తొలి గేమ్‌లో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల విభాగంలో కోనేరు హంపి ఓటమి చవిచూడగా... ద్రోణవల్లి హారిక తన గేమ్‌ను 'డ్రా' చేసుకుంది. జార్జియా గ్రాండ్‌మాస్టర్ బెలా ఖొటెనాష్‌విలితో జరిగిన గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన హంపి 42 ఎత్తుల్లో ఓడిపోయింది. ఈ టోర్నీలో నిలవాలంటే నేడు బెలాతో జరిగే రెండో గేమ్‌లో హంపి తప్పనిసరిగా గెలవాలి. ఎలైన్ రోబర్స్ (నెదర్లాండ్స్)తో జరిగిన గేమ్‌ను హారిక 70 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. నేడు వీరిద్దరి మధ్య జరిగే రెండో గేమ్‌లో గెలిచిన ప్లేయర్‌కు క్వార్టర్ ఫైనల్ బెర్త్ లభిస్తుంది. 'డ్రా'గా ముగిస్తే శుక్రవారం టైబ్రేక్ గేమ్‌ల ద్వారా విజేతను నిర్ణయిస్తారు. ఓపెన్ విభాగంలో ఎటిని బాక్రోట్ (ఫ్రాన్స్)తో జరిగిన గేమ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ 30 ఎత్తుల్లో గెలుపొందాడు. గుకేశ్ (భారత్)-ఎసిపెంకో (రష్యా); అర్జున్ (భారత్)-సిందరోవ్ (ఉజ్బెకిస్తాన్); నిహాల్ (భారత్)-నెపోమ్‌నిశి (రష్యా); ప్రజ్ఞానంద (భారత్)-నకముర (అమెరికా) మధ్య జరిగిన గేమ్‌లు 'డ్రా'గా ముగిశాయి.

సినిమా


• మహేశ్‌బాబు

డబుల్ ట్రీట్

బర్త్ డేకి డబుల్ ట్రీట్ ఇచ్చారు మహేశ్‌బాబు. 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'గుంటూరు కారం'. ఈ చిత్రంలో శ్రీలీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఎస్. రాధాకృష్ణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. బుధవారం (ఆగస్టు 9) మహేశ్‌బాబు బర్త్ డే. ఈ సందర్భంగా 'గుంటూరు కారం' సినిమా నుంచి మహేశ్‌బాబుకు చెందిన రెండు పోస్టర్స్‌ను రిలీజ్ చేశారు. ఒక పోస్టర్ ఇంట్లోది, మరొకటి కబడ్డీ గేమ్ ఆడేటప్పుడు అని తెలుస్తోంది. ఇలా డబుల్ పోస్టర్స్‌తో ఫ్యాన్స్‌కి డబుల్ ట్రీట్ ఇచ్చారు మహేశ్‌బాబు. జయరాం, జగపతిబాబు, రమ్యకృష్ణ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు తమన్ స్వరకర్త. సంక్రాంతి సందర్భంగా 'గుంటూరు కారం'ను జనవరి 12న రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఇక ప్రస్తుతం వెకేషన్‌లో భాగంగా ఫారిన్‌లో ఉన్నారు మహేశ్‌బాబు. ఈ నెల మూడో వారంలో ఇండియా చేరుకుంటారని, నాలుగో వారంలో 'గుంటూరు కారం' సినిమా షూట్‌లో జాయిన్ అవుతారని తెలుస్తోంది.

రామ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన సినిమా 'స్కంద'. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటించారు. తాజాగా రామ్, శ్రీలీలపై చిత్రీకరించిన పాటతో 'స్కంద' షూటింగ్ పూర్తయినట్లుగా చిత్ర యూనిట్ వెల్లడించింది. జీ స్టూడియోస్ సౌత్, పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 15న విడుదల కానుంది.


• రామ్, శ్రీలీల

పెళ్లి అనే చాప్టర్‌లోకి అడుగుపెడతా

\- విజయ్ దేవరకొండ


• హేషమ్ అబ్దుల్ వాహబ్, శివ నిర్వాణ, విజయ్ దేవరకొండ, రవిశంకర్, నవీన్

''ఒకప్పుడు నా దగ్గర ఎవరూ పెళ్లి మాట ఎత్తేవారు కాదు. కానీ ఇప్పుడు పెళ్లెప్పుడు అని అడుగుతున్నారు. ఈ మధ్య నా ఫ్రెండ్స్ పెళ్లి చేసుకోవడం, వాళ్ల జీవితాలు చూస్తుంటే నాకు పెళ్లి మీద అయిష్టం పోయింది. పెళ్లనేది లైఫ్‌లో ముఖ్యమైన భాగం. నేనూ ఆ చాప్టర్‌లోకి అడుగుపెడతాను'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం 'ఖుషి'. వై. రవిశంకర్, నవీన్ యెర్నేని నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 1న పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ వేడుకలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ- ''ఆ మధ్య ప్రేమ కథలపై నాకు ఆసక్తి తగ్గింది. 'ఖుషి' కథ విన్నాక మళ్లీ ప్రేమ కథల్లో నటించాలనే ఆసక్తి కలిగింది. ఇప్పుడు దేశవ్యాప్తంగా మన కథలను చూపించే చాన్స్ దక్కుతోంది. ఇలాంటి టైమ్‌లో నేను హీరోగా ఉండటం అదృష్టంగా, గౌరవంగా భావిస్తున్నాను. నేను యాక్టర్ అవుతానని ఊహించి ఉంటే పాన్ ఇండియా లాంగ్వేజెస్ అన్నీ నేర్చుకునేవాణ్ని. సమంత మయోసైటిస్ నుంచి కోలుకుంటే చాలనుకున్నాం. ఆమె కోసం ఆర్నెల్లు కాదు.. పదేళ్లయినా వేచి చూసేవాళ్లం'' అన్నారు. ''ఖుషి'ని ఇంత అందంగా తీర్చిదిద్దిన మా టీమ్‌కి థ్యాంక్స్'' అన్నారు నవీన్ యెర్నేని. ''ఖుషి'లో లవ్, సెలబ్రేషన్ ఉంటాయి'' అన్నారు శివ నిర్వాణ. ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్, కెమెరా: జి. మురళి.



తెలుగమ్మాయి కావడం నాకు ప్లస్

\- కావ్య కల్యాణ్ రామ్

''తెలుగు పరిశ్రమలో తెలుగు అమ్మాయిలకు అవకాశాలు రావటం లేదని ఎందుకు అంటున్నారో అర్థం కావటం లేదు. సావిత్రి, శ్రీదేవి.. వంటి తెలుగు హీరోయిన్లు పెద్ద సక్సెస్‌ను సాధించారు. ఇండియా వైడ్ వాళ్ల కంటే సక్సెస్‌ను ఎవరూ చూడలేదు. నా విషయానికొస్తే తెలుగు అమ్మాయి కావటం నాకు ప్లస్'' అని కావ్య కల్యాణ్ రామ్ అన్నారు. శ్రీ సింహా కోడూరి, కావ్య జంటగా నటించిన చిత్రం 'ఉస్తాద్'. ఫణిదీప్ దర్శకత్వంలో రజినీ కొర్రపాటి, రాకేష్ రెడ్డి గడ్డం, హిమాంక్ రెడ్డి దువ్వూరు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కావ్య కల్యాణ్ రామ్ మాట్లాడుతూ- ''ఉస్తాద్'లో సూర్య అనే పాత్రలో శ్రీ సింహా కనిపిస్తారు. తన బైక్‌ను ఉస్తాద్ అని పిలుచుకుంటుంటాడు. ఇందులో సూర్య ప్రేయసి మేఘనగా నటించాను. నా పాత్ర నేటి తరం అమ్మాయిలకు కనెక్ట్ అవుతుంది. ఇవాళ రజనీకాంత్‌గారి 'జైలర్', శుక్రవారం చిరంజీవిగారి 'భోళా శంకర్', శనివారం మా 'ఉస్తాద్' రిలీజవుతున్నాయి. ఆ ఇద్దరు లెజెండ్స్ సినిమాలను చూసే ప్రేక్షకుల్లో సగం మంది అయినా మా సినిమాను చూస్తే చాలు. మా సినిమా హిట్'' అన్నారు.

మలయాళ దర్శకుడు సిద్ధిఖీ కన్నుమూత



మలయాళ ప్రముఖ దర్శక-నిర్మాత-నటుడు-రచయిత సిద్ధిఖీ ఇస్మాయిల్ (63) కన్నుమూశారు. గుండెపోటు కారణంగా కొచ్చిలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేరిన సిద్ధిఖీ పలు ఆరోగ్య సమస్యల కారణంగా తుదిశ్వాస విడిచారని సమాచారం. 1960 ఆగస్టు 1న కొచ్చిలో జన్మించారు సిద్ధిఖీ. తొలుత మలయాళ దర్శకుడు ఫాజిల్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరారు. కొంత కాలం అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశాక మరో అసిస్టెంట్ డైరెక్టర్ లాల్‌తో కలిసి తొలి సినిమా 'రామ్‌జీ రావ్ స్పీకింగ్' (1989)కి దర్శకత్వం వహించారు సిద్ధిఖీ. ఆ చిత్రం ఘనవిజయం సాధించింది. ఆ తర్వాత సిద్ధిఖీ, లాల్ కలిసి పలు సినిమాలను తెరకెక్కించారు. 'కాబూలీవాలా' తర్వాత సిద్ధిఖీ-లాల్ దర్శకులుగా విడిపోయారు. ఆ తర్వాత మమ్ముట్టీతో సిద్ధిఖీ తెరకెక్కించిన 'హిట్లర్' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. 'హిట్లర్' తెలుగు రీమేక్‌లో చిరంజీవి హీరోగా నటించగా, ముత్యాల సుబ్బయ్య దర్శకత్వం వహించారు. ఇక దర్శకుడిగా పలు తమిళ, మలయాళ చిత్రాలను తెరకెక్కించారు సిద్ధిఖీ. 2010లో దిలీప్, నయనతార హీరో హీరోయిన్లుగా సిద్ధిఖీ దర్శకత్వంలో వచ్చిన 'బాడీగార్డ్' సూపర్‌డూపర్ హిట్ సాధించింది. ఈ సినిమా తెలుగు రీమేక్‌లో వెంకటేశ్, తమిళంలో విజయ్, హిందీలో సల్మాన్ ఖాన్ నటించారు. సిద్ధిఖీ చివరి సినిమా 'బిగ్ బ్రదర్' 2020లో విడుదలైంది. ఇక తెలుగులో నితిన్ హీరోగా సిద్ధిఖీ 'మారో' (2011) చిత్రానికి దర్శకత్వం వహించారు. సిద్ధిఖీ మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆత్మగౌరవం నేపథ్యంలో...


• అమల

లక్ష్మణ్ చిన్నా ప్రధాన పాత్రలో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'నచ్చినవాడు'. ఈ సినిమాలోని 'తోడై నువ్వుండక..' పాట లిరికల్ వీడియోను అక్కినేని అమల విడుదల చేసి, సినిమా హిట్ అవ్వాలన్నారు. ''మహిళల ఆత్మగౌరవం నేపథ్యంలో అల్లిన ప్రేమకథా చిత్రం ఇది. కామెడీ, నేటి యువతరానికి కావాల్సిన అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి'' అన్నారు లక్ష్మణ్. రమేష్, కె. దర్శన్, నాగేంద్ర అరుసు, లలిత నాయక్ కీలక పాత్రలు పోషించిన ఈ సినిమాకు మిజో జోసెఫ్ స్వరకర్త.

రీల్స్

మై హూ డాన్


• రణ్‌వీర్ సింగ్

బాలీవుడ్‌లో కొత్త డాన్ వచ్చాడు. 'మై హూ డాన్' అంటున్నారు రణ్‌వీర్ సింగ్. షారుక్ ఖాన్ హీరోగా 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్', 'డాన్ 2: ది కింగ్ ఈజ్ బ్యాక్' సినిమాలను డైరెక్ట్ చేసిన ఫర్హాన్ అక్తర్ బుధవారం 'డాన్ 3' సినిమాను ప్రకటించారు. ఇందులో డాన్‌గా రణ్‌వీర్ సింగ్ నటించనున్నట్లు వెల్లడించారు. 'నిద్ర పోతున్న సింహం లేచిందని ప్రపంచానికి తెలియాలి.. వెళ్లి చెప్పు.. నేను తిరిగొస్తున్నానని', 'నేనే డాన్ని..' అనే డైలాగ్స్ 'డాన్ 3' అనౌన్స్‌మెంట్ వీడియోలో వినిపిస్తాయి. 'డాన్ 3' సినిమా షూటింగ్‌ను ఈ ఏడాది చివర్లో ప్రారంభించి, 2025లో రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

అనుకున్న ఓపెనింగ్స్ వస్తాయి


• అనిల్ సుంకర

''మాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సాగే చిత్రం 'భోళా శంకర్'. బ్రదర్-సిస్టర్ ఎమోషన్ అందరికీ కనెక్ట్ అవుతుంది. మేం అనుకున్న ఓపెనింగ్స్ కచ్చితంగా వస్తాయి'' అన్నారు అనిల్ సుంకర. చిరంజీవి హీరోగా మెహర్ రమేష్ దర్శకత్వం వహించిన చిత్రం 'భోళా శంకర్'. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా శుక్రవారం రిలీజవుతోంది. అనిల్ సుంకర మాట్లాడుతూ- ''సరిలేరు నీకెవ్వరు' సినిమా వేడుక కోసం చిరంజీవిగారిని ఆహ్వానించడానికి వెళ్లినప్పుడు 'మనం సినిమా చేస్తున్నాం' అన్నారాయన. అలా 'వేదాళం' రీమేక్‌ని ఆయనతో 'భోళా శంకర్'గా రూపొందించాం. ప్రస్తుతం మా 14 రీల్స్‌లో బెల్లంకొండ శ్రీనివాస్‌తో ఓ సినిమా చేస్తున్నాం'' అన్నారు.

పొల్లాచ్చిలో ఆటా పాటా


• విరాట్, శ్రీకాంత్, ప్రగతి

విరాట్ కర్ణ, ప్రగతి శ్రీవాస్తవ జంటగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పెద్ద కాపు-1'. మిర్యాల సత్యనారాయణ రెడ్డి సమర్పణలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని చివరి పాట చిత్రీకరణ పొల్లాచ్చిలో జరుగుతోంది. హీరో, హీరోయిన్లపై చిత్రీకరిస్తున్న ఈ పాటకు రాజు సుందరం కొరియోగ్రాఫర్. ''అణచివేత, ఘర్షణల నేపథ్యంలో సాగే చిత్రమిది. న్యూ ఏజ్ పొలిటికల్ డ్రామాగా రూపొందుతోంది. పొల్లాచ్చిలో తీస్తున్న పాటతో షూటింగ్ పూర్తవుతుంది'' అని యూనిట్ పేర్కొంది.

నవ్వించే పార్ట్‌నర్


• హన్సిక, ఆది పినిశెట్టి

ఆది పినిశెట్టి, హన్సిక హీరో హీరోయిన్లుగా మనోజ్ దామోదరన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పార్ట్‌నర్'. ఫ్యాంటసీ కామెడీ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని బీజీ గోవింద్‌రాజు సమర్పణలో ఎంఎస్ మురళీధర్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. 'హిలేరియస్ ఫ్యాంటసీ ఎంటర్‌టైనర్‌గా అందర్నీ అలరించేలా మా సినిమా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.

సాక్షి బిజినెస్

గురువారం
10-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 149	నిఫ్టీ ▲ 62
65,996	19,633

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	13,793	▽	92
డోజోన్స్	35,247	▽	67
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,587	▲	60
డాక్స్	15,853	▲	78
షాంఘై	3,244	▽	16
నికాయ్	32,204	▽	173

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,901	▲	11
బంగారం (99.5 స్వచ్ఛత)	59,137	▲	11
వెండి (కిలో)	70,127	▽	797

మెర్సిడెస్ కొత్త జీఎల్‌సీ



న్యూఢిల్లీ: లగ్జరీ వాహనాల తయారీలో ఉన్న మెర్సిడెస్–బెంజ్ ప్రీమియం ఎస్‌యూవీ జీఎల్‌సీ కొత్త వెర్షన్‌ను భారత మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఎక్స్‌షోరూంలో ఈ కారు ప్రారంభ ధర రూ.73.5 లక్షలు. పెట్రోల్, డీజిల్ పవర్‌ట్రెయిన్స్‌తో లభిస్తుంది. ఇప్పటికే 1,500ల పైచిలుకు బుకింగ్స్ నమోదయ్యాయని కంపెనీ ప్రకటించింది. భారత్‌లో మెర్సిడెస్‌కు అత్యధికంగా అమ్ముడవుతున్న ఎస్‌యూవీ ఇదే. తొలిసారిగా మెర్సిడెస్ కార్లలో ఎన్‌టీజీ 7 ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌ను పొందుపరిచారు. 2 లీటర్ పెట్రోల్ ఇంజన్‌తో తయారైన జీఎల్‌సీ 300 4మేటిక్ గరిష్ట వేగం గంటకు 240 కిలోమీటర్లు.

జీఎస్‌టీ మార్పులకు కేబినెట్ ఓకే

- ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోలు, గుర్రపు పందెం క్లబ్‌లపై 28 శాతం పన్ను
- ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోలు, గుర్రపు పందెం క్లబ్‌లలో బెట్టింగ్‌ల ప్రవేశ స్థాయి పూర్తి ముఖ విలువపై 28 శాతం పన్ను విధించేలా వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) చట్టాల్లో మార్పులకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపిందని అత్యున్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి సెంట్రల్ జీఎస్‌టీ (సీజీఎస్‌టీ), ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ (ఐజీఎస్‌టీ) చట్టాల్లో సవరణలకు ఆగస్టు 2వ తేదీన జరిగిన 51వ జీఎస్‌టీ మండలి భేటీలో ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. సంబంధిత చట్ట సవరణలను ఆగస్టు 11న ముగియనున్న ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టవచ్చని ఆ వర్గాలు వెల్లడించాయి. ప్రవేశ స్థాయి పందెం పూర్తి ముఖ విలువపై 28% జీఎస్‌టీ విధించడం వల్ల ఈ పన్ను రాబడులు పెరుగుతాయి. రిజిస్ట్రేషన్, పన్ను చెల్లింపు నిబంధనలను పాటించడంలో విఫలమైతే, విదేశాల్లోని ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లకు యాక్సెస్ నిరోధించడం కూడా సవరణల్లో భాగంగా ఉన్నట్లు ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి.

అక్టోబర్ నుంచి అమల్లోకి

జీఎస్‌టీ చట్టాలలో సవరించిన నిబంధనలు అక్టోబర్ 1 నుండి అమలులోకి వస్తాయి. ఆన్‌లైన్ గేమింగ్, ఆన్‌లైన్ మనీ గేమింగ్‌లతోపాటు ఆన్‌లైన్ గేమ్‌లకు చెల్లించడానికి ఉపయోగించే వర్చువల్ డిజిటల్ అసెట్స్ అలాగే ఆన్‌లైన్ గేమింగ్ విషయంలో సప్లయర్ వంటి పదాలకు తాజా సవరణలలో విస్పష్ట నిర్వచనాలు కూడా ఉండడం గమనార్హం. అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, ప్రతినిధులతో కూడిన ఆగస్టు 2 మండలి సమావేశం అనంతరం, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో సీజీఎస్‌టీ, ఐజీఎస్‌టీ సవరణలు ప్రవేశపెట్టాలని భావిస్తున్నట్లు తెలిపారు. కాగా, ఈ నిర్ణయాల విషయంలో రాష్ట్రాలు తమ తమ అసెంబ్లీలలో రాష్ట్ర జీఎస్‌టీ చట్టానికి సవరణలను ఆమోదిస్తాయి.

ప్రస్తుత పన్నుల తీరు

ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ, కొన్ని గుర్రపు పందెం క్లబ్‌లు ప్రస్తుతం ప్లాట్‌ఫామ్ ఫీజు/కమీషన్ (5–20%) పూర్తి ముఖ విలువలో 18% చొప్పున జీఎస్‌టీని చెల్లిస్తున్నాయి. అయితే కొన్ని గుర్రపు పందెం క్లబ్‌లు పూర్తి ముఖ విలువపై 28% చెల్లిస్తున్నాయి. బెట్టింగ్, జూదం రూపంలో చర్య తీసుకోగల క్లెయిమ్‌లపై విధిస్తున్న ఈ తరహా 28% లెవీపై ఆయా క్లబ్‌లు న్యాయపోరాటం చేస్తున్నాయి. క్యాసినోలూ ప్రస్తుతం స్థూల గేమింగ్ రెవెన్యూ (జీజీఆర్)పై 28% జీఎస్‌టీ చెల్లిస్తున్నాయి. ప్రవేశ స్థాయి పందెం పూర్తి ముఖ విలువపై 28% జీఎస్‌టీ వల్ల ఖజానాకు మరింత మొత్తం సమకూరనుంది.

మూడు రోజుల్లోనే లిస్టింగ్

- సెబీ తాజా నిర్ణయం
- ఐపీవో ఇన్వెస్టర్లకు ప్రయోజనం



న్యూఢిల్లీ: ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)లకు సంబంధించి సెబీ సానుకూల నిర్ణయం తీసుకుంది. ఐపీవో ఇష్యూ ముగిసిన రోజు నుంచి ఆరు పని దినాల్లో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో ప్రస్తుతం లిస్ట్ కావాల్సి ఉండగా, దీన్ని మూడు రోజులకు తగ్గించింది. అంటే ఇకపై ఐపీవో ముగిసిన రోజు తర్వాత నుంచి మూడో పనిదినం రోజున ఆ కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో లిస్ట్ కావాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 1, ఆ తర్వాత నుంచి వచ్చే ఐపీవోలకు మూడు రోజుల లిస్టింగ్ నిబంధన ఐచ్ఛికమే. అంటే ఇప్పటి మాదిరే ఆరు రోజులు (టీప్లస్6) లేదంటే మూడు రోజుల గడువు (టీప్లస్3)ను కంపెనీలు అనుసరించొచ్చు. కానీ, డిసెంబర్ 1 నుంచి మాత్రం విధిగా అన్ని ఐపీవోలు మూడు రోజుల లిస్టింగ్ నిబంధననే అమలు చేయాల్సి ఉంటుందని సెబీ తన ఆదేశాల్లో స్పష్టం చేసింది.

అందరికీ అనుకూలమే

సెబీ నిర్ణయం చిన్న ఇన్వెస్టర్ల నుంచి పెద్ద ఇన్వెస్టర్ల వరకు ఎంతో ప్రయోజనం కలిగించనుంది. షేర్ల కేటాయింపు లేకపోతే బ్యాంక్ ఖాతాల్లో బ్లాక్ అయిన నిధులు తొందరగా విడుదల అవుతాయి. రుణం తీసుకుని ఐపీవోల్లో దరఖాస్తు చేసే హెచ్‌ఎన్ఐలు కూడా ఉంటారు. వీరికి రోజుల వారీగా రుణంపై వడ్డీ భారం పడుతుంది. తొందరగా లిస్ట్ అయితే, తాము తీసుకున్న రుణాన్ని తొందరగా తీర్చేసే వీలుంటుంది. అటు ఐపీవోకు వచ్చిన కంపెనీలకూ ప్రయోజనమే. ఎలా అంటే ఐపీవో నిధులను అవి వేగంగా పొందొచ్చు. ఏఎస్‌బీఏ కింద షేర్లు అలాట్ కాని వారి నిధులను బ్యాంకు ఖాతాల్లో టీప్లస్3 రోజున అన్‌బ్లాక్ చేయాల్సి ఉంటుంది. లేదంటే వారికి చెల్లించే పరిహారం అనేది టీప్లస్3 తర్వాతి రోజు నుంచి అమల్లోకి వస్తుందని సెబీ తెలిపింది.

జీఎంఆర్ పవర్‌కు రూ. 217 కోట్ల నష్టం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఎంఆర్ పవర్, అర్బన్ ఇన్‌ఫ్రా జూన్ త్రైమాసికంలో రూ.217 కోట్ల నష్టం చవిచూసింది. గతేడాది ఇదే కాలంలో కంపెనీ రూ.201 కోట్ల నికరలాభం నమోదు చేసింది. టర్నోవర్ రూ.1,163 కోట్ల నుంచి రూ.1,190 కోట్లకు ఎగసింది. ఫలితాల నేపథ్యంలో జీఎంఆర్ పవర్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో బుధవారం 8.42 శాతం అధికమై రూ.21.38 వద్ద స్థిరపడింది.

టాటా పవర్ లాభం అప్



క్యూ1లో రూ. 1,141 కోట్లు

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం టాటా పవర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 29 శాతం జంప్‌చేసి రూ. 1,141 కోట్లకు చేరింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 884 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 14,639 కోట్ల నుంచి రూ. 15,485 కోట్లకు ఎగసింది. వరుసగా 15వ త్రైమాసికంలోనూ పటిష్ట లాభాలు ఆర్జించినట్లు కంపెనీ సీఈవో, ఎండీ ప్రవీర్ సిన్హా పేర్కొన్నారు. గ్రీన్ఎనర్జీ, ప్రసారం, పంపిణీ బిజినెస్‌లలో ఈ ఏడాది రూ. 12,000 కోట్ల పెట్టుబడులు వెచ్చించే ప్రణాళికలున్నట్లు చెప్పారు.

టాటా పవర్ షేరు బీఎస్‌ఈలో 0.5 శాతం బలపడి రూ. 235 వద్ద ముగిసింది.

నాట్కో రూ. 7 డివిడెండ్

క్యూ1లో లాభం రూ. 420 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఔషధ రంగ సంస్థ నాట్కో ఫార్మా రూ. 420 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ1లో నమోదైన రూ. 320 కోట్లతో పోలిస్తే ఇది 31 శాతం అధికం. మరోవైపు, ఆదాయం రూ. 919 కోట్ల నుంచి సుమారు 26 శాతం వృద్ధి చెంది రూ. 1,160 కోట్లకు చేరింది. రూ. 2 ముఖ విలువ చేసే షేరు ఒక్కింటికి రూ. 7 చొప్పున కంపెనీ మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ప్రధానంగా ఫార్ములేషన్ ఎగుమతులు పెరగడం, దేశీయంగా ఫార్మా.. ఆగ్రో వ్యాపార విభాగాలు వృద్ధి చెందడం తదితర అంశాలు మెరుగైన పనితీరుకు దోహదపడినట్లు వెల్లడించింది. పెండింగ్‌లో ఉన్న పేటెంటు ఉల్లంఘన లిటిగేషన్ కేసులకు సంబంధించి రూ. 51 కోట్లు కేటాయించినట్లు, అలాగే క్యూ1లో ఉద్యోగులకు ప్రత్యేక ఇన్సెంటివ్‌ల కింద రూ. 17 కోట్లు చెల్లించినట్లు సంస్థ తెలిపింది.

ఆదుకున్న ఆఖర్లో కొనుగోళ్లు

- కనిష్ట స్థాయిల నుంచి రికవరీ
- ఇంట్రాడేలో ఒడిదుడుకుల ట్రేడింగ్
- 19,600 పాయింట్లపైకి నిఫ్టీ



ముంబై: ట్రేడింగ్ చివర్లో ఐటీ, మెటల్, ఆటో, ఫార్మా, ఎఫ్‌ఎంసీజీ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బుధవారం కనిష్ట స్థాయిల నుంచి రికవరీ అయ్యాయి. ఇంట్రాడేలో 402 పాయింట్లను కోల్పోయిన సెన్సెక్స్ చివరికి 64 పాయింట్ల లాభంతో 65,996 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 102 పాయింట్ల పతనం నుంచి తేరుకొని 61 లాభంతో 19,633 వద్ద ముగిసింది. యూరప్ మార్కెట్ల సానుకూల ప్రభావం, నేడు వెలువడే ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ దేశీయ ఆర్థిక వృద్ధిపై ప్రభావాన్ని చూపదనే ఆశలు సూచీల నష్టాల రికవరీకి కలిసొచ్చాయి. అలాగే అధిక వెయిటేజీ ఐటీసీ, రిలయన్స్ షేర్లు ఒకశాతం వరకు రాణించి తమ వంతు తోడ్పాటు అందించాయి. బ్యాంకులు, ఫైనాన్స్, రియల్టీ షేర్లు నష్టాలు చవిచూశాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ సూచీలు 0.57%, 0.39 శాతం చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ. 2,289 కోట్ల విలువైన షేర్లను అమ్మారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.553 కోట్ల విలువైన షేర్లను కొన్నారు. ఆసియాలో అత్యధిక మార్కెట్లు నష్టపోయాయి. యూరప్ సూచీలు లాభపడ్డాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- అదానీ విల్మార్ షేరు 4% నష్టపోయి రూ.378 వద్ద స్థిరపడింది. ప్రమోటర్ గౌతమ్ అదానీ ఈ కంపెనీలో వాటాను విక్రయించనున్నారనే వార్తలు షేరు పతనానికి కారణమయ్యాయి.
- జూన్ క్వార్టర్‌లో నికర లాభం 29.6% వృద్ధి చెందడంతో ఇక్రాన్ ఇంటర్నేషన్ షేరు 7% ర్యాలీ చేసి రూ.106.50 వద్ద నిలిచింది.
- ప్రోత్సాహకర తొలి త్రైమాసిక ఫలితాల ప్రకటనతో కళ్యాణ్ జ్యువెలరీ షేరు 3% లాభపడి రూ.183 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 6% ఎగసి రూ.189 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.

తగ్గిన తాజ్ జీవీకే లాభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆతిథ్య రంగంలో ఉన్న తాజ్ జీవీకే హోటల్స్, రిసార్ట్స్ జూన్ త్రైమాసికంలో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.16 కోట్ల నుంచి రూ.13 కోట్లకు వచ్చి చేరింది. ఎబిటా రూ.30.5 కోట్ల నుంచి రూ.26 కోట్లకు పడిపోయింది. టర్నోవర్ రూ.86 కోట్ల నుంచి రూ.92 కోట్లకు ఎగసింది. ఫలితాల నేపథ్యంలో తాజ్ జీవీకే షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో బుధవారం 8.99 శాతం క్షీణించి రూ.251.95 వద్ద స్థిరపడింది.

ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌లో పతంజలి ఫుడ్స్

హైదరాబాద్: పతంజలి ఫుడ్స్ అస్సాం రాష్ట్రం తిన్‌సుకియా జిల్లాలో అస్సాం వ్యవసాయ శాఖ నిర్వహించిన 'ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్'లో పాల్గొంది. పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు అస్సాం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, రాందేవ్ బాబాతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. పామాయిల్ సాగుకు 20 హెక్టార్ల పరిధిలో 2800 మొక్కలను ఎంపిక చేసిన రైతులకు పంపిణీ చేశారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-8-2023	
విశాఖ	455-00
చిత్తూరు	483-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	445-00
విజయవాడ	445-00
రిటైల్ ధర (డజను)	72.00
9-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)-2023

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)ల్లో.. మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ అడిషన్ టెస్ట్(క్యాట్)–2023 నోటిఫికేషన్ విడుదలైంది.

» **దేశవ్యాప్తంగా ఉన్న ఐఐఎంలు:** అహ్మదాబాద్, అమృత్‌సర్, బెంగళూరు, బోధ్ గయ, కోల్‌కతా, ఇండోర్, జమ్మూ, కాశీపూర్, కోజికోడ్, లక్నో, నాగ్‌పూర్, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మార్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం.

» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు ఉన్నా అర్హులే). డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు:** అనంతపురం,చిత్తూరు,గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్. ఈ ఏడాది దేశవ్యాప్తంగా మొత్తం 155 నగరాల్లో పరీక్షను నిర్వహించనున్నారు.

» **పరీక్ష విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు.పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్–1 వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రెహెన్షన్, సెక్షన్–2 డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్,సెక్షన్–3 క్వాంటిటేటివ్ ఎబిలిటీ విభాగాల్లో ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు ఉంటాయి. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆయా సంస్థలు గ్రూప్ డిస్కషన్,రిటెన్ ఎబిలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 13.09.2023
» **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేదీలు:** 25.10.2023 నుంచి 26.11.2023 వరకు.
» **పరీక్ష తేది:** 26.11.2023.
» **ఫలితాల ప్రకటన:**2024 జనవరి రెండో వారం
» **వెబ్‌సైట్:** https://iimcat.ac.in

గేట్-2024

ఐఐటీలు, నిట్‌లు వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో పీజీ, డాక్టోరల్ కోర్సుల్లో ప్రవేశానికి ఏటా నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్)–2024 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్ష స్కోరు ఉన్నత విద్యతోపాటు పలు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాల ఎంపికకు ఉపయోగపడుతుంది. ఈసారి గేట్‌ను బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ) నిర్వహించనుంది.

» **అర్హత:** ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, సైన్స్, హ్యుమానిటీస్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

» **వయసు:** గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.

» **పరీక్ష విధానం:** అభ్యర్థులను కంప్యూటర్ ఆధారిత పరీక్షలో వచ్చిన స్కోర్ ఆధారంగా ఎంపికచేస్తారు. పరీక్షకు 3 గంటల వ్యవధి ఉంటుంది. అభ్యర్థులు 1 లేదా 2 పేపర్లను ఎంపికచేసుకోవచ్చు. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 24.08.2023
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 29.09.2023.
» **అపరాధ రుసుముతో దరఖాస్తుకు చివరితేది:** 13.10.2023.
» **పరీక్ష తేదీలు:** 03.02.2024, 04.02.2024, 10.02.2024, 11.02.2024.
» **పరీక్ష ఫలితాల విడుదల తేది:** 16.03.2023.
» **వెబ్‌సైట్:** https://gate2024.iisc.ac.in

ఏపీపీఎస్సీ-ఆర్ఐఎంసీలో ఎనిమిదో తరగతిలో ప్రవేశాలు

ఏపీపీఎస్సీ ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ(ఆర్ఐఎంసీ)లో జూలై–2024 టర్మ్ ఎనిమిదో తరగతిలో ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2024 జూలై నాటికి ఏడో తరగతి చదువుతున్న లేదా ఏడో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు.
» **వయసు:** 01.07.2024 నాటికి పదకొండున్నర ఏళ్లకు తగ్గకుండా పదమూడేళ్లకు మించకుండా ఉండాలి. 02.07.2011 నుంచి 01.01.2013 మధ్య జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, వైవా వోస్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫీజు చెల్లించాలి. ఆర్ఐఎంసీ పంపిన దరఖాస్తు ఫారం నింపి అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి అసిస్టెంట్ సెక్రటరీ(ఎగ్జామ్స్), ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్, న్యూ హెడ్స్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్స్ బిల్డింగ్, రెండో అంతస్తు, ఆర్టీఏ కార్యాలయం దగ్గర, ఎంజీ రోడ్డు, విజయవాడ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.10.2023.
» **పరీక్ష తేది:** 02.12.2023.
» **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

ఫ్రాన్స్‌లో.. చదువు.. కొలువు!

» ఫ్రాన్స్‌లో అయిదేళ్లు పోస్ట్ స్టడీ వర్క్ అవకాశం
» చదువు పూర్తి చేసుకుంటూనే కొలువుకు దరఖాస్తు
» అయిదేళ్ల తర్వాత పర్మనెంట్ రెసిడెన్సీకి మార్గం
» ఐదేళ్ల షెన్‌జెన్ వీసాలు ఇవ్వనున్నట్లు వెల్లడి

ఫ్రాన్స్ ప్రభుత్వం భారతీయ విద్యార్థులకు మేలు చేసే నిర్ణయం తీసుకుంది! ఆ దేశంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో చేరిన భారత విద్యార్థులు.. కోర్సు పూర్తయ్యాక అయిదేళ్లపాటు అక్కడే ఉండి ఉద్యోగం చేసుకోవచ్చని పేర్కొంది. అంటే.. పోస్ట్ స్టడీ వర్క్ గడువును అయిదేళ్లకు పెంచింది. దీంతోపాటు తాజాగా భారత విద్యార్థులకు ఐదేళ్ల కాలపరిమితితో షెన్‌జెన్ వీసాలను జారీ చేసే యోచనలో ఉన్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో.. ఫ్రాన్స్‌లో ఉన్నత విద్య, పోస్ట్ స్టడీ వర్క్ తాజా నిబంధనలు, ఉద్యోగావకాశాలపై ప్రత్యేక కథనం..



ఫ్రాన్స్.. మన దేశ స్టడీ అబ్రాడ్ విద్యార్థులకు టాప్–10 దేశాల జాబితాలో నిలుస్తోంది. అధికారిక గణాంకాల ప్రకారం–2019లో పది వేల మంది భారత విద్యార్థులు ఆ దేశంలోని వివిధ యూనివర్సిటీల్లో చేరారు. కోవిడ్ కారణంగా 2020, 2021లలో మాత్రం ఆ సంఖ్య ఎనిమిది వేలు చొప్పున ఉంది.

ఐదేళ్ల షెన్‌జెన్ వీసా

ఇటీవల కాలంలో భారత విద్యార్థులను ఆకట్టుకునేలా ఫ్రాన్స్ ప్రభుత్వం పలు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా 2030 నాటికి కనీసం 30 వేల మంది భారత విద్యార్థులను ఆకర్షించేలా నిబంధనలను సరళీకృతం చేస్తోంది. అందుకోసం ఇప్పటికే ఐదేళ్ల పోస్ట్ స్టడీ వర్క్‌ను ప్రకటించిన ఆ దేశం.. తాజాగా ఐదేళ్ల కాల పరిమితితో షెన్‌జెన్ వీసాలను జారీ చేసే యోచనలో ఉన్నట్లు తెలిపింది. ఫ్రాన్స్‌లో కనీసం ఒక సెమిస్టర్ చదివి ఉండి.. భారత్, ఫ్రాన్స్ లేదా మరే దేశంలోనైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మాస్టర్ డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ స్థాయి కోర్సులు పూర్తిచేసిన భారతీయులు ఈ వీసా పొందేందుకు అర్హులని ఫ్రాన్స్ ఎంబసీ అధికారక ప్రకటనలో వెల్లడించింది.

పోస్ట్ స్టడీ వర్క్

భారత విద్యార్థులను ఆకట్టుకునే చర్యల్లో భాగంగా ఫ్రాన్స్ పోస్ట్ స్టడీ వర్క్ గడువును అయిదేళ్లకు పెంచింది. ప్రస్తుతం ఈ గడువు రెండేళ్లుగా ఉంది. ఈ ఏడాది నుంచి దీన్ని అయిదేళ్లకు పెంచుతూ కొద్దిరోజుల క్రితమే ప్రకటన విడుదలైంది. ఫ్రాన్స్‌లో పోస్ట్ స్టడీ వర్క్ అవకాశాలు కోరుకునే విద్యార్థులు ఏపీఎస్ పేరిట జారీ చేసే టెంపరరీ రెసిడెంట్ పర్మిట్(తాత్కాలిక నివాస అనుమతి)కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ అనుమతి పొందిన వారు తమ కోర్సు పూర్తయ్యాక ఏడాది కాలం ఫ్రాన్స్‌లోనే ఉండి.. ఉద్యోగాన్వేషణ సాగించొచ్చు. ఈ సమయంలో వారు వారానికి 20 గంటలు, ఏడాదికి గరిష్టంగా 964 గంటలు పార్ట్ టైమ్ జాబ్ చేసుకుంటూ శాశ్వత కొలువు కోసం అన్వేషణ సాగించొచ్చు.

టెంపరరీ ఎంప్లాయీ పర్మిట్

పోస్ట్ స్టడీ వర్క్ విధానంలో భాగంగా ముందుగా టెంపరరీ ఎంప్లాయీ లేదా టెంపరరీ వర్కర్ రెసిడెంట్ పర్మిట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. దీనికి దరఖాస్తు చేసుకునే ముందు అభ్యర్థులు కనీస వేతన నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగం పొందాల్సి ఉంటుంది. టెంపరరీ రెసిడెంట్ ఎంప్లాయి పర్మిట్ పూర్తయ్యాక లేదా ఉద్యోగ గడువు ముగిశాక.. పూర్తి స్థాయి రెసిడెంట్ పర్మిట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ తర్వాత అక్కడే శాశ్వత నివాసం ఉంటూ ఉద్యోగం కొనసాగించొచ్చు.

ఈ రంగాల్లో డిమాండ్

ఫ్రాన్స్‌లో మాన్యుఫ్యాక్చరింగ్, మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్, హాస్పిటాలిటీ, టూరిజం సెక్టార్స్ ఉద్యోగాలు కల్పించడంలో ముందంజలో నిలుస్తున్నాయి. వీటిలో.. ఇంజనీర్స్, మేనేజర్స్, ప్రోగ్రామర్స్, అగ్రికల్చరల్ ఇంజనీర్స్ వంటి కొలువులు సొంతం చేసుకోవచ్చు. టూరిజం సెక్టార్‌లోనూ ప్లానర్స్, హోటల్ మేనేజర్స్ వంటి కొలువులు దక్కించుకోవచ్చు.

వేతనాలు ఆకర్షణీయం

ఫ్రాన్స్‌లోని పలు రంగాలకు చెందిన సంస్థలు ఆకర్షణీయ వేతనాలను అందిస్తున్నాయి. అధికారిక గణాంకాల ప్రకారం–సగటు వేతనం నెలకు రూ.3,085 యూరోలుగా ఉంది. కనీస వేతనం నెలకు రూ.1,708 యూరోలు ఉండాలనే నిబంధనను ఫ్రాన్స్ ప్రభుత్వం అమలు చేస్తోంది.

ప్రముఖ వర్సిటీలకు కేరాఫ్

ఫ్రాన్స్ పలు ప్రముఖ యూనివర్సిటీలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. ఎకోల్ నార్మల్ సుపీరియర్; ఎకోల్ పాలిటెక్నిక్; యూనివర్సిటీ పియెర్రె ఎట్ మేరీ క్యూరీ; సెంట్రల్ సుపీలెక్; ఎకోల్ నార్మల్ సుపీరియర్ డె లియన్; యూనివర్సిటీ గ్రెనోబల్; ప్యారిస్ యూనివర్సిటీ; యూనివర్సిటీ డి స్ట్రాస్‌బర్గ్; ప్యారిస్ యూనివర్సిటీ డిడెరట్; యూనివర్సిటీ డి మాంట్‌పెల్లెర్ వంటి పలు ప్రముఖ యూనివర్సిటీలు ఉన్నాయి. పీఎస్‌ఎల్ రీసెర్చ్ యూనివర్సిటీ, సార్‌బోన్ యూనివర్సిటీలకు క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లోనూ చోటు లభిస్తోంది.

ఫీజులు

ఫ్రాన్స్‌లోని ప్రభుత్వ యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్స్‌లో ఫీజులు తక్కువగానే ఉంటాయి. ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల వార్షిక ఫీజు 620 యూరోలుగా; మేనేజ్‌మెంట్ కోర్సుల ఫీజు 4,500 యూరోల నుంచి ఏడు వేల యూరోల వరకు ఉంటుంది. హ్యుమానిటీస్,ఆర్ట్స్ తదితర ట్రెడిషనల్ కోర్సులకు సగటున ఏడాదికి 270 యూరోలుగా ఉంటోంది. ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్స్‌లో మాత్రం ఈ ఫీజులు రెట్టింపు స్థాయిలో ఉంటాయి.

నివాస ఖర్చులు

ఆ దేశంలో నివాస ఖర్చులు విద్యార్థులకు అందుబాటులోనే ఉంటాయి. సాధారణ జీవనశైలికి నెలకు 500 నుంచి 600ల యూరోల వరకు ఖర్చు అవుతుంది. ఈ మొత్తంలోనే వసతి, ట్రాన్స్‌పోర్ట్, ఇతర వ్యక్తిగత అవసరాలు తీర్చుకునే అవకాశం ఉంటుంది. ద్వితీయ శ్రేణి నగరాల్లో ఈ వ్యయం 400ల యూరోల నుంచి 500 యూరోల మధ్యలో ఉంటోంది.

స్కాలర్‌షిప్

ఫ్రాన్స్‌లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విదేశీ విద్యార్థులకు పలు స్కాలర్‌షిప్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.భారత్–ఫ్రాన్స్ మధ్య ప్రత్యేకంగా ఉన్న ఒప్పందం ఫలితంగా అండర్ గ్రాడ్యుయేట్(బ్యాచిలర్ డిగ్రీ), మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ వరకు పలు స్కాలర్‌షిప్‌లు లభిస్తున్నాయి. అవి..

- చర్పక్ ఏఎంఈ స్కాలర్‌షిప్(మాస్టర్స్ ప్రోగ్రామ్): ఈ పథకం ప్రకారం–రెండేళ్ల మాస్టర్ ప్రోగ్రామ్‌లో ఒక విద్యా సంవత్సరానికి(పది నెలల వ్యవధి) గాను ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపు, 615 యూరోల నివాస వ్యయ మొత్తం లభిస్తాయి.
- పీహెచ్‌డీలో ప్రవేశం పొందిన అభ్యర్థులకు భారత శాస్త్ర సాంకేతిక శాఖ, ఫ్రాన్స్ ఎంబసీలు సంయుక్తంగా రామన్ చర్పక్–పీహెచ్‌డీ స్కాలర్‌షిప్ పథకాన్ని అమలు చేస్తున్నాయి. దీని ప్రకారం–గరిష్టంగా ఆరు నెలల వరకు ఫ్రాన్స్‌లో ఉండి ఎలాంటి ఖర్చు లేకుండా పరిశోధనలు కొనసాగించొచ్చు.
- వీటితోపాటు ఈఐఎఫ్‌ఎఫ్ఈఎల్ స్కాలర్‌షిప్; ఎరాస్మస్ ముండస్ స్కాలర్‌షిప్; చర్పక్ ఏఎంఈ స్కాలర్‌షిప్ వంటి కూడా ఉన్నాయి.

పార్ట్ టైమ్ వర్క్

ఫ్రాన్స్‌లో అడుగుపెట్టిన విద్యార్థులు.. స్టడీ ఎట్ వర్క్ విధానంలో పార్ట్ టైమ్ ఉద్యోగం చేసుకునే అవకాశం కూడా ఉంది. వారానికి 20 గంటలు మించకుండా ఏదైనా పార్ట్‌టైమ్ కొలువు చేయొచ్చు. యూనివర్సిటీల్లో రీసెర్చ్ ఫ్యాకల్టీ వద్ద రీసెర్చ్ అసిస్టెంట్‌గా చేరొచ్చు. నాన్–సైన్స్, ఇంజనీరింగ్ విద్యార్థులకు సూపర్ మార్కెట్స్, హాస్పిటల్స్, టూరిజం ఏజెన్సీల్లో పనిచేసే అవకాశం లభిస్తోంది. వారానికి కనీసం 60 యూరోలు ఆదాయం పొందే వీలుంది. దీని ద్వారా నివాస ఖర్చుల భారం నుంచి కొంత ఉపశమనం పొందొచ్చు.

ఇంటర్న్‌షిప్

ఫ్రాన్స్‌లో అడుగుపెట్టిన భారత విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ చేసే సదుపాయం కూడా అందుబాటులో ఉంది. ఆ దేశంలో గ్రాండ్స్ ఎకోల్స్‌గా పిలిచే ఎలైట్ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు.. యూరోపియన్ యూనియన్‌లో స్కెంజెన్ దేశాలుగా పిలిచే 26 దేశాల్లో(ఫ్రాన్స్ సహా) ఇంటర్న్‌షిప్ చేయొచ్చు. ఈ విషయంలో ప్రత్యేకంగా ఎలాంటి వీసాలు పొందక్కర్లేదు. అంటే.. ఫ్రాన్స్‌లోని ఒక ఇన్‌స్టిట్యూట్‌లో చేరిన విద్యార్థికి తమ అకడమిక్ కోర్సులో భాగంగా జర్మనీలో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది. దీనిద్వారా విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో ప్రతిభ చూపి.. అదే సంస్థలో శాశ్వత కొలువు పొందొచ్చు.

ఇంగ్లిష్, ఫ్రెంచ్

ఫ్రాన్స్‌లో ఉద్యోగం చేయాలనుకుంటున్న భారత విద్యార్థులకు ఇంగ్లిష్, ఫ్రెంచ్ నైపుణ్యాలు దోహదపడతాయి. ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ. అంతర్జాతీయంగా ఉన్న తన ఎంబసీల ద్వారా ఫ్రెంచ్ లాంగ్వేజ్ ట్రెనింగ్ సదుపాయాలను కల్పిస్తోంది. కొన్ని దేశాల్లో నేరుగా, మరికొన్ని దేశాల్లో గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్‌లతో ఒప్పందం ఆధారంగా ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటే.. ఫ్రెంచ్‌లో నైపుణ్యాన్ని పెంచుకుని అక్కడి కంపెనీల్లో కొలువుదీరే అవకాశం పొందొచ్చు.

స్పాన్సర్‌షిప్ లెటర్

పోస్ట్ స్టడీ వర్క్‌లో భాగంగా టెంపరరీ ఎంప్లాయి పర్మిట్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు.. తప్పనిసరిగా ఎంప్లాయర్ ఇచ్చే స్పాన్సర్‌షిప్ లెటర్ కలిగుండాలి. దీని ఆధారంగానే టెంపరరీ ఎంప్లాయీ పర్మిట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. సదరు కంపెనీ ఫ్రాన్స్ ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ అయి ఉండాలనే నిబంధన కూడా ఉంది.

క్లుప్తంగా...

ఐఏఎస్ వెడ్స్ ఐపీఎస్

- పుట్టిన రోజున రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్న కృష్ణా జిల్లా జేసీ



అపరాజితసింగ్, దేవేంద్రకుమార్‌లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా రిజిస్ట్రార్, సబ్‌రిజిస్ట్రార్

చిలకలపూడి (మచిలీపట్నం): కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) డాక్టర్ అపరాజితసింగ్ సిన్‌సిన్వర్ తన పుట్టిన రోజున ట్రైనీ ఐపీఎస్ దేవేంద్రకుమార్‌ను వివాహమాడారు. రాజస్థాన్‌కి చెందిన అపరాజితసింగ్‌ది 2019 ఐఏఎస్ బ్యాచ్. ఆమె 2022 నవంబర్ 29న కృష్ణా జిల్లా జేసీగా బాధ్యతలు చేపట్టారు. యూపీ స్టేట్ క్యాడర్ ఐపీఎస్‌గా ఎంపికైన దేవేంద్రకుమార్ హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణలో ఉన్నారు. జిల్లా రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్, సబ్ రిజిస్ట్రార్ జగన్‌మోహనరావు బుధవారం వధూవరులిద్దరి సంతకాలు తీసుకున్న అనంతరం మ్యారేజ్ సర్టిఫికెట్ అందజేశారు. అపరాజితసింగ్ మాట్లాడుతూ తామిద్దరం రాజస్థాన్‌కి చెందినవారమని, పెద్దల అంగీకారంతోనే వివాహం నిశ్చయమైందని చెప్పారు. ఉద్యోగరీత్యా పెద్దలకు దూరంగా ఉండటంతో ఆర్భాటం లేకుండా వివాహం చేసుకోవాలనే ఆలోచనతో రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నట్లు తెలిపారు.

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి రాజు రవీంద్ర రాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడుతో పాటు 33 మంది కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం బుధవారం విజయవాడలో రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. 1500 మంది గ్రేడ్-2 వీఆర్వోల ప్రొబేషన్ ఖరారు చేయాలని కోరారు. అనంతరం సీసీఎల్‌ఏ సెక్రటరీ ఇంతియాజ్ అహ్మద్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎ.బాలాజీ రెడ్డి, కోశాధికారి ఎ.మౌళిబాషా, ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ, కె.రవికుమార్, బి.ప్రసన్న లక్ష్మీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

'గోల్డెన్ అవర్' బ్రోచర్ ఆవిష్కరణ



గోల్డెన్ అవర్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కృష్ణబాబు

సాక్షి, అమరావతి: పక్షవాతానికి గురైన వారికి చికిత్స అందించడంలోనూ, ప్రమాదాల్లో గాయపడినవారిని కాపాడడంలోనూ తొలి గంట అత్యంత ముఖ్యమైనదని, గోల్డెన్ అవర్‌గా పేర్కొనే మొదటి గంట వ్యవధిలో సరైన చికిత్స అందిస్తే కచ్చితంగా మెరుగైన ఫలితాలను సాధించవచ్చని వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు అన్నారు. వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్ చేపట్టిన 'గోల్డెన్ అవర్' ప్రోగ్రాం బ్రోచర్‌ను బుధవారం సచివాలయంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. న్యూరో సర్జన్ డాక్టర్ పువ్వాడ రామకృష్ణ మాట్లాడుతూ.. ఈనెల 13న శ్రీలంక ఆహార భద్రత, వాణిజ్యశాఖ మంత్రి సదాశివన్ వియలండేరన్, ఎం.టి. కృష్ణబాబు 'గోల్డెన్ అవర్'ను ఆవిష్కరిస్తారని ప్రకటించారు. వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్ చైర్మన్, కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ గుంటూరు వరుణ్, స్టేట్ ఐకాన్స్ ఫోరం అధ్యక్షుడు చైతన్య జంగా, డాక్టర్ విశ్వనాథ్, సతీష్ పాల్గొన్నారు.

ఇక బైపీసీ అభ్యర్థులకు ఫుడ్ ఇంజినీరింగ్‌లో అడ్మిషన్లు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ ఈఏపీ (ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ) సెట్ ద్వారా నిర్వహించే వెబ్ కౌన్సెలింగ్‌లో ఇంటర్మీడియెట్ బైపీసీ ఉత్తీర్ణులకు ఫుడ్ ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశాలకు అనుమతి ఇస్తూ సాంకేతిక విద్యాశాఖ అనుమతి ఇచ్చింది. ఈ అనుమతి కోసం జేఎన్‌టీయూ(కాకినాడ) వీసీ డాక్టర్ ప్రసాదరాజు ఉన్నత విద్యామండలికి గత జూలైలో లేఖ రాశారు. ఈ కోర్సులో ప్రవేశాలకు కేవలం ఎంపీసీ విద్యార్థులకు మాత్రమే ఇప్పటివరకూ అవకాశం ఉండేది. ఈ ఏడాది నిర్వహించే ప్రవేశాల్లో బైపీసీ అభ్యర్థులకు అనుమతి ఇవ్వాలని ఆయన కోరారు. ఈ మేరకు తాజాగా అనుమతి లభించింది.

ఏకీకృత రూల్స్, సీపీఎస్ అమలుకు సహకరించాలి

- ఏపీ ఎంపీలకు ఏపీయూఎస్ విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: ఏకీకృత రూల్స్, సీపీఎస్ అమలుకు సహకరించాలని ఆంధ్రప్రదేశ్ ఎంపీలకు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) విజ్ఞప్తి చేసింది. బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో ప్రతినిధులు వైవీ రామిరెడ్డి, రంగనాథ్, శ్రావణ్‌కుమార్, బాలాజీ, మహేంద్రనాథ్‌లతో కూడిన బృందం ఏపీ ఎంపీలను కలిసి వినతి పత్రమిచ్చింది. 2003 డీఎస్సీ వారికి కేంద్ర ప్రభుత్వ పింఛన్ డిపార్ట్‌మెంట్ మెమో 57 ప్రకారం పాత పింఛను అమలు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరాలని సంఘం ప్రతినిధులు కోరారు.

పూర్తవని ఈ-టెండర్‌పై.. ఈ తప్పుడు రాతలేంటి..!

తుపాను ప్రభావిత తీర ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థ పటిష్టతకు భూగర్భ కేబుళ్లు • వాస్తవాలను దాచిపెట్టి దురుద్దేశంతో ఈనాడు తప్పుడు కథనం



సాక్షి, అమరావతి: వెన్నంటి ఉండేవారిని సన్నిహితులంటారు. వదిలేసి వెళ్లిపోయిన వారిని సన్నిహితులని ఈనాడు రామోజీరావు మాత్రమే అనగలరు. న్యాయ సమీక్షను తప్పుబట్టగలరు. రివర్స్ టెండరింగ్ చెడ్డదని రాయగలరు. ఆయన అనుకున్నది సాధించడానికి ఏదైనా అచ్చేయగలరు. నిస్సిగ్గుగా అబద్ధాలను జనంపై రుద్దేయగలరు. అంతమాత్రాన వాస్తవాలు ప్రజలకు తెలియవనుకుంటే పొరపాటే. అసలు ఈనాడు రామోజీరావు దృష్టిలో అవినీతి అంటే ఏమిటి? ఎక్కడా లేని రీతిలో రూ.2.28 లక్షల కోట్లు డీబీటీ పద్ధతిలో రాష్ట్ర ప్రజలకు అందించింది రాష్ట్ర ప్రభుత్వం. ఇది అవినీతా? లేక గత ప్రభుత్వంలా దోచుకోవడం పంచుకోవడం అవినీతా? సీఎం స్థానంలో చంద్రబాబును కూర్చోబెట్టాలనే ఆరాటంలో పత్రిక విలువలను దిగజార్చి, జర్నలిజం నియమాలను తుంగలో తొక్కి, సొంత అజెండాతో కథనాలు రాయడం ఈనాడుకు నిత్యకృత్యమైంది. ఇదే ధోరణితో ఇంకా పూర్తి కాని భూగర్భ విద్యుత్ లైన్ల టెండర్లపై ఓ తప్పుడు కథనాన్ని వండి వార్చింది. ఆ రాతల వెనుక అసలు నిజాలు ఇలా ఉన్నాయి..

ఆరోపణ: అది జగన్‌కు అత్యంత సన్నిహితుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి కంపెనీ

వాస్తవం: పొంగులేటి శ్రీనివాసరెడ్డి సన్నిహితుడు అయితే వైఎస్సార్‌సీపీని **ఎందుకు** విడిచిపెట్టి వెళ్లారు? జగన్ **మీద** రాజకీయ ప్రతీకారంగా కే**సులు** పెట్టి, జైల్లోకి పంపిన కాంగ్రెస్‌**లోకి** ఎలా వెళ్లారు? ఏ రకం**గా** సన్నిహితుడని చెప్తారు? అస**లు** ఎవరు ఎవరికి సన్నిహితు**లో** ఈనాడుకు తెలియంది **కాదు.** రామోజీ వియ్యంకుడు **నవయుగ** వారికి చెందిన సంస్థ కాదా? **ఆర్వీఆర్ ఆనే సం**స్థ వారికి చెందిన వారిది కాదా? సుధాకర్ యాదవ్ యనమలకు వియ్యంకుడు కాదా? అందుకే పోలవరంలో నామినేషన్ పద్ధతుల్లో కాంట్రాక్టు దక్కలేదా? సీఎం రమేష్ మీవాడు కాదా? వారి సంస్థ రిత్విక్‌కు నామినేషన్ పద్ధతిలో పనులు కట్టబెట్టలేదా? నామా నాగేశ్వరరావు, గరికపాటి **మోహన్‌రావు** మీ వాళ్లు కాదా? **రామోజీరావు** ఓన్ చేసుకోవాలంటే **వీళ్లని** ఓన్ చేసుకోవాలి.

ఆరోపణ: ప్రభుత్వ పెద్దలకు **సన్నిహిత** సంస్థల్లో దేనికి ఏ కాం**ట్రాక్టు** వెళ్లాలో ముందే **ఖరారై**పోతుంది.

వాస్తవం: రాష్ట్రంలోని జ్యుడిషియల్ **ప్రివ్యూ** వ్యవస్థ దేశానికే మార్గదర్శకంగా **నిలుస్తోంది.** ముందుగా టెండర్లు తీసుకుని 2 వారాల సమయం ఇచ్చి పబ్లిక్ డొమైన్‌లో వాటిని పెట్టి అభ్యంతరాలను జ్యుడిషియల్ ప్రివ్యూ జడ్జి స్వీకరిస్తారు. ఆ మేరకు మార్పులు చేస్తారు. మళ్లీ టెండర్లు పిలుస్తారు. టెండర్లు ఖరారు చేశాక రివర్స్ టెండరింగ్ నిర్వహిస్తారు. ఇంత పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ దేశంలో ఎక్కడాలేదు. మరి భూగర్భ విద్యుత్ కేబుల్ పనుల టెండర్ల ప్రక్రియలో రామోజీరావు ఎందుకు పాల్గొనలేదు?

ఆరోపణ: టెండర్ నిబంధనలు ఎలా ఉండాలో అధికారులకు ఆయనే నిర్దేశిస్తారు.

వాస్తవం: 'ఆర్‌డీఎస్ఎస్' పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్) పరిధిలోని తుపాను ప్రభావిత తీర ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థ పటిష్టత కోసం భూగర్భ విద్యుత్ కేబుళ్లు అమర్చాలని ప్రణాళిక రూపొందించారు. రూ..1,165.41 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టు నివేదికను 2022 మార్చిలో కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.699.25 కోట్లు గ్రాంట్ రూపంలో వస్తుంది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన నోడల్ ఏజెన్సీ పీఎఫ్‌సీ ఆమోదించిన స్టాండర్డ్ బిడ్డింగ్ డాక్యుమెంట్‌కి అనుగుణంగా ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలిచారు. దీని నిబంధనలను ఎవరో ఒకరు మార్చేసే అవకాశం లేదు.

ఆరోపణ: రివర్స్ టెండరింగ్ ఓ బూటకం

వాస్తవం: 2022 డిసెంబర్ 9న జ్యుడిషియల్ ప్రివ్యూ ఇచ్చిన ఆమోదం మేరకు ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా 2022 డిసెంబర్ 12న మొదటి టెండర్ ప్రకటన జారీ చేశారు. ఈ బిడ్ నెం.09/2022-23లో ఇద్దరు గుత్తేదార్లు పాల్గొన్నారు. సాంకేతిక పరిశీలన అనంతరం షిర్డీ సాయి, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీల బిడ్లు అర్హత సాధించాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 25న ప్రైస్ బిడ్స్‌లో ఎల్ 1 బిడ్డర్‌గా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఆర్‌సీఐఎల్ అర్హత సాధించింది. గుత్తేదార్లు కోట్ చేసిన రేటు అధికంగా ఉండటం వల్ల రివర్స్ టెండర్ ప్రక్రియ కొనసాగించారు. గుత్తేదార్ల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో టెండర్‌ను రద్దు చేశారు. తిరిగి ఏప్రిల్‌లో రెండోసారి టెండర్ ఆహ్వానించారు. ఈ రీ టెండరింగ్ సమయంలో రింగ్ మెయిన్ యూనిట్ల పరికరాలను టెండర్ నుంచి మినహాయించారు. ఈ పరికరాల నాణ్యత, దీర్ఘకాల గ్యారెంటీ సౌకర్యం కోసం వాటిని డిస్కం ప్రత్యేకంగా కొనాలని నిర్ణయించింది. రింగ్ యూనిట్లు మినహాయించిన ఈ టెండర్లలో నలుగురు గుత్తేదారులు టెండర్లు దాఖలు చేశారు. ఇందులో ఇద్దరు అర్హత సాధించగా సంబంధిత ధర నిర్ణయం కోసం రివర్స్ టెండరింగ్ నిర్వహించారు. రివర్స్ టెండరింగ్ ధరల ప్రకారం 2022-23 ప్రామాణిక ధరల పట్టిక (ఎస్ఎస్ఆర్) ఆధారిత అంచనాలకు మించి 8 శాతం అధికంగా ఎల్1 బిడ్డర్ ఆర్‌సీఐఎల్ దాఖలు చేసింది. ఇంత పక్కాగా, పూర్తి పారదర్శకంగా ఈ టెండర్ ప్రక్రియ జరుగుతోంది. ఇందులో బూటకం ఏముంది?

ఆరోపణ: పోటీలో ఆ రెండు కంపెనీలే

వాస్తవం: రింగ్ మెయిన్ యూనిట్లు సరఫరా కోసం కేంద్ర ప్రభుత్వం పోర్టల్‌లో టెండర్లు ఆహ్వానించారు. ఈ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. ఇందులో బీహెచ్ఎల్, ఏబీబీ, సీమెన్స్, ష్నైడర్ వంటి తయారీ సంస్థలు పాల్గొనే అవకాశం ఉంది. ఈ టెండర్ ప్రక్రియ ఈ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా పూర్తి పారదర్శకంగా జరుగుతోంది. ఆసక్తి కలిగిన గుత్తేదారులందరూ ఈ టెండర్ ప్రక్రియలో పాల్గొనవచ్చు. ఈ సాధారణ ప్రక్రియలో కనీస ధర ప్రతిపాదించి ఎల్ 1గా అర్హత పొందిన గుత్తేదారుకు మాత్రమే పనులు దక్కించుకొనే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ గ్రాంటును పొందడానికి టెండర్‌ను నిర్ణీత వ్యవధిలో ఖరారు చేయవలసి ఉంది. ఈ కారణంగా టెండర్ వివరాలను ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ పరిశీలనకు పంపించారు. వాస్తవాలు ఇలా ఉంటే అడ్డగోలుగా కట్టబెట్టేశారని రామోజీ గగ్గోలు దేనికో..!!

ఆరోపణ: పనులు అవే.. అంచనాలు పెంచేయడం వల్ల అదనంగా ఖర్చు

వాస్తవం: భూగర్భ విద్యుత్ పనుల్లో అధికంగా వినియోగించే కేబుల్స్ ధరల్లో భారీ వ్యత్యాసం కారణంగా టెండర్ ధర అధికంగా వచ్చింది. వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను 2021లో తయారు చేశారు. ఆ సమయంలో కేబుల్ ధరలు 2018-19 నుంచి 2019-20 ఆర్థిక సంవత్సరంలో డిస్కం కొనుగోలు చేసిన ధరలకు అనుగుణంగా తీసుకున్నారు. అయితే కోవిడ్ మహమ్మారి తెచ్చిన సంక్షోభం, విధించిన ఆంక్షల కారణంగా సరఫరా వ్యవస్థ బాగా ప్రభావితమైంది. ముడిసరుకులైన అల్యూమినియం, రాగి, స్టీల్ వంటి వాటి ధరలు బాగా పెరిగాయి. కవర్ కండక్టర్, ఎక్స్ఎల్‌పీఈ కేబుల్స్, 33 కేవీ, 11 కేవీ ఆర్ఎంయూలు మొదలైనవి, అలాగే లేబర్ రేట్లు కూడా పెరిగాయి. వీటి ఆధారంగా మంజూరైన ధరతో పోలిస్తే బిడ్డర్లు కోట్ చేసిన రేట్లలో సహజంగానే పెరుగుదల ఉండవచ్చు.

11 నుంచి పాలిటెక్నిక్ ప్రవేశాలకు ఆప్షన్ల ఎంపిక

- 18వ తేదీన సీట్ల కేటాయింపు
- 23 నుంచి తరగతులు ప్రారంభం
- సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి



సాక్షి, అమరావతి: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల షెడ్యూల్‌ను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి బుధవారం విడుదల చేశారు. విధానపరమైన కారణాలతో వాయిదా పడిన పాలిసెట్ ప్రవేశాల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఆగస్టు 10వ తేదీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆగస్టు 11 నుంచి 14వ తేదీ వరకు నాలుగు రోజుల్లోగా ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 16వ తేదీ ఆప్షన్లలో మార్పులు చేసుకోవచ్చన్నారు. 18వ తేదీన సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. 19వ తేదీ నుంచి 23లోగా విద్యార్థులు సీట్లు పొందిన కళాశాలల్లో నేరుగా రిపోర్టు చేయాలన్నారు. 23వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. మొత్తం 88 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 18,141 సీట్లు, 182 ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో 64,933 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

సాక్షి, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఆదర్శ పాఠశాలల్లో జూన్ 15, 2013 నుంచి జూన్ 01, 2014 వరకు పనిచేసిన ప్రిన్సిపాల్స్, పీజీటీ, టీజీటీల వివరాలతో తాత్కాలిక మెరిట్ సీనియారిటీ జాబితాను సిద్ధం చేశామని ఏపీ మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ ఎం.వి.కృష్ణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీటిని పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు. వీటిపై అభ్యంతరాలుంటే సరైన పత్రాలతో apms.cse@apschooledu.in ఈ-మెయిల్ ద్వారా ఈ నెల 11వ తేదీలోగా పంపాలని విజ్ఞప్తి చేశారు. 12, 13 తేదీల్లో అభ్యంతరాలు పరిష్కరించి, 14న సీనియార్టీ మెరిట్‌లిస్ట్ విడుదల చేస్తామని ఆయన తెలిపారు.

అప్పటివరకు ఉష్ణతాపమే

- వారం రోజులు వానలుండవ్!
- ఇప్పట్లో అల్పపీడనాలు లేనట్టే
- కొన్నాళ్లు చిరు జల్లులకే పరిమితం



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో వానల కోసం కొన్నాళ్లు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మారిన వాతావరణం నేపథ్యంలో మరో వారం రోజుల పాటు వర్షాలకు అనుకూల పరిస్థితులు కనిపించడం లేదు. కొద్దిరోజుల నుంచి రాష్ట్రంపైకి పశ్చిమ, వాయవ్య గాలులు వీస్తున్నాయి. గాలిలో తేమ కూడా తక్కువగా ఉంటోంది. అలాగే బంగాళాఖాతంలో గాని, భూ ఉపరితలంలో గాని ఆవర్తనాలు/ద్రోణులు ఏర్పడటం లేదు. వర్షాలు కురవడం లేదు. అంతేకాదు.. మేఘాల జాడ కనిపించడం లేదు. వీటన్నిటి ఫలితంగా గాలిలో వేడి, తేమతో కూడిన వాతావరణం ఏర్పడుతోంది. దీనికి పశ్చిమ/వాయవ్య గాలులు తోడై ఉష్ణతాపానికి, అసౌకర్య వాతావరణానికి కారణమవుతోంది. దీంతో కోస్తాంధ్ర, రాయలసీమల్లో సాధారణంకంటే 3నుంచి 5 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాష్ట్రంలో కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు వరకు వెళ్తున్నాయి. బుధవారం పల్నాడు జిల్లా శావల్యాపురంలో 39.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. కావలిలో 39.1, బాపట్లలో 39, ఒంగోలులో 38.9, విశాఖపట్నంలో 38 డిగ్రీలు నమోదయ్యాయి. రానున్న వారం రోజులు ఇవే పరిస్థితులు కొనసాగుతాయని, వర్షాలకు ఆస్కారం ఉండదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ ఎక్కడైనా కురిసినా తేలికపాటి వర్షం లేదా చిరు జల్లులకే పరిమితమవుతుందని పేర్కొంటున్నారు.

అల్పపీడనాలు ఇప్పట్లో లేనట్టే..

సాధారణంగా ఆగస్టు ఆరంభం నుంచి బంగాళాఖాతంలో అల్పపీడనాలు ప్రభావం చూపుతుంటాయి. వాటికి ద్రోణులు, ఆవర్తనాలు తోడై ఈ నెలలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. కానీ.. ఇప్పటివరకు వాటి జాడ లేదు. దీంతో వానలు ముఖం చాటేశాయి. ఆగస్టులో ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఇప్పటికే ముందస్తు అంచనాల్లో స్పష్టం చేసింది. అందుకు అనుగుణంగానే పరిస్థితులు కొనసాగుతున్నాయి.

సీఎం జగన్ హయాంలో గిరిజన జీవితాల్లో వెలుగులు

- కొనియాడిన గిరిజన నేతలు
- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



ప్రపంచ ఆదివాసీ ఉత్సవంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాక్షి, అమరావతి/సాలూరు : ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనుల జీవితాలు అభివృద్ధి పథంలో పయనింపజేసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. సీఎం జగన్ హయాంలో ఊహించిన దానికంటే ఎక్కువగా గిరిపుత్రుల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని తెలిపారు. ప్రపంచ ఆదివాసీల దినోత్సవం బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నేతలు బీఆర్ అంబేడ్కర్, వైఎస్సార్, గిరిజన నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక 18 సెల్ టవర్లతో అన్ని గ్రామాలకు కమ్యూనికేషన్ వచ్చిందన్నారు. గిరిజన మహిళను డిప్యూటీ సీఎం చేసిన ఘనత సీఎం జగన్ దక్కుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే కుంభా రవిబాబు మాట్లాడుతూ గిరిజనలకు సీఎం జగన్ నాణ్యమైన విద్య, ప్రాథమిక స్థాయిలోనే ఇంగ్లీషును అందిస్తున్నారని కొనియాడారు. అడవుల్లో రోగాలతో వందలాది మంది చనిపోయే వారని ఇప్పుడు సీఎం జగన్ వైద్యం అందుబాటులోకి తెచ్చారని, గిరిజనులు కోసం ట్రైబల్ మెడికల్ కాలేజీని తెచ్చారని తెలిపారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు గిరిజనులను కనీసం మనుషులుగా కూడా చూడలేదన్నారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్‌లు ప్రసంగించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నేతలు డాక్టర్ వెంకటలక్ష్మి, మేరాజోత్ హనుమంత్ నాయక్, రాష్ట్ర గిరిజన విభాగం ప్రధాన కార్యదర్శి గుండా సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా సీఎం జగన్ : డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

గిరిజనులకు అండగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆయన అధ్యక్షతన, పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాజన్నదొర మాట్లాడుతూ గిరిజనులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పాటు రాజ్యాంగపరమైన గిరిజన చట్టాలు జగనన్న పాలనలో పరిరక్షింపబడుతున్నాయన్నారు. గత టీడీపీ పాలనలో ఎన్నికలకు ఆరు నెలలు ముందు గిరిజన సంక్షేమ శాఖ మంత్రిని నియమించారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.70 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావు, ఎమ్మెల్సీ పి.రఘువర్మ, జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులతో ఫలించిన చర్చలు

▶ మొదటి పేజీ తరువాయి

బుధవారం సచివాలయంలో చర్చలు జరిపింది. మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ సమక్షంలో ఈ చర్చలు జరిగాయి. ఇది ఉద్యోగుల అనుకూల ప్రభుత్వమని, అందరికీ మేలు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి నిర్ణయాలు తీసుకుంటున్నారని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విద్యుత్ ఉద్యోగులకు తెలిపారు. విద్యుత్ సంస్థలను కాపాడుకునేందుకు యాజమాన్యం, ఉద్యోగులు ఎంతో కొంత త్యాగం చేయాల్సిన అవసరం ఉందని మంత్రులు, అధికారులు సూచించారు. అనామలీస్ ఉంటే సరిచేసి పేస్కేలును నిర్ధారించడానికి ఏపీజెన్‌కో ఎండీ నేతృత్వంలో డిస్కంల సీఎండీలతో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసేలా అంగీకారం కుదిరింది.

సింగిల్ మాస్టర్ స్కేల్ పీపీతో కలిపి రూ.2.60 లక్షలు, 8 శాతం ఫిట్‌మెంట్, ఒక డీఏ విడుదల, 12 వాయిదాల్లో బకాయిలు, వైద్య పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు, మాస్టర్ స్కేల్ రూ.2.60 లక్షలు దాటిన వారికి తప్పనిసరిగా పర్సనల్ పే, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి 2018 స్కేల్ ప్రకారం జీతాలతో పాటు అదనంగా 2 శాతం పెంపునకు యాజమాన్యాలు, ఉద్యోగ సంఘాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. యాజమాన్యం ప్రతిపాదనలను ఆమోదిస్తున్నట్లు జేఏసీ ప్రతినిధులు ప్రకటించారు. ఈ మేరకు పీఆర్సీ ప్రతిపాదనలను ఆమోదిస్తూ ఏపీ ట్రాన్స్‌కో, ఏపీజెన్‌కో, ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు, జేఏసీ ప్రతినిధుల మధ్య శుక్రవారం ఒప్పందం జరుగుతుందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. ఈ చర్చల్లో సీఎస్ జవహర్‌రెడ్డి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, ఏపీజెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మాజనార్దన్ రెడ్డి, ట్రాన్స్‌కో జేఎండీ మల్లారెడ్డి, జేఏసీ నేతలు చంద్రశేఖర్, ప్రతాప్‌రెడ్డి, సాయికృష్ణ, శేషారెడ్డి, శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఎంబీబీఎస్' వెబ్ ఆప్షన్స్ నమోదు

సాక్షి, అమరావతి: 2023-24 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ కోర్సులో కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్ల భర్తీలో భాగంగా విద్యార్థులు గురువారం వెబ్ ఆప్షన్స్ నమోదుకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అవకాశం కల్పించింది. ఈ మేరకు బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. వెబ్ బేస్డ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి విద్యార్థులు https://ugcq.ysruhs.com వెబ్‌సైట్‌లో గురువారం ఉదయం 8 గంటల నుంచి ఈ నెల 12వ తేదీ రాత్రి 9 గంటల లోపు ఆప్షన్స్ నమోదు చేసుకోవాలి. ఈ క్రమంలో విద్యార్థులు తమ ప్రాధాన్యత కళాశాలలను ఒకేసారి ఆప్షన్స్ రూపంలో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ఆప్షన్స్ ఆధారంగానే అన్ని రౌండ్ల కౌన్సెలింగ్‌లో సీట్ల కేటాయింపులుంటాయి. ఆప్షన్స్ నమోదు సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే 7416563063, 7416253073, 9063400829 నంబర్లలో సంప్రదించవచ్చు.

పోలీసుల భాగస్వామ్యంతో నాపై దాడులు

- పుంగనూరు ఘటనపై సీబీఐ విచారణ చేయాలి
- అధికారం అండతో కేసులు పెట్టిస్తున్నారు
- దాడులపై రాష్ట్రపతి, ప్రధాని, గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం
- టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు



విజయనగరం రూరల్/పార్వతీపురం/కురుపాం/కొమరాడ: వైఎస్సార్‌సీపీ నేతలు పోలీసులను భాగస్వామ్యం చేసి తమపై దాడులు చేస్తున్నారని, అక్రమ కేసులు పెట్టిస్తున్నారని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ దాడులపై సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా బుధవారం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా విజయనగరంలో, పార్వతీపురం మన్యం జిల్లాలోని తోటపల్లి ప్రాజెక్టు వద్ద విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రాజెక్టుల నిర్వీర్యంపై తాను చేస్తున్న పర్యటనలను అడ్డుకునేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాడులకు దిగుతోందని ఆరోపించారు. పుంగనూరులో తనపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు హత్యాయత్నం చేశారన్నారు. దాడి సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారన్నారు. అధికారం అండతో తనపైనే హత్యాయత్నం కేసు నమోదు చేయించారని అన్నారు. తన వెంట వచ్చిన వారిపైనా తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. దాడులపై రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే నదులను అనుసంధానం చేసి ప్రతి ఎకరాకు సాగు నీటిని అందిస్తామని చెప్పారు. వంశధార, నాగావళి నదులను అనుసంధానం చేసి హిరమండలంలో రిజర్వాయర్‌ను నిర్మించడానికి గతంలో శంకుస్థాపన చేశానని చెప్పారు. అవసరం లేని కాలువల నిర్మాణానికి తంబళ్లపల్లెలో పీఎల్ఆర్ కంపెనీకి రూ.5వేల కోట్లు మంజూరు చేశారని, ఈ కంపెనీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సంబంధీకులదని అన్నారు. ఆ నిధులను ఉత్తరాంధ్రలోని ప్రాజెక్టులకు వెచ్చిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు.

చంద్రబాబును అరెస్ట్ చేయాల్సిందే!

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున



సాక్షి, అమరావతి: పుంగనూరులో టీడీపీ అధినేత చంద్రబాబుపై హత్యాయత్నం జరగలేదని, చంద్రబాబు వర్గీయులే అక్కడ పోలీసులపై దాడి చేశారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. ఆ ఘటనలో చాలామంది పోలీసులు తీవ్రంగా గాయపడగా.. చివరకు ఒక పోలీస్ కళ్లు కూడా పోయాయన్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద బుధవారం మంత్రి మేరుగు మీడియాతో మాట్లాడుతూ.. 'పోలీసులు వారి డ్యూటీ వారు చేశారు. వారిపై దాడి చేసి, తీవ్రంగా గాయపర్చడం ఏమిటి. చాలామంది పోలీసులు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రుల్లో ఉన్నారు. ఇంత ఘోరానికి పాల్పడ్డ నిన్నేం చేయాలి చంద్రబాబు' అని ప్రశ్నించారు. చంద్రబాబుపై కేసు పెట్టి అరెస్ట్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. దుష్ట శక్తులను ఉక్కుపాదంతో అణచివేయాల్సిన అవసరం ఉందని, చట్టానికి ఎవరూ అతీతులు కారని పేర్కొన్నారు. 'పోలీస్ ఆర్డర్‌ను కాదని, పుంగనూరు వెళ్లాలని ఎందుకు అనుకున్నావ్. పోలీసుల మీద రాళ్ల దాడి చేస్తే.. ఇంకా వేయండి అని రెచ్చగొడతావా. చట్టానికి అతీతంగా వ్యవహరిస్తే, పోలీసుల మీద దాడిచేసి కొడితే చర్యలు తప్పవు. చట్టం తన పని చేసుకుపోతుంది' అన్నారు. రాష్ట్రం విడిపోతున్న సమయంలో చిరంజీవి కేంద్ర మంత్రిగా ఉన్నారని, రాష్ట్ర ప్రయోజనాలపై అప్పట్లో చిరంజీవి మాట్లాడటంలో విఫలమయ్యారని ధ్వజమెత్తారు.

ఆరేళ్లు కలిసుండి.. అత్యాచారం అంటే చెల్లదు

దొడ్డబళ్లాపురం: ఒక పురుషుడు, మహిళ ఇష్టపడి కలిసి ఉండి.. ఆ తర్వాత మహిళ అత్యాచారం ఆరోపణలు చేస్తే చెల్లదని కర్ణాటక హైకోర్టు ఓ తీర్పులో స్పష్టం చేసింది. సోషల్ మీడియా ద్వారా పరిచయమైన దావణగెరెకు చెందిన మహిళ, బెంగళూరుకు చెందిన ఒక పురుషుడు ఆరేళ్లుగా సన్నిహితంగా ఉన్నారు. పురుషుడు వివాహానికి నిరాకరించడంతో తనపై అత్యాచారానికి పాల్పడినట్టు ఆరోపిస్తూ మహిళ 2021లో బెంగళూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. దీనిని సవాల్ చేస్తూ అతడు హైకోర్టును ఆశ్రయించాడు. 2013లో ఫేస్‌బుక్ ద్వారా తమకు పరిచయం కలిగిందని, ఇద్దరి ఆమోదంతోనే సంబంధం కొనసాగిందని పేర్కొన్నాడు. ఇరువర్గాల వాదనలను ఆలకించిన జస్టిస్ నాగప్రసన్న ధర్మాసనం .. మహిళ ఆరోపణలను తోసిపుచ్చింది. ఆరేళ్ల సుదీర్ఘ సంబంధం ఉండడం వల్ల ఆమె చేసే అత్యాచారం అభియోగాలు చెల్లవని అభిప్రాయపడింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.